లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లాషరీక లక లబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్ నిఆమత, లకవల్ ముల్క్, లా షరీక లక్

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

# హజ్ - ఉమ్రా

# HAJ - UMRAH

**The History of Makkah Mukarramah and Madinah Munawwarah, Haj, Umrah, Ziarah vidhanam (Telugu)**

**Dr. Fazalullah Khan** M.A. Ph.D.

**September 2015**

**Copies** 3000

**Typeset by** Al-Zal Graphics
Kanchanbagh
Hyderabad.

**Published by** Centre for Minority Studies and Research
# 8-2-310/A/38, Ibrahimnagar
Road No.10, Banjarahills
Hyderabad. Ph: 99482 54564

# హజ్ యాత్ర ఇలా కొనసాగుతుంది.....

మక్కా చేరుకున్న హాజీలు ఉమ్రా విధి పూర్తి చేయడం

| | |
|---|---|
| *8 జిల్ హజ్* | ఇహ్రాం ధరించి మక్కా నుంచి మీనా వెళ్ళాలి. అక్కడ ఐదు నమాజ్‌లు విధిగా పూర్తి చేయాలి. |
| *9 జిల్ హజ్* | సూర్యాహస్తమయం కంటే ముందు అర్ఫాత్‌లో నిలబడడం, ముజ్దల్ఫాలో రాత్రి జాగరణ చేయాలి |
| *10 జిల్ హజ్* | షైతాన్‌పై రాళ్ళు వేయాలి, ఖుర్బానీ ఇవ్వాలి, తల వెంట్రుకల్ని తీసివేయాలి. మక్కా వెళ్ళి కాబా తవాఫ్ చేసి మీనాకు తిరిగి రావాలి. |
| *11, 12, 13 జిల్‌హజ్* | మీనాలో వుండి మూడు షైతాన్‌లపై రాళ్ళు వేస్తే హజ్ పూర్తి అవుతుంది. ఇక |

మక్కా వెళ్ళి కాబా చుట్టూ తావాఫే విదా చేసి మదీనా ప్రయాణం.

---

ధుల్‌హులైఫా: ఇది మదీనా నుంచి మక్కావైపు ఆరు మైళ్ళ దూరంలో ఉన్న పట్టణం. మదీనా నుంచి వచ్చే వారికి ఇది మీఖాత్ - హద్దు. ప్రవక్త ముహమ్మద్ (స) ఇక్కడే తమ ఇహ్రాంను కట్టుకున్నారు.

జుహాస్: రబీఘ్‌కు సమీపాన గల ఈ పట్టణం మక్కాకు సుమారు **150** మైళ్ళ దూరాన వుంది. ఈ పట్టణం ఈజిప్టులకు, సిరియన్లకు, రోమన్లకు హద్దు.

జులెఖర్నె: మక్కాకు తూర్పువైపు **20** మైళ్ళ దూరం ఖర్న్ పర్వతం నుంచి ఖర్న్ కొండకు దగ్గరలోవున్న జనావాసానికి ఈ పేరు వుంది. ఇది ఇరాఖీలకు హద్దు.

ఖర్న్ అల్ మనాజిల్: మక్కాకు వెళ్ళే దారిలో తాయిఫ్ వద్ద గల ప్రదేశం. నజాద్ వారి కోసం ఇది మీఖాత్.

యలం-లామ్: ఇది మక్కాకు ఆవలివైపున ఉన్న చిన్న కొండ. పాకిస్తాన్, ఇండియా, యెమన్, తూర్పుదేశాల నుంచి వచ్చే హాజీల కోసం ఏర్పాటు చేసిన మీఖాత్.

# హజ్, ఉమ్రాలకు ముందు చేయవలసిన పనులు

హజ్ చేయదలచిన వ్యక్తి ఇతరుల సొమ్మును ఆశించకూడదు. డబ్బు ఇతరుల నుంచి తీసుకొని హజ్ చేయరాదని దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించారు. తనకున్న సొంత సొమ్ముతోనే హజ్ (ధర్మ యాత్ర) చేయాలి. ఉన్నంతలోనే సర్దుకునే వానికి అల్లాహ్ తోడ్పడతాడు. పరుల సొమ్ము ఆశించని వ్యక్తికి ధనభాగ్యం, దైవం నుంచి శుభం కలుగుతుంది. అలాకాకుండా ప్రజల వద్దనున్న సొమ్ము అడిగేవాడు ప్రళయదినాన అతని ముఖంపై మాంసం ముక్కే లేకుండా భయంకరంగా ప్రత్యేక్షమవుతాడు.

హజ్, ఉమ్రా నిర్వహించుటకు తన హలాల్ సంపాదన మాత్రమే ఉపయోగించాలి. దైవప్రవక్త ఇలా తెలిపారు. హలాల్ సంపాదనతో మానవుడు హజ్ కొరకు బయలు దేరునప్పుడు లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ అని అరచినప్పుడు ఆకాశం నుంచి ఈ అరుపులు వినపడును. లబ్బైక్ వ సఅదైక్ (చిత్తము, సౌభాగ్యము) నీ దారి భత్యము స్వచ్ఛమైనది, నీ ప్రయాణ ఖర్చు స్వచ్ఛమైనది, నీ హజ్ పవిత్రమైనది. పాపభారానికి దూరంగా ఉన్నది.

ఒక వేళ పాపపు సొమ్ముతో హజ్‌కు బయలుదేరునప్పుడు లబ్బైక్ అల్లాహుమ్మ అని పిలికినచో వానికి ఆకాశం నుంచి ఈ కేకలు వినపడతాయి: లా లబ్బైక్, వలాసాదైక్ (వద్దే వద్దు, నీరాక శుభము కాదు) నీ దారి భత్యం పాపపు సొమ్ముతో కూడి ఉంది. నీ దారి ఖర్చులు తప్పుడివే. నీ హజ్ అశుభము.

హదీసు గ్రంథకర్తలు బుఖారి, ముస్లింల వ్యాఖ్యానం ప్రకారం హజరత్ ఆయిషా (రజియల్లాహు అన్‌హా) ఇలా వివరించారు : రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇహ్రాం కట్టుకోక ముందే ఆయన దుస్తులపై అత్తరు రాస్తూ ఉండేదాన్ని, అలాగే ఆయన జిల్‌హజ్ 10వ తేదీన హజ్ కార్యాలు నిర్వహించి ఇహ్రాం దుస్తులు తీసి కుట్టిన దుస్తులు ధరించి బైతుల్లా తవాఫ్ చేయకముందే సువాసలు అత్తరు వగైరాలు రాసేదానిని. ఇహ్రాంకు ముందు కుట్టిన దుస్తులు తీసి దైవప్రవక్త స్నానం చేశారని హదీసు ద్వారా రుజువైంది. ఇహ్రాంకు ముందే స్త్రీ పురుషులు మీసాలు, గోర్లు, చంకలు, తమ మర్మాంగాల వద్దనున్న వెంట్రుకలు తీసివేయాలి. ఇహ్రాంతో ఉన్నప్పుడు ఈ పనులు చేయరాదు. ఇహ్రాంకు ముందు తల వెంట్రుకలు తీయమని స్త్రీ పురుషులలో ఎవరికి ఆజ్ఞాపించలేదు.

స్త్రీల ఇహ్రాం దుస్తుల విషయంలో ఎలాంటి నిబంధనలు లేవు. స్నానం, పరిశుభ్రత తరువాత ఇహ్రాం నియమాలు పూర్తి చేసుకొనిన తరువాత చేయబోవు ఉమ్రా లేక హజ్

నియత్ చేసుకోవాలి. ఎట్టి పరిస్థితిలోను గడ్డం తీసివేయడం లేక చిన్నదిగా చేయుట నిషేధించబడింది. అయితే గడ్డంపై మొలుచు వెంట్రుకల్ని కట్ చేయకూడదు. అసలు దానిని ముట్టనే కూడదు. పూర్తిగా వదిలివేయాలి. బుఖారి, ముస్లిం హదీసు గ్రంథాలలో అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ప్రకటించిన హదీసులో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అన్నారు. మీసాలు కత్తిరించండి. గడ్డాలు పెంచండి. దీని ద్వారా మజూస్ (అగ్ని పూజకుల) పద్దతుల్ని విడిచిపెట్టండి.

ఆయిషా(రజియల్లాహు అన్‌హా) హజ్‌యాత్రలో ఉమ్రా చేయ సంకల్పించినప్పుడు నెల తప్పారు. అప్పుడు ఇహ్రాం స్నానమాడి హజ్ కొరకు సంకల్పించమని ప్రవక్తగారు ఆమెకు ఆజ్ఞాపించారు. బీబీ అస్మాబిన్‌తె ఉమైస్(రజి) జుల్‌హులేఫా అనే ప్రదేశంలో ప్రసవించినప్పుడు స్నానమాడి ముట్టు రక్తము విసర్జించుచోట బట్ట గట్టిగా చుట్టి ఇహ్రాం కట్టుకోమని రసూలుల్లా (రజి) ఆజ్ఞాపించారు. కావున నెల తప్పిన స్త్రీ కాని, ప్రసవించిన స్త్రీ మీఖాత్ చేరుకుంటే వారు స్నానం చేసి అందరితో సమానంగా ఇహ్రాం కట్టుకోవాలి. హజ్ చేయు వ్యక్తి చేసే పనులన్నీ ఆమె కూడా చేయవచ్చు. కాని కాబతుల్లా చుట్టూ తవాఫ్ మాత్రం చేయకూడదు. హజరత్ ఆయిషా, అస్మాగార్లకు ఇలా చేయమని ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞాపించారు.

ప్రతి పూట నమాజు సక్రమంగా చేయాలి. అనవసరంగా మాట్లాడకుండా అక్కరకురాని విషయాలకు దూరంగా వుండాలి. నవ్వులాటలో విలువైన సమయాన్ని వృద్ధా చేయరాదు. అబద్దాలు, చాడీలు, గీబత్ వంటి దురలవాట్లు, చెడు వ్యాఖ్యలు నోటిపై రానీయకూడదు. ఇతరులకు ఎలాంటి హాని కలిగించకుండా మసలుకోవాలి.

## హజ్ ముబారక్ హో....

ఒక వ్యక్తి తన ఇంటిని, భార్యాపిల్లల్ని, బంధుమిత్రుల్ని, వ్యాపార వ్యవహారాల్ని పక్కనపెట్టి, ఖర్చును, ప్రయాణాన్ని ఓర్చి సంతోషంగా హజ్ కోసం బయలుదేరుతాడో అతని ప్రయాణం అతనిలో దైవప్రేమ, దైవభీతి, దైవం విధించిన విధిని – విధిగా తలిచే ఆలోచన ఉంది అనడానికి నిదర్శనం. ఎప్పుడైనా దైవమార్గంలో బయలుదేరవలసి వస్తే సంశయించకుండా బయలుదేరే శక్తి అతనికి వుందని, ప్రయాణంలో వచ్చే కష్టనష్టాలను ఎదుర్కోగలడని, తన సొత్తును, సుఖాన్ని దైవప్రసన్నత కోసం త్యాగం చేయగలడని నిరూపించుకునే సత్తా అతనికి వుందనుకోవాలి.

ఉపాధి కోసం చేసే ప్రయాణం ఒకటైతే, వినోదం కోసం పర్యటించడం మరొకటి. ఈ రెండు రకాల ప్రయాణాల్లో అవసరాలు, కోరికలు మనిషిని ప్రేరేపిస్తాయి. కేవలం అల్లాహ్ కోసం తనపై అల్లా విధించిన ఫర్జ్‌ను నెరవేర్చడానికి చేసే ప్రయాణమే హజ్‌యాత్ర. పాపాలకు పశ్చాత్తాపపడుతూ తన చేతల గురించి చేతులెత్తి మన్నించమని దైవాన్ని వేడుకుంటాడు. చెడు ఎడల ఏహ్యాభావంతో సత్కార్మలవైపు మొగ్గుతాడు. ఎవ్వరికీ తన వల్ల కష్టం కల్గించకుండా సాధ్యమైనంత వరకు ఒకరికి సహాయపడాలనే ఆతురత అధికమవుతుంది. పరుష వాక్యాలు, అశ్లీలం, అన్యాయం, అకృత్యం, అవినీతి, పొట్లాటల గురించి దూరంగా ఉండాలనే కోరుకుంటాడు. హజ్ ప్రయాణమంతా ఆరాధనే. గొప్ప సంస్కరణా సమయం అది.  లోపలి నుంచి మీ హృదయం తేలికపడుతోంది. మీలోని అహం నశిస్తుంది. సాధుస్వభావం, శాంతం నెలకుంటుంది. ప్రాపంచిక వ్యాపకాల్లో, మనోవాంఛల్లోను చిక్కుకొని ఉన్న మీ అంతరాత్మ ప్రక్షాళింపబడుతుంది. దైవచింతన, దైవభీతి అంతర్గతంగా, బహిర్గతంగాను మీలో చోటు చేసుకుంటాయి.

డబ్బువుందనికాని, సంఘంలో గొప్పతనం కోసమో.... ఓ వ్యక్తి హజ్ యాత్ర చేయలేదు. అల్లాహ్ ఆహ్వానం మేరకే ఆ అదృష్టవంతుడు కఫన్ తొడిగి లబ్బైక్ అంటూ అల్లాహ్ గృహం కాబా వైపు ప్రయాణమవుతాడు. హజ్‌కు వెళ్ళడం కూడా జిహాద్ లాంటిదే. హజ్‌చేసే ఆర్థిక స్థితి మీకు వుంటే ఆ విధిని వెంటనే పూర్తి చేయండి. ప్రయత్నించండి. “యహూదీ, నస్రానీ బన్‌కర్ నా మరో! హజ్ కా ఫరజ్ అదాకరో!!

ఎసి రూం, బెడ్, మూడు దుప్పట్లు, వంట గ్యాస్ తదితర సదుపాయాలు అక్కడ ప్రతి హాజీకి లభిస్తాయి. కిచిన్ సదుపాయం వుంటుంది. కాబట్టి మీరు సాధ్యమైనంత తక్కువ లగేజ్ ఇంటి నుంచి తీసుకువెళ్ళండి. అన్ని వస్తువులు అక్కడ దొరుకుతాయి. మీరు ప్రతి రోజు డాక్టర్ సలహా మేరకు మందులు వాడుతుంటే ఆ మందులు మాత్రం తప్పని సరిగా 45 రోజులకు సరిపడ తీసుకువెళ్ళండి. మీరు వాడుతున్న మందులు అక్కడ దొరకవు. డాక్టర్ రాసిచ్చిన మందుల చీటిపై డాక్టర్ సంతకం, స్టాంప్ వేయించి మందులతో పాటు ప్యాక్ చేసుకోవడం మరిచిపోవద్దు. పాస్‌పోర్టు, ఇమిగ్రేషన్ డాక్యుమెంట్, హెల్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు రెండు అదనంగా పెట్టుకోండి. జిరాక్స్ సెట్ మీతో పెట్టుకోండి. మరో కాపీని ఇండియాలో వుండే మీ బంధువులకు ఇవ్వండి.

కష్‌కష్ (గసగసాల) తీసుకువెళ్ళవద్దు. మరణశిక్షా లేక ఎనిమిదేళ్ళ జైలు శిక్ష పడుతుంది. ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకువెళ్ళవద్దు. గుర్తు తెలియని వ్యక్తుల సామాన్లు మీరు పట్టుకోవద్దు. అందులో ఏమైనా వుండవచ్చు. ఆ సామాన్లు మీకు జైలుకు పంపవచ్చు.

జాగ్రత్త. ఇతరుల బ్యాగ్ మీరు తీసుకుంటే ఇరుక్కుంటారు. ఎవరూ మిమ్మల్ని కాపాడలేరు. అలా అని మీ సామాను ఇతరులకు ఇవ్వవద్దు. దొంగలుంటారు జాగ్రత్త. హరమ్‌లోనూ, తవాఫ్ సమయంలో దొంగల బారిన పడకుండా చూసుకోండి. డబ్బు ఒకరి వద్దే పెట్టుకోవద్దు. ఇంట్లో సభ్యులందరూ పంచుకొని డబ్బు అందరి వద్ద పెట్టుకోండి. ఎవరితోనూ గొడవ పడవద్దు. మక్కా, మదీనాలో ప్రతి నలుగురిలో ఒకరు పోలీసు వుంటారు. వారంతా మామూలు డ్రెస్‌లో వుండి అన్ని గమనిస్తూ వుంటారు. ఏడుస్తూ, భయపడుతూ కనిపిస్తే పిచ్చివాడు అనుకొని అరెస్ట్ చేస్తారు. జైలుకు వెళ్ళితే రెండు మూడు నెలల వరకు బయటికి రాలేరు. అందుకనే మంచిగా ప్రవర్తించండి. అతి చేయకండి. ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు దాటవద్దు. అక్కడ వాహనాలు చాలా స్పీడ్‌గా వెళుతుంటాయి. హైదరాబాద్ రోడ్లపై తిరిగినట్లు అక్కడ తిరగవద్దు. రోడ్డు దాటితే ఘోర ప్రమాదం జరగవచ్చు.

గ్రీన్ క్యాటగిరి అంటే హరమ్ సరిహద్దు నుంచి 1200 మీటర్ల దూరంలో వుంటుంది. అజీజియా అంటే 7 కిలీమీటర్ల దూరంలో వుంటుంది. దీన్ని హాజీలు ఫస్ట్‌క్లాస్, సెకెండ్‌క్లాస్ అనుకుంటారు. అది కరెక్ట్ కాదు. గ్రీన్ బిల్డింగ్‌లు అనువుగా వుంటాయి. అంతే కాని లగ్జరీ కోసం కాదు. హరమ్‌లో ఎక్కువ సమయం గడపడానికి ప్రయత్నించండి. అందరూ కలిసి కాబా చుట్టూ తవాఫ్ చేయండి. కాబాలోనూ పురుషులతో కలిసి మహిళలు నమాజ్ చేయడాన్ని వీలులేదు. కాబట్టి నమాజ్ సమయంలో మహిళలు నమాజ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు వుంటాయి. మీతో వున్న స్త్రీలను, మహిళలు నమాజ్ చేసే ప్రదేశంలో వెళ్లేలా నమాజ్‌కు అరగంట ముందే పంపండి. లేక పోతే సివిల్ డ్రస్‌లో వున్న అరబ్ పోలీసులు మహిళల్ని తరమేస్తుంటారు కాబట్టి మీరు మొండిగా ప్రత్నించకుండా జికర్ చేసుకుంటూ విడివిడిగా నమాజ్‌కు సిద్ధంగా వుండండి.

20 కె.జిల ఒక బ్యాగ్, 25 కె.జిల మరో బ్యాగ్ మొత్తం 45 కె.జి.లకు మాత్రమే అనుమతి వుంది. హ్యాండ్ లగేజ్‌లో మరో 10 కె.జిలు, జం జం ఐదు లీటర్లు తీసుకురావచ్చు. మక్కా–మదీనా నుంచి ఖర్జూర్, జానిమాజ్, జం జం మాత్రమే తీసుకురండి. దేనికంటే అక్కడంతా చైనా మాల్ దొరుకుతుంది. హైదరాబాద్‌లో వంద రూపాయలకే దొరికే వస్తువు అక్కడ రెండు వందలకు దొరుకుతుంది. అది కొని మోసపోకండి. ఎక్కువగా షాపింగ్ చేయకండి. మోసపోకండి. హజ్ యాత్రలో సమస్యలు సహజం. ఛాలెంజ్‌గా తీసుకోండి. ఫిజికల్‌గా ఫిట్ వుండండి. లక్షలాది జనంలో ప్రతి హాజీ ఒంటరి వాడే. అల్లాహ్‌తో మనస్సు కలపండి. కోపాన్ని అదుపులో వుంచుకోండి. హజ్ యాత్రలో ఎటు

వెళ్ళిన నడవాల్సిందే. 50 ఏళ్ళ లోపే మీ హజ్ విధిని పూర్తి చేయండి. సృష్టికర్త సన్నిధిలో దయా హృదయంతో మెలగండి. ఓపిక వహించండి. హజ్ మీకొక పరీక్ష. అక్కడి నుంచి నేర్చుకొని రండి. పరస్పరం ప్రేమ పంచుకోండి. హాజీ ఇహ్రాం (కఫన్) తొడిగిన తర్వాత అల్లాహ్ ధ్యానంలో మమేకమైపోవాలి. అల్లాహ్ మీ నియత్ చూస్తాడు. మక్కాలో తవాఫ్ చేయండి. మదీనాలో దరూద్ చదవండి.

"మొదటిసారి మానవుల కొరకు నిర్మించిన ఆరాధనా గృహం మక్కాలోనే ఉంది. సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి. ఇబ్రాహీమ్ ప్రార్థనా స్థలం ఉంది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు." (ఆలి ఇమ్రాన్: 96) హజ్ యాత్రికుల్లారా? మీరు పవిత్రమైన స్థలంలో వున్నారు. ఎల్లప్పుడూ అల్లాహ్ ధ్యానంలో వుండండి. పుణ్య పనులలో సమయాన్ని గడిపి అల్లాహ్‌ను మెప్పించడానికి ప్రయత్నించండి. మజ్జిదె హరాంలో నమాజ్, కాబతుల్లా చుట్టూ తవాఫ్ అధిక సంఖ్యలో చేయడం మరవవద్దు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై దరూదు సలాములు అధిక సంఖ్యలో పంపండి. హజ్.... ముసల్మానోంకి మేహరాజ్ హై....హజ్ ముబారక్ హో..

### ఇహ్రామ్ స్థితిలో ఇలాంటి పొరపాటు చేస్తే దమ్ (పరిహారం) తప్పనిసరి

***1.సుగంధం వినియోగించడం 2.కుట్టిన దుస్తులు ధరించడం 3.గోళ్ళు కత్తిరించడం 4.వెంట్రుకలు పీకడం 5.కటింగ్ చేయించడం 6.పేలను చంపడం 7.తల, ముఖం కప్పుకోవడం 8.సాక్సులు తొడగడం 9.భూభాగంపై జంతువులను వేటాడటం 10.మురికిని శుభ్రపరచడం 11.పోట్లాడటం 12.తవాఫె జియారత్ కంటే ముందు స్త్రీ/పురుషుడు కోరికతో చుంబించడం 13.అరఫాలో ఉన్నప్పుడు, తల వెంట్రుకలు తీసిన తర్వాత తవాఫె జియారత్ కంటే ముందు సంభోగం జరపడం 14.ఇహ్రామ్ ధరించకుండానే హరమ్‌లో ప్రవేశించడం 15.వుజూ చేయకుండా తవాఫ్ చేయడం 16.అపరిశుద్ధత, బహిష్టు, పురుటి రక్తస్రావస్థితిలో, వుజూ చేయకుండా ఉమ్రా తవాఫ్ చేయడం 17.తవాఫె విదా, తవాఫె ఖుదూమ్ విడిచిపెట్టడం 18.ఏ కారణం లేకుండా స్వారీ చేస్తూ సయీ చేయడం 19.అరఫాత్ మైదానం నుంచి సూర్యాస్తమయం అవకముందే బయలుదేరడం 20.సయీలోని ప్రదక్షిణలు విడిచిపెట్టడం 21.ముజ్దలిఫాలో సమయం కేటాయించకపోవడం. దమ్ తప్పనిసరి.***

# నా మాట

హజ్, ఉమ్రా, జియారత్ గురించి దివ్య ఖుర్‌ఆన్, హదీసుల ఆధారంగా ఈ పుస్తకం రాశాను. ఈ పుస్తకం అందరికీ ఉపయోగపడేటట్లు చేయమని, నా శ్రమను నిస్వార్థము చేయమని, సకల సౌభాగ్యాలుగల స్వర్గప్రవేశానికి మూలకారణం చేయమని అల్లాహ్‌ను వేడుకుంటున్నాను. అతనే మనందరికి దిక్కు. గొప్ప ఆపద్బాంధవుడు. ఏ ప్రయత్నం, మరే శక్తి అతనిని మించిపోదు.

సహోదరులారా! మీ ముందున్న ఈ చిన్న పుస్తకం హజ్ చేయు విధానం, ఉమ్రా, జియారత్ నియమాలను సంక్షిప్త రీతిలో రాసి మీకు సమర్పిస్తున్నాను. ప్రపంచ మానవాళి శ్రేయస్కరానికి, మార్గదర్శకానికిగాను ఇందులో గల విషయాలు ఇస్లాం గ్రంథాలు, ఖుర్‌ఆన్, హదీసుల ఆధారంగా ఈ క్రింది పవిత్ర ఆదేశాలను అనుసరించి రాశాను. దివ్యఖురాన్ వాక్యాలు ఇలా ఆదేశిస్తున్నాయి: 1. నీతి బోధించుము. 2.ఖురాన్‌లోని అంశాల్ని దాచకుండా ప్రజలందరికీ అర్థమైయేలా ప్రకటించండి.

అల్లాహ్ మనందరినీ సన్మార్గాన నడపాలని దుఆ చేస్తూ అనంత కరుణామయుడు అపార కృపాశీలుడు అల్లాహ్ పేరుతో మొదలుపెడుతున్నాను.

రాష్ట్రం నుంచి ఏటా ఎనిమిదివేల మంది హజ్ యాత్రకు వెళ్తుంటే వారిలో ఐదు వేల మంది జిల్లాల నుంచి వెళ్తున్నారు. వారికి తెలుగులో అర్థం అయ్యేలా సమగ్రంగా ఓ పుస్తకం వుండాలనిపించింది. నేను హజ్ యాత్రకు వెళ్తున్నప్పుడు తెలుగులో వున్న పుస్తకాల్ని సేకరించాను. అందులో వున్న సమాచారం నాకు పూర్తి సంతృప్తి ఇవ్వలేదు. అప్పుడనిపించింది. హజ్‌యాత్రకు సంబంధించి తెలుగులో సమగ్ర పుస్తకం తీసుకు రావాలని. నాకు తెలియని విషయాలన్నీ తెలుసుకున్నాను. చాలా మంది ముఫ్తీలను కలిశాను. హాజీలు మక్కా మదీనాలో ప్రతి క్షణం ఆధ్యాత్మిక ఆనందం పొందేలా నేను సేకరించిన సమగ్ర నోట్స్ యే ఈ పుస్తకం.

హాజీలు తమ సమయాన్ని క్షణం కూడా వృధా చేయకుండా సద్వినియోగం చేసుకునే విధంగా, మక్కా- మదీనాలో ప్రతి దినం సంపూర్ణంగా ఆధ్యాత్మికంగా వుండేలా ఈ పుస్తకం మీ ముందు వుంది. ఐదు సార్లు కాబాలోనే నమాజ్ చేస్తూ చారిత్రక ప్రాంతాల్ని ఎలా సందర్శించాలి. వాటి ప్రాముఖ్యతపై స్పష్టమైన వివరణతో గతాన్ని మీ కళ్ళ ముందు వుంచేలా ప్రయత్నించాను. మీరు సందర్శించనున్న ప్రాంతం గురించి ముందే మీరు తెలుసుకొని సందర్శిస్తే..... వేల ఏళ్ళ నాటి చరిత్ర మీ కళ్ల ముందు దృశ్య రూపంలో

అనుభూతి పొందేలా ఈ పుస్తకంలో రచన కొనసాగింది. ఒక్కో సంఘటన మిమ్మల్ని ఆ నాటి సమాజంలోకి తీసుకొని వెళ్ళి అద్భుతమైన ఆధ్యాత్మిక ఆనందాన్నిస్తుంది.

హ(జత్ ఇబ్రాహీమ్(అ) ఇరాక్‌లోని ఉ'ర్' అనే పట్టణంలో పుట్టారు. అగ్నిగుండం నుంచి రక్షణ పొందిన తరువాత ఆయన స్వగ్రామం వదలి 'హారాన్'కు వెళ్ళారు. అక్కడి నుంచి పాలస్తీనా వైపునకు వెళ్ళారు. బైతఏల్, హిబ్రూన్, బీ'ర్' సబఅలో తన సందేశ కేంద్రాలు నెలకొలిపారు. తరువాత మృత సముద్రం తూర్పున తన సోదర సుతుడు హజ్రత్ 'లూత్'(అ)ను సందేశ నిమిత్తం నియమించారు. అక్కడి నుంచి ఈజిప్ట్‌కు వెళ్ళారు. ఆ కాలంలో ఇరాక్ తరువాత సంస్కృతీ నాగరికతల దృష్ట్యా అదే మహత్తరమయిన ప్రాంతంగా అలరారేది. అయితే ఈజిప్ట్‌లో ఆయన సందేశ కేంద్రం ఏదైనా నెలకొలిపారా లేదా అన్నది స్పష్టంగా తెలియదు. ఆ తరువాత ఆయన హిజాజ్ (నేటి సౌదీ అరేబియా)కు బయలుదేరారు. 'మక్కా'లో దైవగృహం 'కాబా' నిర్మించారు. తన జ్యేష్టపుత్రుడు హజ్రత్ ఇస్మాయిల్‌ని అక్కడ సందేశ సేవలు అందజేసేందుకు నియమించారు. తరువాత పాలస్తీనాలో హెబ్రూన్‌ని తన స్థిరకేంద్రంగా ఏర్పరచుకున్నారు. ఆయన అక్కడే పరమపదించారు. ఆయన రెండవ కుమారుడు హజ్రత్ ఇస్‌హాక్(అ) ఆ కేంద్రంలో ఆయన స్థానంలో పని చేశారు. ఇస్‌హాక్ నుంచి హజ్రత్ ఇబ్రాహీమ్(అ) వారసత్వం హజ్రత్ యాకూబ్ (అ)కు దక్కింది.

క్రీస్తు శకం ఆరవ శతాబ్దమది. సౌదీ అరేబియాతో సహా అరబ్ దేశాల్లో పాటిస్తున్న సనాతన, నీతిబాహ్యమైన కట్టుబాట్లు, ఛాందస భావాల్ని రూపుమాపి, మరొక కొత్త జీవన విధానాన్ని ప్రజలకు అందించాలని మొహమ్మద్ ప్రవక్త(స) భావించారు. ఆయన సందేశం.... జాతుల జీవితాలనే మార్చివేసింది. తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు, చిన్నలు, పెద్దలు, పండితులు, పామరులు, పురుషులు, స్త్రీలు, ధనికులు, పేదలు అందరూ తమ ఆసక్తి, అభిరుచుల మేరకు ఇస్లాం శుభాలను ఆస్వాదించారు. ఈ సందేశం కారణంగా ఒక్కసారిగా బానిసలు పతనావస్థలోంచి పైకి వచ్చి అధికార పీఠాన్ని అధిరోహించారు. బాహ్య విషయాలనే కాదు, భావ దృక్పథాన్ని, అంతరంగాన్ని సైతం మార్చివేసిన విప్లవ జ్వాల అది. దొంగలు, దోపిడీ దారుల్ని అత్యంత విశ్వసనీయులుగా, శాంతికాముకులుగా మార్చివేసింది. దుష్టుల్ని, దుర్నీతిపరుల్ని నీతిమంతులుగా, నిజాయితీపరులుగా మార్చింది. ఆదర్శసమాజానికి, ఆరోగ్యవంతమైన నాగరికతకు అంకురార్పణ చేసి, ఉత్కృష్టమైన సంస్కృతీ సౌధాన్ని నిర్మింపజేసిన మహత్తర నైతిక విప్లవమది.

హజ్రత్ ఇబ్రాహీం(అ), హజ్రత్ ఇస్మాయిల్(అ)ల పవిత్ర హస్తాల మీదుగా

పునాదులు వేసిన కాబా కేవలం సృష్టికర్త, విశ్వప్రభువు అయిన అల్లాహ్ ఆరాధన కోసమే ప్రత్యేకించబడింది. కాని అవివేకులు, అజ్ఞానులైన ఖురైషీయులు దాన్ని విగ్రహాల మందిరంగా మార్చివేశారు. అందులో ప్రతీ చోట రాతి విగ్రహాలు, చెక్కబొమ్మలు స్థాపించారు. గోడల మీద చిత్రాలు చిత్రించారు. మహాప్రవక్త(స) దైవగృహంలో ప్రవేశించి చేతి కర్రతో ఒక్కో విగ్రహం మీద దెబ్బవేస్తూ "జాఅల్ హఖ్ఖు వ జహఖల్ బాతిల్ ఇన్నల్ బాతిల కాన జహూఖా" ఖుర్‌ఆన్ ఆయత్ పఠిస్తూ అక్కడ ప్రతిష్ఠింపబడిన 360 రాతి విగ్రహాలను తొలగించారు. రెండు వేల సంవత్సరాల తరబడి వేళ్ళూనికొని పోయిన జాతర్లు, ఉత్సవాలన్నింటిని నామరూపాల్లేకుండా చెరిపేసి 'కాబా' పవిత్రస్థలంగా, దైవగృహంగా కలకాలం అలరారుతుందని, ప్రపంచ ముస్లింలందరికీ చెందుతుందని అల్లాహ్ పవిత్ర నామంతో ప్రవక్త(స) ప్రకటించారు.

ప్రయాణ సామాగ్రి లేకుండా హజ్ కోసం బయలుదేరడాన్ని నిషేధించారు. అలాగే మూగ హజ్‌ను, ఆకలిదప్పులతో చేసే హజ్‌ను నిషేధించి అజ్ఞానకాలం నాటి ఇతర ఆచారాలను తుదముట్టించి హజ్ ఆరాధనను దైవభీతితో కూడిన పవిత్రమైన, నిరాడంబరమైన ఆరాధనగా చేశారు. హాజీలు హజ్ కోసం ఇళ్ల నుంచి బయలుదేరగానే ప్రాపంచిక వ్యాపకాలకు దూరంగా వుండాలని, కామాన్ని విడనాడి తమ భార్యల్తో ఆ కాలంలో లైంగిక సంబంధాల్ని పెట్టుకోకూడదని, తిట్లకు, దుర్భాషలకు ఇతర దుష్కార్యాలకు స్వస్తి చెప్పాలని ఆదేశించారు. హజ్‌లో కామోద్రేకాలను, పాపకార్యాలను త్యజించినవారు తమ మాతృగర్భాల నుంచి పుట్టిన వారిలా మారిపోతారని ప్రవక్త ప్రకటించారు.

కాబా గృహ ద్వారాలను తెరచిన తరువాత ప్రవక్త మొహమ్మద్(స) జారీ చేసిన మొదటి ఉత్తరువు ఏమిటంటే? హజ్రత్ ఇస్మాయీల్, ఇతర ప్రముఖుల చిత్రపటాలను తొలగించమని ఆజ్ఞాపించటం. తరువాత ఆయన అక్కడ నమాజ్ చేశారు. సకల పాపాలకు కారణం..... మత్తు పదార్థాలను సేవించటమని, మత్తు కలిగించే ఏ పదార్థమైనా, దాని ప్రమాణం ఎంతయినా, అది నిషిద్ధమనీ, 'హరామ్' అని ఆయన ప్రకటించారు. కాబతుల్లాహ్‌పై పెత్తనం చలాయిస్తున్న అన్ని తెగలను, వర్గాలను, నాయకులను తొలగించారు. సర్వమానవ సౌభ్రాతృత్వ భావనలు వెల్లివిరిశాయి. అప్పటి నుంచి 'ప్రతి ముస్లిం' అంటే... ఇక్కడ స్త్రీ-పురుష భేదం కనిపించదు. అందరూ కలిసి స్వేచ్ఛగా అల్లాను ధ్యానిస్తూ కాబా ప్రదక్షిణం చేస్తున్నారు.

**-డాక్టర్ ఫజలుల్లాఖాన్**

**Dr.Abdul-Raheem Mohammed Moulana**
M.B.B.S. MS., DM (Nephrology)
Retd. Chief of Kidney & Hypertension Centre
King Abdul Aziz Hopsital, **Holy Makkah, KSA**

*అల్హమ్దు లిల్లాహ్, వస్సలాతు వస్సలాం అలా రసూలుల్లాహి వ అలా ఆలిహీ వసహబిహీ అజ్మఈన్. అమ్మా బఅద్.*

*సోదర సోదరీ మణులారా! ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికమైనది. వంద సంవత్సరాలు నివసించినా పునరుత్థాన దినమున మేము ఈ ప్రపంచంలో ఒక్క రోజో, లేక ఒక్క రోజులోని కొంత భాగమో, మాత్రమే నివసించి ఉంటామని భావిస్తాము. ఈ ప్రాపంచిక జీవితం ఒక పరీక్ష! దీని కర్మల ప్రకారం వచ్చే పరలోక జీవితంలో ఫలితం లభిస్తుంది. ఎవరికైనా ఈ జీవితంలో తమ కర్మలకు మంచివిగానీ చెడువిగానీ వాటి పూర్తి ఫలితం లభించకపోవచ్చు. కాని ఈ ప్రాపంచిక జీవితపు కర్మలకు వచ్చే జీవితంలో పూర్తి ప్రతిఫలం ఇస్తానని అల్లాహ (సు.తా) వాగ్దానం చేశాడు. ఎవ్వరికీ రవ్వంత అన్యాయం కూడా జరుగదని కూడా వాగ్దానం చేశాడు. కాబట్టి అపర లోక స్వర్గవనాల శాశ్వత సుఖాలను అనుభవించాలనుకుంటే, దానికి ఏకైక మార్గం అల్లాహ్ (సు.తా) చూపించిన మార్గం మీద నడవటం. మానవుడు తనను తాను అల్లాహ్ ఆదేశాలకు అల్లాహ్ దాస్యానికి అర్పించడం.*

*ఇస్లాంలో ఐదు ముఖ్య విధులున్నాయి. 1. ఈమాన్ : అల్లాహ్‌ను ఏకైక విశ్వ ఆరాధ్యునిగా నమ్మి కేవలం ఆయనను మాత్రమే ఆరాధించడం. 2. సలాహ్ : దినానికి ఐదు సార్లు నమాజ్ చేయడం 3. జకాత్ : ఒక్క సంవత్సరం వరకు మిగిలివున్న ధనం నుంచి రెండున్నర శాతం ప్రతి సంవత్సరం దానం చేయడం. 4. సౌమ్ : రమదాన్ నెలలో ఉపవాసాలుండటం 5. హజ్జ్ : ఆర్థిక స్తోమత ఉంటే జీవితంలో కనీసం ఒక్క సారి హజ్ చేయడం. ఈ ఐదు విధులలో చివరిది హజ్! దీని మహత్యం ఏమిటంటే ఒక వేళ ఇది అల్లాహుతాఆలా నుంచి స్వీకరించబడితే అంతకు ముందు చేసిన పాపాలన్ని క్షమించబడి మానవుడు కొత్తగా పుట్టిన బిడ్డవలే అమాయకుడవుతాడు! ఆ తర్వాత మళ్ళీ పాపాలు చేయకుంటే స్వర్గానికి అర్హుడవుతాడు.*

*హాజీ డాక్టర్ ఫజులుల్లాహ్‌ఖాన్ ఎంతో చక్కగా ఈ పుస్తకాన్ని రాశారు. పాఠకుల చేతుల్లో ఉన్న ఈ పుస్తకాన్ని నేను నిశితంగా అధ్యయనం చేశాను. డాక్టర్ ఫజల్ తన కృషిని కొనసాగిస్తూ తెలుగు జనావళికి మరింత సన్నిహితమయి, వారికి తన జ్ఞానసంపత్తితో వీలైనంత ఎక్కువ ప్రయోజనం చేకూర్చుతారని ఆశిస్తున్నాను. అల్లాహుతాఆలా ఆదేశానుసారంగా హజ్ పూర్తి చేయుటకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగకరమైనది. అల్లాహ్ (సు.తా) మీ హజ్‌ను అంగీకరించాలని నా ప్రార్థన.*

*డా. అబ్దుల్ రహీం మౌలానా*
*దివ్యఖుర్ఆన్ సందేశం అనువాదకులు*
*మక్కా, సౌదీ అరేబియా*

# ఒక్కప్పటి మక్కా....

దూరతీరాల వరకు ఓ చెట్టు నీడ సైతం ప్రాప్తించని రాతి నేల. దాహం తీర్చుకునేందుకు గుక్కెడు నీరు కూడా లభ్యం కాని బండ భూమి. ఎటు చూసినా ఎడారే. బండ రాళ్ళే. బాటసారుల రాకపోకలు సైతం లేని బీడు స్థలం ఒక్కప్పటి మక్కా. దేవుని ఆజ్ఞ ప్రకారం అప్పట్లో హజరత్ ఇబ్రాహీం తన భార్య హజ్రత్ హాజరాతో చిన్నారి ఇస్మాయిల్‌ను ఈ గృహం వద్దే వదలి వెళ్లినట్లు చరిత్ర చెబుతోంది.

అలాంటి స్థలంలో హజరత్ హాజరా ఇస్మాయిల్ దప్పిక తీర్చడానికి మంచినీటి కోసం అన్వేషిస్తారు. సఫా, మర్వా అనే రెండు కొండల మధ్య హజ్రత్ హాజరా పరుగు పెడతారు. కాని ఎక్కడా నీటి చుక్క కన్పించదు. ఆ మాతృమూర్తిపై దయతలచిన భగవంతుడు చిన్నారి ఇస్మాయిల్ రెండు పాదాలున్న స్థలం నుంచి నీటి ఊటను పుట్టిస్తాడు. ఇది చూసి సంతోషంతో హజరత్ హాజ్రా జం, జం అంటూ ఆ నీటి చూట్టూ రాళ్ళు పేర్చుతారు. అప్పటి నుంచి ఈ పవిత్ర జలాలు మక్కా ప్రజల దాహార్తిని తీరుస్తుండటం విశేషం. ఈ సంఘటనను గుర్తు చేసుకుంటూ హాజీలు సఫా, మర్వా మధ్య ఏడు పరుగులు చేస్తారు.

నాలుగున్నర వేల సంవత్సరాల క్రితం తాము నమ్మిన దేవుడ్ని సంతృప్తి పరచడానికి మనిషినే బలి ఇవ్వడం సర్వసాధారణంగా జరిగేది. తమకు పుట్టిన పిల్లల్ని సైతం దేవుని పేరుతో బలి ఇచ్చి ఆ భగవంతుడిపై తమకున్న ప్రేమాభిమానాలను చాటుకునే వారు. మరికొందరైతే అతీతశక్తుల్ని స్వాధీనం చేసుకోవడానికి ఇలాంటి చర్యలకు పాల్పడేవారు. అయితే ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి ప్రవక్త ఇబ్రాహీం ప్రయత్నించారు.

దేవుడు కలలో కన్పించి ఇబ్రాహీం ముద్దుల కొడుకు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వమని కోరుతాడు. ఈ విషయాన్నే ఆయన మక్కాలో చాటింపు వేస్తారు. స్థానిక జనంతో పాటు సంఘ పెద్దలు కొన్ని వందల ఒంటెల్ని ఇస్మాయిల్‌కు బదులుగా బలి ఇవ్వమని సూచిస్తారు. ఇబ్రాహీం అలానే చేస్తారు. కాని మళ్ళీ కలలో దేవుడు కన్పించి ఇస్మాయిల్‌నే బలి కోరుతాడు. ఈ విషయాన్నే ఇబ్రాహీం సంఘపెద్దలతో చర్చిస్తారు. కొన్ని వేల సంఖ్యలో గొర్రెల్ని ఇస్మాయిల్‌కు బదులుగా బలి ఇస్తారు. కాని మళ్ళీ అదే కల రావడంతో ఇస్మాయిల్‌నే బలి ఇవ్వాలనే నిర్ణయం జరుగుతోంది. సయ్యదన హజ్రత్ ఇబ్రాహీం తన ముద్దుల కొడుకు ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి మినాకు తీసుకువస్తారు. బలి ఇచ్చే క్రమంలో ఓ అద్భుతం జరిగి ఇస్మాయిల్ స్థానంలో గొర్రె వధ జరుగుతోంది. దేవుడు మనిషి బలి కోరుకోడని, మనిషిని బలి ఇవ్వడం మహా పాపమన్న సందేశాన్ని ప్రవక్త ఇబ్రాహీం ప్రపంచానికి చాటి

చెబుతారు. అప్పటి నుంచి ప్రపంచంలోని యూదులు, క్రిస్టియన్లు, ముస్లింలలో మనిషిని బలి ఇచ్చే సాంప్రదాయం పూర్తిగా నిర్మూలించబడింది. ఈ మూడు మతాలవారు ఇబ్రాహీం సంతతివారే.

అల్లాహ్ సూచించిన పద్ధతి ప్రకారం కాబా గృహాన్ని, సందర్శించటం, అర్ఫాత్ మైదానంలో బస చేయడాన్నే హజ్ అంటారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం ప్రపంచం నలువైపుల నుంచి ముస్లింలు తర తమ భేదం లేకుండా హజ్‌యాత్ర కోసం జిల్‌హజ్ నెలలో సౌది అరేబియాలోని మక్కాకు ఇహ్రామ్ వస్త్రధారణలో వస్తారు. కాబా దర్శనం.... ప్రేమానురాగాలు, శాంతి సమానత్వం, సామాజిక న్యాయం వుండాలనే సందేశాన్నిస్తోంది.

నాలుగున్నర వేల సంవత్సరాల క్రితం మనిషి కనిపించిన ప్రతి వస్తువును, చెట్టును, పుట్టతో పాటు రాజుల్ని, తండ్రినే దైవంగా పూజించేవారు. ఆ సమయంలో ప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం ఒకే దేవుడిని పూజించాలని ప్రజలకు బోధించారు. దీనిపై ఆగ్రహం చెందిన రాజు ఎన్నో కష్టాలకు గురి చేశాడు. కష్టాల్ని ఎదుర్కొంటూనే ప్రజల అభిమానాన్ని గెల్చుకున్న ఇబ్రాహీం అల్లా ఆదేశం ప్రకారం దేవుని కోసం ఒక గృహాన్ని నిర్మించారు. ఆరోగ్యవంతుడై, తన దగ్గర భార్యా పిల్లల అవసరాల ఖర్చులకుపోగా కాబా గృహానికి వెళ్ళి రావడానికి సరిపడ ధనం మిగిలివున్నా ప్రతి ముస్లిం, స్త్రీ పురుషుడు తప్పకుండా హజ్ యాత్రకు వెళ్ళాలి. హజ్ యాత్రకు బయలుదేరిన ముస్లింలు ఇహ్రాం అనే ప్రత్యేక వస్త్రాధారణలోనే కాబాను సందర్శించాల్సి వుంటుంది.

మక్కా సరిహద్దును మిఖాత్ అంటారు. హాజీలు ఇక్కడే ప్రత్యేక నమాజ్ చేసి... పురుషులు కుట్టిన బట్టిల్ని వాడకుండా కేవలం రెండు తెల్లటి వస్త్రాల్ని (లుంగీలు దుప్పట్లు) తహ్‌బంద్‌ను నడుంకు చుట్టుకొని, చాదర్‌ను భుజంపై వేసుకొని మజీదే హరం సందర్శిస్తారు. కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణం చేస్తారు. ముఖామే ఇబ్రాహీం వద్ద రెండు రకాత్‌లు నఫిల్ నమాజ్ చదువుతారు. ఆ తరువాత సఫా, మర్వాపై పరుగుపెడుతూ ఏడు చక్కర్లు కొట్టి, నఫిల్ నమాజ్ చేసి తలవెంట్రుకలు కత్తిరించుకొని ఉమ్రా పూర్తిచేస్తారు.

# మక్కా ప్రయాణం

"లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్" పఠిస్తూ... మక్కా యాత్ర కొనసాగుతోంది. హజ్‌హౌస్ నుంచి షంషాబాద్ ఎయిర్‌పోర్ట్.... అక్కడి నుంచి నేరుగా జిద్దాకు ప్రయాణం. మనసులోనే ధ్యానం చేస్తూ శ్వాస తీసుకునేటప్పుడు, విడిచి పెట్టేటప్పుడు లబ్బైక్ ప్రాక్టీస్ చేయండి.

లయబద్ధంగా మనసు పలుకుతూనే వుండాలి లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్'. విమానంలో వున్న కంప్యూటర్‌లో స్పష్టంగా కనిపిస్తోంది. మనం ఎంత వరకు ప్రయాణం చేశాం. ఇంకా ఎంత వరకు ప్రయాణించాలి. ప్రస్తుతం మనం ఎక్కడ వున్నాం. అరేబియా సముద్రం మీదుగా విమానం వెళుతోంది. విండోలో నుంచి కిందికి చూస్తే ఆకాశ మార్గంలో అద్భుత దృశ్యాలు కంటికి రమణీయంగా కనిపిస్తాయి. ఆధ్యాత్మికానందంతో పాటు ఈ దృశ్యాలు అల్లాహ్ గొప్పతనాన్ని చాటుతుంటాయి. విశ్వప్రభువైన అల్లాహ్‌కు సహస్రకోటి ధన్యావాదాలు. ఆయన కృప, కటాక్షం వల్ల మీకు ఇంతటి అదృష్టం పట్టిందని గర్వంగా భావించండి. అపార కృపాశీలుదు పరమ కరుణామయుదు అల్లాహ్ చూపిన మార్గాన్ని ఎప్పటికీ వీడకుండా రుజుమార్గాన్ని అనుసరించాలని ధృడంగా నిశ్చయించుకోండి..

జిద్దా అంటే నాయనమ్మ అని అర్థం. అమ్మలగన్న అమ్మ హవ్వా అలైహిసలాం నగరమిది.... ఆమె సమాధి ఇక్కడే వుంది. మొదటి మానవుడి చిరునామా ఇక్కడే వుంది.

హజ్ టెర్మినల్ లోపల కుర్చిల్లో కూర్చోబెట్టి వ్యాక్సిన్ (చుక్కల మందు) ఇస్తారు. కొద్ది దూరంలో భారత జాతీయ పతాకం. ఆ జెండా కిందే ఇండియా నుంచి వచ్చే హజ్ యాత్రికుల లగేజ్‌ను విమానం నుంచి నేరుగా తీసుకొచ్చి పడేస్తారు. అక్కడికి వెళ్ళి మీ లగేజ్ తీసుకోండి. ఇమ్మిగ్రేషన్ చెకింగ్ తరువాత ఎయిర్‌పోర్ట్ బయటి ఆవరణలో ముఅల్లిమ్ బస్సుకోసం వెయిటింగ్ చేయాలి.

ముఅల్లిమ్ మనుషులు వచ్చి మిమ్మల్ని బస్సులో కూర్చోబెట్టి చిన్నపాటి ఆహ్వాన ప్రసంగం చేస్తారు. పాస్‌పోర్ట్‌లు తీసుకొని ఖజ్జూర్‌తో తయారుచేసిన స్నాక్స్, జంజం వాటర్ బాటిల్ ఇస్తారు. లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్ పఠిస్తూ బస్సు జిద్దా ఎయిర్‌పోర్ట్ నుంచి మక్కా వైపుకు బయలుదేరుతోంది. విశాలమైన రోడ్లపై బస్సు వేగంగా దూసుకుపోతోంది. చెక్‌పోస్ట్ వద్ద బస్సు ఆపుతాడు. డ్రైవర్ బస్సులో వున్న హాజీల పాస్ట్‌పోర్ట్‌లను తీసుకొని అక్కడి అధికారులకు చూపిస్తాడు. అరగంటకు పైగా అక్కడ చెక్ చేసుకుంటారు. మక్కా సరిహద్దులో వున్నా మీరు మరికొన్ని నిమిషాల్లో అల్లాహ్ గృహానికి చేరుకుంటారు. ఆ క్షణాలు మరిచిపోలేనివి.

నిజమే. అల్లాకా ఫజల్.... ఆజ్ హోరహా హయ్ అనుకుంటూ.... లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్. మనసు లయబద్ధంగా అలా పఠిస్తూనే వుండండి. ఎటు చూసినా

కొండలే కనిపిస్తుంటాయి. వాటి లోపల టన్నెల్స్ ద్వారా ప్రయాణిస్తూ మీకు కేటాయించిన బిల్డింగ్ వద్ద బస్సు అతను విడిచిపెడతాడు.

మీకు కేటాయించిన రూంలో సామాను పెట్టుకోండి. ఉమ్రా పూర్తి చేయండి. లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్ పఠిస్తూ కాబా దర్శనానికి బయలుదేరండి. అల్లా కృపతోనే మీకు ఈ అదృష్టం పట్టింది.

ఇది నిజం. పవిత్ర మక్కా నగరంలో కాబా వైపు మీరు ప్రయాణం చేస్తున్నారు. లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్ పఠిస్తూ ఒక్కో అడుగు ముందుకు వేస్తూ మస్జిదే హరంలోకి ప్రవేశించండి.

కళ్ళు పైకి ఎత్తకుండా  నడక కొనసాగించండి. కాబాపై పడిన మొదటి చూపులో ఏం కోరుకుంటే అది నెరవేరుతోందనే విశ్వాసం... అందుకే పైకి చూడకుండా ముందుకు వెళుతూ *"బిస్మిల్లాహి వల్ హందు లిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలుల్లాహి సల్లల్లాహు అలైహి వసల్లం"* పఠిస్తూ......

పైకి చూడండి. "మహా అద్భుతం" కళ్ళ ముందు పవిత్ర కాబా. ఆ క్షణంలో శరీరం దూదిపింజలా తేలియాడుతున్న అనుభూతి. గతంలో మరెప్పుడూ చూడని ఆ వెలుగులో కాబా గృహం మెరిసిపోతోంది. మీ శరీరానికి-ఆత్మకు సంబంధం తెగిందా అనిపించే క్షణమది. అల్లాహ్ నేను జీవితంలో చేసే ప్రతి దువా అంగీకరించంటూ వేడుకోండి. మొదటి చూపులో కను రెప్ప కొట్టకుండా "చేసే దువా" అల్లా అంగీకరిస్తాడట. రెండు చేతులు పైకి లేపి దువా చేస్తూ అల్లాహ్‌తో మనసులోని భావాల్ని పంచుకోండి. *"అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్"* ఆ క్షణంలో లభించిన సంతోషం మీ జీవితంలో మరెప్పుడూ లభించదు.

కాబా పరిసర ప్రాంతమంతా వెలుగుతో నిండి వుంటోంది. తవాఫే కాబా చేయడానికి హజ్రె అస్వద్ వైపు ఈ దువా పఠిస్తూ......

*"అల్లాహుమ్మ అన్తస్సలాము వ మిన్ కస్సలాం. వ ఇలైక యర్జివుస్సలాం హయ్యినా రబ్బనా బిస్సలాం వ అద్‌ఖిల్‌నా దారుక దారుస్సలామి తబారక్త రబ్బనా యా జల్ జలాలి వల్ ఇక్‌రామ్-అల్లాహుమ్మ హాజా బైతుక అజ్‌జంతహు వ షర్రఫ్‌తహు వ కర్రమ్‌తహు".*

*"అల్లాహుమ్మ ఫజిదహు తాజీమన్ వజిద్‌హు తష్‌రీఫన్ వ తక్‌రీమా"*

*“వజిద్‌హు మహాబతన్ వజూమన్ హజ్జహుబ్ బిర్‌అవ్ వ కరామత”*

*“అల్లాహుమ్మఫ్‌తహ్‌లీ అబ్వాబ రహ్మాతిక వ అధ్ఖిల్‌నీ జన్నతిక వ అఇజ్‌నీ మినష్ షైతా ని(రజీమ్.*

“అయ్ అల్లాహ్ ఆప్ హీ సలామతీ దేనే వాలేహై. ఔర్ ఆప్ హీసే హమ్ కో సలామతీ హై. ఔర్ ఆప్ హీకీ తరఫ్ సలామతీ ఫిర్‌తీ హై. అయ్ హమారే రబ్ హమ్‌కో సలామతీ కే సాథ్ జిందా రఖియే ఔర్ హమ్‌కో సలామతీ కే ఘర్ మే దాఖిల్ కీజియే. ఆప్ బర్కత్ వాలే ఔర్ ఇజ్జత్ వాలే హై. అజ్మత్ దీ ఆప్‌నే ఇస్ కో ఔర్ షరఫ్ బక్షా. ఇస్ కో ఔర్ ఇక్రామ్ దియా ఇస్‌కో”

“అయ్ అల్లాహ్ ఇస్‌కీ అజ్మత్ మే ఇజాఫా కీజియె. ఔర్ ఇస్‌కీ బుజుర్గీ ఔర్ ఇక్రామ్ ఏ భీ ఇజాఫా కీజియె”

“ఔర్ జియాదా కీజియె లోగోం కే దిలో మే ఇస్కీ అజ్మత్ ఔర్ హైబత్ ఔర్ ఉస్ షఖ్స్ కీ నేకియో కో దోబాలా కీజియె ఔర్ బుజుర్గీ దీజియె జో సచ్చే దిల్ సే ఇస్ కా హజ్ కర్తాహై”

“అయ్ అల్లాహ్ మేరే లియె అప్ని రహ్మత్ కే దర్వాజే ఖోల్ దీజియె ఔర్ ముఝె జన్నత్ మే దాఖిల్ కీజియె ఔర్ మై పనాహ్ మాంగ్‌తా హూ షైతాన్ మర్దూద్ సే”

లక్షల్లో జనం కాబా చుట్టూ ప్రదక్షిణం చేస్తూనే వుంటారు. హ(జె అస్వద్ వున్న వైపుకు వెళ్ళండి. తవాఫ్ ప్రారంభం చేయడానికి సరైన దిశను సూచిస్తూ గ్రీన్ లైట్ వెలుగుతోంది. గ్రీన్ లైట్ వున్న దిశలో నిలబడి హ(జె అస్వద్ వైపు ముఖం తిప్పి నియ్యత్ చేసుకోవాలి.

*“అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదు తవాఫ బైతికల్ హరామి తౌఫల్ ఉమ్రతి ఫయస్సిరుహా లీ బిహఖ్ఖి హబీబిక ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం తఖబ్బల్‌హు మిన్నీ”*

పఠిస్తూ రెండు చేతులు హ(జె అస్వద్ వైపు చూపుతూ

‘*‘బిస్మిల్లాహి అల్లాహు అక్బర్”* అంటూ తవాఫ్ మొదటి చక్కర్ ప్రారంభించండి.

*“సుబ్‌హానల్లాహి వల్‌హందు లిల్లాహి వలాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలా హోల వలా ఖువ్వత ఇల్లా బిల్లా హిల్ అలియ్యిల్ అజీమ్ – వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహి సల్లల్లాహు అలైహి వసల్లం – అల్లాహుమ్మ ఈమానవ్ వతస్‌దీఖన్ బికితాబిక వ వఫా అన్ బిఅహ్‌దిక వ ఇత్తిబాఅన్ లి సున్నత నబియ్యిక ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లం”*

పఠిస్తూ కుడివైపు ముందుకు నడుస్తూ..... కాబా దర్వాజ వద్ద

*"అల్లాహుమ్మ హాజల్ బైతి బైతుక వ హాజల్ హరము హరముక వ హాజల్ అమను అమనుక వ హాజా మఖాముల్ ఆయిజు బిక మినన్నార్"*

పఠిస్తూ రుకునె ఇరాఖీ వద్ద

*"అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినష్ షక్కి వష్షిర్కి వల్ కుఫ్రి వన్ నిఫాఖి వష్ షిఖాఖి వ సూయిల్ అఖ్లాఖి వసూయిన్ నజరి ఫిల్ అహ్లి వల్ మాలి వల్వలది"*

పఠిస్తూ ముందు నడుస్తుంటే హతీం – మీజాబె రహ్మత్ సమీపంలో రాగానే

*"అల్లాహుమ్మ అజిల్లనీ తహత అర్షిక యౌమ లాజిల్లి ఇల్లా జిల్ల అర్షిక్ అల్లాహుమ్మస్ఖినీ బికాసి ముహమ్మదిన్ సల్లల్లాహు అలైహి వసల్లం షర్బతన్ లా అజ్మాయి బాదహు అబదా"*

పఠిస్తూ రుకునె షామీ సమీపించింది.

*"అల్లాహుమ్మజ్ అల్హు హజ్జమ్ మబ్రూరన్ వసఅయమ్ మష్కూరన్ వ జంబమ్ మగ్ఫూరన్ వ తిజారతన్ లన్తబూర యా అజీజు యా గఫూరు గ్ ఫిర్ వర్హమ్ వజావజ్ అమ్మాతాలమ్ ఇన్నక అన్తల్ అయిజ్జల్ అక్రమ్"*

పఠిష్తూ రుకునె యమనీ సమీపంలో చేరుతూ

*"అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మినల్ కుఫ్రి వ అవూజుబిక మినల్ ఫఖ్రి వమిన్ అజాబిల్ ఖబ్ర వమిన్ ఫిత్నతి మహ్యాయి వ మమాతి వ అవూజుబిక మినల్ ఖిజియి ఫిద్దున్యా వల్ ఆఖిర"*

పఠిస్తూ రుకునె యమానీ – హజ్రె అస్వద్ మధ్యలో

*"అల్లాహుమ్మ రబ్బనా ఆతినా ఫిద్దున్యా హసనతవ్ వఫిల్ ఆఖిరతి హసనతవ్ వఖినా అజాబన్నార్. వద్ ఖిల్నల్ జన్నత మఅల్ అబ్రారి, యా అజీజు యా గఫ్ఫారు యా రబ్బుల్ ఆలిమీన్"*

పఠిస్తూ హజ్రెఅస్వద్కు చేరుకుని ఒక చక్కర్ పూర్తి చేయండి. ఇలాగే ప్రతి తవాఫ్లో ఈ దువాలు పఠిస్తూ ఏడు చక్కర్లు పూర్తి చేయాలి.

# ముఖామె ముల్తజిం

కాబా దర్వాజాకు హజ్రె అస్వద్కు మధ్య వున్న స్థలం ఇది. ఇక్కడ

*"అల్లాహుమ్మ యారబ్బుల్ బైతిల్ అతీఖి ఈతిఖ రఖ్బతి మినన్నారి వ అయిజ్నీ మిన్ కుల్లి సూయిన్ వ ఖన్నీనీ బిమా రజఖ్తనీ వబారిక్ ఫీమా ఆతైతనీ"*

దువా చేసి మఖామె ఇబ్రాహీమ్ వైపు

*"వత్తఖిజూ మిమ్ మఖామి ఇబ్రాహీమ ముసల్లా"*

పఠిస్తూ వెళ్ళి రెండు రకాత్‌ల నమాజ్ చేయాలి. మొదటి రకాత్‌లో "ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్, రెండవ రకాత్‌లో "ఖుల్‌హు వల్లాహు అహద్ సూరా చదివాలి. నమాజ్ తరువాత దువా చేసుకోని జం జం వద్దకు వెళ్ళి...

*"అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక రిజ్‌ఖన్ వసఅ అవ్ ఇల్మన్ నాఫిఅవ్ వ షిఫాఅన్ మిన్ కుల్లి దాయిన్"*

పఠించి కాబా వైపు చూస్తూ జం జం కడుపునిండా తాగాండి.

ఇక సయీ చేయాలి. సాత్ ఫేర్ లగానా హై.

హజ్రెఅస్వద్ వైపు రెండు అరచేతులు చూపుతూ

*"ఇన్నస్ సఫా వల్ మర్వత మిన్ షాయిరల్లాహ"*

పఠించి సఫా-మర్వా వైపు వెళ్ళాలి. సఫా చేరుకొని కాబా వైపు తిరిగి రెండు అరచేతులు ఆకాశం వైపు ఎత్తి ఈ దువా పఠించండి.

*"లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లాషరీకలహూ లహుల్ ముల్కు వలహుల్ హందు యుహ్‌యీ వయుమీతు వహువ హయ్యు లాయుమీతు బియదిహిల్ ఖైర్ - వహువ అలా కుల్లి షయ్యిన్ ఖదీర్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ వసదఖ వాదహూ వనసర అబ్దహూ వఅ అజ్‌జ జున్‌దహూ వ హజమల్ అహ్‌జాబ వహ్‌దహూ లా ఇలాహ ఇల్లల్లాహు ముఖ్లిసీన లహుద్దీన వలవ్ కరిహల్ కాఫిరూన్"*

అల్లా కరుణాకటాక్షాలు లభించే స్థలం ఇది. మనం చేసే దువా ఇక్కడ ఫలప్రదమవుతుంది.

ఇక్కడే సయీ చేయడానికి నియత్ చేయాలి

*"అల్లాహుమ్మ ఇన్నీ ఉరీదుస్ సఅయబైనస్సఫా వల్ మర్వతిన్ సబ్అత అష్వాతిన్ లివజ్ హికల్ కరీమ్ ఫయస్సిరిహు లీ వతఖబ్బల్‌హు మిన్నీ బిహఖ్ఖి ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం."*

పఠించి మర్వా వైపుకు నడవాలి. మధ్యలో రెండు గ్రీన్ ట్యూబ్‌లైట్లు కనిపిస్తాయి. వాటి మధ్యలో పరుగెత్తాలి. ఇక్కడే హాజ్రా అలైహిస్సలాం పరుగుపెట్టారు.

*"రబ్బనా ఆతినా ఫిద్దున్‌యా హసనతవ్ వఫిల్ ఆఖిరతి హసనతవ్ వఖినా అజాబన్నార్"*

పఠిస్తూ మర్వా చేరుకొని కాబా వైపు తిరిగి దువా చేయాలి. సఫా నుంచి

మర్వాకు ఒకటి. మర్వా నుంచి సఫాకు రెండు. సఫా నుంచి మర్వాకు మూడు. మర్వా నుంచి సఫాకు నాలుగు. సఫా నుంచి మర్వాకు ఐదు. మర్వా నుంచి సఫాకు ఆరు. సఫా నుంచి మర్వాకు ఏడు. ఇక్కడ సయీ పూర్తి అవుతుంది. గ్రీన్ లైట్‌ల మధ్య ప్రతిసారి పరుగు పెట్టాలి. మహిళలు పరుగు పెట్టాల్సిన అవసరం లేదు.

సయీ పూర్తి అయిన తరువాత కాబా వైపుకు వెళ్ళి హజ్రెఅస్వద్ ముందు రెండు రకాత్‌ల నమాజ్ చేయాలి. మస్జిద్ హరం నుంచి బయటికి వచ్చి తలవెంట్రుకలు తీసివేయాలి. అప్పుడు మీ ఉమ్రా పూర్తి అవుతుంది. జం జం నీళ్ళు ఎక్కువగా తాగండి. కాబాలో ప్రతి రోజు తహజ్జుద్ నమాజ్ కూడా చదవడానికి ప్రయత్నించండి. ఐదుసార్లు నమాజ్, దరూద్ చదువుతూ వీలైనంత ఎక్కువ సేపు కాబాలోనే వుండటానికి ప్రయత్నించండి.

మజ్జిదె హరంలో కూర్చొని ఎదురుగా హతీం, పైన బంగారు పర్నాలను చూస్తూ.... అల్లా గొప్పతనాన్ని ఇక్కడే చూడాలి. ఏదో... ఓ రకమైన వెలుగు–అదోరకమైన వేడి స్పష్టంగా అనిపిస్తోంది. మాటలకు అందని అదో అద్భుతమైన అనుభూతి. గతంలో విన్నారు. క్యాలెండర్లలో ఫొటోలు చూశారు. ఇప్పుడు కనులారా వీక్షిస్తూ ఆస్వాదించండి.

# హజ్ నేపథ్యం

మక్కాకు అంటే కాబాకు 5 కి.మీ. దూరంలో ఉంది మీనా. మీనా నుంచే హజ్ యాత్ర ప్రారంభం అవుతుంది. క్రీ.శ. 632లో మొహమ్మద్ ప్రవక్త (స) అరఫాత్ మైదానంలో ఖుత్బా ఇచ్చారు. 200 అడుగుల ఎత్తులోని జబలే రహ్మత్ పర్వత గుట్ట వద్ద ఒంటె మీద కూర్చుని ప్రసంగించారు. లక్ష మందికి పైగా ప్రజలు ప్రవక్త సందేశాన్ని విన్నారు. ఇస్లాం మానవుల్లో సమానత్వానికి ఎంత ప్రాధాన్యత ఇస్తుందో వివరించారు. వ్యక్తిగతంగా మానవుల మధ్య ఎన్ని తేడాలున్నా సమానత్వం అవసరమనీ, భార్యా భర్తల మధ్య హక్కులు, బాధ్యతలు సమానంగా పంచుకోవాలని చెప్పారు. వడ్డీలు తీసుకోవడం మహాపాపమని బోధించారు.

ఈ స్థలంలో యాత్రికులు మౌనంగా నిలబడి ఆ బోధనల్ని గుర్తు చేసుకుంటారు. ప్రతి వ్యక్తి తన మార్గంలో దైవాన్ని ప్రార్థిస్తాడు. కూర్చుని, నిలుచుని, కదలకుండా, అటూ ఇటూ నడుస్తూ దైవాన్ని తలచుకోవచ్చు. తన హృదయాన్ని అల్లాహ్‌కి విప్పి చెప్పే విధంగా వ్యక్తిగత ప్రార్థనలు నిజాయితీ, నిష్టలతో చేయవచ్చు. అరఫాత్ మైదానంలో నిలబడటం (వకూఫ్) యాత్రికులకు ప్రవక్త(స) బోధనల నాటి సమావేశాల్ని గుర్తు చేస్తుంది. హజ్ రోజు మీరు తప్పకుండా అరఫాత్ మైదానంలోని గుట్టపై నిలబడడానికి ప్రయత్నించండి. అక్కడున్న లక్షల మంది జనాన్ని చూసి భయపడవద్దు. హజ్ రోజు అక్కడ కొన్ని లక్షల

మందిలో నిలబడటమే సమస్య అని ఇవాళ్టి యాత్రికులకి అనిపిస్తే, అంతిమ తీర్పు ఖయామత్ రోజు అల్లాహ్ ఎదుట తీర్పు కోసం కోట్ల మంది ప్రజల మధ్య దుస్తుల్లేకుండా, కాళ్లకు చెప్పుల్లేకుండా నిలబడటం ఇంకెంత కష్టం?

అరఫాత్ నుంచి ముజ్దలీఫాకు ప్రయాణం. ఆ రాత్రి అక్కడే గడిపి ఫజర్ నమాజ్ తరువాత మీనాకు వెళ్ళాలి. లక్షల మంది యాత్రికులు. నమాజ్ ముగించుకొని షైతాన్‌పై రాళ్ళు రువ్వడానికి బయలుదేరుతారు.

ఇబ్రాహీం(అ) ఇస్మాయిల్(అ)ను అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం ఖుర్బానీ ఇవ్వకుండా చేయాలని సైతాన్ పలువిధాలా ప్రయత్నించాడు. కాని ఇబ్రాహీం(అ) ఆ ఆలోచనల్ని వదిలించుకొని తన లక్ష్యాన్ని పూర్తి చేస్తారు.

తన కుమారుడిని(ఇస్మాయిల్)ను ఖుర్బానీ చేస్తున్నట్లుగా ఇబ్రాహీంకు కల వస్తుంది..... ఇంత కష్టదాయకమైన పని అల్లాహ్ ఎందుకు చేయమన్నాడు? ఇబ్రాహీం(అ) వృద్ధుడు. ఆయన కుమారుడు ఇస్మాయిల్ యువకుడు. తన జీవితానికి కొనసాగింపుగా భావించి కుమారుడి సాయంతో జీవనం గడపాల్సిన వయస్సు ఇబ్రాహీంది. ఇబ్రాహీం(అ)కు పిల్లలు పుట్టే అవకాశమే లేదు. ఆ దశలో అల్లాహ్ ఇబ్రాహీం(అ)కు ఇస్మాయిల్(అ)ను బలిదానం చేయమని ఆజ్ఞా ఇచ్చాడు. కత్తి తీసుకుని కుమారుడి కళ్ళలోకి చూస్తూ తన స్వంత చేతులతో అతన్ని జుబ్హా చేయాలి. ఎంత మంది పిల్లలున్నా... ఇలాంటి పని చేయడం కష్టమే. అలాంటిది ఒకే ఒక్క కొడుకు. అందులోనూ యుక్త వయసులో ఉన్న కొడుకును చంపాలి. అల్లాహ్ మీద అత్యంత విశ్వాసం కలిగిన వారికి తప్ప వేరెవరికి సాధ్యమయ్యే పని కాదు ఇది. ఆ దేవుడి మీద అమితమైన ప్రేమ ఉన్న వారు తప్ప ఇంకెవరూ ఈ పని చెయ్యలేరు. ఇబ్రాహీం విశ్వాసానికి పెట్టిన అగ్నిపరీక్ష అది. ప్రపంచంలో అందరికన్నా తనకు అల్లాహ్‌యే ప్రీతిపాత్రుడని ఇబ్రాహీం నిరూపించుకున్నాడు. మాటలతో కాదు, చేతులతో, అల్లాహ్ ఆదేశం ప్రకారం కొడుకుని బలిదానం చెయ్యడానికి తీసుకు వెళ్ళారు. ముందు చెప్పకుండా పర్వతం దాకా తీసుకు వెళ్ళి, అక్కడ కత్తి బయటికి తీసి కొడుకును ఆశ్చర్య పెట్టాలని ఇబ్రాహీం ప్రయత్నించలేదు. ముందే తానేం చేయబోతున్నాడో చెప్పారు. ఏం జరగబోతోందో తన కుమారుడికి ముందుగా చెప్పాలని ఇబ్రాహీం(అ) అనుకున్నారు. సరే, మరి అల్లాహ్ పెట్టిన ఈ పరీక్ష గురించి ఇస్మాయిల్ ఎలా భావించారు?

ఖురాన్ ఈ సంఘటనను ఖచ్చితమైన పదాల్లో

"ఆ బాలుడు అతనికి తోడుగా శ్రమ చేయగల వయసుకు చేరుకున్నప్పుడు, ఇబ్రాహీం అన్నాడు!

ఓ నా కుమారా! వాస్తవానికి నేను నిన్ను బలి (జుబా) చేస్తున్నట్లు నా కలలో చూశాను. ఇక నీ సలహా ఏమిటో చెప్పు!

ఇస్మాయిల్(అ) అన్నాడు.

"ఓ నాన్నా! నీకు ఇవ్వబడిన ఆజ్ఞను నెరవేర్చు. అల్లాహ్ కోరితే నీవు నన్ను సహనశీలునుగా పొందగలవు! (అస్ సాఫ్ఫాత్ 37:102)

ఇస్మాయిల్ తన జీవితం కన్నా అల్లాహ్‌నే ఎక్కువ ప్రేమించారు. అందుకే తండ్రి కొడుకులిద్దరు కత్తి పట్టుకుని ముందడుగు వేశారు. కానీ అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించడాన్ని షైతాన్ అంగీకరిస్తాడా? భూమ్మీద అల్లాహ్ పట్ల ఎవరైనా వినయం ప్రదర్శిస్తే దాన్ని నాశనం చెయ్యడమే అతని ధ్యేయం. ఖలీలుల్లాహ్ (అల్లాకు సన్నిహిత సేవకుడు) అయిన ఇబ్రాహీం(అ) బుర్రలో రకరకాల ఆలోచనలతో షైతాన్ కలవర పెట్టాడు. నీ కొడుకును ఏం చేయాలనుకుంటున్నావు? నువ్వు వృద్ధుడివి. నీకు కొడుకు అవసరం ఉంది. అతన్ని నరికి చంపితే నీకేం వస్తుంది? అలాంటి కలల్ని ఎలా నమ్మగలవు? ఆ స్వప్నం అబద్ధం....అబద్ధం అనే ఆలోచనల్ని రేపుతాడు. షైతాన్ ఎంత చిన్న అవకాశాన్నయినా వదలడు. అందుకే ఇబ్రాహీంకు అల్లాహ్ ఆజ్ఞ పాటించవద్దని ఎన్నో రకాలుగా బుర్రలో విశ్లేషించాడు.

ఇబ్రాహీం(అ), ఇస్మాయిల్, హాజిరా ముగ్గురికి ఇలాంటి ఆలోచనలు వచ్చాయి. అంటే షైతాన్ ఇలాంటి రకరకాల భావాల్ని క్రియేట్ చేయడానికి ప్రయత్నించి విఫలమైయాడు. వారి చేత దైవాజ్ఞ తిరస్కరింపజేయాలని అన్ని ప్రయత్నాలు చేస్తూనే వున్నాడు. ఇస్మాయిల్, ఇబ్రాహీంలు ఇల్లు దాటి తమ పని మీద బయల్దేరగానే వాళ్ళ వెంట బడ్డాడు. అంటే షైతాన్ కారణంగా వివిధ రకాల ఆలోచనలు వీరిని వెంటాడుతూనే వున్నాయి.

హాజరతో షైతాన్ ఇలా అంటాడు. నీ కొడుకును నరికి చంపడానికి ఇబ్రాహీం తీసుకు వెళ్ళాడు. అల్లాహ్ అలా చేయమన్నాడా? అయితే అల్లాహ్ ఆదేశిస్తే అలా జరగాల్సిందే. అనే దృఢ అభిప్రాయానికి వస్తారు హాజర. దీంతో షైతానీ ఆలోచనలు ఆమెకు దూరమౌతాయి.

ఇక షైతాన్ ఇబ్రాహీం వద్దకు వస్తాడు. 'నీ స్వప్నం అల్లాహ్ ఆదేశమని నీకెవరు చెప్పారు? అదేదో తప్పుడు కల అయి వుంటుంది. నీ కొడుకును చంపితే అల్లాహ్‌కు ఏం వస్తుంది? ఈ ఆజ్ఞ పాటించకు. పాటిస్తే నువ్వు పశ్చాత్తాపంతో కుమిలిపోతావు. నీ కొడుకుని నరికి చంపితే చనిపోయేటప్పుడు అతని ముఖం ఎలా ఉందో నీ జీవితంలో ఎన్నడూ మర్చిపోలేవు. నీ జీవిత మంతా అది నీ కళ్ళ ముందు కనబడి నిన్ను చిత్రహింసలు పెడుతుంది. నీకు 84 ఏళ్ళు. తర్వాత ఇంకో కొడుకు పుట్టడు. అంటూ వస్తున్న షైతాన్

ఆలోచనల్ని పట్టించుకోకుండా ఇబ్రాహీం అల్లాహ్‌ను ఆరాధిస్తూ ధృఢ సంకల్పంతో ముందుకు వెళ్ళారు. ఇబ్రాహీంలో ఎలాంటి మార్పును గమనించని షైతాన్ ఇక ఇస్మాయిల్‌ను టార్గెట్‌గా చేసుకున్నాడు. నీ తండ్రి నిన్ను నరికి చంపేస్తాడు. అనే ఆలోచన వచ్చింది. వెంటనే దానికి ఇస్మాయిల్ ఇలా స్పందించారు. అల్లాహ్ ఆయనకు అలా ఆదేశం ఇచ్చాడు. అలాగే చెయ్యనీ అంటూ ఇస్మాయిల్(అ) ధృఢంగా ప్రశాంతంగా వుంటారు.

అల్లాహ్ ఆదేశం పాటించేందుకు సయ్యదన ఇబ్రాహీం(అ) తన కుమారుడ్ని ఖుర్బానీ ఇవ్వడానికి ఎన్నుకున్న ప్రదేశం మీనా. మొదటి సారి ఖురానీ ఇవ్వడానికి ప్రయత్నిస్తే షైతానీ ఆలోచనలు వస్తాయి. అప్పుడు ఇబ్రాహీం ఏడు గులకరాళ్ళను తీసుకుని ఆ ప్రదేశంలో గాలిలో విసురుతారు. అక్కడి నుంచి కొద్ది దూరం వెళ్ళి ఇస్మాయిల్‌ను వధించడానికి ప్రయత్నిస్తారు. మళ్ళీ అలాంటి ఆలోచనలే వచ్చి బలిదానం జరగదు. ఇబ్రాహీం షైతానీ ఆలోచనలు వచ్చిన ప్రదేశంపై ఏడు రాళ్ళు కొడుతారు.

అక్కడి నుంచి మరికొంత దూరం వెళ్ళి ఇస్మాయిల్‌పై కత్తి తిప్పుతారు. దైవదూత జిబ్రయిల్ స్వర్గం నుంచి గొర్రెను తీసుకొని ఇక్కడ ప్రత్యక్షమవుతారు. అల్లాహ్ మీ బలిదానాన్ని అంగీకరించాడు. దేవుడు పెట్టిన పరీక్షలో మీరు నెగ్గారు. మనిషి బలిని దేవుడు అంగీకరించడు. ఇదే సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పండి. ఈ గొర్రెను ఖుర్బానీ ఇవ్వండి. ఇది అల్లాహ్ ఆదేశమని తాను తీసుకువచ్చిన ప్రవక్త సందేశాన్ని ఇబ్రాహీంకు జిబ్రయిల్ వివరిస్తారు.

అప్పట్లో హజ్రత్ ఇబ్రాహీం షైతాన్‌పై రాళ్ళు విసరడం అల్లాకు ముచ్చటేస్తుంది. అదే సాంప్రదాయాన్ని హజ్‌లో భాగంగా పాటించమని విధిగా ఆదేశించాడు. అందుకే హాజీలంతా షైతాన్‌పై రాళ్ళు విసురుతారు. మన లోపల ఉన్న షైతాన్‌ను మనం (మానసికంగానే) రాళ్ళతో కొట్టి, లోపలికి రాకుండా చేయాలని దీని ద్వారా మనకు అందే నీతి. షైతాన్ తన పన్నాగాలతో మన దగ్గరకు వచ్చినప్పుడు అతన్ని పట్టించుకోకుండా రాళ్ళతో కొట్టాలి. షైతాన్ చూపే ఆశలకు లొంగ కూడదు. ఆ షైతానీ ఆలోచనలు తగ్గే దాకా ఇలాగే చేయాలి. షైతానీ మాటల్ని వినడమే అవిధేయతకు మొదటి మెట్టు. మనం తన మాటల్ని వినేలా షైతాన్ మనల్ని ప్రోత్సహిస్తాడు. అతనికి ఆ అవకాశం ఇవ్వమని మనం మనసులోనే అనుకోవాలి. ధృడంగా వ్యవహరించాలి......

మజ్జిదె హరంలో ఎక్కడ పడితే అక్కడ జం జం దొరుకుతుంది. కూల్, నార్మల్ రెండు వుంటాయి. కడుపు నిండా తాగండి. మీరు రూంలో తాగడానికి కూడా డబ్బాలో నింపుకొని వెళ్ళండి. మీరు మక్కాలో వున్న అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకొని

ప్రతిరోజూ జం జం నీళ్ళే తాగండి.

**జబలే అబూ ఖుబేస్** – జబలే అమీన్ (ఫహాద్ బిల్డింగ్ వున్న స్థలం) ప్రవక్త ఈ పర్వతంపైనే చంద్రున్ని రెండు ముక్కలు చేసిన స్థలం.

కేరళలో పెరుమాళ్ అనే రాజు వుండేవాడు. ఆ రాత్రి నిద్దుర పట్టకపోవడంతో ఇంటి ఆవరణలో ఆ చల్లటి గాలిలో తిరుగుతుండగా ఆకాశంలో జరిగిన వింతను కళ్ళారా చూశాడు. చంద్రుడు రెండు ముక్కలు కావడాన్ని నమ్మలేక తన సహచరులకు ఆ వింత చూపించాడు. అంతా విడ్డూరంగా ఆకాశంలోని అద్భుతాన్ని చూశారు. ఇలా ఎందుకు జరిగిందని పెరుమాళ్ ఆ రాత్రి నిద్దురపోకుండా ఆలోచనలో పడ్డాడు. ఉదయం రాజ్యంలోని ప్రముఖ మంత్రగాళ్ళు, జ్యోతిష్కులు, ఖగోళ పండితుల్ని పిలిపించి రాత్రి తాను చూసిన సంఘటన వివరించాడు. వారంతా నెల రోజుల పాటు కసరత్తు చేసి అసలు విషయాన్ని కనిపెట్టారు. మక్కాలో మొహమ్మద్ ప్రవక్త(స) జబలే అబూ ఖుబేస్ పర్వతంపై నిలబడి చేతి వేలితో చంద్రుడ్ని రెండు ముక్కలు చేశారని, దేవుడు ఒక్కడే అని ప్రచారం చేస్తున్న మొహమ్మద్‌కు మక్కావాసులు ముఖ్యంగా అబూజహల్ చేసిన ఛాలెంజ్‌కు ప్రవక్త(స) ఇలా జవాబు చెప్పారని వారు రాజా పెరుమాళ్‌కు వివరించారట. అప్పుడు పెరుమాళ్ మక్కా వాసులు ఇస్లాం స్వీకరించారా అని ఆసక్తిగా అడిగారట.

మొహమ్మద్‌తో వాదనకు దిగిన అబూజహల్ చంద్రుడ్ని రెండు ముక్కలు చేసి చూపించు అప్పుడు నీవు చెప్పే మార్గం వైపు మేమూ వస్తాము అని అన్నాడట. అప్పుడు ప్రవక్త మొహమ్మద్ రెండు రకాత్‌లు నఫిల్ నమాజ్ చేసి అల్లాహ్‌ను వేడుకుంటారు. అప్పుడు జిబ్రిల్ వహీ ద్వారా శుభసమాచారాన్ని ప్రవక్త(స)కు అందించి చేతి వేలును చంద్రుని వైపు చూపిస్తారు. అప్పుడు చంద్రుడు రెండు ముక్కలు అవుతాడు. ఇది చూసి అబూజహల్ మొహమ్మద్ నీవు జాదు చేశావు. నేను నమ్మనంటూ అక్కడి నుంచి వెళ్ళిపోతాడని పెరుమాళ్‌కు వారు వివరిస్తారు. ఆ తరువాత రాజా పెరుమాళ్ మక్కా వెళ్ళి మొహమ్మద్‌ను కలిసి ఇస్లాం స్వీకరించాడు.

బాబె కాబా: బాబె కాబా ముందు ప్రవక్త నమాజ్ చేయించిన స్థలం

దైవప్రవక్త జన్మించిన స్థలం: జబలే అబూఖుబేస్, (జబలే అమీన్) పర్వతం కింద వుంది. ఇప్పుడు అక్కడ లైబ్రరీ ఏర్పాటు చేశారు. మాజానే ఇబ్రాయిం, అబూబకర్(ర) మకాన్ బిన్ దావుద్ బిల్డింగ్ వెనుక వైపు వుంది.

అప్పట్లో ఆడపిల్ల పుడితే ఆ శిశువును పుట్టినట్లే సమాధి చేసేవారు. మజ్జిదె హారం నుంచి జిద్దా వైపు వెళ్ళే బస్సు స్టాండ్ దారిలో ఈ ప్రదేశం వుంది. చుట్టూ ప్రహరీ

కట్టి వుంది.

కాబా తవాఫ్ చేసేటప్పుడు రుకనే యమని, దీనికంటే ముందు రుకనే షామి, రుకన్ ఇరాకీ,  హజరే అస్వద్ (రుకన్ హిందుస్థాన్)

హతీం, రుకన్ యమని – హజరే అస్వద్ మధ్యలో డబ్బై మంది దైవదూతలు తథాస్తు అంటారు. (70 ఫిరస్టే ఆమీన్ బోల్తే హై). రుకన్ షామీ – రుకన్ ఇరాకీ మధ్య ఏడు చేతులు కాబా పరిధిలో 3 లైన్లు వుంటాయి.

కాబాకు దర్వాజా రెండు వైపులా వుండేది.

**మజ్జీద్ జిన్** ప్రవక్త జిన్నాత్‌లను ముస్లింలుగా మార్చింది ఇక్కడే. 'తారిఖె మక్కా ముకర్రమా' సౌదీలో ప్రచురితమైన ఈ గ్రంథంలో మజ్జీద్ జిన్ గురించి వివరణ ఇలా వుంది.  మొహమ్మద్ ప్రవక్త ఇల్లు (ప్రస్తుతం దీన్ని లైబ్రరీగా మార్చారు) వైపు నుంచి సౌదీ పోస్టాఫీస్‌కు వెళ్ళే దారిలో మజ్జీద్ జిన్ వుంది. ఈ మసీదు కంటే ముందు వున్నది మజ్జీద్ ఫతే. మక్కా ఫత్హే అయినప్పుడు జెండా పాతిపెట్టిన స్థలంలో ప్రస్తుతం మసీద్ ఫతే నిర్మించారు.

దైవప్రవక్త(స) ధర్మ ప్రచారం కోసం తాయిఫ్ పట్నం వెళ్ళి అక్కడి పరిస్థితి అనుకూలించనందున బాధాతప్త హృదయంతో మళ్ళీ మక్కా పట్నానికి తిరుగు ముఖం పట్టారు. దారిలో ఆయన నఖ్లా అనే చోట విడిది చేశారు. ఆ రాత్రి ఆయన నమాజులో ఖుర్ ఆన్ పఠిస్తుంటే జిన్నుల సమూహం ఒకటి యాదృచ్ఛికంగా అటువచ్చి ఖుర్‌ఆన్ బోధ విన్నది. తర్వాత వారు తమ జాతి ప్రజలకు దగ్గరికెళ్ళి దాన్ని ప్రచారం కూడా చేశారు. అయితే ఈ సంగతి దైవప్రవక్త(స) ఏమాత్రం తెలియదు. ఆ తరువాత దేవుడు ఈ సంఘటన గురించి దివ్యావిష్కృతి ద్వారా ఆయనకు తెలియజేశారు.

'మేము జిన్నుల సమూహం ఒకదాన్ని ఖురాన్ వాణి వినేందుకు నీదగ్గరకు పంపాం. వారు (నీవు ఖురాన్ పఠిస్తున్న) స్థలానికి చేరుకొని పరస్పరం నిశ్శబ్దంగా ఉండండని అన్నారు. ఖురాన్ పఠనం ముగిసిన తరువాత వారు తమ జాతి ప్రజల దగ్గరకెళ్ళి (ధర్మబోధ చేస్తూ) వారితో ఇలా అన్నారు.

మా జాతి సోదరులారా! మేమొక (అద్భుత) గ్రంథం విన్నాం. ఇది మూసా నిష్క్రమణ తరువాత అవతరించింది. పూర్వం అవతరించిన గ్రంథాలను ధృవీకరిస్తోంది. సత్యం, సన్మార్గాల వైపు మార్గదర్శనం చేస్తుంది. కనుక మా జాతి సోదరులారా! దేవుని వైపు పిలిచేవాని పిలుపు అందుకోండి. ఆయన్ని విశ్వసించండి. దేవుడు మీ తప్పులు

మన్నిస్తాడు. మిమ్మల్ని ఘోర శిక్ష నుంచి రక్షిస్తాడు.' (ఖురాన్ 46:29:31)

ఈ సంఘటన తర్వాత జిన్నులు తరచుగా దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చి ఖురాన్ విని పోతుండేవారు. దైవప్రవక్త(స) మక్కాలో ఉన్న కాలంలో జిన్నులు ఈ విధంగా ఆరుసార్లు వచ్చి పోయారని తెలుస్తోంది. కొన్ని హదీసుల్ని బట్టి దైవప్రవక్త(స) జిన్నుల విజ్ఞప్తిపై నిర్ణీత సమయానికి ఓ ప్రత్యేక నిర్జన ప్రదేశానికెళ్ళి ఖుర్ఆన్ పఠించేవారని, అప్పుడు జిన్నులు ఆ దైవవాణిని శ్రద్ధగా వినేవారని తెలుస్తోంది.

**మజ్జీదె ఆయిషా** ఈ మసీదు కాబా నుంచి ఉత్తరం దిక్కున ఏడున్నర కిలోమీటర్ల దూరంలో మదీనా రోడ్డు మీద ఉంది. ఈ రహదారిని హిజ్రత్ రోడ్ అని అంటారు. ఈ ప్రదేశంలో దైవప్రవక్త(స) సతీమణి హజ్రత్ ఆయిషా(ర)కు సంబంధించిన ఒక సంఘటన జరిగినందువల్ల ఇక్కడ ఆమె పేరుతో మసీద్ నిర్మించారు. తన్ఈమ్ అనే ప్రదేశంలో ఈ మసీద్ వుంది కాబట్టి మజ్జీద్ తన్ఈమ్ అని కూడా అంటారు. హి.శ. 10. దైవప్రవక్త(స) హజ్ చేయడానికి నిశ్చయించుకొని ఓ బహిరంగ ప్రకటన చేశారు. ఈ ప్రకటన వినగానే మదీనా పట్నం, దాని పరిసరప్రాంతాల నుంచి వేలాది యాత్రికులు బయలుదేరారు. దైవప్రవక్త (స) మక్కా నుంచి మదీనా వలస వచ్చిన తరువాత ఆయన చేసిన మొట్ట మొదటి హజ్ ఇదే. హజ్రత్ ఆయిషా(ర)ను వెంటబెట్టుకొని మొహమ్మద్ ఈ హజ్ చేశారు.

దైవప్రవక్త(స)తో పాటు యాత్రికులంతా మక్కా చేరుకొని హజ్ నియమాలు పాటించారు. అరఫాత్‌లో దైవప్రవక్త(స) వీడ్కోలు ప్రసంగం చేశారు. అయితే హజ్ సందర్భంలో హజ్రత్ ఆయిషా(ర)కు బహిష్టు అయినందున ఆమె హజ్ మూడో రోజున కాబా చుట్టూ తవాఫె జియారత్ చేయలేక పోయారు. మహిళలు సహజ సిద్ధమైన అపరిశుద్ధావస్థలో కాబా ప్రదక్షిణ చేయకూడదు. అందువల్ల హజ్రత్ అయిషా(ర) రుతుక్రమం ఆగిపోయి స్నానం చేసిన తరువాతనే కాబా ప్రదక్షిణ చేయగలిగారు. కాని బహిష్టు కారణంగా ఆమె అందరితో పాటు ఉమ్రా చేయలేక పోయారు. అప్పుడు ఆమె దైవప్రవక్త(స)తో మాట్లాడుతూ దైవప్రవక్తా! మీరందరూ హజ్, ఉమ్రాలు రెండు ఆరాధనలూ పూర్తి చేసుకొని తిరిగి వెళ్ళిపోతున్నారు. నేను ఒక్క హజ్ మాత్రమే చేసి వెళ్ళిపోవాలా? అని అడిగారు.

దైవప్రవక్త(స) ఈ మాట విని ఈమెను తన్ఈమ్ ప్రదేశానికి తీసుకెళ్ళు. అని హజ్రత్ ఆయిషా(ర) సోదరుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్(ర)ని ఆదేశించారు. ఆమె తన్ఈమ్ ప్రదేశంలో(ఇహ్రాం) ఉమ్రా నియత్ చేసుకొని ఉమ్రా విధి నెరవేర్చారు. ఇది జిల్‌హజ్జ

నెలలో హజ్ తరువాత జరిగింది. (బుఖారి)

**మజ్జీదె జీరాన** జీరాన అనేది మక్కా, తాయిఫ్ నగరాల మధ్య ఉన్న ఒక బావి పేరు. ఇది తాయిఫ్ కన్నా మక్కాకే చాలా దగ్గరగా వుంది. దైవప్రవక్త(స) హునైన్ యుద్ధంలో హవాజన్ తెగవారి నుంచి లభించిన సమరసొత్తును ఈ ప్రాంతంలోనే సైనికులకు పంచారు. ఆ తరువాత ఆయన ఇక్కడే ఉమ్రా కోసం నియత్ చేసుకున్నారు. అందువల్ల ఇక్కడ జీరాన పేరుతో ఒక మసీదు నిర్మించారు.

అక్కడున్న భావి విషపు నీటితో నిండి వుండేది. ఆ నీరు తాగిన వారు వెంటనే చనిపోయేవారు. మరో ప్రక్క మంచినీటి కోసం ఆ ప్రాంతంలో తీవ్ర ఇబ్బంది వుండేది. అటువంటి సమయంలోనే ప్రవక్త(స) అక్కడ ఇస్లాం ప్రచారం చేశారు. అల్లా ఆజ్ఞా ప్రకారం ప్రవక్త(స) ఆ విషపు నీటిని మంచి నీరుగా మార్చారు. నఫీల్ నమాజ్ చేసి ఖురాన్‌లోని కొన్ని ఆయత్‌లో పఠించి ఈ బావిలో ప్రవక్త ఉమ్ము వేసి ఆ నీళ్ల తాగారు. ఆ తరువాత స్థానిక జనం ఆ నీళ్లు తాగారు. ఈ మిరాకిల్ చూసి స్థానికులందరూ ఇస్లాం స్వీకరించారు.

**మజ్జీదె మున్వరున్ నబీ** ఈ మసీదు మీనాలో వుంది. "ఇన్నా ఆతైనా సూరా ఇక్కడే వచ్చింది.

**మజ్జీదుల్ కబష్** ఇక్కడే ఇబ్రాహీం(స) ఖుర్బానీ ఇచ్చారు.

**మజ్జీదె ఖైఫ్** మీనాలో వుంది. ఇక్కడ 70 మంది ప్రవక్తలు నమాజ్ చేశారు. ఇక్కడే వారు సమాధి అయ్యారు.

**గారె ముర్సలాత్** మజ్జీదె ఖైఫ్‌కు అతి దగ్గరలో వుంది. ఇక్కడే సూరె ముర్సలాత్ ఆవిష్కరించబడింది.

**మఖ్బరతుల్ మాల** ఉమ్ముల్ మొఅమినీన్ హజ్రత్ ఖదీజ తుల్ కుబ్రా(ర), ప్రవక్త(స) కుమారుడు హజ్రత్ ఖాసిం(ర), హజ్రత్ అబ్దుల్లా(ర) సమాధితో పాటు పలువురు ప్రముఖుల సమాధులున్నాయి ఇక్కడ.

ఉమ్ముల్ మొఅమినీన్ హజ్రత్ మైమునా(ర) సమాధి మక్కా నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో వాదియె ఫాతిమ సమీపంలో రోడుకు కుడివైపున వున్న కొండ కింది భాగాన వుంది.

# కాబా సందేశం

ఇబ్రాహీం, ఇస్మాయీల్ ప్రవక్తలచే నిర్మించబడిన మొదటి ఆరాధనాలం. అల్లాహ్ దీన్ని మానవుల శాంతిభద్రతల నిలయంగా చేశాడు. (ఖురాన్ 5:98) బైతుల్లా, బైతుల్ హరాం, మస్జిదుల్ హరాం, బైతుల్ అతీఖ్ అనే పేర్లతో కాబాను పిలుస్తారు. గత నాలుగు వేల సంవత్సరాల కాలంలో ఎన్నిసార్లు పునర్నిర్మించారో ఖచ్చితమైన ఆధారాలు లేవు. హజ్రత్ ఆదం(అ), ఇబ్రాహీం, ఖురైష్ తెగవాళ్ళు, ఆతరువాత మహాప్రవక్త(స) అనుచరుడైన హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి) పాలన కాలంలో నిర్మించారు.

హజ్రత్ ఇబ్రాహీం.... భార్యా, కొడుకును ఏడారి ప్రాంతంలో వదిలేసి వెళ్ళినా, అప్పుడప్పుడు వచ్చి వాళ్ళను చూసిపోయేవారు. ఆ విధంగా అనేక సంవత్సరాలు గడిచిపోయాయి. హజ్రత్ ఇస్మాయీల్(అ) యవ్వన దశలో అడుగుపెట్టారు. ఒకసారి హజ్రత్ ఇబ్రాహీం వచ్చినప్పుడు హజ్రత్ ఇస్మాయీల్ ధనస్సు సరిచేస్తూ కూర్చున్నారు.

ఆయన హజ్రత్ ఇబ్రాహీంని చూడగానే లేచి ఆయనకు ఎదురుగా వెళ్లారు. తండ్రీకొడుకులిద్దరూ కౌగలించుకొని పరస్పరం యోగక్షేమాలు విచారించి తెలుసుకున్నారు. ఆ సందర్భంలో ఇబ్రాహీం మాట్లాడుతూ ఇస్మాయీల్! దేవుడు నాకు ఒక విషయం గురించి ఆదేశించాడు అని అన్నారు.

హజ్రత్ ఇస్మాయీల్ ఈ మాట విని మంచిది. దేవుడు ఏ పని గురించి ఆదేశించాడో ఆ పని చేయండి అన్నారు.

మరి ఈ పనిలో నువ్వేమైనా నాకు సహాయపడగలవా? అని అడిగారు హజ్రత్ ఇబ్రాహీం.

తప్పకుండా సహాయపడ్తాను. అన్నారు హజ్రత్ ఇస్మాయీల్(అ)

ఈ ప్రదేశంలో ఒక ఆరాధనాలయం నిర్మించమని దేవుడు నన్ను ఆదేశించాడు అని చెప్పారు హజ్రత్ ఇబ్రాహీం(అ) ఓ ఎత్తయిన ప్రదేశం వైపు చూపిస్తూ. ఆ తరువాత ఇద్దరూ కలిసి ఆ ప్రదేశంలో పునాదులు తవ్వి గోడలు లేపారు. హజ్రత్ ఇస్మాయీల్(అ) రాళ్ళు మోసుకొచ్చారు. హజ్రత్ ఇబ్రాహీం(అ) కట్టడం పని చేశారు. ఇలా గోడలు పైకి వచ్చాక అల్లా అనుగ్రహంతో అప్పట్లో ఆదం(అ) తెచ్చిన మరో రాయిపై నిలబడి హజ్రత్ ఇబ్రాహీం నిర్మాణం కొనసాగించారు. ఈ రాయి పైకి కిందకి కదిలేది. ఇది అల్లా అనుగ్రహం. ఈ రాయిపై ఇప్పటికీ ప్రవక్త ఇబ్రాహీం పాదముద్రలు స్పష్టంగా కనిపిస్తాయి. దీనినే

మఖామె ఇబ్రాహీం అంటారు.

అయితే ఒక చోట గోడలో ఓ మోస్తరు రాయి అంతటి ఖాళీ మిగిలి పోయింది. ఆయన కుమారుడు హజ్రత్ ఇస్మాయిల్(అ) అక్కడ సరిపడే రాయి కోసం వెతకడం ప్రారంభించారు. హజ్రత్ ఇబ్రాహీం(అ) ఆయన్ని పిలిచి 'నేను చెప్పే రాయిలాంటి రాయి తీసుకురా', అన్నారు. హజ్రత్ ఇస్మాయీల్(అ) మళ్ళీ వెతికి చివరికి ఒక రాయి తీసుకొచ్చారు. కాని హజ్రత్ ఇబ్రాహీం(అ) అప్పటికే (కాంతివంతమైన) ఒక రాయిని కాబాగోడలో అమర్చారు.

హజ్రత్ ఇస్మాయీల్(అ) దాన్ని చూసి నాన్నా! ఈ రాతిని ఎవరు తీసుకొచ్చారు? అని అడిగారు.

జిబ్రీల్(అ) తీసుకొచ్చారు అని ఇబ్రాహీం(అ) చెప్పారు.

అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం హజ్రత్ ఇబ్రాహీం(అ) కాబా నిర్మాణం పూర్తి చేశారు. ముఖామే ఇబ్రాహీంగా ప్రస్తుతం పిలువబడుతున్న రాయిపై నిలబడ్డారు. ఆ రాయి చుట్టుపక్కలున్న కొండలతో సమాంతర ఎత్తులో పైకి లేచింది. రెండు వేళ్ళు రెండు చెవిలో పెట్టుకొని ముఖాన్ని కుడి, ఎడమ వైపు తిప్పుతూ ప్రజల్లారా మీ కోసం అల్లాహ్ కాబా గృహాన్ని నిర్మించారు. ఈ కాబా గృహాన్ని సందర్శించండి. హజ్ యాత్ర చేయండంటూ ప్రకటన చేశారు. హజ్రత్ ఇబ్రాహీం ప్రకటన విశ్వమంతా ప్రతిధ్వనించింది. కోట్లాది ఆత్మలు లబ్బైక్ అని సమాధానమిచ్చాయి.

అప్పుడు ఇబ్రాహీం మనసులో... చుట్టూ కొండలు. అ తరువాత ఎడారి ప్రాంతం. ఇక్కడికి ఎవరు ఎలా వస్తారని  అనుకుంటుండగా ఆకాశంపై నుంచి దేవుని వాక్కు వినిపిస్తుంది.

వ అజ్జిన్ ఫిన్నాసి బిల్‌హజ్జి యఅతూక రిజాలవ్ వఅలాకుల్లి జామిరియ్ యఅతీన మిన్‌కుల్లి ఫజ్జిన్ అమీఖ్.

ఓ ఇబ్రాహీం నీ ప్రకటన విని లబ్బైక్ అన్న ఆత్మలన్నీ ఈ పవిత్ర గృహాన్ని సందర్శిస్తారు. హజ్ చేస్తారు. సుదూర మార్గాల నుంచి మక్కా చుట్టూ వున్న కొండల కడుపులోంచి సముద్రపు అలలుగా హజ్ యాత్రకు తరలి వస్తారు.

కొండల కడుపులోంచి సముద్రపు అలలుగా హజ్ యాత్రకు మక్కా సందర్శనకు వస్తారు. ఈ పుస్తకాన్ని చదువుతున్న హాజీ మిత్రమా... అల్లాహ్ (సు.తా.) గొప్పతనాన్ని మక్కాలో కనులార వీక్షిసున్న మీకు శుభాకాంక్షలు. కొండల కడుపులోంచి సముద్రపు

అలలు.. ఆ దృశ్యాలు. కొండల కడుపులో అంటే కొండ లోపల వున్న సొరంగ మార్గాలు.. సముద్రపు అలలుగా కనిపిస్తున్న తెల్లటి దుస్తుల్లో హాజీలు. లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ లబ్బైక్ లాషరీక లక లబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్ నిఆమత, లకవల్ ముల్‌క్, లా షరీక లక్.

ఒక వ్యక్తి తవాఫ్ చేసినప్పుడు మన పితామహుడు ఇబ్రాహీం(అ) గుర్తుకు వస్తారు. మానవులకు సురక్షిత స్థలంగా, శాంతి స్థలంగా కాబాను ఏర్పాటు చేసి హజ్ యాత్ర జరపాలని పిలుపు ఇచ్చిన సంగతిని గుర్తు చేసుకుంటున్నాడు. అప్పుడు ప్రవక్త ముహమ్మద్(స) కూడా ఈ అల్లాహ్ గృహానికి యాత్రలు జరపాలని పిలుపునిచ్చారు. మూసా, యూసుఫ్, ఈసా(అ)లు కూడా ఈ గృహానికి యాత్రలు జరిపారు. ఈ స్థలం ఆ ప్రవక్తలందరికి ఒక సమావేశ స్థలంగా, పవిత్ర చిహ్నంగా ఉండేది. (దీన్ని నిర్మించమని అల్లాహ్ ఇబ్రాహీం(అ)ను ఆదేశించి, దీన్ని పవిత్రం కావించాడు).

మహమ్మద్ ప్రవక్త(స) హజ్ యాత్రలో ప్రదక్షిణ జరిపినప్పుడు – ఇది మన తండ్రి ఇబ్రాహీం స్థానమా అని ఉమర్(ర) అడిగారు. ఆయన అవునని సమాధానం ఇచ్చారు. దీనిని ప్రార్థనా స్థలంగా చేసుకోవచ్చా అని ఉమర(ర) అడిగారు. దానికి అల్లాహ్ ఈ స్థలాన్ని (ఇబ్రాహీం(అ)కు చెందిన) ప్రార్థనా స్థలంగా చేసుకోమని ఆదేశించినట్లు ప్రవక్త(స) చెప్పారు. ఇబ్నె ఉమర్ ముహమ్మద్ ప్రవక్త(స) ఈ గృహం చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణ జరిపి రెండు రకాత్ నమాజ్ చేశారని చెప్పినట్లు బుఖారీ రాశారు.

మొదటగా కాబా కుడి వైపు నుంచి మొదలు పెట్టి ఏడు సార్లు చుట్టి రావాలి. దీన్ని తవాఫ్ అంటారు. ఇది మక్కాలో మాత్రమే చేయగల ఆరాధన. కాబా చుట్టూ ప్రదక్షణం అంటే (ఆరాధనకు) అల్లాహ్‌కే (అంకితమయిన) గృహాన్ని మీ జీవితం మధ్యలో ప్రతిష్టాపించుకోవడం అన్న మాట. రమ్ల అంటే మొదట మూడు ప్రదక్షణలలో వేగంగా చిన్న అడుగులతో తిరగడం. ఇది పురుషులకు తగినది. స్త్రీ లకు తగినది కాదు.

# హజ్రె అస్వద్

హజ్రెఅస్వద్ స్వర్గం నుంచి వచ్చింది. ప్రారంభకాలంలో ఎంతో తెల్లగా మెరిసిపోతూ ఉండేది. దీన్ని గురించి దైవప్రవక్త(స) ప్రస్తావిస్తూ 'హజ్రెఅస్వద్ స్వర్గం నుంచి వచ్చింది. అప్పుడది పాలకన్నా తెల్లగా ఉండేది. అయితే ఆ తర్వాత ఆదం సంతతి చేసిన పాపాల వల్ల నల్లగా మారిపోయింది. అని అన్నారు. (తిర్మిజి)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్(ర) కథనం ప్రకారం దైవప్రవక్త(స) ఈ విధంగా

ప్రవచించారు. హ్రజె అస్వద్, ముఖామె ఇబ్రాహీంలు స్వర్గం నుంచి వచ్చిన రెండు రాళ్ళు. ఇవి మెరిసిపోతుండేవి. అయితే దేవుడు వాటి కాంతిని అంతం చేశాడు. అల్లాహ్ వాటి కాంతిని గనక అంతం చేయకపోయివుంటే ఇవి భూమ్యాకాశాల మధ్య, తూర్పు పడమరల మధ్య యావత్తు ప్రపంచాన్ని ప్రకాశవంతం చేసి వుండేవి.

హ్రజె అస్వద్ అనేక శతాబ్దాల పాటు ఒకే ఒక రాయిగా ఉండేది. కాని ఆ తరువాత ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, దాడుల కారణంగా ఇది ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది. ఇప్పుడా ముక్కలన్నింటిని కలిపి ఒకటిగా చేసి, దాన్ని ఒక వెండి చట్రంలో బిగించి, యధాతథస్థానంలో అమర్చారు. హ్రజెఅస్వద్ ప్రతి ప్రదక్షిణ ప్రారంభానికి, ముగింపుకు గుర్తుగా కాబా గోడలో పొదగబడిన ఒక విశిష్ట శిలా రాజం. పవిత్ర కాబాలోని ఆగ్నేయ మూలలో వెండి తాపడంలో ఏర్పరచబడి వుంది ఈ నల్లశిల. కాబా తవాఫ్ ఇక్కడి నుంచే ప్రారంభించాలి. ఈ రాయి మొదట్లో తెల్లగా వుండేది. పాపాలు చేసి దీన్ని తాకడంతో అది నల్లగా మారిపోయిందట.

ఖయామత్ రోజున ఈ రాయి తనను తాకిన వారి సత్య సంధత గురించి సాక్ష్యం పలుకుతుందట. ఇబ్నె అబ్బాస్ ఇలా చెప్పారు. అల్లాహ్ ఖయామత్ రోజున ఈ నల్లరాయికి రెండు కళ్ళు, ఒక నాలుక వస్తాయి. ఆ కళ్ళతో చూసి, నాలుకతో అది మాట్లాడుతుంది. దాన్ని నిజాయితీతో తాకిన వారి పక్షాన్నే అది సాక్ష్యమిస్తుంది. తవాఫ్ మొదలు పెట్టేటప్పుడు ముందుగా చేయాల్సిన పని ఈ నల్లరాయిని తాకడం, ముద్దుపెట్టుకోవడం.

జాబిర్ ఇబ్నే అబ్దులాహ్(ర) ఏం చెప్పారంటే అల్లాహ్ ప్రవక్త(స) మక్కాకు వచ్చినప్పుడు ఆయన ఈ నల్లరాయిని తాకారు. తర్వాత దాని కుడి వైపుకు వెళ్ళి కాబా చుట్టూ మూడు సార్లు పరిగెడుతూ, నాలుగు సార్లు నడుస్తూ ప్రదక్షిణలు చేశారు. ప్రవక్త ఈ రాయిని చుంబించారు. ఆయన అనుచరులూ అలాగే చేశారు.

ఉమర్(ర) ఈ నల్లరాయి దగ్గరకు వచ్చి దాన్ని ముద్దు పెట్టుకుని ఇలా అన్నారు. నువ్వు కేవలం రాయివే, నీ ద్వారా నాకు హాని గానీ, ప్రయోజనంగాని జరగదని నాకు తెలుసు. ముహమ్మద్ ప్రవక్త(స) నిన్ను ముద్దు పెట్టుకోవడం చూశాను కాబట్టి నేను కూడా అలా చేశాను. (అల్ బుఖారీ) తర్వాత ప్రవక్త(స) కాబా చుట్టూ ప్రదక్షిణ చేశారు.

జన్నత్ కా పత్తర్. ఆదం(అ) తెచ్చారు. రాత్రిపూట టార్చ్ లైట్‌లా వెలిగిపోయేది. మనిషి కర్మలవల్ల వెలుగు కోలిపోయింది. ఖయామత్ రోజు హ్రజె అస్వద్‌కు నోరు, కళ్ళు

వస్తాయి. ఈ రాయి పవిత్రత ఏమిటంటే దీని ముందు ఏ ఉద్దేశంతో వస్తే అదే స్థితి కొనసాగుతుందట. ఆదం(అ) మొదటిసారి కాబానిర్మాణం చేసినప్పుడు ఆగ్నేయ మూలలో అమర్చారు. ప్రవక్త నూహూ కాలంలో కాబా కొట్టుకుపోయింది. ఇబ్రాహీం(అ) మళ్ళీ దీన్ని పునర్ నిర్మించారు.

## ముల్తజం

కాబా తూర్పు వైపున తలుపుకు, హజ్రెఅస్వద్‌కు మధ్య ఉన్న గోడ భాగాన్నే ముల్తజం అంటారు. దీనికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. కాబా ప్రదక్షిణ చేసిన తరువాత ఇక్కడ దాకా చేరుకోగలిగే హాజీలు ముల్తజంను గుండెలకు గట్టిగా హత్తుకొని కడు దీనంగా దువా చేస్తారు. ముల్తజం దగ్గర నిలబడి దువా చేయడం గురించి దైవప్రవక్త(స) ఇలా అన్నారు. కష్టాలలో ఉన్న మనిషి ఎవరైనా ముల్తజం దగ్గర దైవాన్ని వేడుకుంటే అతని కష్టాలు తప్పకుండా దూరమవుతాయి. (అబూదావూద్) హజ్రత్ షుఐబ్ కథనం: అబ్దుల్లా బిన్ అమ్ర్(ర) హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య కాబాకు ఎదురుగా నిలబడి తన రొమ్ము, ముఖం, అరచేతులను కాబా గోడకు ఆనిచ్చి, దైవప్రవక్త(స) ఇలా చేస్తుంటే చూశాను అని అన్నారు (అబూదావూద్).

హజ్రత్ ముజాహిద్ ముల్తజం ప్రాముఖ్యాన్ని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు. హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉన్న చోటునే ముల్తజం అంటారు. ఇక్కడకు వచ్చి ఎవరయినా దేవుణ్ని వేడుకుంటే దేవుడు అతని వేడుకోలును తప్పకుండా స్వీకరిస్తాడు. హజ్రత్ ఇబ్నె అబ్బాస్(ర) హజ్రెఅస్వద్‌కు, తలుపుకు మధ్య ఉండే చోటును హత్తుకొని (ముల్తజంకు ఎదురుగా) నిల్చొని ఎవరైనా దైవాన్ని వేడుకుంటే అతని పని తప్పక నెరవేరుతుంది అని చెప్పేవారు. (బైహఖీ)

## రుకునే యమాని

కాబా నాలుగు మూలలో ఒక మూల యమన్ దేశం దిశగా ఉంది. ఆ మూలనే రుకునె యమాని అంటారు. తవాఫ్ సమయంలో దాన్ని తాకాలి. రుకునె యమాని–హజ్రెఅస్వద్ మధ్య 70 మంది దైవదూతలు వుంటారు. హాజీలు ఇక్కడ ఈ విధంగా దువా చేసినప్పుడు ఈ దైవదూతలు ఆమీన్ అంటారు.

## హతీం (ఖాళీగా వదలిన కాబా స్థలం)

మీజాబె రహ్‌మత్ కింది స్థలం. రుకునె ఇరాఖీ–రుకునె షామీ మధ్యలో వుంది.

కాబాకు ఆనుకొని తొమ్మిది అడుగుల దూరాన అర్థ వృత్తాకారంలో నాలుగడుగుల ఎత్తుతో కట్టబడిన పిట్టగోడ లోపలి ప్రదేశాన్ని హతీం అంటారు. ఖురైషీయులు కాబాను పునర్నిర్మించవలసి వచ్చినప్పుడు సరిపడ పైకం సమకూరక పోవడంతో ఆ స్థలం ఖాళీగా వదలి కాబాగోడలు కట్టారు.

## అబ్రహా పరాభవం

మహా ప్రవక్త ముహమ్మద్(స) జన్మించడానికి రెండు నెలల ముందు.... అబిసీనియా రాజ్య పరిధిలోని యమన్‌కు గవర్నర్‌గా అబ్రహా వచ్చాడు. రాజ్య విస్తరణ కాంక్షతో రగిలిపోయాడు. అరేబియాని జయించాలని కలలు కన్నాడు. ప్రపంచ యాత్రికుల్ని ఆకట్టుకోవడానికి కాబాను పోలిన ఒక మందిరం నిర్మించాలని నిర్ణయించుకున్నాడు. తాననుకున్నట్లు జరిగితే  అరేబియా అంతటా క్రైస్తవమతాన్ని వ్యాపింపజేయవచ్చని భావించాడు. మరో వైపు అరబ్బుల వాణిజ్య మార్గాలు మూసేసి ఆర్థిక ప్రయోజనాలు పొందాలనేది అబ్రహా లక్ష్యం.

ఈ లక్ష్యంతో అబ్రహా మొట్ట మొదట యమన్ రాజధాని 'సనా'లో బ్రహ్మాండమైన ఒక చర్చి నిర్మించాడు. చర్చి నిర్మించిన తరువాత "తన లక్ష్యం గురించి అబిసీనియా చక్రవర్తికి లేఖ రాస్తూ అరబ్బుల కాబా యాత్రను ఈ ఎక్లిసియా చర్చి వైపు మరల్చనిదే విశ్రమించను" అని ప్రతిజ్ఞ చేశాడు. ఈ విషయమై అతను యమన్ అంతటా బహిరంగ ప్రకటన చేయించాడు.

ఇలా అరబ్బుల మత భావాల్ని రెచ్చగొట్టి, వారి ద్వారా తనకు మక్కాపై దాడి చేయడానికి సాకు దొరుకుతుందని భావించాడు. అతనికి నిజంగానే సాకు దొరికింది. అబ్రహా ప్రకటనలకు రెచ్చిపోయిన కొందరు అరబ్ యువకులు ఆ చర్చికి నిప్పంటించారు. దాంతో ఆగ్రహోదగ్రుడైన అబ్రహా క్రీ.శ. 570లో 60 వేల మంది సైనికులు, 13 ఏనుగులతో మక్కాపై దాడి చేయడానికి బయలుదేరాడు. దారిలో అరబ్బులకు చెందిన వేలాది ఒంటెలు దోచుకున్నాడు. వాటిలో మహాప్రవక్త ముహమ్మద్(స) తాత అబ్దుల్ ముత్తలిబ్‌కు చెందిన రెండొందల ఒంటెలు ఉన్నాయి.

ఆ తరువాత అతను మక్కావాసుల దగ్గరికి ఒక రాయబారిని పంపాడు. నేను మీతో యుద్ధం చేయడానికి రాలేదు. కాబా ధ్వంసం చేయడానికి మాత్రమే వచ్చాను. మీరు గనక యుద్ధం చేయకుండా ఉంటే, నేను మీ ధన, మాన, ప్రాణాలకు ఎలాంటి హాని కలిగించను. మక్కా నాయకుడు ఏదైనా మాట్లాడదలిస్తే అతడ్ని తన దగ్గరకు పిలుచుకురమ్మని

రాయబారిని ఆదేశించాడు. వెంటనే అతను అబ్దుల్ ముత్తలిబ్‌కు విషయం తెలియజేశాడు. అబ్రహా సైన్యాల్ని ఎదుర్కొనే శక్తి లేదంటూ అబ్దుల్ ముత్తలిబ్ రాయబారి వెంట అబ్రహా దగ్గరకి వెళ్ళారు.

అబ్దుల్ ముత్తలిబ్ ముఖవర్చస్సు, ఠీవి, దర్పం చూసి అబ్రహా ఎంతో ప్రభావితుడయ్యాడు. వెంటనే తన ఆసనం నుంచి లేచి, అబ్దుల్ ముత్తలిబ్‌కు స్వాగతం చెప్పి, తన పక్కన కూర్చో బెట్టుకున్నాడు. 'మీరేం కోరుతున్నారో చెప్పండి' అన్నాడు. దానికి అబ్దుల్ ముత్తలిబ్ మీరు పట్టుకున్న నా ఒంటెల్ని నాకు ఇచ్చేయండి అన్నారు నిర్లక్ష్యంగా. అబ్రహా ఈ మాటలు విని తెల్లబోయాడు.

నేను మిమ్మల్ని చూసి ఎంతో ముగ్ధుడ్ని అయ్యాను. కాని మీరు మీ ఒంటెల్ని అడిగి నా దృష్టిలో దిగజారిపోయారు. మీ తాత ముత్తాతల ఆరాధనా కేంద్రం, శాంతి నిలయమైన కాబా గురించి మీరు ఒక్క మాటా ప్రస్తావించలేదు అన్నాడు అబ్రహా.

నేను నా ఒంటెలకు మాత్రమే యజమానిని. అందుకని నేను వాటి గురించే మాత్రమే మిమ్మల్ని అడుగుతున్నాను. ఇక కాబా అంటారా!.... దానికి దాని ప్రభువు, యజమాని ఒకడున్నాడు. ఆయనే దాన్ని కాపాడుకుంటాడు అన్నారు అబ్దుల్ ముత్తలిబ్.

ఆ ప్రభువు కూడా కాబాను నా నుండి కాపాడలేడు అన్నాడు అబ్రహా కటువుగా.

ఆ సంగతి మీకు, ఆయనకే తెలియాలి మధ్యలో నాకెందుకు? అంటూ అబ్దుల్ ముత్తలిబ్ అక్కడ్నుంచి వెళ్ళి పోయారు.

అబ్దుల్ ముత్తలిబ్ పట్నంలోకి తిరిగి రాగానే ప్రజలను సమావేశపరచి మీరంతా సామూహిక హత్యాకాండ నుంచి కాపాడుకోవడానికి మీ భార్యా పిల్లల్ని తీసుకొని కొండల్లోకి వెళ్ళిపోండి అని ప్రకటించారు. ఆ తరువాత ఆయన కొందరు ఖురైష్ నాయకులతో కలసి కాబా గృహానికి వెళ్ళారు. ఆ కాలంలో కాబాలో 300 విగ్రహాలు ఉండేవి. కాని ఖురైష్ నాయకులు ఈ క్లిష్ట సమయంలో వాటన్నింటిని మరచిపోయి కాబా ప్రభువయిన దేవుడ్ని మాత్రమే తలచుకొని దేవా! నీవు నీ గృహాన్ని, దాని సేవకుల్ని కాపాడు అని దీనంగా ప్రార్థించారు. ఇలా వేడుకున్న తరువాత వారు కూడా కొండల్లోకి పోయి దాక్కున్నారు.

మరునాడు అబ్రహా సైన్యంతో మక్కా పట్నంలోకి ప్రవేశించేందుకు బయలుదేరాడు. అయితే సైన్యం ముందు నడుస్తున్న ఓ ప్రత్యేక ఏనుగు ఒక చోట హఠాత్తుగా ఆగిపోయి నేలమీద చతికిలబడింది. మావటివాడు ఎంత కొట్టినా, అంకుశంతో పొడిచి గాయపర్చినా అది కదల్లేదు. మక్కా వైపు నుంచి వేరే వైపుకు తిప్పి అదిలిస్తే చాలు అది పరుగెత్తసాగేది.

కాని మక్కా వైపు తిప్పగానే అది మళ్ళీ నేల మీద చతికిలబడి పోయింది. మక్కా వైపు ఒక్క అంగుళం కూడా ముందుకు సాగనని మొండికేసింది. ఈ దృశ్యం చూసి అబ్రహా, అతని సైనికులు ఆశ్చర్య పోయారు. అంతలో ఎక్కడ్నుంచో అకస్మాత్తుగా ఏవో పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి సైన్యం మీద కంకర్రాళ్ళు విసరిపడేయటం మొదలెట్టాయి. ఆ రాళ్ళు వచ్చి నేరుగా సైనికుల మీద పడగానే వారి శరీరాలు తీవ్రమైన దురదతో జివ్వుమనేవి. ఆ దురద భరించలేక సైనికులు అక్కడ గోకి గోకగానే చర్మం చిట్లి పోయి మాంసం ఊడి క్రింద పడిపోసాగింది. చూస్తుండగానే మైదానమంతా రక్తం, చీముతో నిండి పోయింది. సైనికులు భయపడి ఎటుపడితే అటు పారిపోవడానికి ప్రయత్నించారు. కాని అప్పటికే చాలా మంది మృత్యువాత పడ్డారు. మిగిలినవారు. కొద్ది దూరం పారిపోయి ప్రాణాలు వదిలారు. ఇలా అబ్రహాతో పాటు అతని సైనికులంతా కొన్ని గంటల్లోనే సర్వనాశనమై పోయారు.

ఈ సంఘటన క్రీ.శ. 570వ సంవత్సరంలో మీనా, ముజ్దలఫాల మధ్య ముహస్సిర్ అనే ప్రదేశంలో జరిగింది. ఈ సంఘటనతో ఎంతో ప్రభావితులైన అరబ్బులు కొన్నేళ్ళ వరకు విగ్రహాలు, ఇతర మిథ్యదైవాలను వదలి, సృష్టికర్త, విశ్వపాలకుడైన నిజదేవుడ్ని మాత్రమే ఆరాధించారు. ఆ తరువాత మళ్ళీ వారిలో బహుదైవారాధనా భావం విస్తరించింది.

నీ ప్రభువు అబ్రాహాతో పాటు వచ్చిన ఏనుగుల వాళ్ళను ఏం చేశాడో నీకు తెలియదా? ఆయన వారి (దుష్ట) యత్నాలను వమ్ము చేయలేదా? వారి మీదికి ఆయన పక్షుల్ని గుంపులు గుంపులుగా పంపాడు. అవి వారి మీద కంకర్రాళ్ళు విసరిపడేశాయి. దాంతో వారు సర్వనాశనం అయ్యారు." (దివ్యఖుర్ఆన్-105) ఈ సంఘటన తరువాత రెండు నెలల్లోనే మహాప్రవక్త ముహమ్మద్(స) జన్మించారు.

# కాబాగృహ పునర్నిర్మాణం

ఖురైషీయులు కాబాగృహ పునర్నిర్మాణాన్ని ప్రారంభించిన రోజులవి. అప్పుడు ప్రవక్త(స) వయస్సు 35 సంవత్సరాలు. కాబా గృహం గోడలు ఎక్కువ ఎత్తు ఉండేవి కావు. హజ్రత్ ఇస్మాయీల్(అ) కాలం నుంచే దాని ఎత్తు తొమ్మిది మూరలు. దాని పైకప్పు లేదు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకొని దొంగలు అందులో దాచి పెట్టిన ధనాన్ని దోచుకు పోయేవారు. కాబా నిర్మాణం జరిగి చాలాకాలం కావడం వల్ల కట్టడం బలహీన పడింది. గోడలు బీటలు తీశాయి. ఆ సంవత్సరమే పెద్ద వరదలు వచ్చాయి. వరదల ప్రవాహ దిశ కాబా గృహం వైపే ఉండటం వల్ల అది ఏ క్షణాన్నయినా కూలిపోయే ప్రమాదం ఏర్పడింది.

ఆ రోజు..నిర్మలంగా ఉన్న ఆకాశం క్రమంగా మేఘావృతమయింది. దట్టమైన మబ్బులు కమ్మేశాయి..... ఉన్నట్లుండి, రివ్వున గాలి వీచింది. ఆ వెనువెంటనే పెళ పెళమంటూ పిడుగు పడినంత భీకర గర్జన. ఆ తర్వాత కాస్సేపటికే చల్లటి గాలులతో చిటపట చినుకులు మొదలయ్యాయి. చూస్తుండగానే అది కాస్తా ఉధృతమై, భారీ వర్షమైంది. ఆకాశం ఎక్కడికక్కడ చిల్లులు పడినట్లు కుండపోతగా కురుస్తూనే వుంది. గంటలు, రోజులు... అలా గడిచిపోయాయి.

కాని, వర్షం వెలిసే సూచన కానరాలేదు. మక్కా ప్రజలు... ఎవరి ఇళ్ళలో వారు.. నిర్బంధంగా ఉండిపోయి, నింగికేసి వింతగా చూడసాగారు. ముసురు వదలడం లేదు. ఒకటే వర్షం. కష్టజీవులకు కష్టపడకుండానే కష్టం అనుభవించే పరిస్థితి ఏర్పడింది. ఎడతెరిపి లేకుండా భోరున వర్షం కురుస్తూనే వుంది. ఒంటెలు, మేకలు ఆకలితో అల్లాడిపోతున్నాయి. వర్షపు నీటితో గుంటలు, గోతులు పొంగి పొర్లుతున్నాయి. వీధుల్లో వరద పరవళ్ళు తొక్కుతోంది. నానిన గోడలు నేలబారుగా పడిపోతున్నాయి. కారుతున్న ఇళ్ల కప్పు కూలిపోయి ప్రజలు భయాందోళనలతో తమ ఇష్ట దేవతలను వేడుకుంటున్నారు. అయినా వర్షం తగ్గలేదు, సరికదా ప్రకృతి మరింత ప్రకోపించింది. గుండెలు పగిలిపోయే ఉరుములతో కుంభ వర్షం వీర ప్రతాపం చూపింది.

వర్షం వెలిసేటప్పుటికీ మక్కా పట్టణం ఓ పెద్ద చెరువులో తేలుతున్నట్లు కన్పించింది. రెండు మూడు రోజుల తరువాత వరద నీరు క్రమంగా తగ్గిపోయింది. పడిపోయిన ఇళ్ళతో, గోతులు పడ్డ వీధులతో మక్కా బీభత్సంగా తయారైంది. వరద తాకిడికి కాబా గోడలు బీటలు వారాయి. కొన్ని గోడలు పూర్తిగా పడిపోయాయి. హజ్రె అస్వద్ గోడలో నుంచి జారి కింద పడిపోయింది.

కాబాను చూసి మక్కావాసులు తల్లడిల్లిపోయారు. ప్రముఖులంతా సమావేశమై పరిస్థితి సమీక్షించారు. కాబా దర్శనం కోసం సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారు. కాబా వల్లే అరేబియాలో వారికి అమితమైన గౌరవ ప్రతిష్టలు లభించాయి. అందుకని ఖురైష్ తెగవారు కాబా పవిత్రతను కాపాడాలనే ఉద్దేశ్యంతో తిరిగి నిర్మించడానికి పూనుకున్నారు.

ఈ దశలో ఖురైష్ తెగవారు, కాబా గృహ నిర్మాణంలో కేవలం ధర్మ సమ్మతమైన డబ్బునే వాడాలని, దీనికి పాపమార్గాలైన వ్యభిచారం, వడ్డీ, దోపిడీ ధనాన్ని వాడరాదని ఏకగ్రీవంగా తీర్మానించుకున్నారు. కొత్త కట్టడాన్ని నిర్మించడానికి పాత కట్టడాన్ని కూల్చవలసి వచ్చింది. పాత కట్టడాన్ని కూల్చడానికి ఎవరికీ ధైర్యం చాలడం లేదు. గునపం తగిలితే ఏ

పాపం చుట్టుకుంటుందోనని అందరూ భయపడి పోయారు. పైగా గతంలో ఒకసారి అబ్రహా రాజు కాబాను నేలమట్టం చేయడానికి వస్తే దైవ శిక్ష విరుచుకుపడి సర్వనాశనమయ్యాడు. అంచేత దైవగృహాన్ని కూలగొడ్తే ఏ ఆపద వచ్చి పడుతుందోనని అందరూ భయపడసాగారు. తమ సంకల్పం కట్టడాన్ని పునర్నిర్మించాలన్నదేగాని, అబ్రహాలా నాశనం చేయాలన్నది కాదు. ఈ ఆలోచన వారికి కొంత ధైర్యాన్నిచ్చింది. పాతకట్టడం పడగొట్టడానికి ముందుగా వారు పూజలు చేశారు. కానుకలు సమర్పించుకున్నారు. జంతు బలులు చేశారు. ఆ తరువాత వలీద్ బిన్ ముగీరా మగ్జూమీ ముందుకు వచ్చాడు. వణుకుతున్న చేతులతో గడ్డపార తీసుకున్నాడు. గుండె దిటవు చేసుకొని, నరాలు బిగబట్టి గడ్డపారతో ఒక స్తంభాన్ని పడగొట్టి పనిని ప్రారంభించాడు.

అతనిపై ఏ ఆపద విరుచుకు పడిపోతుందోనని జనం భయపడుతూ ఊపిరి బిగబట్టి ఎదురు చూశారు. అంతా నిశ్శబ్దం. కొన్ని క్షణాలు గడిచి పోయాయి. ఉహు, ఏమీ కాలేదు. ఆ రాత్రి గడిచింది. ఉదయభానుడు యథాప్రకారం మక్కా గగన తలంపైకి వచ్చాడు. కాని వలీద్ నిక్షేపంగానే ఉన్నాడు. దాంతో ప్రజల మనస్సులు కుదుటపడ్డాయి. ఇక అందరూ కలసి కాబా గోడలు పడగొట్టడం ప్రారంభించారు. అలా పునర్నిర్మాణ ఉద్దేశ్యంతో కూల్చడం వల్ల అతను ఎలాంటి దైవ శిక్షకు గురికాలేదని చూసి మిగతా వారు కూడా అతనికి తోడ్పడ్డారు. అలా ఇబ్రాహీం(అ) నిర్మించిన పునాదుల వరకు కూలుస్తూ వెళ్ళిన తరువాత అక్కడి నుంచి కాబా గృహాన్ని తిరిగి నిర్మించారు. ప్రతి తెగ వారు తమ వంతు రాళ్ళను పోగు చేసుకున్నారు. నిర్మాణం ప్రారంభమైంది.

# హజ్రె అస్వద్ వివాద పరిష్కారం

కాబా పునర్ నిర్మాణ పనిలో ముహమ్మద్(స), ఆయన పెదనాన్న అబూతాలిబ్‌లు కూడా పాల్గొన్నారు. ప్రజలు దగ్గర్లో వున్న గుట్టల నుంచి రాళ్ళు మోసుకొచ్చారు. చూస్తూ ఉండగానే కాబా గోడలు తయారయ్యాయి. కట్టడం గోడలు హజ్రె అస్వద్(నల్లరాయి) స్థానం వరకు లేచాయి. హజ్రె అస్వద్‌ను దాని స్థానంలో ప్రతిష్టించే గౌరవం, భాగ్యం ఎవరికి దక్కాలన్న వివాదం తలెత్తింది. ఈ వివాదం ఐదు రోజుల పాటు కొనసాగింది. క్రమంగా తీవ్రరూపం దాల్చి మక్కా లాంటి పవిత్ర స్థలంలోనే రక్త పాతం జరిగేటంత వరకూ వెళ్ళింది. కానీ, అబూ ఉమయ్యా మగ్జూమీ అనే వ్యక్తి ఒక పరిష్కారం చూపాడు. అబూ ఉమయ్యాని అన్ని తెగల వారు ఎంతో గౌరవిస్తారు.

ఈ సమస్యకు ఒక్కటే పరిష్కారం. సఫా ద్వారం నుంచి మొట్ట మొదట ఎవరైతే

లోనికి ప్రవేశిస్తారో అతడ్ని మధ్యవర్తిగా స్వీకరించాలి. అతను ఎలా చెబితే అలా నడచుకోవాలి అన్నాడు అబూ ఉమయ్యా. ఈ సలహా అందరికీ నచ్చింది. సరేనంటూ...ఆ వ్యక్తి కోసం వారు ఎదురు చూస్తామన్నారు. కాబా గృహం చుట్టూ ఉన్న నాలుగు ప్రహరీ గోడలకు నాలుగు ముఖద్వారాలు ఉన్నాయి. అందులో సఫా ద్వారం పట్నం వైపు గాకుండా దానికి అభిముఖంగా కొండల వైపు వుంది. అందరి దృష్టి సఫా ద్వారం వైపు కేంద్రీ కృతమయింది. మరుసటి ఉదయం మజ్జిదె హరామ్ ద్వారం నుంచి ఎవరు మొదట ప్రవేశిస్తారో అతణ్ని తమ వివాదానికి న్యాయవేత్తగా ఒప్పుకుందామని సలహా ఇచ్చాడు. అందరూ ఈ సలహాను స్వీకరించారు. దైవలీల ఏమిటోగాని, ఆ సలహా తరువాత మొట్టమొదటగా దైవప్రవక్తే ఆ ద్వారం గుండా లోనికి ప్రవేశించారు. ప్రజలు ఆయన్ను చూడగానే ఓహో! ఈయన ముహమ్మద్(స)! ఈయన నిజాయితీ పరుడు. మేము ఆయన చెప్పినట్లు నడుచుకుంటాం. అని ముక్తకంఠంతో పలికారు. ఆయన దగ్గరకు రాగానే అందరూ ఆ వివాదం వివరాలు వివరించి తీర్పు చెప్పమని అడిగారు.

ఖురైష్ నాయకులు సమస్యను ముహమ్మద్(స) ముందుంచారు. ముహమ్మద్(స) అంతా విని ఒక దుప్పటి తెప్పించారు. దాన్ని నేలమీద పరచి మధ్యలో హజ్రె అస్వద్‌ని ఎత్తి పెట్టారు. దుప్పటి అంచుల్ని అన్ని వర్గాల నాయకులు పట్టుకొని ఆ శిల పెట్టవలసిన చోటికి ఎత్తి పట్టుకురమ్మని చెప్పారు. అలా అందరూ కలసి తెచ్చిన తర్వాత మొహమ్మద్(స) తన స్వహస్తాలతో ఆ రాయిని ఎత్తి దాని స్థానంలో అమర్చారు.

ఈ న్యాయ నిర్ణయం, సమయ స్ఫూర్తిని చూసి అందరూ అబ్బుర పడ్డారు. ముహమ్మద్‌ను ప్రశంసించారు. ఘోర రక్తపాతానికి దారి తీస్తుందని అనుకున్న సమస్య ఇలా ప్రశాంతంగా సమసిపోయింది. అమీన్ చూపిన ఉపాయం వల్ల అంత:కలహం ఆరంభంలోనే అంతరించినందుకు అందరూ ఎంతో ఆనందించారు.

## కాబా పునర్నిర్మాణం నిర్మాణం

యజీద్ మరణవార్త విన్న శత్రుసైనికులు యుద్ధం ఆపి సిరియా వెళ్ళిపోయారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్(ర) కాస్త ప్రశాంత పరిస్థితి నెలకొన్న తర్వాత హి.శ. 64వ ఏటా కాబా పునర్నిర్మాణం వైపు దృష్టి సారించారు. ఆయన ఇబ్రాహీం ప్రవక్త(అ) తీసిన పునాదులపై కాబాను పునర్నిర్మించాలనే సంకల్పంతో నగర ప్రముఖులతో సంప్రదింపులు జరిపారు. అయితే హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(ర)తో సహా అనేక మంది ఈ ప్రతిపాదనను వ్యతిరేకించారు. కొందరు మాత్రమే సమర్థించారు. హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్(ర)

ప్రతిపాదనను వ్యతిరేకించిన వారికి నచ్చజెపుతూ కాబా నిర్మాణం గురించి దైవప్రవక్త (స) చెప్పిన ఈ మాటలను గుర్తుచేశారు.

దైవప్రవక్త(స) హజ్రత్ ఆయేషా(ర)తో మాట్లాడుతూ ఆయేషా! నీకీ సంగతి తెలియదు. నీ జాతి (ఖురైష్) వాళ్ళు కాబాను పూర్తిగా ఇబ్రాహీమి పునాదులపై నిర్మించలేక పోయారు. వారు కొంత భాగం తగ్గించారు అని అన్నారు. హజ్రత్ ఆయేషా(ర) ఈమాట విని అలాగైతే దైవప్రవక్తా! మీరు ఇబ్రాహీమి పునాదుల ప్రకారం దాన్ని మళ్ళీ ఎందుకు నిర్మించలేదు? అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త(స) సమాధానమిస్తూ నీజాతి (ఖురైష్) వాళ్ళు ఇప్పుడిప్పుడే ఇస్లాం స్వీకరించారు. వారు మార్గభ్రష్టులయి పోతారన్న ప్రమాదం గనక లేకపోతే నేను అలాగే నిర్మించేవాడ్ని అని అన్నారు. (సహీ బుఖారి)

అబ్దుల్లా బిన్ జుబైర్(ర) ఈ విధంగా నచ్చజెప్పి, చివరికి ఇబ్రాహీమి పునాదుల ప్రకారం పూర్వం ఖురైషీయులు వదలిన ఖాళీ స్థలాన్ని (హతీంని) కాబా పరిధిలో చేర్చి పునర్నిర్మించారు. దానికి తూర్పు, పడమరల వైపున రెండు ద్వారాలు కూడా నేలబారుగా ఏర్పరిచారు. ప్రజలు అప్పట్నుంచి కాబా ప్రదక్షిణ చేస్తూ దాని నాలుగు మూలలనూ చేత్తో తాకే వారు. అంతకు ముందు ఖురైషీయుల నిర్మాణంలో కొంత భాగం ఖాళీగా వదిలేసినందున దైవప్రవక్త(స) రెండు మూలలను మాత్రమే తాకేవారు. కొత్త నిర్మాణం తరువాత ప్రజలు కాబా సమగ్ర కట్టడం ప్రదక్షిణ చేశాక, తూర్పు ద్వారం గుండా లోపలికి ప్రవేశించి పడమర ద్వారం గుండా బయటికి వచ్చేవారు. ఈ విధంగా చాలాకాలం జరిగింది.

యజీద్ మరణించిన తరువాత అతని కుమారుడు మావియా కొన్నాళ్ళు మాత్రమే ఖలీఫాగా పరిపాలను చేసి తనువు చాలించాడు. అప్పటి నుంచి ఆరేడు నెలల వరకూ మొత్తం ఇస్లామీయ రాజ్యానికి హజ్రత్ అబ్దుల్లా బిన్ జుబైర్(ర) మాత్రమే ఖలీఫాగా ఉండేవారు. ఆ తరువాత ఆయన ఆధీనంలోని ప్రాంతాలపై ప్రత్యర్థివర్గాల దాడులు పెరిగిపోయి పరిస్థితులు క్రమంగా విషమించాయి.

సిరియా ఖలీఫాగా వచ్చిన అబ్దుల్ మలిక్ హి.శ.72లో హజ్జాజ్ బిన్ యూసుఫ్‌కు ఓ పెద్ద సైన్యాన్నిచ్చి మక్కా పంపాడు. అతను మక్కా నగరాన్ని దిగ్బంధం చేసి యుద్ధం ప్రారంభించాడు. దిగ్బంధం నాలుగు నెలలు కొనసాగింది. ఈ సుదీర్ఘ ముట్టడితో ఇబ్బందులపాలై అనేక మంది ప్రజలు మక్కా వదలి పోయారు. అటు హజ్జాజ్ సైనిక సంఖ్య క్రమంగా పెరిగి పోయింది. హజ్జాజ్ దౌర్జన్యాల వల్ల హజ్ కోసం బయటి నుంచి వచ్చిన యాత్రికులు సైతం హజ్ నియమాలు పూర్తిగా పాటించలేకపోయారు.

హజ్ దినాలు పోగానే హజ్జాజ్ మక్కాపై రాళ్ళు, అగ్నిగోళాలతో తీవ్రమైన దాడులు ప్రారంభించాడు. ఆ సందర్భంలో ఓ పెద్ద రాయి వచ్చి కాబా మీద పడింది. దాంతో కాబా కప్పు కూలిపోయింది. సరిగ్గా అదే సమయంలో ఆకాశం నుంచి భయంకరమైన ఓ గర్జన విన్పించి, ఓ మెరుపు మెరిసింది. ఆ తర్వాత నింగి నేల అంతా గాఢాంధకారం ఆలుముకుంది. ఈ పరిస్థితి చూసి హజ్జాజ్ సైనికులు భయపడిపోయి రాళ్ళు విసరడం మానేశారు. వారిలో అనేక మంది చనిపోయారు. కాని హజ్జాజ్ బిన్ యూసుఫ్ సైనికులకు నచ్చజెబుతూ 'ఈ గర్జన, మెరుపులు మన విజయానికి సంకేతం' అన్నాడు.

ఆ తరువాత ఆ దుర్మార్గుడు ఓ దుష్టపన్నాగం పన్నాడు. దాని వల్ల హ|జత్ అబ్దుల్లా బిన్ జుబైర్(ర) సైన్యంలోని అనేక మంది సైనికులు ఆయన్ని వదిలేసి హజ్జాజ్ దగ్గరకు వెళ్ళిపోయారు. ఆఖరికి ఆయన కుమారులలో ఇద్దరు ఆయన్ని వదలి వెళ్ళారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం హ|జత్ అబ్దుల్లా బిన్ జుబైర్(ర) ఏమాత్రం నిరాశ చెందకుండా శత్రువుతో హోరాహోరిగా పోరాడి హి.శ. 73లో అమరులైయ్యారు.

ఆ తరువాత హజ్జాజ్ మక్కాలో ప్రవేశించి కాబాలో పడిన రాళ్ళు, రక్త బిందువుల్ని చూసినా చలించలేదు. అతను కాబా నూతన నిర్మాణం కోసం ఒక నివేదిక ఖలీఫా అబ్దుల్ మలిక్‌కు పంపించాడు. ఖలీఫా అబ్దుల్ మలిక్ కాబాను విస్తరించి కట్టినంత మేరకు పడగొట్టి నిర్మించమని హజ్జాజ్‌ని ఆదేశించాడు. దాని ప్రకారం హజ్జాజ్ కాబాను ప్రవక్త కాలంలో ఉన్న విధంగా పునర్నిర్మించాడు. ఆ తరువాత ఖలీఫా దృష్టికి హ|జత్ ఆయేషా(ర) ఉల్లేఖించిన ప్రవక్త ప్రవచనాలు రాగానే అతను చాలా పశ్చాత్తాప పడ్డాడు. కాని కాబాను దైవప్రవక్త(స) ప్రవచనాల ప్రకారం విస్తరించకుండా యధాతథంగా ఉంచాడు. (సహీ ముస్లిం) ఆనాటి నుంచి ఈనాటి వరకూ కాబా కట్టడం అలాగే వుంది.

## మఖామ్-ఎ-ఇబ్రాహీం

మక్కాలో కాబాగృహాన్ని నిర్మిస్తున్నప్పుడు ఇబ్రాహీం(అ) నిలబడిన రాయినే మఖామ్-ఎ-ఇబ్రాహీం అని పిలుస్తారు. ఆ గృహం గోడలు పెద్దవైన కొద్దీ ఇబ్రాహీం(అ)కు ఎత్తు మీద నిలబడేందుకుగాను ఇస్మాయిల్ ఒక రాయి తెచ్చి వేశారు. అప్పుడు ఇస్మాయిల్ అందించిన రాళ్ళు తీసుకుని ఇబ్రాహీం(అ) గోడ కట్టడం కొనసాగించారు. ఒక పక్క పూర్తవ్వగానే మరో పక్క కట్టేవారు. అన్ని వైపులా తిరుగుతూ దీన్ని నిర్మించారు. ఇబ్రాహీం(అ) ఇస్మాయిల్(అ) కాబా గృహాన్ని నిర్మించారని ఇబ్‌నె అబ్బాస్ చెప్పిన వివరాల్ని అల్ బుఖారీ పొందుపరిచారు. ఇబ్రాహీం పాదముద్రలు ఇప్పటికీ ఈ రాయిమీద కనిపిస్తాయి.

మఖామె ఇబ్రాహీం రాయి పొడువు, వెడల్పు 14 చదరపు అంగుళాలు. మందం 8 అంగుళాలతో తేలికపాటి ఎరుపు రంగు మీద నల్లటి చారలు కలిగి వుంది. దీన్ని ఓ పెద్ద పంజరం లాంటి గ్రిల్ లోపల కదలకుండా పెట్టారు. ఈ రాయి మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్(ర) పాలన వరకూ కాబా గోడకు ఆనుకుని ఉండేది.

హాజీలకు ప్రదక్షిణ సమయంలో ఇబ్బంది కలుగుతోందని రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్(ర) మఖామె ఇబ్రాహీంను అక్కడ్నుంచి తీసి కాబాకు కొంచెం దూరంలో ప్రస్తుతమున్న చోట పెట్టించారు.

ఇబ్రాహీం(అ) కాబా గృహ నిర్మాణాన్ని పూర్తి చెయ్యగానే ఈ రాయిని కాబా గోడకు పక్కనే ఉంచేవారట. ఏడు ప్రదక్షిణలు(తవాఫ్) పూర్తి చెయ్యగానే ఈ రాయి పక్కనే నిలబడి ప్రార్థన చేయాలని అల్లా నుంచి ఆయనకు ఆదేశం వచ్చింది. కాబా నిర్మాణం పూర్తయ్యేసరికి ఈ రాయిని (ఇబ్రాహీం ముఖామ్) పూర్తయిన చోటే వదిలేశారు. హాజీల సౌకర్యార్థం హజ్రత్ ఉమర్(ర) ఈ రాయిని తన పాలన కాలంలో కాబా గోడ దగ్గర్నుంచి దూరంగా జరిపారు.

## ఖిస్వా

కాబా మీద వున్న నల్లటి వస్త్రాన్ని ఖిస్వా అంటారు. దీన్ని ప్రత్యేకంగా తయారు చేయడానికి మక్కాలో ఓ ఫ్యాక్టరీ వుంది. ప్రతి సంవత్సరం రెండు సార్లు ఖిస్వాను కాబాపై అలంకరిస్తారు. ఒక ఖిస్వా తయారు చేయడానికి ఖర్చు 17 మిలియన్ల సౌదీ రియాళ్ళు. 670 కిలోల వెండి, 120 కిలోల బంగారంతో తయారు చేస్తారు. ఖురాన్ సూరాలు దీనిపై రాయడానికి 50 కిలోల వెండిని ఉపయోగిస్తున్నారు. దీని విస్తీర్ణం 658 చదరపు మీటర్లు.

## జమ్ జమ్ పవిత్ర జలాలు

హజ్రత్ ఇబ్రాహీం దైవప్రవక్తగా పాలస్తీనాలో ధర్మప్రచారం చేస్తున్న రోజులవి. ఆయన మొదటి భార్య హజ్రత్ హాజరా(ర) ద్వారా ఇస్మాయీల్(అ) జన్మించారు. ఈ వార్త విన్న రెండవ భార్య హజ్రత్ సారా(ర)కు అసూయ పుట్టింది. హాజరా, ఇస్మాయీల్‌లను ఎలాగైనా తరిమి వేయాలని ఆమె పట్టుపట్టారు. తన కళ్ళ ముందు వీరు వుండడానికి వీలులేదని, వారిని దూరంగా తీసుకెళ్ళమని ఇబ్రాహీంపై ఒత్తిడి పెంచారు. గొడవ ఎక్కువ కావడంతో హజ్రత్ ఇబ్రాహీం(అ) హాజరాను, కొడుకు ఇస్మాయిల్‌ను తీసుకొని అరేబియా ప్రాంతానికి బయలుదేరారు.

అరేబియాలోని భయంకరమైన నిర్జన ఎడారి ప్రదేశంలో వాళ్ళిద్దర్ని దిగబెట్టారు. ఆ రోజుల్లో మక్కాలో ఎవరూ ఉండే వారు కాదు. నీరు కూడా దొరికేది కాదు. ఇబ్రాహీం హాజిరను, పసిబిడ్డ ఇస్మాయిల్(అ)ను కాబా దగ్గరలోని ఒక చెట్టు కింద ఎత్తయిన ప్రాంతంలో వదిలారు. కొన్ని ఖర్జురాలున్న తోలు సంచితో పాటు నీళ్ళున్న మరో సంచిని హాజిరాకు ఇచ్చి ఇబ్రాహీం(అ) ఇంటికి తిరిగి బయల్దేరారు.

ఇస్మాయిల్(అ) తల్లి.... ఆయన వెనకే వెళ్ళి ఓ ఇబ్రాహీం! ఒక్క మానవ మాత్రుడు కూడా లేని ఈ లోయలో మమ్మల్ని వదిలేసి వెళ్తున్నావు? అని పదేపదే ప్రశ్నించింది. అయినా ఆయన ఆమె వైపుకి చూడక పోవడంతో...

ఆమె..... అల్లాహ్ నీకలా చెయ్యమని ఆదేశం ఇచ్చాడా? అనడిగింది.

దానికి ఆయన అవునని జవాబిచ్చాడు.

"అయితే అల్లాహ్ మమ్మల్ని కష్టాల్లో వదిలెయ్యడు" అని ధైర్యంగా వెనక్కి మళ్ళింది. తర్వాత ఇబ్రాహీం(అ) ముందుకి సాగారు. హజ్రత్ ఇబ్రాహీం కొంచెం దూరం పోయాక వెనక్కి తిరిగి చూస్తూ చేతులెత్తి ఇలా ప్రార్థించారు.

అల్లా! నేను నా సంతానాన్ని ఎలాంటి చెట్టూ, పుట్టా లేని ఎడారి ప్రాంతంలో నీ ప్రతిష్టాలయం వద్ద వదిలి వెళ్తున్నా. వీరిపట్ల నీవు ప్రజల హృదయాల్లో ఆసక్తి అభిమానాలు కలిగించు. వీరికి తినడానికి పండ్లు ఫలాలు ప్రసాదించు. బహుశా అందుకు కృతజ్ఞులై ఉంటారు. ప్రభూ! మేము దాస్తున్నదీ, బహిర్గతం చేస్తున్నదంతా నీకు తెలుసు. నిస్సందేహంగా దేవునికి భూమ్యాకాశాల్లో ఏదీ కనుమరుగుగా లేదు. (ఖుర్‌ఆన్ 14:37, 38)

హాజిర(అ) ఇస్మాయిల్‌కు పాలిచ్చి సంచిలోని నీటిని తాగింది. ఆ నీరంతా అయిపోయాక ఆమెకు, ఆమె కుమారుడికి దాహం మొదలైంది. ఇస్మాయిల్(అ)ను ఎత్తుకుని విచారంతో నిస్సహాయంగా నిలబడింది. తర్వాత ఆయన బాధను చూడలేక, ఆ పిల్లవాడిని అక్కడ వదిలి అక్కడికి దగ్గర్లోని అల్ సఫా పర్వతం దగ్గరికి వెళ్ళింది. దాని మీద నిలబడి లోయలో ఎవరైనా కనిపిస్తారేమోనని నిశితంగా పరిశీలించింది. ఎవరూ కనబడక పోవడంతో అల్ సఫా మీద నుంచి కిందకి దిగి, లోయకు చేరగానే కంగారుగా, కష్టాల్లో ఉన్న వ్యక్తి లాగే పరిగెత్తింది. లోయను దాటి అల్ మర్వా పర్వతాన్ని ఎక్కింది. దాని పైనించి కింద ఎవరైనా కనిపిస్తారేమోనని పరిశీలించింది. అయినా ఎవరూ కనబడలేదు. అలా రెండు పర్వాతాల మధ్య ఏడు సార్లు పరిగెత్తిందామ్మ.

ప్రవక్త(స) ఇలా అన్నారు. అల్ సఫా, అల్ మర్వాకు చేరినప్పుడు ఆమెకు ఒక

గొంతు వినబడటంతో ఆమె ఆగి శ్రద్ధగా ఆలకించింది. మళ్ళీ ఆ గొంతు వినబడింది. అప్పుడామె 'ఓయి! (మీరెవరోగానీ) మీ గొంతు నాకు వినబడింది. మీరు నాకేదైనా సాయం చేయగలరా? అని ప్రశ్నించింది. అక్కడ దైవదూత నేలమీద తన రెక్కతో కొట్టింది. ఆ ప్రదేశంలో నీటి ఊట బయటపడింది. జమ్‌జమ్ అంటూ ఆమె తన చేత్తో పాదులా చేసి అందులోంచి నీటిని తన నీటి సంచిలోకి నింపుకోవడం మొదలెట్టింది కొంత నీరు ఇలా తియ్యగానే ఆ నీరు అందులోంచి బయటికి ప్రవహించింది. బుఖారీ హదీస్ ప్రకారం ప్రవక్త ఇలా పేర్కొన్నారు.... ఆమె (హాజిర) ఆ నీటిని సహజంగా పారేలా వదిలేస్తే, అది భూమి ఉపరితలమంతా నిండెది. ఆ తల్లి ఆరోజు పడిన కష్టాలు, త్యాగాల ఫలితాన్ని ఇవాళ మనం అనుభవిస్తున్నాం. జమ్ జమ్ పవిత్ర జలాల్ని అప్పటి నుంచి ఇప్పటి వరకు తాగుతున్నారు.

హజ్‌లో రెండు పర్వతాల మధ్య మనం తీసే పరుగు ఆనాడు హాజిరా తీసిన దానికన్నా ఎంతో తేలిగ్గా అయిపోతోంది. తన కొడుకు పట్ల ఆమె చూపిన ప్రేమ, బాధ్యత, అల్లాహ్ మీద ఆమెకున్న అపరిమిత విశ్వాసం- అలాంటి దారుణ పరిస్థితుల్లో సైతం అల్లాహ్‌ను గాఢంగా విశ్వసించింది.

ఈ సంఘటన జరిగిన రెండున్నర వేల ఏళ్ల తరువాత ప్రవక్త ముహమ్మద్(స) తాతగారు అబ్దుల్ ముత్తలిబ్ కాబా ధర్మకర్త అయ్యారు. కానీ ఆనాడు మక్కాలో జమ్‌జమ్ బావి కాదు కదా, దాని చిహ్నాలు కూడా లేకుండాపోయాయి. అబ్దుల్ ముత్తలిబ్ కాబా నిర్వహణ బాధ్యత చేపట్టగానే మొదట కాబా యాత్రికుల సమస్యల్ని గురించి ఆలోచించాడు. వాటిలో అతనికి మంచి నీటి కొరత పెద్ద సమస్యగా కనిపించింది. స్థానిక మక్కా ప్రజలకు పట్నం వెలుపల శివార్లలో ఉన్న కొన్ని బావుల్లో నుంచి మాత్రమే కొంత నీరు లభిస్తున్నది. అంత దూరం నుంచి పట్నంలోకి యాత్రికుల కోసం నీరు మోసుకురావడం కూడా సమస్యగానే ఉంది.

ఈ సమస్యే అబ్దుల్ ముత్తలిబ్‌ని నిరంతరం బాధిస్తూ వుంది. జమ్‌జమ్ బావినీరు ఎంతో మధురంగా ఉంటుంది. ఎంత తోడినా తరగని అపార జలనిధి. అదీగాక నీరు ఎంతో పైకి ఉండేది. సులభంగా తోడుకోవచ్చు. అలాంటి బావి కనపడకుండా పోయింది. దాన్ని ఎవరు పూడ్చి నాశనం చేశారో! అబ్దుల్ ముత్తలిబ్ ఓ రోజు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ జమ్‌జమ్ బావిని ఎవరు పూడ్చారు? ఎందుకు పూడ్చవలసి వచ్చింది? అని అడిగాడు కొందరు వృద్ధ ఖురైషీయుల్ని.

మొదట్లో ఇక్కడ జుర్హుమ్ తెగవాళ్ళు పరిపాలన చేస్తుండేవారు. అయితే కొంత కాలానికి ఆ తెగవాళ్ళలో నీతినియమాలు సన్నగిల్లడం ప్రారంభమయింది. అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయి. దాంతో బనూ ఖుజాఅ తెగవాళ్ళు వారి మీద తిరగబడ్డారు. జుర్హుమ్ తెగవారికి, వారి రాజు ముజాజ్ జుర్హుమికి వ్యతిరేకంగా యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో జుర్హుం తెగవాళ్ళు చిత్తుగా ఓడిపోయారు. అప్పుడు ముజాజ్ జుర్హుమి మక్కా నుంచి పారిపోతూ ప్రతీకారంగా కాబాలోని కానుకల్ని జమ్‌జమ్ బావిలో విసిరేసి, దాన్ని పూడ్చి వెళ్ళాడని చెప్పారు వృద్ధ ఖురైషీయులు.

ఎలాగైనా జమ్‌జమ్ బావిని వెతికి తీసి, దాని నీటిని ప్రజలు వాడుకునేలా చేసే వరకు నాకు మనశ్శాంతి వుండదన్నాడు అబ్దుల్ ముత్తలిబ్. ఒకటే ఆలోచన. కాని ఏం చేస్తాడు. అంతా ఆ భగవంతుడిపైనే భారం వేశాడు.

ఆ రోజు అబ్దుల్ ముత్తలిబ్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. అప్పుడే ఓ ధ్వని విన్పించింది. అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్‌ని వెలికి తియ్యి. దాంతో ఉలిక్కిపడి లేచాడు. చూస్తే తాను నిద్దురపోతున్న గదిలో ఎవరూ లేరు. అదేదో తన భ్రమ అనుకొని మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారింది. దైనందిన కార్యకలాపాలలో నిమగ్నుడై పోయాడు. సాయంత్రం. రాత్రి అయింది. యథా ప్రకారం పడక మీదకు చేరుకున్నాడు. సరిగ్గా నడిరేయి సమయంలో మళ్ళీ అదే విచిత్ర ధ్వని! అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్ బావిని వెలికి తియ్యి.

అబ్దుల్ ముత్తలిబ్ మళ్ళీ ఉలిక్కిపడి లేచి, చుట్టూ కలియజూస్తే ఎవరూ కన్పించ లేదు. ఏమిటి వింత శబ్దం! ఎవరు తనను పిలుస్తున్నది? ఇలా ఆలోచిస్తూ తిరిగి నిద్రలోకి ఒరిగిపోయాడు. కాని ఉదయం లేవగానే ఆ విషయం గురించిన ఆలోచనలు ముసురుకున్నాయి. అయినా ఎలాంటి నిర్ణయానికి రాలేక పోయాడు. మరచిపోవాలన్నా మరువలేక పోతున్నాడు.

మూడవ రోజు కూడా నడిరేయి సమయంలో అదే కంఠస్వరం విన్పించింది. అబ్దుల్ ముత్తలిబ్! లే. లేచి జమ్‌జమ్ బావిని వెలికి తియ్యి. దానివల్ల నీకు, నీ సంతతికి గౌరవ ప్రతిష్టలు లభిస్తాయి. అది ఎన్నటికీ ఎండిపోదు. దాని నీరు తరగిపోవడం కూడా జరగదు. ఆ నీరు హాజీలు తాగుతారు. జమ్ జమ్ బావి..... పేడ, రక్తం మధ్య తెల్లకాకి పొడిచి తినే బలిప్రదేశంలో ఉంది. ఆ ప్రదేశంలో త్రవ్వడం ప్రారంభించు. కలలో ఎవరో పుణ్యపురుషుడు ఈ మాటలు చెబుతూ అబ్దుల్ ముతాలిబ్‌ని కాబా మందిరానికి తీసికెళ్ళాడు. అక్కడ జమ్‌జమ్ బావి ఉన్న బలి ప్రదేశాన్ని కూడా చూపించాడు. ఆతర్వాత ఆ వ్యక్తి

అదృశ్యమై పోయాడు. కల చెదిరిపోయింది. అబ్దుల్ ముత్తలిబ్ తృళ్ళిపడి లేచాడు. ఇది నిజంగా కాబా ప్రభువు నుంచి వచ్చిన ఆదేశమై వుంటుందని భావించాడు. ఈ ఆలోచనతో ఆయనకు ఆ తర్వాత నిద్ర పట్టలేదు.

తెల్లవారిన తర్వాత కొడుకు హారిస్‌ని పిలిచి కలలో అందిన ఆజ్ఞ గురించి తెలియజేశాడు. ఆ తర్వాత హారిస్‌ని వెంటబెట్టుకొని కాబాకు వెళ్ళాడు. అక్కడ ఖురైష్ నాయకుల్ని పిలిపించి వారికి ఈ విషయం తెలియజేస్తూ ఇలా అన్నాడు.

సోదరులారా! గత మూడు రాత్రులు కలలో నాకిలాంటి ఆజ్ఞలు లభించాయి. కలలో ఈ ప్రదేశంలోనే జమ్‌జమ్ బావి వున్నట్లు చూశాను. నాకు గట్టి నమ్మకం ఉంది. కాని ఇక్కడ త్రవ్వకం జరిపి జమ్‌జమ్‌ను వెలికి తీయడం ఎంతో శ్రమతో కూడిన పని. మీరు కూడా నాతో సహకరిస్తే ఈ పని సులభమవుతుంది.

ఖురైష్ నాయకులు ఈ మాటలు విని ఒకరి ముఖాలు ఒకరు చూసుకోసాగారు. ఒకతను ముందుకొచ్చి ఇదంతా మీ భ్రమ. కలలోని మాటలు నిజమవుతాయనుకోవడం కన్నా మించిన వెర్రితనం మరొకటి లేదు. జమ్‌జమ్‌ను వెతికి తీయడం సాధ్యమయ్యే పనికాదు అన్నాడు నిర్లక్ష్యంగా ఈ ప్రదేశంలో మనం త్రవ్వకం ఎలా జరపగలం? దీనికి ఇరువైపులా మన దేవతా విగ్రహాలున్నాయి. ఇక్కడ త్రవ్వితే పాపం మూట కట్టుకున్నట్లే అన్నాడు మరొకడు.

విగ్రహాలు పెద్ద సమస్య కాదు. వీటిని ఇక్కడ్నుంచి తీసి వేరే చోటికి తరలించవచ్చు అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్.

ఎంత మాత్రం వీల్లేదు. వీటిని ఇక్కడే ఉండనివ్వాలి. ఎన్నో సంవత్సరాలుగా వుంటున్న ఈ విగ్రహాల్ని తొలగించడమంటే దేవతల ఆగ్రహాన్ని మనం చేజేతులా కొని తెచ్చుకోవడమే. మేము ఈ పనిలో మీతో సహకరించలేం అన్నాడు వేరొక వ్యక్తి. ఔను, మేము మీతో ఏ మాత్రం సహకరించలేం అన్నారు మరో నలుగురు.

సరే మీరు సహకరించినా సహకరించకపోయినా, నేను మాత్రం ఈ పని చేసి తీరుతాను అన్నాడు అబ్దుల్ ముత్తలిబ్ ఎంతో ఆత్మవిశ్వాసంతో...

మీ ఇష్టం. ఈయన గారికేదో కీడు మూడింది. అందుకే తెగించి ఈ దుస్సాహసానికి పాల్పడుతున్నాడు. మరికొందరైతే పర్యవసానం ముందుకు వస్తే గాని వాస్తవం అర్థం కాదు అనుకుంటూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

ఆ తరువాత అబ్దుల్ ముత్తలిబ్ కొడుకు హారిస్ సహాయంతో జమ్‌జమ్ చోటు

నుంచి విగ్రహాలను వేరే చోటుకు తరలించి త్రవ్వకం మొదలుపెట్టాడు. చివరికి ఆయన శ్రమ ఫలించింది. జమ్‌జమ్ నీటిని చూసి ఆనందభాష్పాలు రాల్చాడు. జమ్‌జమ్ బావిలో జుర్హుమీ తెగ నాయకుడు ముజాజ్‌కు చెందిన అనేక ఖడ్గాలు, డాళ్ళు, కవచాలు దొరికాయి. ప్రజలు దేవతలకు సమర్పించుకున్న కానుకలు కూడా లభించాయి. ఆ కానుకలలో రెండు బంగారు జింకలు కూడా ఉన్నాయి. ఖురైష్ నాయకులు ఇదంతా చూసి సిగ్గుపడిపోయారు. ఈ పవిత్రకార్యంలో తాము పాలుపంచుకోలేక పోయామే అని తెగ బాధపడిపోయారు.

మేం అబ్దుల్ ముత్తలిబ్‌కు ఏదో పిచ్చి పట్టిందని అనుకున్నాం. కాని ఆయన తాననుకున్న కార్యం సాధించి తీరే దృఢ మనస్కుడని ఇప్పుడు అర్థమైందని చెప్పుకున్నారు. వారు తమ సహాయ నిరాకరణకు సిగ్గుపడ్డారు.

జమ్‌జమ్ బావి బయటపడిందని, ఇక నుంచి ఎడతెగకుండా లభించే దాని మధురమైన నీటిని హాయిగా తాగవచ్చని తెలియగానే జనం గుంపులు గుంపులుగా వచ్చి చూడసాగారు. అబ్దుల్ ముత్తలిబ్‌ని వారు ప్రశంసలతో ముంచెత్తనారంభించారు.

జమ్‌జమ్ జలాశయం కాబా తూర్పు వైపున వుంది. జమ్‌జమ్ నీటిని ఏ ఉద్దేశంతో తాగితే ఆ ఉద్దేశం నెరవేరుతుంది (ఇబ్నెమాజ) ఎవరైనా శత్రువుల బారి నుంచి రక్షణ పొందే ఉద్దేశంతో జమ్‌జమ్ నీరు తాగితే అతనికా రక్షణ లభిస్తుంది. స్వస్థత కోసం తాగితే స్వస్థత చేకూరుతుంది. ఇది జిబ్రీల్ తన కాలితోపుతో తవ్విన బావి. ఇస్మాయీల్ కోసం వెలిసిన జలధార. (దారెఖుత్నీ)

18 × 14 పొడవు, వెడల్పు, 13 మీటర్ల లోతు వున్న బావిది. నాలుగువేల ఏళ్ళ చరిత్ర దీనికుంది. ఇంత వరకు ఎప్పుడు ఎండి పోలేదు. నీటి రుచి మారలేదు. ఈ నీటిలో ఇంత వరకు ఎలాంటి ఫంగస్ చేరలేదు. దీంట్లో చిన్న చిన్న మొక్కలు మొలవలేదు. భారీ మోటార్లతో ఇందులో నుంచి నీటిని తోడుతున్నారు. సెకెండ్‌కు ఎనిమిది వేల లీటర్లను తోడుతున్నారు. 24 గంటలు నీటిని తోడుతూనే వుంటారు. నీటి లెవెల్ కేవలం పదకొండు నిమిషాల్లో యథాతథా స్థితిలో వుంటుంది.

జమ్‌జమ్‌పై రసాయనిక విశ్లేషణ జరిగింది. ఈ నీటిలో మెగ్నీషియం సల్ఫేట్, సోడియం సల్ఫేట్, సోడియం క్లోరైడ్, క్యాల్షియం కార్బొనేట్, పొటాషియం నైట్రేట్‌లు వున్నట్లు తేలింది. వాంతుల్ని, తలనొప్పి, మూత్ర పిండంలో ఏర్పడిన రాళ్ళు తొలగించడం, రక్తపోటు, అజీర్ణం, మూత్ర వ్యాధులు ఇలా 72 రకాల వ్యాధుల నివారణకు జమ్‌జమ్

దివ్య ఔషధంగా పనిచేస్తుంది. మొండి రోగాలు కూడా జమ్‌జమ్ నీటితో నయమైన సంఘటనలు ఉన్నాయి.

# హిరా గుహ

మక్కాలో ఎటు చూసినా కొండలే కనిపిస్తాయి. పవిత్ర ఖురాన్ ఆవిష్కారమైన ప్రదేశం. ముహమ్మద్(స) ప్రవక్త కాక ముందు ఇక్కడే ఎక్కువ సమయం అల్లాహ్ ధ్యానంలో వుండేవారట. హిరా గుహ నాలుగు గజాల పొడవు, ఒకటి ముప్పాతిక గజాల వెడల్పు గల చిన్న గుహ. ఇది ఓ ఇరుకైన బాటకు ప్రక్కన, పైన రెండు బండరాళ్ళు పరస్పరం కలుసుకోవడం మూలంగా ఏర్పడిన ఓ గుడిసెలా వుంది.

తన జాతి ప్రజల చెడు నడవడిక ప్రవక్త ముహమ్మద్(స)ను కలిచి వేసింది. ఏకాంతవాసమే ప్రియమనిపించింది. నీరు, పేలపు పిండి వెంట తీసుకుని మక్కాకు రెండు మైళ్ళ దూరంలో ఉన్న హిర కొండలోని ఓ గుహలోనికి వెళ్ళి దైవధ్యానంలో లీనమైపోయేవారు. హజ్రత్ ఖదీజా(ర) కూడా ఆయన వెంటే వచ్చి దగ్గరలోనే మరో చోట ఉండేవారట.

ఈ ఏకాంతవాసంలో విశ్వవ్యవస్థ గురించి ఆలోచిస్తూ, దాని వెనుక దాగి వున్న మర్మాల గురించి ఆలోచించేవారు. హిరా కొండ గుహలో ఏకాంత వాసపు మూడవ సంవత్సరం ప్రవేశించినప్పుడు, అల్లాహ్ భూవాసులపై కారుణ్యం కురిపించి ఆయనను ప్రవక్త(స)గా నియమించి జిబ్రీల్(అ) దివ్య ఖుర్ ఆన్ వాక్యాలను కొన్నింటిని ఆయన వద్దకు తెచ్చారు. ఈ సంఘటన రంజాన్ నెల 21వ తేదీ, సోమవారం రాత్రి సంభవించింది. ఆ రోజు ఆగస్టు 10, క్రీ.శ. 610వ సంవత్సరం. చాంద్రమాన లెక్కల ప్రకారం దైవప్రవక్త(స) వయస్సు ఆ నాటికి నలభై సంవత్సరాల ఆరు నెలల పన్నెడు రోజులు.

హజ్రత్ ఆయిషా(ర) నోట ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.

దైవ ప్రవక్త(స) పై దైవవాణి ఆవతరణ నిద్రలో శుభసూచక స్వప్నాల రూపంలో ప్రారంభం అయింది. ఆయన చూసిన ప్రతి స్వప్నం నిజమయ్యేది. ఆ తరువాత ఆయనకు ఏకాంతం రుచించింది. కాబట్టి ఆయన హిరాకొండ గుహలో ఏకాంతంగా, ఎన్నో రోజుల పాటు ఇంటికి రాకుండా ఆరాధనలో నిమగ్నులై ఉండేవారు. ఈ ఆరాధన కోసం ఆయన తన వెంట భోజనం కూడా తీసుకు వెళ్ళేవారు. హజ్రత్ ఖదీజా(ర) ఆయన వద్దకు వెళ్ళి మళ్ళీ కొన్ని రోజుల కోసం భోజనం సమకూర్చి వచ్చే వారు. చివరికి ఆయన వద్దకు సత్యసందేశం వచ్చేసింది. దైవప్రవక్త(స) హిరా గుహలో ఉన్నప్పుడు ఆయన వద్దకు ఓ దైవదూత వచ్చి చదువు అని అన్నాడు. జవాబుగా నాకు చదువు రాదు అని పలికారు

ప్రవక్త. ఈ విషయమై దైవప్రవక్త ఇలా అన్నారు. ఆ దైవదూత నన్ను పట్టి గట్టిగా అదిమాడు. నా శక్తి అంతా పిండేసినట్లయింది. తరువాత నన్ను వదిలి మళ్ళీ చదువు అని అన్నాడు. నేను, నాకు చదువు రాదని చెప్పాను. అతను తిరిగి నన్ను పట్టి అదిమి వదిలి పెట్టాడు. ఆ తరువాత చదువు అని అన్నాడు. నేను, నాకు చదువు రాదు అని తిరిగి అన్నాను. మూడోసారి మళ్ళీ అదిమి 'ఇఖ్‌ర బిస్మి రబ్బికల్లజీ ఖలఖ్. ఖలఖల్ ఇన్సాన మిన్ అలఖ్, ఇఖ్‌ర వ రబ్బుకల్ అక్రమ్' ఓ ప్రవక్త పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో, ఆయన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. పఠించు నీ ప్రభువు పరమ దయామయుడు అన్నాడు.

ఈ వాక్యాలతో దైవ ప్రవక్త(స) వెనక్కుమరిలారు. ఆయన గుండె దడదడ లాడుతోంది. 'నాపై దుప్పటి కప్పు, నాపై దుప్పటి కప్పు' అని చెప్పారు. ఆమె అలా దుప్పటి కప్పగా కొంత సేపటికి స్థిరపడ్డారు.

ఆ తరువాత దైవప్రవక్త(స) హజత్ర్ ఖదీజా(ర)కు ఈ సంఘటన గురించి చెబుతూ, నాకే మైంది? నాకు నా ప్రాణం పోతుందేమోనన్న భయం కలిగింది' అని అన్నారు. దానికి హ్రజత్ ఖదీజా(ర) లేదు! మిమ్మల్ని అల్లాహ్ అగౌరవం పాలు చేయదు. మీరు బంధువుల పట్ల సత్ప్రవర్తన చూపుతారు, కష్టాల్లో చిక్కుకున్న వారిని ఆదుకుంటారు. నిరుపేదలకు సహాయం చేస్తారు. అతిథులను సత్కరిస్తారు. సత్యమార్గంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొంటారు' అని ధైర్యం చెప్పారు.

తర్వాత హ్రజత్ ఖదీజా(ర) ఆయన్ను తన పినతండ్రి కుమారుడైన వర్‌ఖా బిన్ నౌఫల్ బిన్ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా వద్దకు తీసుకు వెళ్ళారు. వర్‌ఖా ప్రవక్త(స)కు ముందు కాలంలో క్రైస్తవ మతాన్ని స్వీకరించిన వ్యక్తి. హెబ్రూ భాషలో రచనలు చేసేవాడు. సువార్త రాసేవాడు. అప్పటికే ఆయనకు వృద్ధాప్యం, దృష్టిలోపం కలిగాయి. ఆయనతో హ్రజత్ ఖదీజా(ర) అన్నయ్యా... మీరు... మీ సోదర కుమారుని మాటలేమిటో కొంత వినండని అనగా, 'ఏమిటి నీవు చూసిందేమిటో చెప్పమని అడిగాడు. దైవప్రవక్త(స) చూసిందంతా చెప్పగా, వరఖా, 'మూసా(అ)కు దైవవాణి అందించడానికి అల్లాహ్ పంపిన జిబ్రీలే ఆయన. నిన్ను... నీజాతి బహిష్కరించే నాటికి నేను సజీవంగా ఉండగలిగితే ఎంత బాగుండేది' అన్నాడు.

'ఏమిటీ నా జాతే నన్ను బహిష్కరిస్తుందా? అని ప్రవక్త(స) అడుగగా...

ఔను ఇలాంటి సందేశం తెచ్చిన ప్రతి వ్యక్తిని వారి జాతే తప్పకుండా

బహిష్కరించడం జరిగింది. నేను కనుక ఆ కాలంలో జీవించి ఉంటే నీకు చాలా సహాయం చేయగలను' అని అన్నాడు. ఆ సంఘటన తరువాత కొద్ది కాలానికే వర్ఖా కాలధర్మం చెందాడట.

కాబా చూస్తూ కూర్చుంటే మనస్సు ఆనందడోలికల్లో తేలియాడుతోంది. ఏదో తెలియని సంతోషం. చాలా గర్వంగా వుంది. (చిన్న పిల్లలు తమ స్వంత ఇంట్లో, అమ్మ సమక్షంలో ఇంటి ఆవరణలో తిరుగుతుంటే ఆ పిల్లలకు ఎలాంటి ఫీలింగ్ వుంటుందో అలాంటి అనుభూతి నాకు కలిగింది. మా అమ్మ..... తేలప్రోలులోని ఇల్లు.... గుర్తుకు వచ్చాయి. ఇంట్లో వున్నట్లు వుంది. చిన్నప్పుడు మా ఇంటి ఆవరణలో ఆడుకున్నట్లు, తిరుగుతున్నట్లు అన్పించింది). ఒకటి కాదు రెండు కాదు 70 తల్లుల ప్రేమ పంచేవాడు అల్లాహ్ అని ఖురాన్‌లో వుంది. అది ఇప్పుడు నాకు స్పష్టంగా అనుభవంలోకి వచ్చింది. కడుపునిండా జమ్‌జమ్ తాగి గుండుపై జంజం నీళ్ళు పోసుకుంటే ఆ అనుభూతిని ఎలా వర్ణించాలో తెలియడం లేదు. సుబ్హానల్లా. యా రసూలల్లా. అయ్ పాక్ పర్వర్ దిగారే ఆలం హమేషా తేరీ రహ్మత్ బరసాదే అంటూ ఆకాశంవైపు తలపైకెత్తి అల్లాహ్‌ను వేడుకున్నాను.

# సౌర్ గుహ

దైవప్రవక్త ముహమ్మద్(స)ను హతమార్చడానికి చేయని ప్రయత్నమంటూ లేదు. ఇస్లాం విశ్వసించిన వారిపై యథాప్రకారం హింసా కాండ కొనసాగుతూనే వుంది. ముస్లింల జీవితాలు దుర్భరమై పోయాయి. దైవప్రవక్త(స) రోజు రోజుకు విషమిస్తున్న పరిస్థితి గమనించి, ఈ హింసా కాండ నుంచి బయటపడి ప్రశాంతంగా ధార్మిక జీవితం గడపడానికి ముస్లింలు మదీనా వలస పోయేందుకు అనుమతి ఇచ్చారు. ఈ అనుమతితో చాలా మంది ముస్లింలు పథకం ప్రకారం ఒక్కొక్కరుగా, జట్లు జట్లుగా మక్కా నుంచి బయటపడి రహస్యంగా మదీనా దారి పట్టారు.

ఇదంతా గమనించిన ఖురైషీయులు ఆగ్రహంతో అట్టుడికిపోయారు. వారి గుండెల్లో బెదురు పుట్టింది. తమకు ముస్లింలకు మధ్య భయంకర యుద్ధం సంభవించే సూచనలు కన్పిస్తున్నాయని భావించి హడలిపోయారు. దాంతో వారు 'దారున్ నద్వా'లో సమావేశమై తీవ్రంగా ఆలోచించారు. 'మనం ప్రతి తెగ నుంచి మంచి బలవంతుడు, ధైర్యసాహసాలుగల ఒక్కొక్క యువకుడ్ని ఎన్నుకోవాలి. వారందరికీ తలా ఒక ఖడ్గం ఇవ్వాలి. అవకాశం చూసి అందరూ ఒకేసారి ముహమ్మద్(స)పై విరుచుకుపడాలి. ఇలా అతని

చరిత్ర సమాప్తమవుతుంది. మనకు శాశ్వతంగా మనశ్శాంతి లభిస్తుంది. మన యువకులు అన్ని తెగలకు చెందిన వారయినందున హత్యానేరం అందరి మీద వుంటుంది. హాషిం సంతతివాళ్ళు సంఘటితమై తెగలన్నింటిని ఎదిరించి పోరాడలేరు. చివరికి గత్యంతరం లేక రక్త పరిహారం క్రింద వంద ఒంటెల్ని తీసుకోడానికి ఒప్పుకుంటారంటూ అబూజహల్ తన అభిప్రాయం చెప్పాడు. ఈ అభిప్రాయం అందరికీ నచ్చింది కాబోలు అందరూ తలలూపారు. బ్రహ్మాండంగా వుంది ఈ సలహా అంటూ అబుజహల్‌ను తెగ మెచ్చుకుంటూ కార్యాచరణకు దిగారు.

మరో వైపు ముహమ్మద్ ప్రవక్త(స)కు మదీనా వెళ్ళడానికి అల్లాహ్ నుంచి అనుమతి వచ్చింది. ఈ విషయాన్నే తన ముఖ్య అనుచరుడైన అబూబకర్‌తో చర్చించి ప్రయాణానికి ప్లాన్ రూపొందించారు.

మదీనా ఉత్తరం వైపుంది. మక్కా వదలిన ముహమ్మద్(స) మదీనా దారిలో వెళ్తారని శత్రువులు ఉత్తరం దిక్కుగా వెతుకుతారు. కాబట్టి తామెటు పోయిందో అర్థం కాని విధంగా పథకం రూపొందించారు. ఆయన ఈ పథకం గురించి అబూబకర్(ర)కు వివరించారు.

సౌర్ గుహ మక్కాకు దక్షిణ దిశగా మూడు మైళ్ళ దూరాన యమన్‌కు పోయే దారిలో ఉంది. మొత్తం ప్లాన్ వివరించి ముహమ్మద్(స) వెళ్ళిపోయారు.

మరో వైపు ఖురైషీయులు దైవప్రవక్త(స)ను అంతం చేయడానికి ఈటెలు, బాకులు తీసుకొని బయలుదేరారు. గాఢాంధకారంలో మక్కా నగరం ప్రశాంతంగా నిద్దురపోతోంది. నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ నేల వైపు కళ్ళు చించుకొని చూస్తున్నాయి. వీరందరూ ప్రవక్త ఇంటిని చుట్టుముట్టారు. ఎప్పుడు బయటికి వస్తే అప్పుడు మూకుమ్మడిగా దాడి చేసి ముక్కలు ముక్కలుగా నరికి వేయాలని మాటుకాసి కూర్చున్నారు.

దుర్మార్గుల పన్నాగం ప్రవక్త(స)కు తెలిసిపోయింది. ఆయన వెంట ఇంట్లో హజ్రత్ అలీ(ర) వున్నారు. అన్ని విషయాలు, తమ ప్లాన్‌ను అలీకు వివరించి కొన్ని బాధ్యతలు అప్పగించారు. తెల్లవారగానే మనింట్లో భద్రపరచిన వస్తువులన్నీ ఎవరివి వాళ్ళకు ఇచ్చెయ్యి. ఆ తరువాతే మదీనా వచ్చెయి.

ఆ రోజుల్లో స్థానిక ప్రజలే కాదు శత్రువులు సైతం తమ విలువైన వస్తువుల్ని ప్రవక్త ఇంట్లో సేఫ్టీ లాకర్‌లో దాచుకున్నట్లు భావించేవారు. మొహమ్మద్(స) నిజాయితీపరుడని వారంతా నమ్మేవారు. అందుకే అలీని ఎవరి వస్తువులు వారికి అప్పగించే

వరకు మక్కాలోనే వుండమని చెప్పారు. చివరి సారిగా దైవప్రవక్త(స) అలీ(ర)ని ఆలింగనం చేసుకొని దేవుడే నీకు రక్ష. అల్లా తలచుకుంటే వారు నిన్నేమీ చేయలేరు. మనం మళ్ళీ మదీనాలో కలుసుకుందాం. ఇక పోయి పడుకో' అన్నారు.

తరువాత ఆయన బయటికి వచ్చి నేల మీది మన్ను కొంచెం చేతిలోకి తీసుకున్నారు. దాన్ని అవిశ్వాసులపై విసిరేసి ఖుర్ ఆన్‌లోని యాసీన్ సూరా పఠిస్తూ వారి మధ్య నుంచే వెళ్ళిపోయారు. కాని అవిశ్వాసులెవరూ ఆయన్ని చూడలేక పోయారు.

తూర్పు దిక్కున ఆకాశంలో కారు చీకట్లను చీల్చుకుంటూ ఉషఃకాంతులు కూడా ఉబికి వస్తున్నాయి. శత్రువుల ఆరాటం ఎక్కువైంది. ఇక ఉండబట్టలేక చిన్నగా తలుపు సందు నుంచి లోపలికి తొంగి చూశారు. పడక మీద పచ్చ దుప్పటి కప్పుకొని పడుకొని ఉన్న ఆకారాన్ని చూసి అసహనంగా నిట్టూర్పు విడిచారు.

సరే ఇంకాస్సేపటికైనా బయటికి వస్తాడు కదా? అప్పుడు ఒక్క సారిగా అందరం విరుచుకుపడి పని పూర్తిచేద్దాం అంటూ ద్విగుణీకృత ఉత్సాహంతో నిరీక్షించసాగారు.

తెల్లవారింది. ఇంట్లో అయిన అలికిడికి వారు ఉలిక్కిపడి లేచారు. మరుక్షణం కత్తులు సిద్ధంచేసుకొని రక్తదాహంతో తహతహలాడుతు లేచారు. గబగబా అడుగులేసి మళ్ళీ తలుపు కన్నం నుంచి తొంగి చూశారు అంతే! లోపలి దృశ్యం చూసి కొయ్యబారి పోయారు. ప్రవక్త(స) పడక మీద దుప్పటి తొలగించుకుంటూ కొత్త ఆకారం కన్పించింది. శత్రువులు నిర్ఘాంతపోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. అలి బిన్ అబూతాలిబ్. ఇక్కడున్నాడేమిటి? మరి మొహమ్మద్(స) ఏమైనట్టు? మన కళ్ళుగప్పి మొహమ్మద్(స) పారిపోయాడా? నలుగురికి తెలిస్తే ఎంత అవమానం! మన పథకమంతా తల్లకిందులై పోయిందే! అయ్యయ్యో అంటూ ఆగ్రహంతో ఖురైషీయులు అలీ(ర) పై విరుచుకుపడ్డారు. రెచ్చిపోయిన వీరు అలీ(ర) బయటకు ఈడ్చుకువచ్చి అమానుషంగా కొట్టారు. ఎంత కొట్టినా హజ్రత్ అలీ(ర) తనకేమీ తెలియదనే చెప్పారు. ఇక లాభం లేదనుకున్న ఖురైషీయులు అలీని కాబాలో నిర్బంధించి హింసించడం మొదలెట్టారు. ఆఖరికి కొందరు బంధువుల జోక్యం వల్ల అలీ(ర)ని వారు వదిలేశారు.

దైవప్రవక్త ముహమ్మద్(స) మక్కా వదలి వెళ్ళిపోయారన్న వార్త పట్టణంలో దావానంలా వ్యాపించింది. ఖురైష్ నాయకులు ఆగ్రహంతో రగిలిపోయారు. మదీనా వైపు పరుగుపెట్టారు. ఎక్కడా ముహమ్మద్(స) జాడ దొరక్కపోవడంతో మక్కా నలువైపులా గాలించడం ప్రారంభించారు.

దైవప్రవక్త మొహమ్మద్(స) శత్రువుల కళ్ళుగప్పి మక్కా నుంచి బయట పడ్డారు. కొంత దూరం నడిచిన తర్వాత అప్రయత్నంగా నిలబడి వెనక్కి తిరిగి చూశారు. నక్షత్ర కాంతిలో ఆకాశం ఎంతో నిర్మలంగా, ఆ వెలుగులో మక్కా నగరం ఎంతో శోభాయమానంగా కన్పించింది. గత స్మృతులు గుర్తుకువచ్చాయి. తాను ఈ నగరంలోనే పుట్టి పెరిగారు. ఇక్కడే ఓ ఇంట్లో వివాహం చేసుకున్నారు. ఈ నగరంలోనే తనకు వహీ వచ్చింది. ఈ నగరం నుంచే తాను మెహరాజ్ వెళ్ళి దైవ సాన్నిధ్యం పొందారు. ఈ పవిత్ర క్షేత్రమే తన ధార్మికోద్యమానికి ప్రథమ వేదిక అయ్యింది. ఇలాంటి తన ప్రియ నగరానికి ఈ రోజు తాను వేరే మార్గం లేక వీడ్కోలు చెప్పవలసి వచ్చింది. ఆ జ్ఞాపకాలతో మనసు కకావికలమయిపోయింది. కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. హృదయవీణ మూగగా విలపించింది. స్వస్థల ఎడబాటును దిగమింగి కర్తవ్యోన్ముఖులయ్యారు మొహమ్మద్(స). చీకటిలో వేగంగా నడవ సాగారు. కొంత దూరం పోయిన తర్వాత మరో దారి నుంచి అబూబకర్ వచ్చి కలుసుకున్నారు. ఇద్దరూ చకచక అడుగులేస్తూ సౌర్‌గుహకు చేరుకున్నారు.

ఉదయకాంతులతో చీకటి తెరలు క్రమక్రమంగా విడిపోతున్నాయి. దైవ ప్రవక్త(స), అబూబకర్(ర) కలిసి నమాజ్ చేశారు. ఆ తరువాత హజ్రత్ అబూబకర్(ర) గుహలో ప్రవేశించి రాళ్ళు, ముళ్ళూ తీసేసి నేల శుభ్రం చేశారు. అక్కడక్కడ కన్నాలు ఉంటే గుడ్డపేలికలు చుట్టి వాటిలో పెట్టారు. తరువాత దైవప్రవక్త(స)ని లోపలికి తీసికెళ్ళారు. మొహమ్మద్(స) చాలా అలసిపోయారు. అందువల్ల ఆయన అబూబకర్(ర) తొడ మీద తలపెట్టి పడుకున్నారు. కాస్సేపటికి ఆయనకు నిద్ర పట్టింది. హజ్రత్ అబూబకర్(ర) గుహలోని కన్నాలన్నీ గుడ్డపేలికలతో మూసినా ఇంకో కన్నం మిగిలిపోయే ఉంది. దానికి ఆయన తన కాలి బొటన వ్రేలు పెట్టి మూసేశారు. అయితే కాస్సేపటికి ఆ కన్నంలో ఏం విష పురుగుందో గాని, అది అబూబకర్(ర) కాలికి కాటేసింది. కాని దైవ ప్రవక్త(స)కు నిద్రభంగం కలుగుతుందని భావించి ఆయన కదలకుండా బాధను ఓర్చుకుంటూ అలాగే కూర్చున్నారు. కాస్సేపటికి దైవప్రవక్త(స) మేల్కొన్నారు. చూస్తే అబూబకర్(ర) లోలోన ఏదో బాధపడుతున్నట్టు అన్పించింది.

అబూబకర్! ఏమయింది. ఏదో బాధపడుతున్నట్లు ఉన్నావు?

దైవప్రవక్తా! ఏమని చెప్పను? ఇదిగో ఈ కన్నం మూసేయడానికి కాలి బొటనవ్రేలు అడ్డం పెడ్తే విష పురుగేదో కరిచింది.

బాధపడకు. ముందు అక్కడ్నుంచి కాలు తీసెయ్యి అన్నారు దైవప్రవక్త.

హజ్రత్ అబూబకర్(ర) కన్నంపై నుంచి కాలు తీసి దగ్గరకు లాక్కున్నారు. వెంటనే కన్నంలో నుంచి భయంకరమైన ఓ త్రాచుపాము బయటికొచ్చి పడగవిప్పింది.

ఆ తర్వాత దైవప్రవక్త(స) తన లాలాజలం తీసి అబూబకర్(ర) కాలి బొటన వ్రేలిపై రాసి రుద్దారు. మరుక్షణమే పాము విషప్రభావం పోయి అబూబకర్ (ర)కు బాధ తగ్గిపోయింది. తరువాత దైవప్రవక్త(స) మళ్ళీ కొద్ది సేపు నిద్దురపోయారు.

కాస్సేపటికి ఓ సాలెపురుగు గుహ ముఖంపై గూడు అల్లింది. ఆ తరువాత ఎటు నుంచో వచ్చిన రెండు పావురాళ్ళు గుహద్వారం ముందు కిచకిచమంటూ ఎగరసాగాయి.

అటు ఖురైషీయులు ఎలాగైనా దైవప్రవక్త(స)ను పట్టుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వారు అడుగుజాడల్ని గుర్తించగలిగే మనిషి కోసం వెతికారు. చివరికి కుర్జ్ బిన్ అల్ఖమా అనే వ్యక్తి దొరికాడు. కుర్జ్ అడుగుజాడల్ని గుర్తించడంలో గొప్ప ప్రవీణుడు. సౌర్ పర్వతం నరరూప రాక్షసుల అరుపులతో దద్దరిల్లసాగింది. ఖురైషీయులు ఈలలు, అరుపులు, వికటాట్టహాసాలతో కర్రలు, కటారులు తిప్పుకుంటూ కుర్జ్ బిన్ అల్ఖమా వెంట వచ్చారు. ఆ సమయంలో దైవప్రవక్త(స) తనపై దాడి చేయడానికి వస్తున్న ముష్కరమూకల కేకలకు చలించకుండా ప్రశాంతంగా దైవధ్యానంలో నిమగ్నులై ఉన్నారు. కాని దుష్టుల అరుపులు దగ్గరయ్యే కొద్దీ అబూబకర్(ర) మనస్సులో మాత్రం ఆందోళన అంతకంతకు ఎక్కువ కాసాగింది. తన ప్రాణస్నేహితుడు, ప్రియతమ నాయకుడయిన ముహమ్మద్(స)ని కాపాడుకునే మార్గం ఏమిటి?

అయ్యో! నేను ముహమ్మద్‌ను నా హృదయంలో దాచుకోగలిగితే ఎంత బాగుండు! శత్రువుల కంటబడకుండా ఆయన్ని నా దేహంతో కప్పగలిగితే నేనెంత అదృష్టవంతుడ్ని! ఆయన హృదయం విలపించింది.

కుర్జ్ బిన్ అల్ఖమా ఎంతో జాగ్రత్తగా దారిలో పాదచిహ్నాలు చూసుకుంటూ కొండ మీదికి ఎక్కాడు. ఖురైషీయులు అతని వెనకాలగా నడుస్తున్నారు. కుర్జ్ కొండ మీదికి పోయి హఠాత్తుగా ఒక చోట ఆగాడు. తరువాత ఎటు పోవాలో అర్థంగాక అయోమయంలో పడిపోయాడు. అతని దేహం నుంచి చెమటలు కారుతున్నాయి. చివరికి అతను దిక్కుతోచక దిగాలుపడిపోయి నిలబడ్డాడు. అతని వాలకం చూసి ఖురైషీయులకు ఆశ్చర్యం, ఒకింత అనుమానం కూడా కలిగాయి. ఏమయింది? అకస్మాత్తుగా ఆగిపోయి అలా దిక్కులు చూస్తున్నావేమిటి?

వాళ్ళిద్దరు ఈ రాయి దాకా వచ్చారు. ఆ తరువాత ఎటు పోయారో తెలియడం

లేదు అన్నాడు కుర్జ్ ఎదురుగా ఉన్న ఓ రాతి వైపు చూపిస్తూ.

ఇబ్నె అల్ఖమా! ఈరోజు ఏమయింది నీకు? ఇలా ఇది వరకెప్పుడూ పొరపాటు చేయలేదు నీవు! అన్నారు ఖురైషీయులు..... వస్తున్న కోపాన్ని తమాయించుకుంటూ.

వారికి కొద్ది దూరంలో పశువుల్ని మేపుకుంటున్న ఓ పశువులకాపరి కన్పించాడు. ఖురైషీయులు అతని దగ్గరకు పోయి కొండ మీదికి ఇద్దరు మనుషులు రావడం చూశావా నువ్వు? అని అడిగారు.

నేనేవరినీ చూడలేదు. అదిగో ఆ గుహలో ఉంటారేమో చూడండి అన్నాడు పశువులకాపరి. కొండ ఎగువ భాగాన కొద్ది దూరంలో ఉన్న గుహ వైపు చూపిస్తూ.

ఖురైషీయులు వెంటనే పైకెక్కి గుహ వైపు వడివడిగా నడవసాగారు. అందరి చేతుల్లో కత్తులు, ఈటెలు, విల్లంబులు ఉన్నాయి. అందరి హృదయాల్లో ఒకే దీక్ష! ఒకే కాంక్ష!! ముహమ్మద్(స)ని వధించే అదృష్టం తనకే దక్కాలి. అంచేత గుహ దగ్గరవుతున్న కొద్దీ వారి ఆరాటం, ఆర్భాటాలు ఎక్కువ కాసాగాయి.

వారిలో ఒక యువకుడు అతి వేగంగా గుహవైపు పరుగెత్తాడు. కాని గుహ ఇంకా కొన్ని గజాల దూరం ఉందేమో. ఠక్కున ఆగిపోయాడు. రెండు క్షణాలు అటూ ఇటూ అయోమయంగా చూసి, నిరుత్సాహంతో వెనక్కి మరిలాడు. వెనకాల వడివడిగా అక్కడికి చేరుకున్న ఖురైషీయులు అతడ్ని చూసి విస్తుబోయారు.

గుహలోపలున్న అబూబకర్(ర)కు గుహ బయట కొద్ది దూరంలో ఉన్న శత్రువుల పాదాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. దాంతో ఆయన దైవ ప్రవక్త(స)కు ప్రమాదం ముంచుకొస్తుందేమోనని భావించి కంగారు పడసాగారు. దైవప్రవక్త(స) ధ్యానం ముగిసింది. ఆయన అబూబకర్(ర) ముఖంలోని ఆందోళనను గమనించి భయపడకు దేవుడు మనకు తోడున్నాడు అన్నారు ధైర్యం చెబుతూ.

ఖురైషీయులు ఆ యువకుని వైపు ఆశ్చర్యంగా చూస్తూ ఏమయింది వెనక్కి తిరిగావు, గుహలోకి తొంగయినా చూడకుండా అని అడిగారు ఆదుర్దాగా.

ఏమని చెప్పను? బహుశా అప్పటికి ముహమ్మద్ పుట్టనైనా పుట్టి ఉండడు. అప్పటి నుంచి గుహ మీద ఓ పెద్ద సాలెగూడు అల్లుకొని ఉంది. గుహ బయట రెండు పావురాళ్ళు గుడ్లు పెట్టి ఎగురుతున్నాయి. దారిలో ఓ పెద్ద చెట్టు కూడా ఉంది. ఇక అలాంటి గుహలో మనుషులు ఉంటారని ఎలా అనుకోను? అన్నాడా యువకుడు.

అతని మాటలు విని ఖురైషీయులు నీరుకారి పోయారు. చివరికి నిరాశా

నిస్పృహలతో చేతులు దులుపుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇళ్ళకు తిరుగుముఖం పట్టారు.

దైవప్రవక్త(స), అబూబకర్ సిద్దిఖ్(ర) ఈ గుహలోనే మూడు రోజులు వున్నారు. అబూబకర్(ర) కొడుకు అబ్దుల్లా(ర) పగలంతా నగరంలో తిరిగి ఖురైషీయులు మొహమ్మద్‌కు వ్యతిరేకంగా ఎలాంటి కుట్రలు పన్నుతున్నారో తెలుసుకొని రాత్రిపూట వచ్చి సమాచారం అందజేసేవారు. ఆయన చెల్లెలు అస్మా తండ్రికి, ప్రవక్త(స)కు అన్నం నీళ్ళు తెచ్చిచ్చేవారు. హజ్రత్ అబూబకర్(ర) సేవకుడు అమిర్ బిన్ పుహైరా మేకలను మేపుకుంటూ గుహ దగ్గరకు వచ్చేవాడు.

హజ్రత్ అస్మా(ర) తెచ్చిన అన్నం దైవప్రవక్త(స), అబూబకర్(ర) తినేవారు. ఆ తరువాత అస్మా(ర), అబ్దుల్లా(ర) గుహదగ్గర్నుంచి తిరిగి వెళ్ళేటప్పుడు శత్రువులు అడుగుజాడల్ని గుర్తించడానికి వీలులేకుండా ఉండేందుకు ముందు వారిద్దరు నడుస్తుంటే వారి వెనుక అమిర్ మేకలను తోలుకుంటూ అనుసరించేవాడు.

ఇలా మూడు రోజులు గుహలో గడిపి, అబ్దుల్లా(ర) సేకరించిన సమాచారాన్ని బట్టి శత్రువులు తమను వెంటాడటం మానేశారని నిర్ధారణ చేసుకున్నారు. అప్పుడు హజ్రత్ అబూబకర్(ర) కొడుకుతో నేను మన ఇంటి దగ్గర రెండు ఒంటెల్ని సిద్ధం చేసి ఉంచాను. నీవు వెంటనే పోయి, ఎవరికీ తెలియకుండా వాటిని తీసుకురా. వచ్చేటప్పుడు అబ్దుల్లా బిన్ అర్ఖత్‌ను కూడా పిలుచుకొనిరా? అని చెప్పి పంపించారు.

ఆ సాయంకాలమే అబ్దుల్లా(ర) గుహ దగ్గరకు తిరిగొచ్చారు. ఆయన వెంట అస్మా(ర), అమిర్ కూడా ఉన్నారు. వారి వెనకాల ఇబ్ను అర్ఖత్ ఒంటెలను తోలుకొని వచ్చాడు. ఇబ్నె అర్ఖత్ ముస్లిమేతరుడు అయినప్పటికీ అబూబకర్(ర)కు ఎంతో నమ్మకస్తుడు. అందువల్ల అబూబకర్(ర) అతనికి కొంత పైకం ముట్టజెప్పి తమను నిర్జన ప్రాంతం గుండా మదీనా తీసికెళ్ళటానికి మార్గదర్శిగా కుదుర్చుకున్నారు.

హజ్రత్ అస్మా(ర)ప్రయాణానికి కావలసిన సామానంతా సిద్ధపరిచారు. కాని అన్నం పాత్ర, నీళ్ళ తిత్తి బిగించి కట్టడానికి ఏమీ దొరక్క కాస్సేపు కంగారు పడ్డారు. తరువాత మెరుపు లాంటి ఆలోచన తట్టింది. వెంటనే ఆమె తన ఓణి తీసి బరబరా రెండు ముక్కలుగా చింపి వాటికి కట్టారు. ఆమె సమయస్ఫూర్తి చూసి దైవప్రవక్త(స) చిరునవ్వుతో జాతున్నితాఖైన్ (రెండు ఓణీల మహిళ" అని పిలిచి బిరుదిచ్చారు.

దైవప్రవక్త(స) ఒక ఒంటెమీద, ఆయన ప్రియ సహచరుడు మరో ఒంటె మీద కూర్చున్నారు. ఇబ్నె అర్ఖత్ తన సొంత ఒంటె మీద కూర్చున్నాడు. దారిలో ఎందుకైనా

ఉపయోగపడవచ్చని హ(జత్ అబూబకర్(ర) తన వెనుక సేవకుడు అమిర్‌ని కూర్చోబెట్టుకున్నారు. అలా ఈ నలుగురు కలసి నబవీ శకం 14వ సంవత్సరం రబీవుల్ అవ్వల్ ఒకటో తేదీ (క్రీ.శ.16-9-622)న ఇబ్నె అర్ఖత్ సారథ్యంలో నిర్మానుష్యంగా ఉన్న తీర(ప్రాంతం గుండా (ప్రయాణమయ్యారు.

హ(జత్ అబూబకర్(ర) వ్యాపారం కోసం అనేక (ప్రాంతాలు తిరిగి ఉన్నందున ఆయనకు దారిలో చాలా మంది పరిచయస్థులు తారస పడుతున్నారు. దారిలో ఒక మిత్రుడు అబూబకర్(ర) ముందు నడుస్తున్న దైవ(ప్రవక్త(స)ను చూసి అబూబకర్! ఎవరీయన? నేనిదివరకెప్పుడూ నీ వెంట ఈ మనిషి చూడలేదే!' అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ. ఈయన నాకు దారి చూపడానికి వచ్చిన మార్గదర్శి' అన్నారు అబూబకర్(ర).

ఈ బాటసారులు అలా (ప్రయాణం చేస్తూ హుజ్ఫా అనే (ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ దైవ(ప్రవక్త(స) ఓ సారి వెనక్కి తిరిగి మక్కాదారి వైపు చూశారు. అలా చూస్తుంటే ఆయన మనస్సులో కాబా లీలగా మెదిలింది.

స్వదేశస్థులే వెళ్ళగొట్టినా స్వదేశాభిమానంవీడని ఆయన హృదయం మరోసారి మూగగా విలపించింది. ముఖంపై ఉదాసీన ఛాయలు అలుముకున్నాయి. అప్పుడు దైవ దూత జి(బ్రీల్ (అలైహి) (ప్రత్యేక్షమై ఖురాన్ సూక్తులు విన్పించారు.

మ్యూజియం...

మ్యూజియం పక్కనే గిలాఫే కాబా తయారు చేసే ఫ్యాక్టరీ వుంది. బయటి నుంచి చూశాం. మ్యూజియం అద్భుతంగా వుంది. కాబాకు సంబంధించిన పూరాతన వస్తువులు అక్కడున్నాయి. కాబా తలుపులు, హైదరాబాద్ నిజాం గిఫ్ట్ చేసిన పలు వస్తువులు అక్కడున్నాయి. టేకుతో తయారు చేసిన మెట్లు, ఖురాన్ (ప్రతులు, జం జం బావిపైన వుండే (ఫేం, కాబాకు సంబంధించిన అమూల్యమైన, చారి(త్రాత్మక ఆధ్యాతిక సంపద చూడాలంటే మ్యూజియంను సందర్శించాల్సిందే. తరతరాల ఇస్లాం చరి(త్రకు ఈ మ్యూజియం అద్దం పడుతోంది.

# హజ్ యాత్ర (5 రోజులు)...

జిల్ హజ్ నెల 8వ రోజు నుంచి హజ్ యాత్ర ప్రారంభమవుతుంది. హాజీలు తెల్లవారుజామున ఇహ్రాం వస్త్రధారణలో తాము వున్న స్థలం మక్కా నుంచి మీనాకు ప్రయాణమవుతారు. మీనా ప్రాంతంలో జుహర్, అసర్, మగ్రిబ్, ఇషా ఐదు సార్లు నమాజ్ చేస్తారు. హజ్ చేయదలచిన స్థానికులు కూడా ఇదే రోజు ఇహ్రాం ధరించి మజ్జిదె ఖైఫ్ వద్ద నమాజ్ చేయడానికి తరలి వస్తారు. ప్రవక్త కాలంలో నిర్దేశించిన మీనాలోనే భారతీయ హాజీలకు వసతికల్పిస్తున్నారు. ఇది మన అదృష్టం.

2వ రోజు మీనాలో ఫజ్జర్ నమాజ్ అనంతరం అరాఫాత్‌కు ప్రయాణమవుతారు. అరాఫాత్‌లో జుహర్, అసర్ నమాజ్ ఒకేసారి చేస్తారు. జబలే రహ్మత్ అనే పర్వత గుట్టపై ప్రత్యేక దువా చేస్తారు. సూర్యాస్తమయం కాగానే మగ్రిబ్ నమాజ్ చేయకుండా ముజ్దల్ఫాకు ప్రయాణమవుతారు. ముజ్దల్ఫా చేరుకుని ఇషా, మగ్రిబ్ నమాజ్ చేస్తారు.

మీనా నుంచి అరాఫాత్ చేరుకోవడానికి హాజీలు కాలినడకన లేదా ఏదైన వాహనం మీద వెళ్ళవచ్చు. అక్కడికి వెళ్ళిన తరువాత నిమ్రాహ్ మసీద్ ఇమాం జుహర్, అసర్ నమాజ్ చేయిస్తారు. నమాజ్‌కు ముందు ఖుత్బా ప్రసంగం చేస్తారు. అందరూ ఏకాగ్రతతో విని ఆధ్యాత్మిక ఆనందం పొందుతారు. నమాజ్ తరువాత హాజీలు జబలే రహ్మత్ (అనుగ్రహ పర్వతం)ను దర్శించుకుంటారు.. అరాఫాత్‌లో ఉంటున్న సమయంలో హాజీలు కాబా వైపు తిరిగి చేతులెత్తి దుఆ చేస్తారు. అరాఫాత్‌లో కొంత సేపు మకాం చేయడం హజ్‌లో ఒక భాగం. అరాఫాత్ రోజు చాలా పవిత్రమైంది. అల్లా ప్రత్యేకించి దయార్ధ హృదయంతో హాజీల పట్ల కరుణ చూపిస్తాడు. స్వర్గం నుంచి విడివిడిగా క్రిందికి త్రోసివేయబడిన ఆదం, హవ్వాలు భూమిపై ఏళ్ల తరబడి సంచరిస్తూ ఒంటరి తనం నుంచి ఇక్కడే విముక్తి అవుతారు. ఆదం(అ) జబలేరహ్మత్  పర్వత గుట్టపై నుంచి దుఆ చేసి కిందికి రాగా హవ్వ(అ) కనిపిస్తారు. ఒకరినొకరు ఇక్కడే గుర్తుపడతారు. అందుకే హజ్ యాత్రలో ఈ ప్రాంతాన్ని సందర్శించడం ఒక భాగంగా మారింది.

సూర్యాస్తమయం కాగానే మగ్రిబ్ నమాజ్ చేయకుండా హాజీలు ముజ్‌దలఫాకు వెంటనే వెళ్లిపోతారు. అక్కడకు చేరుకొని ఒకే అజాన్‌తో మగ్రిబ్, ఇషా నమాజ్ చేస్తారు. ముజ్‌దలఫాలో డేరాలుండవు కాబట్టి ఎక్కడ వీలైతే అక్కడ వుండి రాత్రి విశ్రాంతి తీసుకోవాలి. ముజ్దలఫా పవిత్రమైన ప్రదేశం. స్వర్గం నుంచి భూమిపైకి వచ్చిన ఆదం, హవ్వలు ఒకరి జాడ మరొకొరు తెలుసుకోవడానికి కొన్ని ఏళ్ల పాటు భూమిపై వెతుకుతూ జబలే రహ్మత్

వద్ద కలుసుకొని ఆనందపడతారు. ఆ తరువాత వారు ఇరువురు కలిసి ముజ్దలఫా ప్రాంతానికి వెళ్తారు. ఎడబాటు మిగిల్చిన విరహవేదనను చల్లార్చుకుంటూ ఒకరిలో మరొకరు ఒదిగిపోతారు. విశాలమైన ఆకాశం కింద భూమిపై ఆదం-హవ్వాలు మొదటి రాత్రి గడుపుతారు. భూమిపై మనిషి పుట్టుకకు బీజం ఇక్కడే పడిందని ఖురాన్ స్పష్టం చేస్తోంది. హజ్ యాత్రకు వచ్చిన హాజీలంతా ముజ్దలఫాలో రాత్రంతా భగవంతుని ధ్యానంలో నిమగ్నమౌతారు. లక్ష షబేఖదర్ రాత్రులతో ఈ రాత్రి సమానమని ముస్లింలు భావిస్తారు. తెల్లవారుఝామున ఫజ్ర్ నమాజ్ అనంతరం జుమరాత్ షైతాన్‌పై రాళ్లు రువ్వడానికి ముజ్దలఫాలోనే 70 రాళ్లు ఏరుకొంటారు.

హాజ్ 3వ రోజు ముజ్దల్ఫాలో ఫజ్ర్ నమాజ్ అనంతరం మీనాకు ప్రయాణం. పెద్ద జుమరాత్ అకాబా వద్ద ఏడు రాళ్ళు రువ్వి ఆ తర్వాత ఖుర్బానీ ఇస్తారు. ఖుర్బానీ పూర్తి అయిన తరువాత శిరోముండనం చేయించుకుంటారు. ఆ తరువాత ఇహ్రాం వస్త్రాలను తీసివేస్తారు. మక్కా వెళ్లి కాబాను దర్శించుకొని తవాఫ్, సయీ పూర్తి చేసి మళ్లీ మీనాకు తిరిగివచ్చి రాత్రి విశ్రాంతి తీసుకుంటారు.

ముజ్దల్ఫా నుంచి మీనాకు తిరిగి వచ్చిన హాజీలు తమ సామాన్లను గుడారంలో పెట్టి జుమరాత్ అకబా సైతాన్ వద్దకు వెళ్ళాలి. ఒకసారి ఒకే రాయి చొప్పున ఏడు రాళ్లు రువ్వాలి. ప్రవక్త ఇబ్రాహీం ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి తీసుకువెళ్ళే రహదారిలో సైతాన్ ఇబ్రాహీం, ఇస్మాయిల్‌లను దేవుని మార్గం నుంచి తప్పించడానికి ప్రయత్నిస్తాడు. దేవుని ఆజ్ఞను ఉల్లంఘించమని విభేదాలు సృష్టించడానికి ఉసిగొలుపుతాడు. మూడు రూపాల్లో సైతాన్ చేసే ప్రయత్నాలను మూడు చోట్ల రాళ్ళతో కొట్టి త్యాగానికి సిద్ధమవుతారు. ఈ మూడు షైతాన్లను జుమ్రతె ఉఖ్బా, జుమ్రతె వస్తా, జుమ్రెతె ఊలా అంటారు. హజ్ యాత్రకు వచ్చిన హాజీలు ఈ షైతాన్‌పై రాళ్ళు విసరడం హజ్‌లో భాగంగా మారింది. షైతాన్‌పై రాళ్లు వేసిన తరువాత ఖుర్బాని ఇచ్చి శిరోముండనం, తరువాత స్నానం చేసి ఇహ్రాం తీసివేస్తారు. స్త్రీలు లాంఛనంగా కొన్ని వెంట్రుకల్ని కత్తిరించుకుంటారు. హాజీ మామూలు దుస్తులు వేసుకొని కాబా తవాఫ్ చేసి సఫా, మర్వాల మధ్య సయీ విధి పూర్తి చేస్తారు.

జిల్ హజ్ నెల 11, 12, 13 తేదీలు అంటే హజ్ 4, 5, తష్రీఖ్ రోజులు మీనాలోనే గడపాలి. మధ్యాహ్నకాలం తరువాత, మూడు జుమరాత్‌లపై ఏడేసి రాళ్ళు వేయాలి. మీనా నుంచి బయల్దేరితే హజ్ విధులన్నీ పూర్తి అయినట్లే. మీనా నుంచి మక్కా వెళ్ళి కాబా చుట్టు వీడ్కోలు ప్రదక్షిణ చేసి అల్లాకు కృతజ్ఞత తెలిపి, బంధుమిత్రుల్ని అభినందించుకుంటూ తిరుగు ప్రయాణమవుతారు.

**మక్కా నుంచి మీనా 5 కి.మీ.**

**మీనా నుంచి అర్ఫాత్ 12 కి.మీ.**

**అర్ఫాత్ నుంచి ముజ్దలిఫా 9 కి.మీ.**

**ముజ్దలిఫా నుంచి మీనా 3 కి.మీ.**

**మీనా నుంచి జుమరాత్ 2 కి.మీ.**

**మక్కా నుంచి అర్ఫాత్ 22 కి.మీ.**

**మక్కా నుంచి జుమరాత్ (షైతాన్) 7 కి.మీ.**

# 8 జిల్ హజ్

ముఅల్లిం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సు తెల్లవారుఝామునే మేము ఉన్న హోటల్ వద్దకు వచ్చింది. గుసుల్ చేసి ఇహ్రాం కట్టుకొని రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ చదివి హజ్ నియత్ చేసుకొని నేను వున్న రూం నుంచి “లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్” పఠిస్తూ మీనాకు ప్రయాణమైయ్యాం.

మీనాలో 30 మంది హాజీలకు ఒక గుడారం కేటాయించారు. ప్రతి హాజీకి ఒక బెడ్, దానితో పాటు ఇండియా పేరున్న ప్లాస్టిక్ కవర్‌లో కప్పుకోవడానికి బెడ్‌షీట్‌ను గిఫ్ట్‌గా ఇచ్చారు. ఫైర్ ప్రూఫ్ ఏసి గుడారమది. వెళ్ళిన వెంటనే ఫజ్ఞర్ నమాజ్ జమాత్‌తో కలిసి చదివి.... అలా నిద్రలోకి ఒరిగిపోయాను. జొహర్ నమాజ్ సమయమైందని పక్కన వున్న వారు లేపితే ఉల్కికిపడి లేచాను. వెంటనే గుడారం బయటికి వెళ్ళి వుజూ చేసి జమాత్‌తో కలిసి నమాజ్ పూర్తి చేశాను.

మా గుడారం ప్రక్కనే కింగ్ ఫాద్ పేరుతో కుబరి (బ్రిడ్జి) వుంది. దానిపై ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్ జాతీయ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. అదేమిటోగాని సౌదీ ప్రభుత్వం ఈ మూడు దేశాలకు చెందిన ముస్లింలకు మీనాలో ఒకే చోట బస ఏర్పాటు చేసింది. మీనాలో 8 జిల్‌హజ్ ఐదు నమాజ్‌లు చేయడం. సాధారణ నమాజ్‌తో పాటు దైవ ధ్యానంలో గడపడం తప్ప మీనాలో ఇతర కార్యక్రమాలు లేవు.

నేనున్న ఈ గుడారంలో రాజస్థాన్‌కు చెందిన హాజీలే వున్నారు. నా పక్కనున్న బెడ్‌పై అబ్దుల్ రషీద్ ఖాన్ వున్నారు. ఆయన వయస్సు 104 సంవత్సరాలు. శరీరం అంతగా సహకరించక పోయినా మనిషి చాలా యాక్టివ్‌గా వున్నారు. పోలీస్ శాఖలో డిజిపి హోదాలో రాజస్థాన్‌లో పని చేసి రిటైర్ అయ్యారట. వారి అమ్మమ్మ ఊరు హైదరాబాద్.

అందుకే నా మీద ఖాన్ సాహెబ్‌కు ప్రత్యేక ప్రేమ కలిగింది. నాతో చాలా ఆప్యాయంగా మాట్లాడుతూ వుంటే ఆయనతో వచ్చిన ఇద్దరు కూతుళ్ళు అల్లుళ్ళు కూడా నన్ను ఎంతో మంచిగా చూసుకున్నారు. ఇద్దరు అల్లుళ్ళు కూడా రిటైర్డ్ ప్రొఫెసర్లే. రషీద్ ఖాన్ గారు హైదరాబాద్ గురించి చాలా విషయాలు అడిగి తెలుసుకున్నారు. అధ్యాత్మిక విషయాలు చాలా చెప్పారు. మీనాలో ఎలా వుండాలి. ఏ దువా చదువాలో ఆయన నేర్పించారు.

*"సుబ్‌హానల్లజీ ఫిస్సమాఇ అర్‌షుహు సుబ్‌హానల్లజీ ఫిల్ అర్‌జి మౌతి ఉహు సుబ్‌హానల్లజీ ఫిల్ బహ్‌రి సబీలుహూ సుబ్‌హానల్లజీ ఫిన్నారి సుల్‌తానుహు సుబ్‌హానల్లజీ ఫిల్ జన్నతి రహ్‌మతుహు సుబ్‌హానల్లజీ ఫిల్ ఖబరి ఖజాఉహు సుబ్‌హానల్లజీ ఫిల్‌హవాఇరూహుహూ సుబ్‌హానల్లజీ రఫఅస్సమాల సుబ్‌హానల్లజీ వజఅల్ అర్‌జ సుబ్‌హానల్లజీ లా మల్‌జాల వలా మన్‌జాల ఇల్లా ఇలైహ్.* పఠిస్తూ అస్తగ్‌ఫార్‌తో పాటు దురూద్ చదవాలి. రాత్రి మీనాలో నిద్దురపోవడం సంప్రదాయం.(సున్నత్)

# 9 జిల్ హజ్.

ఫజ్జర్ నమాజ్ తరువాత అర్ఫాత్ వైపు ప్రయాణం. ఇందుకోసం ముఅల్లిం బస్సు ఏర్పాటు చేశారు. "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక్ లాషరీక లకలబ్బైక్, ఇన్నల్ హమ్‌ద వన్‌నిఅమత, లక వల్ ముల్క్, లా షరీక లక్" పఠిస్తూ మీనా నుంచి అర్ఫాత్‌కు ప్రయాణం.

మజ్జిదే నిమ్రా, జబలె రహ్మతె ఏదైనా ఒక స్థలంలోనైనా నమాజ్, దువా చేసే భాగ్యం కలిగించాలని అల్లాహ్‌ను మనసారా వేడుకున్నాను. అర్ఫాత్ మైదానంలో మాకు కేటాయించిన స్థలం వద్ద బస్సు ఆగింది. అక్కడ తాత్కాలిక గుడారాలు ఉన్నాయి. లోపలికి వెళ్ళి కూర్చున్నాం. వెంటనే వూజూ చేసి రెండు రకాత్‌ల నఫిల్ నమాజ్ చేసి బయటకు వచ్చాను. మజ్జిదె నిమ్రా వెత్కుంటూ వెళ్తుండగా జబలె రహ్మత్ గుట్ట కన్పించింది. అదృశాల్ని నా కెమెరాలో బంధించి దూవా చేసుకుంటూ త్వరత్వరగా ముందుకు కదిలాను. ఎటు చూసినా లక్షలాది జనం. రోడ్డు కిక్కిరిసి వుంది. ముందుకు వెళ్ళడం చాలా కష్టంగా అనిపిస్తున్నా మొండి ధైర్యంతో అల్లాహ్ కృప వల్ల మజ్జిదె నిమ్రా చేరుకున్నాను. నా ఆనందానికి ఇక హద్దులు లేవు. వూజూ చేసి మజ్జిదె నిమ్రాలోకి వెళ్ళాను. అతి కష్టం మీద స్థలం దొరికింది. అప్పటికే మజ్జిద్ ఇమాం ఖుత్బా చదువుతున్నారు. ఆ తరువాత పది నిమిషాలకు పైగా దువా చేశారు. ఆ తరువాత జుహర్, అసర్ నమాజ్ ఒకే సారి చదివించారు. చాలా తృప్తిగా అనిపించింది.

పద్నాల్గు వందల ఏళ్ళ క్రితం హజ్రత్ మొహమ్మద్ ముస్తఫా(స) ఇక్కడే లక్ష మంది అనుచరులతో ఈ నిమ్రా మజ్జిద్‌లోనే జొహర్, అసర్ నమాజ్ ఒకే సారిచేసి ఖుత్బా ప్రసంగం, దువా చేశారు. ఈ రోజు నాకు ఎంతటి అదృష్టం దక్కింది. "ఓ పాక్ పర్వర్ దిగారే అలంనే ఆజ్ ఉస్కే **ఫజల్ పర్ ఫజల్ కరా**" మనస్సు పులికించి పోయింది. కళ్ళల్లో నుంచి ధారళంగా ఆనందభాష్పాలు వచ్చాయి. హాజీలు ఒక్కొక్కరూ బయటికి వెళ్తున్నారు. నేను అక్కడే మజ్జిదె నిమ్రా లోపల ముసల్లాపైనే నడుం వాల్చాను. మళ్ళీ లేచి మజ్జిదె లోపల అంతా పరీక్షిస్తూ దువా చేసుకుంటూనే తిరిగాను. మధ్యాహ్నం మూడున్నర వరకు మజ్జిద్ లోపలే వుండి అస్తగఫార్, దరూద్, దువా చేసుకున్నాను. అర్ఫాత్ మైదానంలో మొహమ్మద్ ప్రవక్త ఆరు దువాలను పఠించారు.

*"లాఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లాషరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్‌దు వహువ అలాకుల్లి షైఇన్ ఖదీర్. అల్లాహుమ్మజ్ అల్ ఫీ ఖల్‌బి నూరవ్ వఫీ సమ్‌ఇ నూరవ్ వఫీ బస్‌రి నూరన్ అల్లాహుమ్మష్ రహ్‌లి నద్‌రి వయస్సిర్‌లి అమ్‌రి వఆఊజు బిక మిన్ వసావిసిస్ సదురి వషిత్తాతిల్ అమ్‌రి వఫిత్ నతిల్ ఖబ్‌రి అల్లాహుమ్మ ఇన్నీ అవూజుబిక మిన్ షర్రి మా యలిజు ఫిల్ లైలి వషర్రి మా యలిజు ఫిన్నహారి వషర్రి మా తహుబ్బు బిహిర్రియాహ్"*

అల్లాహ్‌కె సివా కోయి మాబూద్ నహీ. వొ అకేలా హయ్. ఉస్కా కోయి షరీక్ నహీ. ముల్క్‌కా మాలిక్ వహీ హయ్. తారీఫ్ భి ఉసీకె లియె హయ్. వొ హర్ చీజ్ పర్ ఖుద్‌రత్ రఖ్‌తా హయ్. యా అల్లాహ్ మేరె దిల్‌కో రోషన్ కర్దే ఔర్ మేరె కానోకో రోషన్ కర్దే ఔర్ మేరి ఆఖోకొ రోషన్ కర్దె. యా అల్లాహ్ మేరె సీనెకో ఖోల్‌దె. ఓర్ మేరె కామ్‌కొ మేరేలియె ఆసాన్ కర్దే. యా అల్లాహ్ మేరె సీనేకొ వస్‌వసో సె ఔర్ కామోకి పరేషానియోసె ఔర్ ఖబర్‌కె ఫిత్నేసే తేరి పన్హా చాహ్‌తా హు. యా అల్లాహ్ మయ్ తేరి పాక్ జాత్‌కె వసీలేస్ రాత్ కె షర్ ఔర్ దిన్‌కె షర్ సె ఔర్ హవావోకె షర్‌సె తేరి పన్హా చాహ్‌తా హు. ఆమీన్.......

*"లబ్బయ్‌క్ అల్లాహుమ్మ లబ్బయ్‌క ఇన్నమల్ ఖైరు ఖైరుల్ ఆఖిరతి రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతవ్ వఫిల్ ఆఖిరతి హసనతవ్ వఖినా అజాబన్నార్ షహీదల్లాహు అన్నహు లాఇలాహ ఇల్లాహువ వల్ మలాఇకతు వఉలుల్ ఇల్మి ఖాఇమమ్ బిల్‌ఖిస్త్"*

మౌలా గులామ్ తేరె దర్బార్ మె హాజిర్ హయ్. మౌలా భలాఇతో ఆఖిరత్ హీకి హయ్. మౌలా హమ్‌కొ దునియా ఔర్ ఆఖిరత్ మె భలాఇ అతాకర్. ఔర్ హమ్‌కొ దోజఖ్‌కి

ఆగ్‌సె బచాదె. అల్లాహ్ గవా హయ్ కె ఉస్కె సివా కోయి మాబూద్ నహీ. ఔర్ ఉస్కె ఫరిష్తేభి గవా హయ్. ఔర్ సబ్ జాన్నెవాలె సమఝ్‌దార్ లోగ్‌భి గవా హయ్.

*“అల్లాహుమ్మ లకల్ హమ్‌దు కల్లజీ తఖూలు వఖైరన్ మిమ్మా నఖూలు అల్లాహుమ్మలక సలాతి వనుసుకి వమహ్ యాయవమమాతి వ ఇలైక మఆబీ వలక రబ్బీ తురాసి అల్లాహుమ్మ ఇన్ని అఊజుబిక మిన్ అజాబిల్ ఖబ్‌రి వ వస్ వసతిస్ సద్‌రి వషితాతిల్ అమ్‌రి అల్లాహుమ్మ ఇన్ని అఊజుబిక మిన్‌షర్రి మాతజియ్యు బిహిర్రీహు”*

అయ్ అల్లాహ్ తేరెలియె అయ్‌సి తారీఫ్ హయ్ జైసి తూనె అప్ని తారీఫె ఆప్‌కి హయ్, ఔర్ బెహెతర్ ఇస్సె జొ హమ్ కర్తే హయ్. యా అల్లాహ్ మేరి నమాజ్, మేరి ఖుర్‌బానియా, నజర్ నియాజె, మేరా మర్నా జీనా ఔర్ మేరా మాల్ తేరేహిలియె హయ్. ఔర్ మేరా ఠికానాభి తేరేహి తరఫ్ హయ్. యా అల్లాహ్ మయ్ తేరి పాక్ జాత్‌కె తుఫేల్ ఖబర్‌కె దుఖ్‌సె సీనేకె వస్‌వసోసె కామ్‌కి పరాగన్‌దగీసె ఔర్ ఇస్ ఖరాబి ఔర్ తబాహీసె జొ హవాయె లేకర్ ఆతిహయ్ తేరి పనా చాహ్‌తాహు. ఆమీన్.

*“అల్లాహుమ్మ ఇన్నక తస్‌మఉ కలామి వతఅలము మకాని వతఅలమ్ సిర్రి వఅలానియ్యతి లాయఖ్‌ఫ అలైక షైఉమ్ మిన్ అమ్‌రి అనల్ బాఇసుల్ ఫఖీరుల్ ముస్‌తగీసుల్ ముస్‌తజీరుల్ ముష్‌ఫిఖుల్ ముఖిర్రుల్ ముఅతరీఫు బిజమ్‌బిహి అస్ అలుక మస్ అలతల్ మిస్‌కీని వఅబ్‌తహిలు ఇలైక ఇబ్‌తిహాలల్ ముజ్‌నబిజ్ జలీలి వఅద్‌ఉవక దుఆఅల్ ఖాఇఫి జరీరి మన్‌ఖజఅత్ లక రఖబ తుహు వ ఫఅజత్ లక ఐనాహు వజల్ల జసదుహు వరగిమ లక ఐనాహు వజల్ల జసదుహు వరగిమ లక అన్‌ఫుహు అల్లాహుమ్మ లాతజ్ అల్ని బిదుఆ ఇక షఖియ్యావ్ వకున్ బిరఊ ఫర్ రహీమన్ యా ఖైరల్ మస్ ఊలీన వయ ఖైరల్ ముఅతిఈన”.*

యా అల్లాహ్ తు మేరి బాత్ సున్తా హయ్ ఔర్ మేరె ఠికానె ఔర్ మేరి జాహిర్ వొ బాతిన్ సె వాఖిఫ్ హయ్. తుఝ్‌సె మేరి కోయి చీజ్ ఛుఫీ నహీ హయ్. తేరె దర్‌బార్ కా భికారి ఫరియాది పనాహ్ పకడ్నెవాలా డర్నెవాలా గునాహో కా ఇక్‌రార్ కర్నెవాలా హు. మయ్ ఏక్ అద్‌నా జలీల్ మిస్‌కీన్ బన్‌కర్ తేరె దర్బార్ మె ఆయాహు ఔర్ ఏక్ ఖార్ వొ రుస్వా గునేగార్ కి తర్‌హ తేరి తరఫ్ గిడ్‌గిడాతా హు. మయ్ తుఝుసె ఏక్ డర్నెవాలె ముసీబత్ జదకి తర్‌హ పుకార్తాహు జిస్కి గర్‌దన్ తేరె సామ్‌నె ఝుక్‌గఈ హయ్. జిస్కె ఆసు తేరె లియె నికల్ పడేహయ్. జిస్కా జిసమ్ తేరె లియె జలీల్ హోగయా, జిస్కి నాక్ తేరె లియె మిట్టీ మె మిలాదియా హు, యా అల్లాహ్ ముఝే అప్నె దర్‌బార్ సె ఖాలిహాత్

వాపస్ న భేజ్, మేరె సాథ్ షఫఖత్ ఔర్ మహెర్‌బాని ఫర్మా అయ్ మేరె బాదషా జిస్కా దర్‌బార్ మాంగ్నె వాల్కో కె లియె సబ్‌సె బడా దర్బార్ హయ్. ఔర్ జొ సబ్‌సె బెహతరీన్ దేనెవాలా హయ్ ఆమీన్.

*"అల్లాహు అక్‌బర్ వలిల్లాహిల్ హమ్‌ద్, అల్లాహు అక్‌బర్ వలిల్లాహిల్ హమ్‌ద్. అల్లాహు అక్‌బర్ వలిల్లాహిల్ హమ్‌దు లాఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లాషరీక లహూ లహుల్ ముల్‌కు వలహుల్ హమ్‌దు అల్లాహుమ్మహ్ దిని బిల్ హుదా వనఖ్ఖిని బిత్తఖ్వా వ్‌ఫిర్లి ఫిల్ ఆఖిరతి వల్‌ఊలా"*

అల్లాహ్ బహుత్ బడా హయ్. సబ్ తారీఫ్ ఇసీకె లియె హయ్. అల్లాహ్ బహుత్ బడా హయ్. సబ్ తారీఫ్ ఇసీకెలియె హయ్. అల్లాహ్ బహుత్ బడా హయ్. సబ్ తారీఫ్ ఇసీకె లియె హయ్. అల్లాహ్ కె సివా కోయి మాబూద్ నహీ, వొ అకేలా హయ్. ఉస్కా కోయి షరీక్ నహీ. ఉసీక రాజ్ పాట్ హయ్. ఉసీకె లియె తారీఫె హయ్. యా అల్లాహ్ ముఝె సీధె రాస్తేకి తరఫ్ హిదాయత్ కర్ ఔర్ గునాహోకె మైల్ కుచేల్‌సె పాక్‌సాఫ్ కర్ ఔర్ దునియా ఔర్ ఆఖిరత్ మె మేరె అయ్‌బ్ ఛుపాలె. ఆమీన్.

*"అల్లాహుమ్మజ్ అల్‌హు హజ్జమ్ మబ్‌రూరవ్ వజమ్ బమ్ మగ్‌ఫూరా"*

అల్లాహ్ మేరె హజ్‌కొ హజ్జె మగ్‌బూల్ కర్దె. ఔర్ ఇస్కె తుఫేల్ మేరె గునాహో కొ బఖ్‌ష్‌దె, ఆమీన్.

ఈ ఆరు దువాలు చదువుతూ జబలె రహ్మత్ కొండకు చేరుకున్నాను. "అల్లాకా లాక్ లాక్ బార్ షుకర్ ఆదా కర్తే హుయ్" **రెండు చేతులు పైకి ఎత్తి ఆకాశం వైపు చూస్తూ కన్నీళ్ళను ఆపుకోలేకపోయాను. ఎంతటి అదృష్టం. మజ్జిదె నిమ్రాలో నమాజ్, ఖుద్బా, దువాతో పాటు జబలె రహ్మత్ గుట్ట ఎక్కి దువా చేసే అదృష్టం అర్ఫాత్ రోజు నాకు కలిగింది. ఇది చాలా చాలా అరుదైన సంఘటనే. అల్లాహ్ నా మొర ఆలకించాడు. అర్ఫాత్‌లోని రెండు పవిత్ర స్థలాల్ని చుట్టిరావడం ఆ రెండు స్థలాల వద్దే అర్ఫా రోజంతా గడపడం అల్లాహ్ నాకు ఇచ్చిన అతి పెద్ద గిఫ్ట్.** ఈ కొండగుట్టపైనే ఆదాం(అ) దువా చేసి కిందికి రాగా హవ్వా(అ) కనిపించారు. ఆ సంఘటనల్ని గుర్తు చేసుకుంటూ కన్నులు పెద్దవిగా చేసుకొని జబలె రహ్మత్ గుట్టను, అక్కడున్న హాజీలను చూస్తూ కొండగుట్టపైకి ఎక్కాను. మనసు విప్పి అల్లాతో మాట్లాడుకుంటూ, దువా, అస్తగఫార్, తౌబా చేశాను. జీవితంలో ఇలాంటి రోజు మళ్ళీ మళ్ళీ రావాలని అల్లాహ్‌ను మనసారా వేడుకున్నాను.

# మొహమ్మద్ ప్రవక్త(స) ప్రసంగం

అది అరబ్ చరిత్రలోనే అపూర్వ సమావేశం. మొహమ్మద్ ప్రవక్త(స) ఒంటెపై కూర్చుని జబలె రహ్మత్ వద్ద చారిత్రాత్మక ప్రసంగం ఇలా సాగింది.....

అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనకు సాటి ఎవరూ లేరు. తన ప్రజలకు అల్లాహ్ సహాయం చేసి వాగ్దానం నిలబెట్టుకున్నాడు. ఆయన ఒక్కడే యావత్తు దుష్టశక్తుల్ని లొంగదీసుకున్నాడు. ప్రజలారా! వచ్చే సంవత్సరం నేనిక్కడ మిమ్మల్ని మళ్ళీ కలుసుకుంటానో లేదో తెలియదు. కాబట్టి నేను చెప్పేదంతా శ్రద్ధగా వినండి.

"మనవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీ పురుష జంట నుంచి పుట్టించాం. తరువాత మీ పరస్పర పరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాం. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయ భక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." అని సెలవిచ్చాడు దేవుడు ఖురాన్‌లో. కనుక అరబ్బీయుడిపై అరబ్బేతరునికి, అరబ్బేతరునిపై అరబ్బీయుడికి, తెల్లవాడిపై నల్లవాడికి, నల్లవాడిపై తెల్లవాడికి ఏ విధమైన ఆధిక్యత లేదు. ఆధిక్యతకు గీటురాయి దేవుని పట్ల భయభక్తులు కలిగి ఉండటమే. "ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే. తండ్రి ఒక్కడే. మీరంతా ఆదం(అ) సంతానం. ఆదం(అ) మట్టితో సృజించబడ్డారు. మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో అందరి కంటే ఉత్తముడు. కనుక ఆధిక్యతా ఔన్నత్యాలకు సంబంధించిన యావత్తు ప్రగల్భాలు, ధన ప్రాణాల ప్రతీకారాలకు సంబంధంచిన మొత్తం డిమాండ్లు ఇప్పుడు నా కాళ్ల కింద తొక్కివేయబడ్డాయి. అంటే నిషేధించబడ్డాయి. కాబా సంరక్షణ బాధ్యత, హాజీలకు నీటి సరఫరా సేవలు మాత్రం యథాతథంగా కొనసాగుతాయి".

ఖురైష్ ప్రజలారా! దేవుని సన్నిధికి ఇతర ప్రజలంతా పరలోక సామగ్రితో వస్తే మీరు మీ మెడలపై ప్రాపంచిక భారంతో రావడం జరగకూడదు సుమా! దురదృష్టవశాత్తు అలా జరిగితే దేవునిదగ్గర మీకోసం నేను ఏ విధంగానూ ఉపయోగపడలేను. ఖురైషీయు లారా! దేవుడు మీ గర్వాంధకారాన్ని అంతమొందించాడు. అంచేత మీ తాతముత్తాల ఘన కార్యాలను గర్వంతో గొప్పలు చెప్పుకోవడానికి ఇప్పుడు ఎలాంటి అవకాశం లేదు."

"ప్రజలారా! మీరు పరస్పరం మీ ధన ప్రాణాలను, మానమర్యాదలను నష్ట పరచుకోవడం శాశ్వతంగా నిషేధించబడింది. ఈ హజ్ దినాన్ని, ఈ జిల్‌హజ్ శుభమాసాన్ని, ఈ మక్కా నగరాన్ని మనం ఎలా గౌరవిస్తున్నామో వాటిని కూడా అలా గౌరవించవలసి ఉంటుంది. మీరందరూ ఒక రోజు దేవుని సన్నిధికి చేరుకోవలసి ఉంటుంది. అప్పుడు

దేవుడు మీ కర్మలను గురించి లెక్క తీసుకుంటాడు. జాగ్రత్త! నా తదనంతరం మీలో మీరే పోట్లాడుకొని మెడలు నరుక్కునే భ్రష్టులయి పోకూడదు".

ప్రతి ముస్లిం తోటి ముస్లింకు సోదరుడి లాంటివాడు. ముస్లింలంతా పరస్పరం అన్నదమ్ములు. మీరు సేవకుల పట్ల మంచిగా వ్యవహరించండి. వారికి మీరు తినే తిండే పెట్టండి. మీరు కట్టుకునే దుస్తులే కట్టబెట్టండి. అజ్ఞాన కాలం నాటి వడ్డీకి ఇప్పుడు ఎలాంటి విలువ లేదు. నా పిన తండ్రి అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ వంశానికి చెందిన మొదటి వడ్డీని నేను వదిలేస్తున్నాను. ఇప్పుడీ వడ్డీ చెల్లింపులు అంతమైపోయాయి.

"ప్రజలారా! ప్రతి హక్కుదారునికి అతని హక్కును దేవుడు స్వయంగా ఇచ్చేశాడు. కనుక ఇప్పుడు ఏ వారసుడి హక్కు కోసం కూడా వీలునామా వ్రాయకూడదు."

"పిల్లవాడు ఎవరి పడక మీద పుట్టాడో ఆ పిల్లవాడు అతనికే చెందిన వాడుగా పరిగణించబడతాడు. వ్యభిచార నింద నిరూపించబడిన వాడికి శిక్ష రాళ్ళతో కొట్టడమే. కర్మ విచారణ దేవుని దగ్గర జరుగుతుంది."

"అప్పును ఎట్టి పరిస్థితిలోనూ తిరిగి చెల్లించాలి. బదులుగా తీసుకున్న వస్తువును తిరిగిచ్చేయాలి. ఎవరైనా పారితోషికం ఇస్తే దానికి బదులు తీర్చాలి. ఎవరైనా ఎవరికైనా హామీ జామీను ఇస్తే అతను జరిమానా చెల్లించవలసి ఉంటుంది".

"ఏ ఒక్కడూ తన సోదరుడి నుంచి అతని ఇష్టానికి వ్యతిరేకంగా ఎలాంటి వస్తువుని తీసుకోకూడదు. అతను సంతోషంగా ఇస్తే తీసుకోవచ్చు. ఏ ఒక్కడూ తనపై తానుగాని, ఇతరులపై గాని దౌర్జన్యం చేయకూడదు".

"స్త్రీ తన భర్త సంపద నుంచి ఎలాంటి వస్తువుని కూడా అతని అనుమతి లేకుండా ఇతరులకు ఇవ్వడం ధర్మసమ్మతం కాదు".

"వినండి! మీ పై మీ భార్యల హక్కులు కొన్ని ఉన్నాయి. అలాగే మీ భార్యలపై మీ హక్కులు కూడా ఉన్నాయి. మీ భార్యలు..... మీరు ఇష్టపడని ఏ వ్యక్తినీ మీ ఇంట్లోకి రానీయకూడదు. ఇది భార్యలపై మీకున్న హక్కు. వారు ఎలాంటి నమ్మక ద్రోహానికి పాల్పడరాదు. ఎలాంటి సిగ్గుమాలిన పనికి ఒడిగట్టకూడదు. ఒక వేళ అలా చేస్తే వారికి శారీరక శిక్ష విధించడానికి దేవుని తరఫున మీకు అనుమతి ఉంది. వారా చేష్టల్ని మానుకుంటే, ఇక వారిని వేధించకుండా బాగా చూసుకోండి".

"స్త్రీలు మీ ఆధీనంలోని వారు కనుక వారి పట్ల సత్ప్రవర్తన కలిగి వుండండి. వారు తమకోసం ఏదీ చేసుకోలేరు. వారిని మీరు దేవుని పేరు మీద చేపట్టారు. దేవుని

పేరు మీదే వారు మీకు భార్యలుగా ధర్మసమ్మతం అయ్యారు. కాబట్టి వారి విషయంలో మీరు దేవునికి భయపడండి".

ఇలా మొహమ్మద్ ప్రవక్త(స) ప్రజలకు హితబోధ చేస్తూ పరస్పరం ఎలా మసలుకోవాలి, తోటి మానవులతో ఎలా వ్యవహరించాలి మొదలైన విషయాలు స్పష్టంగా తెలియజేశారు. ముఖ్యంగా ఆయన జాతి, తెగ, వర్ణ, వర్గ వివక్షలను, నిమ్నోన్నతా భేదభావాలను నిరసిస్తూ సమానత్వం, సౌభ్రాతృత్వాలను గురించి నొక్కి చెప్పారు.

చివర్లో ఆయన "ప్రజలారా! నేను దైవ సందేశాన్ని మీకు అందజేశానా? అని ప్రశ్నించినప్పుడు

"అందజేశారు మీరు" అని లక్షమంది హాజీలు ముక్తకంఠంతో అన్నారు. ఇది విని ప్రవక్త(స) దేవా! దీనికి నీవే సాక్షివి అని మూడుసార్లు అన్నారు. ఆ తరువాత ముజ్దల్ఫాకు ప్రయాణమైయ్యారు.

# ముజ్దల్ఫా

పడమర వైపుకు సూర్యుడు వాలిపోతున్నాడు. సూర్యాస్తమయం కావస్తోంది. మగ్రిబ్ నమాజ్ చేయకుండా ముజ్దల్ఫాకు ప్రయాణమవ్వాలి. బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్ళే వారితో రోడ్డు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయింది. నడుచుకుంటూ చాలా మంది హాజీలు ముజ్దల్ఫా వైపు ప్రయాణమవుతున్నారు. నేను నడుచుకుంటూనే హజ్ యాత్ర పూర్తి చేయాలనుకున్నా. అందుకే ముజ్దల్ఫా వైపు ఒంటరిగా నడక ప్రారంభించాను.

లక్షలాది మంది హాజీలు గ్రూపులు గ్రూపులుగా వెళుతున్నారు. ఆదృశ్యం ఇంకా నా కళ్ళల్లోనే మెదులుతోంది. హైదరాబాద్ నుంచి వచ్చిన స్నేహితులు ఎవరూ లేకపోవడంతో నేను ఇంత సేపు ఒంటరిగానే అర్ఫాత్ మైదానంలో తిరుగుతున్నా. అయితే తొమ్మిది కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి ముజ్దల్ఫా చేరుకోవాలి. ఎవరైనా తోడు వుంటే బాగుండేదనిపించింది. ఎవరూ తోడుగా లేకపోవడమే కలసి వచ్చిన అదృష్టంగా భావిస్తూ దారిపొడుగునా అల్లాహ్‌తోనే మనస్సులో మాట్లాడుకుంటూ నడక కొనసాగించాను. లక్షలాది మంది హాజీల మధ్య నాది ఒంటరి ప్రయాణం. గ్రూపులు గ్రూపులుగా తల్బియా చదువుతున్నారు. వారితో కలిసి నేను గొంతు కలుపుతూ అల్లాహ్‌తో మనసారా మాట్లాడుతూ నా ప్రయాణం కొనసాగింది.

దారిలో ఆకలిగా అనిపించింది. అక్కడ పది రియాళ్ళకు షీక్ ఖబాబ్ అమ్ముతున్నారు. రోటీ ఖబాబ్ తిని కడుపునిండా నీళ్ళుతాగి మళ్ళీ నడక కొనసాగించాను.

రాత్రి పది గంటలకు ముజ్దల్ఫా చేరుకున్నా. ముజ్దల్ఫా మసీదులో వెళ్ళి మగ్రిబ్, ఇషా నమాజ్ పూర్తి చేసి దువా చేసుకున్నాను. ఈ రాత్రి అంతా ముజ్దల్ఫా మైదానంలోనే వుండాలి. లక్షల మంది హాజీలున్నారు. వారిలో నేను ఒంటరిగా వున్నానా? ప్రపంచం అంతా ఇక్కడే కనిపిస్తోంది. ఆఫ్రికన్లు, చైనీయులు, మలేషియన్లు, ఇండోనేషియన్లు, ఇరానీ, యూరోప్‌కు చెందిన అందరూ ఇహ్రాం తెల్లటి దుస్తులో ముజ్దల్ఫా మైదానంలో అల్లాహ్‌ను ధ్యానిస్తూ కూర్చున్నారు. మరి కొంత మంది షైతన్‌పై విసరడానికి కావల్సిన చిన్న చిన్న రాళ్ళను ఏరుకుంటున్నారు. నేను రాళ్ళు ఏరుకున్నాను.

శరీరం బాగా అలసి పోయినట్లు అనిపిస్తోంది. ఓ నల్లటి మహిళ చైనా మ్యాట్ అమ్ముతూ మసీద్ వైపుకు వచ్చింది. పది రియాళ్ళు ధర చెప్పింది. ఆమెకు డబ్బులు ఇచ్చి ఆ మ్యాట్ తీసుకొని ముజ్దల్ఫా మైదానంలో నడుం వాల్చాను. ఆకాశం ఓపు చూస్తూ అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పాను. మనస్సులో ముజ్దల్ఫాకు చెందిన చరిత్ర గుర్తు చేసుకున్నాను.

ఈ రాత్రి చాలా పవిత్రమైన రాత్రి. లక్ష షబేఖదర్‌లతో సమానమట. స్వర్గం నుంచి భూమిపైకి వచ్చిన ఆదం, హవ్వలు ఒకరి జాడ మరోకొరు తెలుసుకోవడానికి కొన్ని ఏళ్ల పాటు భూమిపై వెతుకుతూ జబలే రహ్మత్ వద్ద కలుసుకొని ఆనందపడతారు. ఆ తరువాత వారు ఇరువురు కలిసి ముజ్దలఫా ప్రాంతానికి వెళ్తారు. ఎడబాటు మిగిల్చిన విరహవేదనను చల్లార్చుకుంటూ ఒకరిలో మరొకరు ఒదిగిపోతారు. విశాలమైన ఆకాశం కింద భూమిపై ఆదం-హవ్వాలు మొదటి రాత్రి గడుపుతారు. భూమిపై మనిషి పుట్టుకకు బీజం ఇక్కడే పడిందని ఇస్లాం మత గ్రంథాలు తెల్పుతున్నాయి. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన హాజీలంతా ముజ్దలఫాలో రాత్రాంతా భగవంతుని ధ్యానంలో నిమగ్నమౌతారు. లక్ష షబేఖదర్ రాత్రులతో ఈ రాత్రి సమానమని ముస్లింలు భావిస్తారు.

తెల్లవారుఝామున ఫజ్ర్ నమాజ్ అనంతరం జుమరాత్ షైతాన్‌పై రాళ్లు కొట్టడానికి ముజ్దలఫాలోనే 70 రాళ్లు ఏరుకొంటారు. 45 లక్షలకు పైగా హాజీలు ఇక్కడ వున్నారు. తహ్హజుద్ నమాజ్ కోసం ఆజాన్ ఇచ్చారు. వుజూ చేసి నమాజ్ చదివాను. జికర్, తజ్బీ ధ్యానంలో కూర్చున్నా. ఫజ్ర్ నమాజ్ ఆజాన్ ఇచ్చారు. జమాత్‌తో కలిసి ఫజ్ర్ నమాజ్ పూర్తి చేసి దువా తరువాత పదిహేను నిమిషాలు ముజ్దల్ఫా మసీదు ఆవరణలోనే కూర్చున్నా. హజ్‌లో భాగంగా ఇక మీనాకు వెళ్ళాలి.

తూర్పుదిక్కున సూర్యుడిరాకను ఆహ్వానిస్తూ నిర్మలమైన ఆకాశంలో అద్భుత రంగులు కనిపిస్తున్నాయి. చీకటి వీడుతూ ఉదయపు సూర్యకిరణాల వెలుగులో మక్కా కొండలు మెరిసిపోతున్నాయి. మాటలకు అందని అదో అద్భుత దృశ్యం కనిపిస్తోంది.

# షైతాన్‌పై రాళ్ళు.... 10 జిల్‌హజ్

చైనా మ్యాట్‌ను చుట్టి చిన్న ప్యాక్‌గా మార్చివేశాను. హాజీలంతా మీనా వైపు కదిలారు. ఒకే సారి లక్షలాది మంది కదిలారు. తల్బియా చదువుతూ... ముజ్దల్ఫా నుంచి జుమరాత్....షైతాన్ వున్న ప్రదేశం ఐదు కిలోమీటర్లు వుంది. ఈ దూరాన్ని కూడా నడుచుకుంటూ మీనా పరిధిలో ప్రవేశించాం.

*"అల్లాహుమ్మ హాజిహీ మినా ఫమ్‌నున్ అలయ్య బిమా మనన్ తిబిహి అలా ఔలియాయిక"*

అయ్ అల్లాహ్ యే మినా హై ఆప్ ముఝ్ పర్ వో ఇహ్‌సాన్ కీజియె జో ఆప్ అప్నే వలియో పర్ కియె హై....

తల్బియా చదువుతూ లక్షలాది మంది హాజీలతో నడుస్తూ షైతాన్ వైపుకు వెళుతున్నాం. ఏదో తెలియని భయం వేసింది. ఎప్పుడూ వార్తాల్లో చూసే ప్రదేశం ఇదే. షైతాన్‌పై రాళ్ళు వేసేటప్పుడు జరిగిన తొక్కిసలాటలో హాజీలు మృతి చెందటం.

నా ముందు-వెనుక లక్షలాది హాజీలు. అందరిలో ఉద్విగ్నత స్పష్టంగా కనిపిస్తోంది. మరి కొంత మంది షైతాన్‌పై రాళ్ళు వేయడానికి ఉద్రేకంగా వేగంగా నడక కొనసాగిస్తున్నారు. పెద్ద జుమరాత్ అకాబా వైపుకు హాజీలంతా వెళ్తున్నారు. మహాసముద్రం లాంటి హాజీల సమూహంలో నేను వడివడిగా అడుగులేస్తున్నాను.

సూర్యోదయం మొదలుకొని రెండవ రోజు ఉదయం వరకు మాత్రమే రాళ్ళు వేయాలి. ప్రవక్త ఇబ్రాహీం ఇస్మాయిల్‌కు బలి ఇవ్వడానికి తీసుకువెళ్ళే రహదారిలో షైతాన్ జోక్యం చేసుకొని ఇబ్రాహీం, ఇస్మాయిల్‌లను దేవుని మార్గం నుంచి తప్పించడానికి ప్రయత్నిస్తాడు. దేవుని ఆజ్ఞను ఉల్లంఘించమంటూ విభేదాలు సృష్టించడానికి ఉసిగొలుపుతాడు. మూడు రూపాల్లో షైతాన్ చేసే ప్రయత్నాలను రాళ్ళతో కొట్టి మూడు చోట్ల ఆ షైతాన్‌ను భూమిలో పూడ్చేస్తారు. ఈ మూడు షైతాన్లను జుమ్రతె ఉఖ్బా, జుమ్రతె వస్తా, జుమ్రెతె ఊలా అంటారు. హాజీలు ఈ షైతాన్‌పై రాళ్ళు విసరడం హజ్‌లో భాగంగా మారింది. అయితే.....

షైతాన్‌పై రాళ్ళు కొట్టడం గురించి మరో హదీస్ కూడా వుంది. అది ఏమిటంటే... కాబా గృహాన్ని నేలమట్టం చేయడానికి వచ్చిన 'అస్హాబిల్‌ఫీల్ (ఏనుగులవాళ్ళు) వచ్చి ఆగిన దానికి గుర్తుగా పాతిన రాతి స్థంభంపై గులకరాళ్ళు విసురుతూ తాము అల్లా సైనికులమంటూ అరబ్బీలో పఠిస్తారు.

పెద్దజుమరాత్ షైతాన్ వద్దకు చేరుకున్నాను. హాజీలు ఆవేశంతో రగలిపోతూ షైతాన్‌పై రాళ్ళు వేస్తున్నారు. ఆ ప్రాంతమంతా రాళ్ళ వర్షం కురుస్తుందా! అన్నట్లు వుంది. భయపడుతూ అటూ ఇటూ దిక్కులు చూస్తున్న నన్ను ఓ తుర్కిస్థాన్‌కు చెందిన హాజీ నా చెయ్యి పట్టుకొన్ని షైతాన్‌కు దగ్గరగా తీసుకువెళ్ళారు. ప్రశాంతంగా నిలబడి దువా చదువుతూ షైతాన్‌పై ఏడు రాళ్ళు వేయించారు.

*"అల్లాహు అక్బర్ అలా తాఅతిర్ రహ్‌మాని వరగ్‌మన్ లిషైతాని తస్‌దీఖన్ బికితాబిక వ ఇత్తిబాఅ లిసున్నతి నబీయ్యిక".*

అల్లాహ్ బడా హై. మై యే కంకర్ మార్తాహూ అల్లాహ్‌కే హుకుమ్ ఔర్ ఉస్‌కీ తాఅత్ కే తహత్ ఔర్ షైతాన్ మర్దూద్ కో జలీల్ కర్నేకేలియె ఔర్ అయ్ అల్లాహ్ ఆప్‌కే కితాబ్ కీ తస్దీఖ్ ఔర్ ఆప్‌కే నబీ(స) కీ ఇత్తెబాకే తహెత్ మార్తాహు.

రాళ్ళు కొట్టడం పూర్తి అయిన తరువాత అక్కడి దృశ్యాల్ని నా కెమెరాలో బంధించాను. సౌదీ పోలీస్ వచ్చి ఫోటో తీయవద్దంటూ రిక్వెస్ట్ చేసి చెబుతూ అక్కడి నుంచి నన్ను ముందుకు పంపించి వేశారు. రాళ్ళు కొట్టిన హాజీలంతా ఓ క్రమ పద్ధతి ప్రకారం ముందుకు వెళ్ళి ఆక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మార్గాల ద్వారా బయటికి వెళ్ళారు. సౌదీ ప్రభుత్వం చేసిన ఈ ఏర్పాటుతో ఎలాంటి ప్రమాదం జరగకుండా నివారించగలిగారు అనుకుంటూ మీనాలో నేను బసచేసిన గుడారం వైపుకు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూనే వెళ్లాను.

***ప్రస్తుతం హజ్ కమిటీ ముందుగానే హాజీ నుంచి ఖుర్బానీ డబ్బులు తీసుకొంటోంది. కాబట్టి మీరు నిర్ణయించిన సమయం ప్రకారం గుండు చేయించుకోవాలి.***

నేను 2008లో హజ్‌కు వెళ్ళినప్పుడు ఖుర్బానీ బాధ్యత హజ్‌కమిటీ తీసుకోలేదు. కాబట్టి ప్రైవేట్ వ్యక్తుల్ని నమ్మేబదులు నేనే స్వయంగా ఖుర్బానీ ఇవ్వాలనే కోరిక బలంగా నాకు కలిగింది. ఖుర్బానీ ఇవ్వాలంటే కబేళాకు వెళ్ళాలి. కబేళాకు వెళ్ళాలంటే ఎవరైనా తోడుగా వుండాలి. అందుకే స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడాను. కలిసి వెళ్దాం అన్నారు. మీనా గుడారానికి వచ్చి ఫోన్ చేస్తామన్నారు. గుడారం బయటే లైట్‌గా బ్రేక్‌ఫాస్ట్ చేసి నిద్దురపోయాను. జొహర్ నమాజ్‌కు లేచి నమాజ్ తరువాత షుజా, జాకీర్, సలీంభాషాతో కలిసి కబేళా వైపు బయలుదేరాం. రోడ్ అంతా ట్రాఫిక్ జాం. ఎటు చూసినా హాజీలతో నిండి వున్న వాహనాలే. కబేళా వైపు వెళ్ళడానికి ఎలాంటి ట్రాన్స్‌పోర్ట్ దొరకలేదు. అలా ముందుకు నడుచుకుంటూ ఐదు కిలో మీటర్లు వెళ్ళాం. అక్కడ ఒక వాహనం దొరికింది.

ఒక్కొకరు 20 రియాళ్ళు ఇచ్చి కబేళాకు చేరుకున్నాం. అక్కడ నాతో పాటు సమీ వాళ్ళ కోసం మేకల్ని కొని నేనే కోశాను. అలా ఖుర్బాని పూర్తి అయింది.

*"ఇన్ని వజ్జహతు వజ్‌హియ లిల్లజీ ఫతరస్ సమావాతి వల్‌అర్‌జ హానిఫవ్ వమాఅన మినల్ ముష్‌రికీన్ ఇన్న సలాతి వనుసుకి వ మహ్‌యాయ వ మమాతి లిల్లాహి రబ్బిల్ ఆలమిన్. లాషరీక లహు వబిజాలిక వఉమిర్‌తు వఅన అవ్వలుల్ ముస్‌లిమీన్. అల్లాహుమ్మ హాజమిన్‌క వలక తఖబ్బల్ మిన్ని కమా తఖబ్బల్‌త మిన్ ఇబ్రాహీమ ఖలీలిక బిస్మిల్లాహి అల్లహు అక్‌బర్".*

నాచేతులతో నేను ఖుర్బానీ ఇవ్వాలనే కోరిక ఇలా నెరవేరింది. చాలా సంతోషం అనిపించింది. కబేళా నుంచి మేం బయలుదేరే సరికి రాత్రి పది గంటలైంది. రోడ్డు మీద వచ్చి నిలబడ్డాం. అతి కష్టం మీద ఒక లారీ దొరికింది. మళ్ళీ ఒక్కొక్కరు 20 రియాళ్ళు కిరాయి ఇచ్చి లారీ ఎక్కాం. బంపర్ టూ బంపర్‌గా వాహనాలు రోడ్డుపై కదులుతున్నాయి. అంత ట్రాఫిక్ వుంది. ముజ్దల్ఫా పొలిమేరల్లో వున్న ఓ బ్రిడ్జిపై ఆ లారీ అతను మమ్మల్ని దింపి ఇక్కడి నుంచి  నడుచుకుంటూ వెళితే మీనా వస్తుందని చెప్పి ఉడాయించాడు.

టైం పన్నెండున్నర అవుతోంది. ఆకలి దంచివేస్తోంది. శరీరం సహకరించడం లేదు. ఇక నడవలేని స్థితి. దారిలో ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఓ హోటల్ వద్ద ఆగి బిర్యానీ తిన్నాం. కూల్‌డ్రింక్ తాగి మెల్లగా నడుస్తూ బయలుదేరం. తెల్లవారుఝామున రెండు గంటలకు మీనాలోని గుడారం వద్దకు చేరుకుని, తల వెంట్రుకల్ని తీసివేశాను. హజ్‌లో భాగంగా షైతాన్‌పై రాళ్ళు వేసిన తరువాత ఖుర్బానీ ఇచ్చి తల వెంట్రుకల్ని తీసివేయాలి. అది ఇప్పుడు పూర్తి అయింది. తలస్నానం చేసి ఇహ్రాం తీసివేసి మామూలు కుర్తా పైజామా ధరించి తహజుద్ నమాజ్ చేసి నడుం వాల్చాను. బాగా అలసిపోయి వుండటంతో వెంటనే నిద్దుర పట్టింది. ఫజ్జార్ నమాజ్ సమయం అయిందంటూ పక్కనున్న వారు తట్టి లేపారు. వెంటనే వుజూ చేసి జమాత్‌తో కలిసి ఫజ్జార్ నమాజ్ పూర్తి చేశాను.

# తవాఫె జియారత్  11 జిల్‌హజ్

ఇక తవాఫె జియారత్ చేయాల్సి వుంది. అందుకు కాబా వెళ్ళాలి. సమీ వాళ్ళ ఫ్యామిలీ, రాజస్థాన్ నుంచి వచ్చిన హాజీలు మేమంతా కలిసి మజ్జిదే హరంకు బయలుదేరాం. అతి కష్టం మీద టాక్సీ దొరికింది. ఒక్కొకరి నుంచి పదిహేను రియాళ్ళు వసూలు చేసి ఆ టాక్సీ అతను మజ్జిదె హరం వద్ద దింపాడు. కాబా తవాఫె, సఫా-మర్వా సయీ పూర్తి చేసి జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా నమాజ్ కాబాలోనే చదివాం. ఆ తరువాత ట్యాక్సీలో  మీనా

సమీపంలో దిగి అక్కడి నుంచి నడుచుకుంటూ జుమరాత్ షైతాన్ వద్దకు వచ్చాం. మూడు షైతాన్‌లకు ఏడేసి రాళ్ళ చొప్పున కొట్టి దువా చేశాం. హజ్‌లో భాగంగా రెండవ రోజు మూడు షైతాన్‌లకు కొట్టాల్సిన కంకర రాళ్ళు కొట్టి మీనాలోని గుడారం వైపుకు వెళ్ళాం. రాత్రి మీనాలోనే నిద్దురపోయాం.

# హజ్ చివరి రోజు..... 12 జిల్‌హజ్

మీనాలోనే మజ్జిదె కైఫ్ వుంది. ఎంతో మంది ప్రవక్తలు ఇక్కడే నమాజ్ చేశారు. వారి సమాధులు కూడా ఇక్కడే వున్నట్లు ఇస్లాం గ్రంథాలు తెలుపుతున్నాయి. అలాంటి మజ్జిదే కైఫ్‌లో నమాజ్ చేయాలనే కోరిక ఇంకా తీరలేదు. అందుకే ఫజ్జార్ నమాజ్ తరువాత నా దగ్గరున్న కొది పాటి లగేజ్ బ్యాగ్ తీసుకొని జుమరాత్ షైతాన్ వైపుకు ముందుగానే బయలుదేరాను. లెక్క ప్రకారం జొహర్ నమాజ్ తరువాత మూడు షైతాన్‌లకు ఏడేసి రాళ్ళు కొట్టాల్సి వుంది.

మీనా నుంచి రెండు కిలోమీటర్ల నడక తరువాత మజ్జిద్ కైఫ్ వచ్చింది. వుజూ చేసి మజ్జిదే కైఫ్‌లోని ప్రవేశించాను. అప్పటికే హాజీలతో కిక్కిరిసివుంది. మెల్లి మెల్లిగా ఒకొక్కొరిని దాటుకుంటూ ఇమాం సాహెబ్ నమాజ్ చేయించే ముసల్లా సమీపంలో కొంత చోటు అతి కష్టం మీద దొరికింది. ఆఫ్రికాకు చెందిన హాజీ కొంచెం కోపం ప్రదర్శిస్తూ నా వైపు చూశాడు. సలామాలేకుం అంటూ అతన్ని నవ్వుతూ పలుకరించాను. వాలేకుం స్సలామంటూ తనూ నవ్వి చోటిచ్చాడు. తన గురించి పరిచయం చేసుకొని ఎక్కడి నుంచి వచ్చారని అడిగాడు. ఇండియా నుంచి వచ్చాను అని చెప్పాను. ఇస్లాం గొప్పతనం హజ్ ప్రాధాన్యత, క్రమశిక్షణ గురించి చాలా విషయాలు ఆయన నాకు చెప్పారు. ఇండియా-పాకిస్తాన్ నుంచి హజ్ యాత్రకు వచ్చే యువకుల సంఖ్య ఎందుకు తక్కువగా వుంటుంది. చాలా మంది వృద్ధులే ఎందుకు వస్తారని ఆయన నన్ను అడిగారు.

ఇంతలో మజ్జిద్‌లో అరబిక్‌లో ఓ ప్రకటన వెలువడింది. నాకు అర్థం కాలేదు. ఆ ఆఫ్రికన్‌ను అడిగాను. షరియత్‌కు సంబంధించిన ప్రశ్నాలపై ముఫ్తిలు సమాధానాలిస్తున్నారు. అంతా అరబిక్‌లోనే ప్రశ్నా జవాబు నడుస్తోంది. మొత్తం మీద ఆధ్యాత్మిక ప్రసంగం మజ్జిదె కైఫ్‌లో అలా సాగింది.

జొహర్ నమాజ్‌కు ఆజాన్ ఇచ్చారు. నా కెమెరాలో ఆజాన్ మొత్తం రికార్డు చేశాను. సున్నత్ నమాజ్ తరువాత జమాత్‌తో కలిసి ఫరజ్ నమాజ్ పూర్తి చేసి దువా, అస్తగఫార్ అల్లాహ్‌తో మనసారా మాట్లాడుకున్నా.

ఇక బయటికి వచ్చి 'అల్ బేక్' డిష్, కూల్ డ్రింక్ తాగాను. షైతాన్‌పై రాళ్ళు రువ్వడానికి హాజీలతో కలిసిపోయి ముందుకు నడిచాను. మూడు షైతాన్‌లకు రాళ్ళు కొట్టి, దువా చేసి బయటికి వచ్చాను.

సౌదీ పోలీసులు రూట్ చెబుతున్నారు. కాబా వైపుకు ఎలా వెళ్ళాలి. వేరే ప్రాంతాలకు ఎలా వెళ్ళాలో సూచిస్తున్నారు. ఓ పోలీస్ వద్దకు వెళ్ళి జునూబియా ఎలా వెళ్ళాలని అడిగాను. అతను ఓ రూట్ చూపాడు.

రోడ్ అంతా ఎటు చూసిన విపరీతమైన ట్రాఫిక్. వాహనంలో వెళ్ళడం కంటే నడుచుకుంటూ వెళ్ళడమే మంచిదనిపించింది. దారి పొడుగునా ఫ్రూట్స్, కూల్‌డ్రింగ్‌లు, మంచినీరు పంచుతున్నారు. రెండు బత్తాయిలు, యాపిల్ తింటూ నడక కొనసాగించాను.

అరగంటలోనే అజీజియా చేరుకున్నా. కాని జునూబియా ఎలా వెళ్ళాల్లో తెలియక కొంత తికమక పడ్డాను. మేం వున్న బిల్డింగ్ సమీపంలో తులసీ ప్రైవేట్ జనరల్ హాస్పిటల్ వుంది. హిషారా(సిగ్నల్) వద్ద సౌదీ పోలీసును తులసీ హాస్పిటల్ అడ్రస్ అడిగితే రూట్ చెప్పాడు. జెస్ట్ ఒక రూట్ దాటగానే ఆ హాస్పిటల్ కనిపించింది. దాని ఎదురుగా వున్నదే దారుల్ అర్కాన్ హోటల్. ఈ బిల్డింగ్ ఎదురుగా వున్న మసీద్‌లో అసర్ నమాజ్, మగ్రిబ్ నమాజ్ చేసుకొని బయటికి వచ్చాను. సమీ ఫ్యామిలీ కూడా మీనా నుంచి దారుల్ అర్కాన్‌కు వచ్చారు. నాతో వున్న బ్యాగ్ రూంలో పెట్టి అలా కొద్ది సేపు కబుర్లు చెప్పుకున్నాం. అల్లా దయతో హజ్ పూర్తి చేసుకున్నాం. ఒకరికొకరు అభినందనలు చెప్పుకున్నాం. ఇషా నమాజ్ తరువాత జిద్దాలోని నా ఫ్రెండ్ ఇర్ఫాన్‌కు ఫోన్ చేశాను. రేపు, ఎల్లుండి హాలిడే. పొద్దునే లేచి వచ్చేయి అంటూ ఇర్ఫాన్ ఎలా రావాలో చెప్పారు. జిద్దాలో రెండు రోజులున్నాను.

## పవిత్ర ఖురాన్

ఖుర్ఆన్ అవతరణ(వహీ) ప్రారంభమైన తేది: క్రీ.శ. 12-2-610 రంజాన్ నెల శుక్రవారం.
ఖురాన్ మొత్తం అవతరించిన కాలం 22 ఏండ్లు, 5 నెలల, 14 రోజులు
ఖుర్ఆన్‌లోని మొత్తం అధ్యాయాలు (సూరాలు) : 114
ఖుర్ఆన్‌లోని మొత్తం సూక్తులు (ఆయత్‌లు) 6,236
ఖుర్ఆన్‌లోని మొత్తం పదాలు : 86,430
ఖుర్ఆన్‌లోని మొత్తం అక్షరాలు : 3 లక్షల 23 వేల 760
ఖుర్ఆన్‌లో మొత్తం ఫతన సజ్దాలు 15
దైవప్రవక్త (స)కు ఖుర్ఆన్ సందేశం (దివ్యావిష్కృతి) అందజేసిన దైవదూత:

హజ్రత్ జిబ్రీల్ (అ)

మూడవ ఖలీఫా కాలం వ్రాతప్రతుల్లో ఇప్పటికీ సురక్షితంగా ఉన్న రెండు ప్రతులు 1. తాష్కంట్ (రష్యా)లో, 2. ఇస్తాంబుల్ (టర్కీ)లో ఉన్నాయి.

అల్లాహ్ పేరు ఖుర్ఆన్‌లో 2 వేల 697 సార్లు వచ్చింది.

నూహ్ ప్రవక్త(అ) ప్రచారం చేసిన కాలం 950 సంవత్సరాలు.

మన తొలి ఆరాధనా కేంద్రం ఖిబ్లా : మజ్జిదుల్ అఖ్సా (బైతిల్ మఖ్దిస్).

ఖురాన్‌లో నమాజ్ ప్రస్తావన 700 సార్లు వచ్చింది.

చెడు జోలికి పోకుండా నిరోధించే సత్కార్యం నమాజ్. దుర్భర (నరక యాతనల నుంచి కాపాడగలిగే వ్యాపార విధానం ఈ సఫ్ (సైనిక పంక్తి 61:10, 11) అధ్యాయంలో ఉంది.

ఖుర్ఆన్‌కు సూరే యాసీన్ గుండెకాయ వంటిది.

దివ్యఖుర్ఆన్ మొహమ్మద్ ప్రవక్త(స) చేత రచించబడి పొందు పరచబడినది కాదు. ఒక తరం నుంచి మరో తరానికి వినికిడి ద్వారా అందించబడిన హితోపదేశాల కూర్పుకూడా కాదు. ఇదే గాక చరిత్ర పూర్వకమైన సంఘటనల గ్రంథం అంతకాన్న కాదు. మహా మహిమాన్వితుడైన అల్లాహ్ యొక్క లౌహుల్ మహ్‌ఫూజ్ అనే మహత్తు పూర్వకమైన సురక్షిత గ్రంథం. జిబ్రీల్(అ) ద్వారా ప్రవక్త హృదయ పీఠంపై అవతరింపజెయ్యబడి ఆయన నోటిగుండా పైకి వెలువరింపబడిన, పఠించబడిన అమృత తుల్యమైన, పరమ పవిత్రమైయిన ఆదేశాలను పొందుపరచబడిన గ్రంథం ఇది. ఇటువంటి విశ్వాసం – దృఢమైన నమ్మకం కలిగి ఉన్నారు ముస్లింలు.

*ఇన్నా ఆతయ్‌నా కల్‌కౌసర్ ఫసల్లి లిరబ్బిక వన్‌హర్ ఇన్న షానిఅక హువల్ అబ్‌తర్*

మానవులు, జిన్నులు ఒక్కటై దివ్య ఖుర్ఆన్ లాంటి దాన్ని దేన్నయినా రచించే ప్రయత్నాలు చేసినా, వారు అటువంటి దాన్ని రచించలేరు. వారందరూ కలసి పరస్పరం సహకరించుకున్నా సరే.

అల్ కితాబ్ – దివ్య గ్రంథం, హబ్‌లుల్లాహ్ – అల్లాహ్ పంపిన త్రాడు, అల్ బయాన్ – దివ్య వివరణ, అల్ బుర్‌హాన్ – విస్పష్టమయిన ఆధారం, అల్ మొహైమిన్ – రక్షక సాధనం, అల్ ముబారక్ – శుభదాయకం, అల్ ముసద్దిక్ – సత్యనిరూపణ, అల్ జిక్రా – సదుపదేశం, అన్నూర్ – దివ్యకాంతి, అల్ బసాయిర్ – జ్ఞాన ప్రకాశం, అల్ హుదా – సరళ మార్గం, అర్ రహ్‌మత్ – దైవ కారుణ్యం, అష్ షిఫా – సంజీవి, అల్ మౌఇజత్ – మంచి మాట, అల్ హుక్మ్ – న్యాయశాసనం, అల్ ముబీన్ – దేదీవ్యమానమైనది, విస్పష్టమైనది, అల్ అరబియ్యా – అరబీ భాషలోనున్నది, అల్ హిక్‌మత్ – విజ్ఞత, వివేచన,

అల్ హక్క్ – సత్యం, అల్ కయ్యుమ్ – సుస్థిరమయింది, అల్‌ఫుర్‌కాన్ – ప్రామాణికతా సాధనం, గీటురాయి, అత్ తన్‌జీల్ – దైవం తరఫున అవతరించినది, అవతరింప చేయబడింది, అల్ హకీమ్ – వివేచనా పూర్వకమయినది, అల్ జిక్ర్ – జ్ఞాపిక, అల్ బషీర్ – శుభవార్తనిచ్చేది, అల్ నజీర్ – హెచ్చరించేది, అల్ అజీజ్ – శక్తిమంతమయినది, అర్రూహ్ – జీవమున్నది, అల్ మజీద్ – గౌరవనీయమైంది, అల్ కరీం – ఘనత గలది, అల్ ముకర్రమా – ఆదరణీయమైనది, అల్ అజీబ్ – ఆశ్చర్యపూరితమైనది, అల్ మర్‌ఫూఆ – ఉన్నతమైనది, అల్ ముతహ్హార – పరిశుద్ధమైంది, అన్ నీమత్ – గొప్ప వరం.

ఇదే కాకుండా, ఖుర్‌ఆన్‌ను అరబీ మాటకు 'పఠించబడేది, పారాయణం చేయతగినది అనేదే అసలు అర్థం. "ఇది కంఠస్థం చేయతగినది, మోక్షప్రదాయిని" అన్న అర్థం కూడా ఉంది. అవును ప్రపంచ ప్రజానీకంలోని బుద్ధి జీవనుల మధ్య ఎక్కువగా పఠించబడేది ఈ దివ్య ఖురానే.

***మనిషి తోటి మనిషికి తలవంచనక్కరలేదు, మోకరిల్లి న్యూనత పడనవసరం లేదు, వంగి వంగి నమస్కారాలు చెయనవసరం లేదు అని ప్రబోధించి వ్యక్తి గౌరవానికి, మానవునిలో స్వతంత్రతా భావబీజాలు నాటి కొత్త బాట వేసింది ఖురాన్. అల్లాహ్ ఒక్కనికే తలవంచి నమస్కారం చెయ్యాలి అని ఆదేశించడం వల్ల ఏం జరిగింది?***

***సాటి మనషి పట్ల అధికారదర్ప ప్రదర్శన, మానవుని తెలివి తేటలను అణిచి వెయ్యగల ఆధిక్యత, భావ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛాయుత ఆలోచనల్ని నాశనం చేసే మానవ కట్టుబాట్లను ఖురాన్ తుడిచి వేసింది.***

***బానిసల శృంఖలాలని విరగగొట్టిన అల్ ఖుర్ ఆన్ మానవులందరూ సమానమే – అనే ఏక దృష్టితో, సమ దృష్టితో చూసింది. ఆ విధంగా చూడమని ప్రబోధించింది. మానవ జాతి అంతా ఒక్కటే అనీ, కుటుంబాలూ, కులాలు, తెగలూ అన్నీ పరస్పరం పరిచయ సాధనాలే అని ఖురాన్ స్పష్టం చేస్తోంది.***

***మనిషి పుట్టుక ఆధారంగా ఏర్పడిన ఆధిక్యత నుంచి విముక్తి కలిగించింది. సర్వ సమానత్వాన్ని బోధించింది. దైవం పట్ల భయభక్తులు అన్న విధిని ఒక్కటే శాసించింది. దేవుణ్ణి ఒక్కడినే పూజించండి, ఆయన శాసించిన కట్టుబాట్లనే అవలంబించండి" అని ఖురాన్ స్పష్టం చేస్తోంది. ప్రజలని పీడించే ప్రభుత్వం, వివేక రహితమైన శాసనం, ఆధిక్యతతో అధికారం చెలాయించే దుర్మార్గులు, యుద్ధాలు, వ్యాధిబాధలు, వృద్ధాప్యం, మరణం, దారిద్ర్యం, అవమానం, ధనప్రలోభం ఇటువంటి వాటిలో దేనిని చూసి ఆశపడకు, భయపడకు, అని మనిషిని శక్తిమంతునిగా, వీర పురుషునిగా తీర్చిదిద్ది అతను దృఢచిత్తంతో నిలబడగల***

*మార్పు తీసుకొస్తోంది ఈ దివ్య ఖురాన్ గ్రంథం. నీతిని, న్యాయాన్ని, రుజువర్తనాన్ని ఏ కారణం చేతా ఎటువంటి పరిస్థితుల్లోనూ విడిచి పెట్టరాదని ఖురాన్ చెబుతోంది. మానవస్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, సామాజిక సమానత్వపు చైతన్యం, నీతిమంతమైన, న్యాయవంతమైన ఆలోచనలు గల అపూర్వ పునాదుల్ని పరిపూర్ణంగా వివరించి, వాటి ఆధారంగా మానవ సమాజాన్ని నిర్మించింది దివ్యఖుర్ఆన్. "మానవ సృజన ఉన్నతమైన సృజన" అని నొక్కి చెప్పటమే కాదు, మానవుడు తన జీవిత కర్తవ్యాన్ని, బాధ్యతలని నెరవేర్చి, పరిపూర్ణ జీవితాన్ని తృప్తిగా జీవించాలి అని ఖచ్చితంగా చెప్పిన గ్రంథం దివ్య ఖురాన్ ఒక్కటే. జీవితం నుంచి భయపడి, పిరికితనంతో పారిపొమ్మని ఎక్కడా చెప్పలేదు. పలాయన వాదాన్ని సమర్థించలేదు, పూర్తిగా సంతృప్తిగా, సంపూర్ణంగా జీవితాన్ని జీవించు – అని నిర్దేశించి చెప్పింది దివ్య ఖురాన్.*

# హజ్రత్ ఆదం(అ) – చరిత్ర

హజ్రత్ ఆదం అలైహిస్సలాం 40 సార్లు హజ్ చేశారు. ఒక సారి ఎద్దుపై హజ్‌కు వెళ్ళారు. సబ్ హతుల్ మర్‌జాన్ గ్రంథంలో ఎద్దుపై హజ్ చేసినట్టు ఉంది. హజ్రత్ ఆదం వ్యవసాయం చేయడానికి అల్లాహ్ ఎర్రావు ఎద్దులను ప్రసాదించాడు. అంటే జంతువుల జన్మస్థలం కూడా మన భారతదేశమే అని రుజువౌతోంది. అందువల్లనేమో మన భారతదేశ ప్రజలు ఆవును పవిత్ర జంతువుగా పూజిస్తుంటారు. ఇది మొదట సృష్టించిన జంతువు కూడా అయి ఉండవచ్చు. ఈ జంతువును మొదటి ప్రవక్త అయిన ఆదం(అ) ఉపయోగించుకున్నారు.

అల్లాహ్ తన మొదటి ఖలీఫా, ప్రవక్త అయిన ఆదం అలైహిస్సలాంను భారతదేశంలోనే పంపించారు. అందుకనే మన భారతదేశాన్ని అల్లాహ్ తొలి రాజ్యంగా చెప్పవచ్చు. హజ్రత్ ఆదం అలైహిస్సలాం స్వర్గం నుంచి సరందీప్ ద్వీపంలోని వజ్‌నీ ప్రాంతంలో దిగారు. అది మన భారతదేశంలోని ప్రదేశమే కాబట్టి ఇబ్నెజరీర్(ర), ఇబ్నెహాతిమ్ (ర), ఇబ్నె అబ్బాస్ (ర) ఉల్లేఖనాన్ని నకలు చేశారు. అల్లాహ్ హజ్రత్ ఆదం(అలైహి)ను మొట్ట మొదట భారతదేశ భూభాగంపై అవతరింపజేశాడు. రెండవ చోట ఇలా వుంది. వజ్‌నీ ప్రాంతంలో దింపాడు. అది భారత దేశంలోని ప్రాంతమే. ఇబ్నె అబ్బాస్ ఉల్లేఖనంలోనే సరందీప్ వాక్యంఉంది.

హజ్రత్ ఆదం (అ) మొదట భారతదేశాన్నే తన స్వస్థలంగా చేసుకున్నారు. అంటే భారతదేశమే జనాభాకు పుట్టినిల్లని అర్థం. ఆదం(అ)తోనే జనాభా మొదలయింది. మొట్టమొదటి ప్రవక్త కూడా ఆదం(అ). కాబట్టి భారత దేశాన్ని మొట్ట మొదట నబువ్వత్ స్థలంగా పేర్కొనవచ్చు. చిట్ట చివరి నబువ్వత్ స్థలం హిజాజ్. ఎందుకంటే దైవ ప్రవక్త(స) జన్మ స్థలం హిజాజ్. మక్కా ప్రాంతాన్నంతా హిజాజ్ అని అంటారు.

స్వర్గం నుంచి ఇద్దరు మానవులు ఈ భూమిపైకి దిగారు. ఒకరు ఆదం(అ) ఆయన భార్య హవ్వా(అ). ఆదమ్(అ) భారతదేశంలో దింపబడితే హవ్వా హిజాజ్ భూభాగంపై దిగారు. అల్లాహ్ రూపొందించిన మొదటి చట్టం భారతదేశంలోనే అమలైంది. జిబ్రాయిల్(అ) మొట్ట మొదటి సారిగా భారతదేశానికే వచ్చారు. నబువ్వత్ శుభవార్త ప్రదేశం కూడా భారత్‌యే. మక్కాలో దైవప్రవక్త మొహమ్మద్(స) జన్మించారు. అంతే కాదు అక్కడ వహీ కూడా అవతరించేది. దివ్య ఖుర్ఆన్ కూడా అక్కడే అవతరించింది.

బనీ ఇస్రాయీల్ ప్రవక్తల జన్మస్థలం షామ్ దేశం కాబట్టి అది కూడా ప్రాముఖ్యతను కలిగి ఉంది. హజ్రత్ మూసా(అ) మిసర్‌లో జన్మించారని మిసర్ కూడా ముఖ్యమనుకోవచ్చు. మరి ఇరాక్ చూస్తే అక్కడ ఇబ్రాహీం అలైహిస్సలాం జన్మించారు. అది కూడా ముఖ్యమైన దేశమే. ఆదం(అ) కుమారుడైన షీష్(అ) కూడా భారత్‌లోనే జన్మించారు. ఆదం అలైహి తర్వాత ఆయనే ఖలీఫా అయ్యారు అని తిబ్‌రాని గ్రంథం ద్వారా రుజువౌతోంది. ఇతనే ఆదం(అ) జనాజా నమాజ్ చదివించారు. ఇబ్నెఅబ్బాస్ (ర) ఉల్లేఖనం ద్వారా హజ్రత్ నూహ్(అ) జన్మస్థలం కూడా భారతదేశమే కాబట్టి ఇంకా పవిత్రతను కలిగిన దేశం మనది. మన దేశంలోనే కొన్ని ప్రవక్తల సమాధులు కనుగొనబడ్డాయి. కాబట్టి మన భారతదేశం అల్లాహ్ తొలి రాజ్యం.

## విగ్రహారాధన ప్రారంభమైన తీరు

హజ్రత్ ఆదం(అ) మరణించిన తరువాత ఆయన కుమారుడు హజ్రత్ షీష్(అ) ఖలీఫా అయ్యారు. ఆయన మరణించిన తరువాత ఆయన మనుమల్లో ఒకరైన హజ్రత్ ఇద్రీస్(అ)ను దేవుడు తన ప్రవక్తగా నియమించాడు. ఆయన జీవన సరళి, ప్రజల పట్ల ఆయనకున్న ఎనలేని ప్రేమానురాగాలు, సమాజానికి ఆయన చేసిన నిస్వార్థమైన, నిష్కళంకమైన సేవ ఈ సుగుణాల వల్ల ఆయన జాతి వారు ఆయన్ని అమితంగా ప్రేమించేవారు. గౌరవించేవారు. చివరకు ఆయన కూడా ప్రపంచం నుంచి వెళ్ళిపోయారు. ప్రజలు ఎంతో విచారించారు. ఎంతో బాధపడ్డారు.

మానవ జాతికి బహిరంగ శత్రువైన షైతాన్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ, నిరాశా నిస్పృహలకు గురైన ఆ జాతి ప్రజల వద్దకు వెళ్ళాడు. తన వద్ద ఉన్న అద్భుత శక్తుల ద్వారా హజ్రత్ ఇద్రిస్(అ) చిత్రపటాన్ని తయారుచేసి ఇస్తానని, దాన్ని ఒక ప్రత్యేకమైన గదిలో భద్రపరచుకోవచ్చని, వారు బాధపడే అవసరం ఎంత మాత్రం లేదని షైతాన్ తన మాయలోకి జనాన్ని లాగాడు. ఇద్రీస్ జాతి ప్రజలు షైతాన్ విషవలయంలో చిక్కుకుపోయారు. ఫలితంగా ఇద్రీస్ బొమ్మ గీయబడిన కాగితం దేవుని రూపంగా, చిహ్నంగా మారిపోయింది.

అల్లాహ్ గృహమైన కాబా స్థాపన జరిగినప్పుడు మక్కా ప్రజలు సంఘటింతంగా లేరు. వారిలో క్రమశిక్షణ లేదు. సర్వత్రా అజ్ఞానం ప్రబలి ఉండటం వల్ల సరైన మార్గదర్శకత్వం లభించకపోవడం వల్ల అరేబియా ప్రజల్లో మూఢనమ్మకాలు చోటు చేసుకున్నాయి. హజ్రత్ ఇబ్రాహీం(అ) ప్రచారం చేసిన ధర్మబోధలు ప్రజల్లో వ్యాపించటం వల్ల ఆయన పట్ల, ఆయన కుమారుడు హజ్రత్ ఇస్మాయీల్(అ) పట్ల వారికి పరిపూర్ణమైన విశ్వాసం, అచంచలమైన నమ్మకం ఏర్పడ్డాయి. తరువాత క్రమేణా వారు సమైక్యమై, సంఘటితమై హజ్రత్ ఇబ్రాహీం(అ) నాయకత్వాన్ని అంగీకరించారు.

కాబా గృహం పట్ల  అరబ్బు ప్రజలకు ఎనలేని విశ్వాసం. అపారమైన అభిమానం ఉండేవి. కాబాను వారు అమితంగా ప్రేమించేవారు. తమ ప్రేమలో అంధులయ్యేవారు. కాని, వైపరీత్యమేమిటంటే వారు కాబా చుట్టూ ఉన్న రాళ్ళను కూడ అంతే ఎక్కువగా ప్రేమించారు. వ్యాపారరీత్యా గాని, మరొక పని కారణంగా కాని మక్కా నగరం నుంచి మరొక ప్రాంతానికి ఎప్పుడైనా ప్రయాణం చెయ్యటం జరిగితే, మక్కా చుట్టు పక్కలో ఉన్న చిన్న రాయి నొకదాన్ని తమతో తీసుకుపోయే వారు. ఈ 'మక్కా రాయి' తమ వెంట ఉండటం వల్ల వ్యాపారంలో నష్టం కలగదని వారి మూఢ నమ్మకం. హజ్రత్ ఇబ్రాహీం(అ), హజ్రత్ ఇస్మాయీల్(అ) మరణానంతరం కొంత కాలం తరువాత అజ్ఞానపు అరబ్బు ప్రజల్లో రాతి పూజ అతి వేగంగా వ్యాపించింది. అగ్నిపర్వతం బద్దలయినప్పుడు ప్రవహించే శిలాద్రవం పేరుకుపోయి గట్టి పడి ఒక విచిత్ర వస్తువుగా మారినప్పుడు, దాన్ని స్వర్గం నుంచి కరిగి భూమి పైకి ప్రవహించిన నక్షత్రాలుగా పరిగణించేవారు. ఏ రాయి అయినా సరే, అది గనక ఆకారంలో, ప్రమాణంలో వింతగా విచిత్రంగా గోచరిస్తే దాన్ని ఇంటికి తీసుకుపోయి ఆరాధ్య దైవంగా చేసుకుని పూజించేవారు.

తర్వాత క్రమక్రమంగా రాళ్ళను వివిధ రూపాల్లో, విభిన్న ప్రమాణాల్లో (కొన్ని మనోహరమైనవి, మరికొన్ని వికృతమైన రాక్షస రూపురేఖలు గలవి) చెక్కే హస్త కళ

ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఖబీలా(తెగ) నాయకుని అభిరుచి ప్రకారం ఆ విధంగా చెక్కబడిన రాతి విగ్రహాలు ఆరాధ్య దైవాలుగా పరివర్తన చెంది తమ తమ గుడారాలలో ప్రతిష్టింపబడేవి. మక్కాలోనూ, మక్కా పరిసరాల్లోనూ ఎన్నో తెగలు తమ నివాసాలను ఏర్పరచుకున్నాయి. అమర్ బిన్ లుహాల్ అనే ఒక ప్రముఖ వ్యాపారస్తుడు తన వాణిజ్య యాత్రను ముగించుకొని మక్కా పట్టణానికి తిరిగివస్తూ మార్గమధ్యంలో రాళ్ళను వివిధ రూపాల్లో తొలిచే ఒక ప్రాంతంలో విశ్రాంతి కోసం ఆగాడు. అందంగా, అపూర్వంగా చెక్కబడిన ఒక రాతి విగ్రహాన్ని చూసి ఆయన ముగ్ధుడయ్యాడు. దాన్ని తనకు విక్రయించమని ఆ శిల్పుల్ని అభ్యర్థించాడు. అపురూపమైన ఆ రాతి విగ్రహాన్ని తన స్వగ్రామంలో ప్రతిష్టిస్తానని అతడు వారికి తెలిపాడు. శిల్పులు ఆనందంతో పొంగిపోయారు. అమ్మటానికి బదులుగా వారు ఆ విగ్రహాన్ని ఆయనకు కానుకగా బహూకరించారు.

ఆ వ్యాపారస్తుడు ఆ విగ్రహాన్ని అక్కణ్ణుంచి మక్కాకు మోసుకు పోయి పవిత్ర కాబా గృహంలో సకల లాంఛనాలతో ఎంతో ఆడంబరంగా ప్రతిష్టించాడు. ఆ రాతి విగ్రహానికి 'హుబల్' (ప్రేమ మూర్తి) అని నామకరణం చేశాడు. కాబాలో ప్రతిష్టించిన విగ్రహాల్లో మొట్టమొదటిది 'హుబల్' విగ్రహం. ఆ కాలంలో మక్కా పట్టణంగాని, కాబా గృహంకాని... ఒక ప్రత్యేక తెగ లేక, ఒక ప్రత్యేక వ్యక్తి యొక్క ఆధిపత్యంలో ఉండేవి కావు. "బలవంతుడిదే రాజ్యం" అప్పట్లో మక్కాలో మరో రెండు రాతి విగ్రహాల ప్రతిష్టాపన జరిగింది. 'ఈసఫ్' మరియు 'నయలహ్' అనే ఈ విగ్రహాలు విశ్వవిఖ్యాతిగాంచిన జం జం బావి దగ్గర ప్రతిష్టించబడ్డాయి. ఇవిగాక చిన్న చిన్న విగ్రహాలు కూడా ఆవిష్కరించబడ్డాయి. మక్కా పట్టణ పరిసర ప్రాంతాల్లో మరొక మూడు అతి పెద్ద రాతి విగ్రహాలు ప్రతిష్టించారు. ఇవి అతి శక్తివంతమైన నాలుగు తెగల ప్రజలకు చెందినవి. "ఉజ్జా" విగ్రహం "ఖుర్‌సాయెహీస్" అనే తెగలకు చెందితే "లాత్" అనే రాతి శిల్పం తాయఫ్ మైదానంలో స్థిరపడిపోయిన "సకీఫ్" తెగకు చెందినది. మదీనా పట్టణంలోని "మన్నత్" విగ్రహం "ఔస్" మరియు "ఖుజ్‌రజ్" అనే తెగకు చెందినది.

"దేవుడు ఒక్కడే" అనే అపూర్వ "తౌహీద్" సిద్ధాంత ప్రచారం కోసం నిర్మాణమైన పరిశుద్ధ దైవ గృహమైన కాబా, విభిన్న రూపాలు ప్రమాణాలున్న రాతి విగ్రహాల ప్రదర్శనశాలగా మారిపోయింది. లాభాలు సంపాదించటానికి, శక్తిని, ఆరోగ్యాన్ని పొందటానికి శాంతి సంక్షేమాలు సిద్ధించటానికి దేవుణ్ణి ఆశ్రయించటం అనివార్యమని ప్రజలు విశ్వసించేవారు. రాతి విగ్రహాల ద్వారానే దేవుణ్ణి ఆశ్రయించటం సాధ్యమని, అవి దైవ సాన్నిధ్యంలో సిఫారసు చేస్తాయని, తద్వారా మానవుల కష్టాలు, నష్టాలు, దు:ఖాలు తీరుతాయని నమ్మేవారు. కాని

మక్కా పరిసరాల్లో ఎక్కడా ప్రజలు ఒక దేవాలయాన్ని గాని, లేదా ఒక కట్టడాన్నిగాని నిర్మించటానికి ప్రయత్నం చెయ్యలేదు. కాబా గృహం ఉండగా మరొక భవనాన్ని నిర్మించాల్సిన అవసరం లేదనే ప్రగాఢ నమ్మకం వారికి ఉండేది.

# మొహమ్మద్ పూర్వీకులు-కాబాతో సంబంధాలు

హజ్రత్ ఇస్మాయిల్(అ) వంశానికి చెందిన 'కిలాబ్' కుమారుడైన 'కుసాయ్' సర్దారుగా పరిపాలనా బాధ్యతల్ని స్వీకరించాడు. ఖురేషు తెగవారితో ఆయనకు బంధుత్వపు సంబంధాలు ఉండేవి. శాంతిభద్రతల పునరుద్ధరణ కోసం, మంచి పాలనను ప్రజలకు అందించే విషయంలో ఆయనకు ప్రముఖ తెగలన్నీ తమ తమ సహాయ సహకారాలను అందించాయి. "దారుల్ నద్వా" అనే కమ్యూనిటీ హాలును నిర్మించే గౌరవం కుసాయ్‌కే దక్కింది. ఎందుకంటే అది పెద్ద సాహసంతో, దూరదృష్టితో కూడుకున్న చర్య, విజ్ఞులు, అనుభవజ్ఞులై విద్యావంతులు ఈ హాలులో సమావేశమై ప్రజలకు సంబంధించిన వ్యవహారాలను, సమస్యలను పరిష్కరించేవారు. ప్రజలకు కావలసిన మౌలిక అవసరాల గురించి చర్చలు జరిపేవారు. ప్రజల పురోభివృద్ధికి సూచనలు చేసేవారు. వివాహానికి, విడాకులకు సంబంధించిన తగాదాలు, వివాదాలు ఈ హాలు ప్రాంగణంలోనే పరిష్కారమైయేవి. ఈ హాలులో జరిగే నిర్ణయాలకు "తీర్పు" లేక 'డిక్రీ' హోదా ఉండేది. సంబంధిత వ్యక్తులే కాదు మొత్తం సంఘమే ఈ తీర్పులను, డిక్రీలను శిరసావహించేది.

మంచి పరిపాలనా దక్షతగల కుసాయ్ తొందరగానే ప్రజల నమ్మకాన్ని చూరగొన్నాడు. శాంతిభద్రతలు స్థాపించాడు. ప్రజలు సుఖంగా జీవిస్తున్నారు. ఆయన ఖురేషు తెగలోని విజ్ఞుల్ని, ఇతర తెగలలోని వివేకవంతుల్ని ఈ హాలులో సమావేశపరిచి, సంవత్సరంలో ఒకసారి కాబా గృహానికి ప్రార్థనలు చేయటానికి దూరప్రాంతాల నుంచి వచ్చిపోయే యాత్రికుల కష్టాలను, అసౌకర్యాలను వారి ముందు పెట్టాడు. సుదీర్ఘమైన చర్చలు జరిపి వారి ఆమోదంతో మక్కాకు వచ్చే యాత్రికుల యోగక్షేమాలను విచారించటానికి, వారికి సకల సౌకర్యాలను కలిగించటానికి ఆయన ఈ మూడు సమన్వయ సంఘాలను ఏర్పాటు చేశాడు.

1. 'సఖాయ' – ఇది దూర ప్రదేశాల నుంచి ఒంటెలపై నీరు తీసుకువచ్చి కాబా యాత్రికులకు అన్ని వేళల్లో సప్లయి చెయ్యటం. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించటం సకాయ బాధ్యత.

2. 'రిఫాద' – ఖురైషు తెగవారు ఈ సంఘంలో సభ్యులుగా వుంటారు. మీనా, మక్కాల వద్ద యాత్రీకులకు సకల వసతులను ఏర్పాటు చేయటం, భోజనం వంటి ఇతర అవసరాలను తీర్చటం కోసం ఈ సంఘం సభ్యులు ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశారు.
3. 'హిజాబా' – కాబా గృహ సంరక్షణ ఈ సంఘం బాధ్యత. కాబా గృహంలోకి ప్రవేశించే వారు ఈ కమిటీ అనుమతిని తప్పనిసరిగా పొందాలి. కాబాను పరిశుభ్రంగా ఉంచటం, దాని పవిత్రతను కాపాడటం ఈ సంఘం సభ్యుల విధి.

ఈ మూడు కమిటీలు కుసాయ్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పనిచేసేవి. ఆయన వాటికి ఆదేశాలు జారీ చేస్తూ ఉండేవారు. వృద్ధాప్యం కారణంగా కుసాయ్ మొత్తం పరిపాలనా బాధ్యతల్ని తన జ్యేష్ట పుత్రుడైన అబ్దుల్ జర్‌కు అప్పగించాడు. కాలక్రమేణా పరిపాలన అబ్దుల్‌జర్ నుంచి అతని కుమారుల చేతుల్లోకి వెళ్ళి పోయింది. లెక్కకు వారు కొంత మంది మాత్రమే. అయితే కుసాయ్‌కి అబ్దుల్ మునాఫ్ అనే మరొక కుమారుడు ఉండేవాడు. అతనికి చాల మంచి కొడుకులు ఉండేవారు. వారు అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి అబ్దుల్ జర్ కుమారులకు వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రకటించారు. విజ్ఞత, దూరదృష్టి ప్రదర్శించటం వల్ల ఇరు పక్షాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం 'సకాయా' 'రిఫాదా' కమిటీలు మునాఫ్ కుమారుల వశమైయాయి. అబ్దుల్ జర్ పుత్రులకు 'హిజాబా' కమిటి లభించింది.

అబ్దుల్ మునాఫ్ పెద్ద కుమారుడైన హాషిమ్ దాతృత్వపు స్వభావం కలవాడు. సమాజంలో మంచి పేరు ప్రతిష్టలుకల వాడు. కాబా సందర్శనార్థం మక్కాకు వచ్చే యాత్రీకులకు స్వయంగా వెళ్ళి స్వాగతం పలుకుతూ, వారి భోజన సదుపాయాలను స్వయంగా పర్యవేక్షించేవాడు. దూరదృష్టిగల ఈయన మక్కా నగర ఆర్థిక ఆదాయాన్ని పెంచటానికి ఎన్నో కొత్త ప్రణాళికలను ప్రవేశపెట్టారు. అలా పెరిగిన ఆదాయాన్ని హజ్ యాత్రీకుల సౌకర్యాలను పెంచటానికి వ్యయపరచాడు. దేశంలోని విభిన్న ప్రాంతాల వ్యాపార నిమిత్తం వెళ్లే వాణిజ్య బృందాల సురక్షిత ప్రయాణానికి సముచితమైన ఏర్పాట్లు చేశాడు.

మంచి వ్యాపార అనుభవంగల హాషిమ్ వ్యాపారం చేయటానికి సరుకులు తీసుకుని సిరియా దేశానికి వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో ఆయన మదీనా పట్టణంలో కొంత సేపు విశ్రాంతి కోసం మజిలీ చేశారు. అక్కడ ఆయన 'యస్రబ్' వ్యాపారస్తుల్ని కలుసుకున్నారు. తమను వ్యాపారం కోసం పంపిన 'సల్‌మా' అనే స్త్రీని గురించి వారు ఆయనకు తెలిపారు. ఆమె గుణగణాలను గురించి, శక్తి సామర్థ్యాలను గురించి విని హాషిమ్ ముగ్ధుడయారు. తనను వివాహం చేసుకోమని రాయబారం పంపారు. ఈ వివాహ సంబంధాన్ని ఆమె

వెంటనే అంగీకరించారు. హాషిమ్ సల్మాల వివాహం అత్యంత వైభవోపేతంగా జరిగింది.

వేసవి కాలంలో ఆయన మరొకసారి వ్యాపార నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు ఆయన సిరియాకు దగ్గర్లో ఉన్న 'గాజ' అనే గ్రామం వద్ద తీవ్ర అస్వస్థతకు గురై మరణించారు.

హాషిమ్ సోదరుడైన ముత్తలిబ్ పరిపాలనా బాధ్యతల్ని చేపట్టారు. హాషిమ్ కుమారుడైన షోయబ్ తన తల్లి సల్మాతో యస్రిబ్‌లో ఉంటున్నారు. పరిపాలనా వ్యవహారాల్లో శిక్షణ పొందే నిమిత్తం షోయబ్‌ను తన వద్దకు పంపవలసిందని ముత్తలిబ్ సల్మాను కోరాడు. దానికి ఆమె అంగీకరించారు.

షోయబ్‌తో మక్కాకు తిరిగి వస్తున్న ముత్తలిబ్‌ను చూసి ప్రజలు ఆయనకు చక్కని బానిస దొరికాడని భావించారు. హాషిమ్ కుమారుడు షోయబ్... అబ్దుల్ ముత్తలిబ్‌గా ప్రఖ్యాతిగాంచాడు. ముత్తలిబ్ మరణానంతరం అబ్దుల్ ముత్తలిబ్ పరిపాలనా భాద్యతల్ని స్వీకరించాడు. ఆయన ప్రభుత్వాధినేతగా తీసుకున్న మొట్టమొదటి చర్య ఏమిటంటే, చారిత్రాత్మకమైన జమ్ జమ్ బావి ఎందుకు మూతపడిందో విచారణ జరిపించటం. 'జుర్హమ్' అనే సర్దారు యుద్ధంలో ఓడిపోయి, మక్కా నగర ఆధిపత్యాన్ని 'బనీ ఖజ్జాత్'కు అప్పగించేటప్పుడు, అతడు తన నిధులనన్నింటిని ప్రతీకార భావంతో, విద్వేషంతో జమ్ జమ్ బావిలో పాతిపెట్టి దాన్ని రాళ్ళతో, మట్టితో పూడ్చించాడు.

జమ్ జమ్ బావి త్రవ్వించి, అందులోని పూడికను తీయించి మళ్ళీ దాన్ని పూర్వపు స్థితికి తీసుకువస్తానని ప్రజలకు వాగ్దానం చేశాడు. అలా చేయటం వల్ల హజ్ యాత్రీకులకు అన్ని వేళలా పుష్కలంగా నీటిని అందించవచ్చని ఆయన తలచాడు. మక్కాలోను, కాబాలోను పతాక స్థాయికి చేరుకున్న మూఢనమ్మకాల కారణంగా ఆయన జమ్ జమ్‌ను త్రవ్వించే పనిని చేపట్టలేక పోయారు. కాబాలో తిష్టవేసి రాజ్యమేలుతున్న విగ్రహాల అంగీకారం కోసం ఆయన వాటిని వేడుకోవలసి వచ్చింది. అప్పుడు ఆయనకు కేవలం ఒక్క కుమారుడే ఉండేవాడు. తనకు పది మంది కుమారుల్ని ప్రసాదించమని ఆయన దేవుణ్ణి ప్రార్థించారు. ఈ వరమిస్తే తన కుమారుల్లో ఒకర్ని బలి ఇస్తానని కూడా ఆయన మొక్కుకున్నారు. ఆయన ప్రార్థనల్ని దేవుడు అంగీకరించాడు. ఆయనకు పది మంది పుత్రుల్ని ప్రసాదించాడు. పరిపాలనా వ్యవహారాల్లో తండ్రికి సహాయం చేసే వయస్సుకు వారంతా ఎదిగారు. ఒక నాటి రాత్రి అబ్దుల్ ముత్తలిబ్ గాఢ నిద్రలో మునిగివున్నప్పుడు జమ్ జమ్ బావిని బాగుచేయించమని ఒక అదృశ్యవాణి కలలో ఆజ్ఞాపించింది. ఆయన విజ్ఞుల్ని సంప్రదించారు. తక్షణం జమ్ జమ్ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టమని వారు ఆయనకు

సలహా ఇచ్చారు. తదనుగుణంగా జమ్ జమ్ బావిలోని పూడిక తీశారు. త్రవ్వకం పని జరుగుతుండగా అసంఖ్యాకమైన బంగారపు కరవాలాలు, నిధులు, రెండు బంగారపు లేళ్ళు దొరికాయి. ఆ నిధుల ద్వారా కాబా గృహానికి పెద్ద తలుపులు చేయించారు. బంగారపు లేళ్ళను కాబా ముఖద్వారానికి ఇరువైపులా నిలబెట్టి దాని గాంభీర్యాన్ని ఇనుమడింపచేశారు.

అబ్దుల్ ముత్తలిబ్ తన కుమారులందర్నీ పిలిచి, తాను తన కుమారుల్లో ఎవరినో ఒకర్ని బలి ఇస్తాననీ చేసుకున్న మొక్కుబడి గురించి వారికి వినిపించారు. తనను బలి ఇవ్వమంటే తనను బలి ఇవ్వమని వారంతా ముందుకు వచ్చారు. ఈ సమస్యను పరిష్కరించటానికి ఆయన తమ కుమారులందర్నీ తమ పేర్లను తమ తమ కరవాలాలపై రాయమని పురమాయించారు. వారంతా అలానే చేశారు. ముఖ్య దేవత అయిన హుబల్‌కు ప్రధాన పూజారిగా ఉన్న వ్యక్తి వద్దకు వాటిని తీసుకువెళ్ళి, ఏ కొడుకును బలి ఇవ్వాలో కనుక్కోమని చెప్పారు. అందరికంటే చిన్న వాడు, అత్యంత ప్రియతముడు అయిన అబ్దుల్లాహ్ పేరును ఆ రాతి విగ్రహం సూచించిందని ఆ పూజారి తెలిపాడు. హృదయ విదారకమైన ఈ వార్తను విన్న మక్కా పౌరులంతా సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. అబ్దుల్ ముత్తలిబ్ తన ముద్దుల కొడుకును జమ్ జమ్ వద్దకు తీసుకెళ్ళారు. అప్పటి ఆచారాలు, సంప్రదాయాల ప్రకారం జమ్ జమ్ సమీపంలోగల 'ఈసఫ్' 'నయలహ్' అని పిలువబడే విగ్రహాల సమక్షంలో బలిదానాలు జరగాలి. వృద్ధులు, విజ్ఞులు అయిన కొందరు పెద్దలు అబ్దుల్ ముత్తలిబ్ వద్దకు పోయి, అబ్దుల్లాహ్ బలిదానానికి బదులుగా మరొకటేదైనా పరిహారంగా ఇచ్చే అవకాశాన్ని గురించి ఆలోచించమని సలహా ఇచ్చారు. 'యస్రిబ్'కు సమీపంలో జ్యోతిష్యం చెప్పే ఒక స్త్రీ ఉండేది. ఇటువంటి సమస్యల్ని పరిష్కరించటంలో సిద్ధహస్తురాలుగా ఆమె పేరు ప్రఖ్యాతులు గాంచింది. దీని కొరకు ఆమె ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉన్నత అదృశ్య శక్తుల్ని వేడుకునేది. కలవరపడుతూ చాలా మంది ప్రజలు ఆమె వద్దకు వెళ్ళారు. సుదీర్ఘమైన ధ్యానముద్ర తరువాత ఆ జ్యోతిష్యురాలు, అబ్దుల్ ముత్తలిబ్ గనక నూరు ఒంటెల్ని పరిహారంగా బలి ఇచ్చినట్లయితే, అబ్దుల్లాహ్ ప్రాణాన్ని కాపాడటం సాధ్యమేనని సలహా ఇచ్చింది. అబ్దుల్లాహ్ పట్ల వారికున్న ప్రేమానురాగాల వల్ల, వాత్సల్యం వల్ల మక్కా ప్రజలు తమలో తాము చందాలు వేసుకొని నూరు ఒంటెల్ని బలిదానం చేశారు. ఆ విధంగా దైవానుగ్రహం వల్ల అబ్దుల్లాహ్ ప్రాణం దక్కింది. మహావ్యక్తి, చివరి దైవ ప్రవక్త అయిన మొహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)కు తండ్రి అయ్యే మహత్తర భాగ్యానికి ఆయన నోచుకున్నారు.

అబ్దుల్ ముత్తలిబ్ కుమారుడైన అబ్దుల్లాహ్ అసాధరణమైన రీతిలో అందంగా

ఉండేవారు. ఆయన ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంగల మంచి మనిషి. ఆయన ప్రవర్తనలో సభ్యతా సంస్కారాలు కొట్టొచ్చినట్లు కనబడేవి. ఆయన మృదుస్వభావులే కాదు. మృదుభాషి కూడా. ఆయన సౌశీల్యం అరబ్బు ప్రజల్ని అపూర్వంగా ప్రభావితం చేసింది. మక్కా నగర ప్రజలు అబ్దుల్లాహ్‌ను గురించి తరచూ చర్చించుకుంటూ ఉండేవారు. ఎన్నో పెళ్ళి సంబంధాలు ఆయనకు వచ్చాయి. కాని అబ్దుల్ ముత్తలిబ్ 'బనీజొహ్రా' అనే తెగ సర్దారు వద్దకు వెళ్ళారు. ఆ సర్దారుకు అమీనా అనే కూతురు ఉండేది. ఆమె అమూల్యమైన ఖురేష్ వంశ ఆణిముత్యం. ఇరుపక్షాలకు ఆమోదయోగ్యమైన ఈ వివాహ సంబంధం మానవ జాతి చరిత్రలో ఒక మహోజ్వలమైన సంఘటన. అప్పుడు అబ్దుల్లాహ్ వయస్సు 17 సంవత్సరాలు. అబ్దుల్లా, ఆమీనాల వివాహం ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరిగింది.

సతీమణి ఆమీనాతో కొన్ని రోజులు సంసారం చేశారో లేదో, వాణిజ్య బృందం ఒకటి సిరియాకు వెళుతోందని అబ్దుల్లాహ్‌కు తెలిసింది. తన తండ్రి వ్యాపార లావాదేవీలను చూసేందుకు ఆయన ఆ బృందంతో సిరియాకు పయనమై వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో ఆ బృంద సభ్యులంతా మార్గమధ్యంలో మదీనా పట్టణ వద్ద మజిలీ చేశారు. అబ్దుల్లాహ్ తాతయ్య స్వగ్రామం మదీనా కావటం విశేషం. ఆయన తన తాతయ్య సమాధిని సందర్శించే అవకాశం లభించినందుకు సంతోషించారు. జియారత్ నిమిత్తం సమాధి వద్ద దువా చేశారు. దైవ సంకల్పం ఏమిటో, ఎలా ఉంటుందో ఎవరికి తెలియదు. అబ్దుల్లాహ్ అస్వస్థులైయారు. మిగతా వ్యాపారస్తులంతా ఆయన్ని అక్కడే విడిచిపెట్టి మక్కాకు వెళ్ళిపోయారు. అబ్దుల్లాహ్ వ్యాధిగ్రస్తులయిన విషయాన్ని వారు తండ్రి అబ్దుల్ ముత్తలిబ్‌కు తెలిపారు. అబ్దుల్లాహ్ అన్నయ్య 'హరీస్' వెంటనే మదీనా బయలుదేరి వెళ్ళారు. అబ్దుల్లాహ్ స్వర్గస్థులయ్యారనే వార్త తెలుసుకొని ఆయన షాక్‌కు గురైయ్యారు. అది దైవ నిర్ణయం. వితంతువైన ఆమీనా తన పరిశుద్ధమైన గర్భంలో ఒక పవిత్రమైన, మహత్తరమైన అమానతును మోసుకుంటూ  పుట్టింటికి వెళ్ళిపొయారు.

## భూమిపై  మొహమ్మద్ వెలుగు

రబ్బీఉల్ అవ్వల్ మాసం 12వ తేదీ ఆమీనా కడుపు పండింది. ఆమెకు అందాలు జాలువారే కుమారుడు పుట్టాడని అబ్దుల్ ముత్తలిబ్‌కు శుభవార్త చేరింది. వెంటనే ఆయన అక్కడకు వెళ్ళి గారాల బాబును సంతోషంతో పొంగిపోతూ ముద్దాడాడు. తరువాత పవిత్ర

కాబా గృహానికి వెళ్ళి దాని చుట్టూ ప్రదక్షిణం చేసి మొహమ్మద్ అని పేరు పెట్టారు. మొహమ్మద్ అంటే ఆచరణలో అందరికంటే శ్రేష్టుడు అని భావం. మొహమ్మద్ పుట్టిన 7వ రోజున అబ్దుల్ ముత్తలిబ్ ఒక ఒంటెను ఖుర్'బానీ చేసి ఖురైషు వంశీయులందరికీ విందుభోజనాలు ఏర్పాటు చేశారు. ప్రజలంతా ప్రేమించాలని, గౌరవించాలని తన మనుమని పేరు మొహమ్మద్ అని పెట్టానని, ఈ కారణంగానే తమ వంశం పేరు తమ కుటుంబం పేరు పెట్టలేదని ఆయన ప్రజలకు వివరించారు.

ధనవంతులైన ఖురైషుల కుటుంబాల్లో పుట్టిన పిల్లలకు తల్లులు తాము పాలిచ్చి పెంచే ఆచారం ఆ కాలంలో లేదు. ఇది ఒక సంప్రదాయంగా స్థిరపడి పోయింది. పల్లెటూళ్ళ నుంచి వచ్చే ఆయాలకు ఈ పిల్లల పెంపకాన్ని అప్పగించే వారు. వారు ధనవంతుల పిల్లల్ని తమ తమ గ్రామాలకు తీసుకెళ్ళి అక్కడ వారిని పాలిచ్చి పెంచి పెద్ద చేసేవారు. ఈ పోషణ భారానికి వారు కొంత ధనం వేతనంగా తీసుకునేవారు. ఇది ఒక వంశపారంపారిక వృత్తిగా అలరారింది. ఆమీనా చాలా బలహీనంగా ఉండేవారు. అయినా కొన్ని రోజుల వరకు ఆమె బాల మొహమ్మద్‌కు పాలిచ్చారు. అబూలహబ్ బానిస సౌబియా కూడా కొంత కాలం వరకు తన పాలిచ్చి సాకారు.

అప్పుడే పుట్టిన పిల్లల్ని తీసుకెళ్ళటానికి గ్రామ ప్రాంతాల నుంచి ఆయాలు వచ్చారు. వారు పిల్లల్ని వారి ఆరోగ్యం చూసి ఎన్నుకునేవారు. పిల్లల తల్లిదండ్రుల ఆర్థిక స్థోమతను బట్టి బేరసారాలు జరిగేవి. శారీరకంగా బలహీనంగా వున్న హలీమా అనే ఆయాకు తమ పిల్లల్ని ఎవ్వరూ ఇవ్వలేదు.

మరో వైపు బాల మొహమ్మద్ అనాథ అని తెలుసుకున్న ఆయాలెవ్వరూ ఆయన్ని పెంచటానికి ముందుకు రాలేదు. హలీమా మొహమ్మద్‌ను తీసుకెళ్ళటానికి సిద్ధమైయ్యారు. ఆమె బాల మొహమ్మద్‌ను ఎత్తుకుని తన ఛాతీకి అదుముకోగానే ఎండిపోయిన ఆమె స్థనాలు పాలతో నిండిపోయాయి. రెండేళ్ళకు పైగానే బాల మొహమ్మద్ హలీమా ఆలన-పాలనలో పెరిగారు. ఒకసారి ఆరుబట ఆడుకుంటూ ఉండగా బాల మొహమ్మద్‌ను యూదుల బృందం ఒకటి చూసింది. దేదీవ్యమానంగా వెలిగే మొహమ్మద్ ముఖారవిందాన్ని, దానిపై ప్రస్ఫుటంగా, ప్రముఖంగా కనిపిస్తున్న కొన్ని గుర్తుల్ని వారు నిశితంగా పరిశీలించారు. ఈ బాబు ఎవరి బాబు అని వారు హలీమాను అడిగారు. మంచి ప్రతిఫలమిస్తామనే ఆశ చూపి మొహమ్మద్‌ను తమకు ఇవ్వాలని ఆ యూదులు హలీమాను వేడుకున్నారు. ఈ బాబును ప్రేమతో, వాత్సల్యంతో అతి జాగ్రత్తగా పెంచి పెద్దచేస్తామని వారు వాగ్దానం చేశారు. భవిష్యత్తులో ఈ పిల్లవాడు ఎంత పెద్దవాడవుతాడో నీకు తెలియదు. ఇతడు

మానవులందరి కంటే ఉన్నతుడు, గొప్పవాడు అవుతాడు' అని జోస్యం చెప్పారు. అద్భుతమైన ఈ విషయాన్ని విన్న హలీమా బాల మొహమ్మద్ విషయంలో ఎంతో జాగ్రత్త పడింది. బాబును తీసుకుపోయి ఇంట్లో దాచి పెట్టింది. వారి కోరికను తిరస్కరించింది. బాల మొహమ్మద్‌ను కంటికి రెప్పలా కాపాడుకోసాగింది. కొంత కాలం తరువాత హలీమా బాల మొహమ్మద్‌ను తల్లి ఆమీనాకు అప్పగించారు. ఇప్పుడు మొహమ్మద్ తాతయ్య సంరక్షణలో, తల్లి ఒడిలో మాతృప్రేమానురాగాల మధ్య పెరగసాగారు.

బాల మొహమ్మద్‌కు ఆరు సంవత్సరాలు నిండాయి. అమ్మ అమీనా ఆయన్ని మదీనా పట్టణానికి తీసుకెళ్ళారు. అక్కడ తండ్రి అబ్దుల్లాహ్ మరణించిన ఇల్లును ఆమె మొహమ్మద్‌కు చూపించారు. ఒక నెల రోజులు గడిపిన తరువాత ఆమె తన ప్రియ పుత్రుని వెంటబెట్టుకొని మక్కా నగరానికి తిరుగు ప్రయాణం కట్టారు. మార్గమధ్యంలో 'హైఫా' అనే ప్రాంతానికి 23 మైళ్ళ దూరంలో ఉన్న 'అబువా' అనే స్థలం వద్ద ఆమె తీవ్ర అస్వస్థతకు గురై అక్కడే స్వర్గస్థులైయారు.

"ఔమీ-యమీన్" అనే మనిషి అనాధ మొహమ్మద్‌ను తన ఇంటికి తీసుకెళ్ళారు. తరువాత ఆయన మొహమ్మద్‌ను మక్కా నగరానికి తీసుకుపోయి తాతయ్య అబ్దుల్ ముత్తలిబ్‌కు అప్పగించారు. అబ్దుల్లాహ్, ఆమీనాల మరణం అబ్దుల్ ముత్తలిబ్‌ను విషాదసాగరంలో ముంచివేసింది. ఆయన మొహమ్మద్‌ను తల్లిదండ్రులు లేని లోటును తీర్చారు. ఆయనకు తల్లి ప్రేమను, తండ్రి సంరక్షణను కలుగ చేశారు. కొంత కాలం తరువాత దురదృష్టవశాత్తు తాతయ్య అబ్దుల్ ముత్తలిబ్ కూడా మరణించారు. అప్పుడు బాల మొహమ్మద్‌కు ఎనిమిది సంవత్సరాలు.

తన తండ్రి అబ్దుల్ ముత్తలిబ్ కోరిక ప్రకారం అబూతాలిబ్ బాల మొహమ్మద్ పోషణ భారాన్ని స్వీకరించారు. అబూతాలిబ్ ఉన్నతమైన వ్యక్తిత్వంగల నిజాయితీ పరుడైన మనిషి. సహృదయుడు. సౌశీల్యవంతుడు. మొహమ్మద్‌ను అత్యంత ప్రేమానురాగాల మధ్య పెంచారు. పెద్దనాయన అబూతాలిబ్ సంరక్షణలో మొహమ్మద్ పెరిగారు.

వ్యాపారనిమిత్తం సిరియా దేశానికి ప్రయాణమైన అబూతాలిబ్ వెంట 12 ఏళ్ళ మొహమ్మద్ కూడా వెళ్ళారు. 'బుస్రాహ్' ప్రదేశానికి చేరుకున్న వ్యాపారస్తులంతా విశ్రాంతి కోసం అక్కడ గుడారాలు వేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బుస్రాహ్ వాణిజ్యవేత్తల్లో "బుహేరియా" అనే వ్యక్తి మకాం వేసిన మక్కా వ్యాపారస్తులందర్ని రాత్రి భోజనానికి ఆహ్వానించాడు. ఇలా జరగటం అరుదు కనుక వారందరూ ఆశ్చర్యచకితులయ్యారు. బాల మొహమ్మద్ తప్ప వారంతా విందుకు హాజరయ్యారు. బాలమొహమ్మద్ చిన్నవారు కాబట్టి

పెద్దవాళ్ళ కోసం ఏర్పాటు చేసిన విందులో పాల్గొనలేదు. ఇంకా ఎవ్వరైనా విందుకు రాకుండా క్యాంపులో మిగిలిపోయారా అని బుహారియా అడిగారు. బాలమొహమ్మద్ రాకపోవటాన్ని తెలుసుకున్న బుహారియా ఆయన్ని కూడా తీసుకురావలసిందని బలవంతం చేశారు. ఆయన వచ్చే వరకు భోజన ఏర్పాట్లు కూడా జరక్కపోవటం విచిత్రం. భోజనాలు ముగిసిన తరువాత బుహారియా ప్రేమతో, వాత్సల్యంతో మొహమ్మద్‌ను 'లూత్, యౌజ్జా' అనే విగ్రహాలపై ప్రమాణం చేసి సత్యం పలకమని కోరారు. కాని ఆయన అలా చేయనని ఖండితంగా చెప్పారు. దానికి బదులుగా మొహమ్మద్ సత్యం పలకటానికి దేవునిపై ప్రమాణం చేశారు. అప్పుడు బుహారియా మొహమ్మద్ పోలికల్ని నిశితంగా పరిశీలించారు. పరిశోధనతో కూడుకున్న కొన్ని ప్రశ్నలు వేశారు. తరువాత ఆయన బాల మొహమ్మద్ గురించి అతి జాగ్రత్తగా మెలగవలసిందని హెచ్చరించారు.

ఇస్రాయిల్ వంశీయులు మొహమ్మద్ కోసం వెదుకుతున్నారని వారు గనుక చూస్తే బాబును ఎత్తుకు పోయి హతమారుస్తారని చెప్పారు. మక్కా నగరానికి తిరిగి వచ్చిన తరువాత అబూతాలిబ్ మొహమ్మద్ దూరదృష్టిని చూసి ఆశ్చర్యపోయ్యారు. ఎందుకంటే మొహమ్మద్ ఎంతో సున్నితమైన, ఎంతో చిక్కుతో కూడుకున్న సమస్యల్ని సునాయాసంగా, సమంజసంగా పరిష్కరించేవారు.

మొహమ్మద్ 23 సంవత్సరాల వయస్సుకు చేరుకున్నప్పుడు ఆయన్ని ఖదీజా అనే స్త్రీ యొక్క వ్యాపార లావాదేవీల్లో ఏజెంటుగా వ్యవహరించమని అబూతాలిబ్ సూచించారు. వెంటనే ఆయన ఈ సూచనను స్వీకరించారు. ఖదీజాకు నమ్మకస్తుడైన యస్రా అనే బానిసతో వ్యాపారనిమిత్తం సిరియాకు వెళ్ళారు. ఖదీజా మక్కాలో అందరి గౌరవాన్ని చూరగొన్న మంచి ధనవంతురాలైన మహిళ. ఆమె అత్యంత పేరు ప్రఖ్యాతులుగాంచిన మక్కా సర్దారు ఖుసాయ్‌కు బంధువు కూడ. ఆమె వితంతువు. తమ వాణిజ్య యాత్రను లాభవంతంగా ముగించుకుని మక్కాకు తిరిగి వచ్చారు మొహమ్మద్. ఖదీజా బానిస యస్రా ఆమెకు మొహమ్మద్‌ను గురించి ఎంతో ఘనంగా చెప్పారు. ముఖ్యంగా ఆయన పెద్ద మనిషితనం, నడవడిక, నెమ్మదితనం, వాణిజ్యనీతి, వస్తువుల క్రయ విక్రయాలలో ఆయన ప్రదర్శించిన చాతుర్యతను గురించి ఎంతో కొనియాడారు. ఖదీజా స్నేహితురాలు, ఆమె శ్రేయోభిలాషి అయిన నఫీసా మొహమ్మద్‌ను వివాహం చేసుకోమని ఆమెకు సలహా ఇచ్చారు.

అబూతాలిబ్ మరియు ఆయన సోదరులు కలసి పెండ్లి సంబంధం తీసుకుని ఖదీజా వద్దకు వెళ్ళారు. ఆమె తక్షణం ఈ సంబంధాన్ని ఒప్పుకున్నారు. ఆ విధంగా

మొహమ్మద్ ఖదీజాల వివాహం జరిగింది. వివాహం జరిగినప్పుడు మొహమ్మద్ వయస్సు 25 సంవత్సరాల రెండు నెలల పది రోజులు. ఖదీజా వయస్సు 40 సంవత్సరాలు.

ఒక రోజు మొహమ్మద్‌కు ఆధ్యాత్మిక సంబంధమైన ప్రేరణ కలిగింది. దాని ప్రకారం ఆయన సఫా కొండపైకి ఎక్కారు. ఖురైషు సోదరులారా, రండి అని బిగ్గరగా పిలిచారు. మక్కా నగరవాసుల చెవుల్లోకి ఈ పిలుపు దూసుకు పోయింది. ఆయన మాటిమాటికి ఇలా పిలవడం వల్ల మక్కా నగర ప్రజలందరూ, యువకులూ, వృద్ధులూ అంతా 'సఫా' కొండ వైపు పరుగెత్తసాగారు. అక్కడ సమావేశమైనవారందరికీ ఆయన దైవసందేశాన్ని వినిపించారు. మహా ప్రవక్త చేసిన ఈ చిరు ప్రసంగం ఒక మంత్ర దండంగా, ఒక మంచి ఔషధంగా పనిచేసింది. ప్రజల్లో గుణాత్మకమైన, ప్రస్ఫుటమైన ఒక మార్పు కనిపించసాగింది. విగ్రహాలను పూజించేవారు, 'మేము దేవుణ్ణి, దేవుని ఏకత్వాన్ని కూడా అంగీకరిస్తాం. కాకపోతే దైవానికి సిఫారసు చేసే మధ్యవర్తులుగా విగ్రహాలను ఉంచుకుంటాం" అని ప్రకటించారు. దేవుడు సర్వశక్తిమంతుడని, ఆయన ఎల్లప్పుడూ ఉన్నాడని, సర్వాధికారాలు కలవాడని, ఆయన అందరి ప్రార్థనల్ని ఆలకిస్తాడని, పశ్చాత్తాపపడే వారిని క్షమిస్తాడని, అందరినీ కరుణిస్తాడని మహాప్రవక్త వివరించగా, ప్రజల్లో మార్పు కొట్టొచ్చినట్లు కనిపించింది.

వివేకంతో, విజ్ఞతతో కూడుకున్న మొహమ్మద్ బోధనలు ప్రజల హృదయాలకు హత్తుకుంటున్నాయి. దేవుణ్ణి నేరుగా ప్రార్థించవచ్చని, ఆయన్ని వేడుకోవచ్చునని, ఏమీ చూడలేని, ఏదీ వినలేని, ఏ మాత్రం పలుక లేని, ప్రాణం లేని రాళ్ళు దైవానికి ఏ విషయం చెప్పలేవని ఆయన ప్రజలకు హితవు చెప్పారు. ఈ సందేశ ప్రచారం తరువాత దైవధర్మం సుదూర ప్రాంతాలకు వ్యాపించసాగింది. దీన్ని చూసి రాళ్ళ పూజారులు, విగ్రహాల సంరక్షకులు కంగారు పడసాగారు. దైవ ధర్మోద్యమాన్ని ఆపటానికి, దాన్ని ఆదుపులో పెట్టటానికి అసంఖ్యాకమైన రాతి దేవుళ్ళను పూజించే ప్రజల నాయకులు ఒక ఉమ్మడి వేదికపై సమావేశమైయారు. కాని ఈ ఉద్యమాన్ని నిరోధించటం ఎలా?

దివ్య ఖురాన్ వాక్యాలు సత్యమైనవి. అనన్యసామాన్యమైనవి, మత ఉద్యమ చరిత్రలో సాటిలేనివని, హృదయానికి హత్తుకు పోతాయని, ప్రజలు వాటికి లొంగిపోతారని, వంగి పోతారని ఆ నాయకులు గ్రహించారు. వారి దృష్టిలో విగ్రహాలను పొగుడుతూ అటువంటి వాక్యాలను మానవుల్లో ఎవ్వరూ రచించలేదు. ఆలస్యంగానైనా ప్రజలు ఈ విషయాలను గ్రహించసాగారు.

మక్కా నగరం నలుమూలల్లో దాని పరిసరాల్లో ప్రజలు ఇస్లాం స్వీకరిస్తూ పోతున్నారు. విగ్రహాలకు పనిలేకుండా పోయింది. అవి నిర్వీర్యమై పోయాయి. కాని వాటి పూజారుల్లో మొహమ్మద్‌కు వ్యతిరేకంగా ప్రతీకారేచ్ఛ రగులుకుంది. ఇస్లాం ఉద్యమాన్ని అంతమొందించే వరకు యుద్ధాన్ని కొనసాగించటం తప్ప మరొక మార్గం లేదనే నిర్ణయానికి వచ్చారు వారు. దీని కొరకు పరస్పరం సహాయ సహకారాలను అందించుకోవాలని, సమైక్య కృషి చేయాలని వారు తీర్మానించారు. దేవుని దైవత్వాన్ని, దైవ సందేశాన్ని ప్రజలు ఆచరించేలా చేయడానికి బలప్రదర్శనం ఎంత మాత్రం పనికిరాదని మొహమ్మద్ సమ్మకం. హింస ద్వారా, దౌర్జన్యం ద్వారా ప్రజల్ని మార్చటం సాధ్యం కాదని, అది తప్పుడు మార్గమని ఆయన విశ్వాసం. అబూజహల్ ఆగర్భ శత్రువు అయ్యాడు. అతడు, అతడి భార్య ఉమ్మెజమీల్ రేయింబవళ్ళు మహా ప్రవక్తను తిడుతుండేవారు.

'అందర్నీ ప్రేమించు, ఎవరినీ ద్వేషించవద్దు' అనే సిద్ధాంతానికి అంకితమైన మొహమ్మద్(స) వాటిని నవ్వుతూ భరించేవారు. ఎందుకంటే వారికి జ్ఞానం గనక తెలిస్తే వారు తప్పకుండా దేవుణ్ణి, దేవుని ఏకత్వాన్ని గ్రహిస్తారు. సన్మార్గాన్ని అనుసరిస్తారు. చెడును, చెడుపనుల్ని త్యజిస్తారని ఆయన దృఢంగా నమ్మేవారు. అబూజహల్ మాదిరిగానే 'ఖురైష్' అనే మరొక తెగ నాయకుడు మొహమ్మద్ రక్తం త్రాగాలని కాచుకుని ఉన్నాడు.

ఒకసారి కాబాలో 'హజ్ రె అస్వద్'కు 'మొఖామె ఇబ్రాహీమ్'కు మధ్య ఉన్న ప్రదేశంలో మహాప్రవక్త ఉదయం ప్రార్థనలు చేస్తూ ఉండగా ఆయనగారిపై బుద్ధిపూర్వకమైన హత్యాప్రయత్నం జరిగింది. మహాప్రవక్త సజ్‌దా చేస్తూ ఉన్నప్పుడు ఆయనపై విసురుదామనే దురుద్దేశంతో అబూజహల్ ఒక పెద్ద బండరాయిని మోసుకెళ్ళాడు. కాని భయకంపితుడై, నిర్వీర్యుడై, నిరర్థకుడై వెనక్కి తిరిగి పరుగెత్తాడు. పారిపోయాడు. అతని అనుచరులు అలా ఎందుకు పారిపోయావని అతన్ని ప్రశ్నించగా, ఒక పెద్ద ప్రమాదకరమైన అగ్నిగుండం తనను ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా అడ్డుగా వుందని అతడు సమాధానం చెప్పాడు. అబూజహల్ పన్నాగాన్ని వమ్ముచేసిన ఈ అగ్నిగుండం గాథ చాలా మంది ప్రజల్ని భయపెట్టింది. వారు బెదిరిపోయారు. ఫలితంగా ప్రజలు మొహమ్మద్(స) శిరస్సుపై దేవుని అచ్చాదన ఉందని, ఆయన బోధల్లో దేవుని మార్గదర్శకత్వం ఉందని గ్రహించసాగారు.

దైవ ధర్మమార్గంలో, దైవ సంతోషం కోసం దైవ శత్రువైన దుర్మార్గుడు అబూజహల్ చేతుల్లో సగర్వంగా మొదటిసారిగా ప్రాణత్యాగం చేసిన వారు ఒక స్త్రీ. ఆమె హజ్రత్ సుమయ్య(ర). హజ్రత్ బిలాల్(ర) కూడా ఎన్నో అత్యాచారాలను, దౌర్జన్యాలను ఎంతో ధైర్యంతో, స్థయిర్యంతో సహించారు. ఇది కేవలం ఆయనకు దేవుని ఏకత్వంలో, మహాప్రవక్త

బోధల్లో ఉన్న అంచంచల విశ్వాసం వల్లనే సాధ్యపడింది. విభిన్న అరబ్బు తెగలకు చెందిన బలవంతులయిన నవ యువకుల్లో ఒక వినూత్న పరివర్తన రాసాగింది. బహిరంగ ప్రకటన చేసి హ(జత్ హంజా ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించారు. అదే విధంగా హ(జత్ ఉమర్(ర) కూడా తన సోదరి ఫాతిమా, భావ సయీద్‌లు ఖురాన్ పఠిస్తుండగా విని ప్రభావితులై ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు. మొహమ్మద్(స) దైవ ప్రవక్త పదవిని అలంకరించి ఆరు సంవత్సరాలు కావస్తోంది. ఇస్లామీయ ఉద్యమం వేగంతో నలుమూలలా వ్యాపిస్తూ ముందుకు పోతోంది. పదవ సంవత్సరంలో ఆయన బాబాయి అబూతాలిబ్‌ను కోల్పోయారు. తరువాత వెంటనే ఆయన ప్రియ సతీమణి హ(జత్ ఖదీజా(ర) మరణించారు. అది రంజాన్ మాసం. అప్పుడు ఆమె వయస్సు అరవై ఐదు సంవత్సరాలు. 'హుజుమ్' అనే ప్రదేశంలో ఆమెను సమాధి చేశారు.

మహాప్రవక్త దాయాది ఆయిన "ఖుల్ లీ' అనే పెద్ద మనిషి ఇచ్చిన సలహా మేరకు, ఆయన హ(జత్ అబూబకర్(ర) కుమార్తె ఆయేషాను, 'జమన్' అనే పెద్ద మనిషి కూతురు సౌధాను వివాహం చేసుకున్నారు. ఆ కాలంలో అప్పుడు అసంఖ్యాకమైన తెగలు వుండేవి. ఒక్కొక్క తెగకు ఒక్కొక్క నాయకుడు ఉండేవాడు. ఇస్లాం ధర్మ వ్యాప్తి కారణంగా, ఆ తెగలన్నీ ఒకే మతధర్మం బావుటా క్రిందకు వస్తూ ఉన్నప్పటికీ, ఒక తెగవారు మరొక తెగవారిని వివాహం చేసుకోకూడదనే దురాచారం ఇంకా సమసి పోలేదు. మహాప్రవక్త మొహమ్మద్(స) విభిన్న తెగలకు చెందిన స్త్రీలను వివాహం చేసుకుని ఒక ఆదర్శాన్ని నెలకొల్పారు. దీనివల్ల ఆ తెగల ప్రజల్లో పరస్పర అవగాహన, శాశ్వత బంధుత్వం నెలకొన్నాయి.

మొహమ్మద్(స) నలుగురి కంటే ఎక్కువ మంది స్త్రీలను వివాహం చేసుకున్నారంటూ కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారు. అలాంటి వారు వాస్తవాల్ని తెలుసుకోవాల్సిన అవసరముంది.

మహనీయ మొహమ్మద్(స) 23 సంవత్సరాల నిండు యౌవనంలో తన కంటే 15 ఏళ్ళు ఎక్కువ వయసుగల వితంతువైన హ(జత్ ఖదీజా(రజి)ని వివాహమాడారు. ఆమెతో కలిసి 25 సంవత్సరాలపాటు ఎంతో అన్యోన్యంగా కాపురం చేశారు. ఈ 25 ఏళ్ల కాలంలో ఆయన మరో స్త్రీని వివాహమాడే తలంపును కూడా తన మనసులోకి రానివ్వలేదు. హ(జత్ ఖదీజా(రజి) చనిపోయిన తరువాతనే ఆయన రెండవ వివాహం చేసుకున్నారు. ఆమె కూడా వయస్సు మీరిన స్త్రీయే (హ(జత్ సౌదా రజి) ఆమెతో 4 సంవత్సరాలు సంసారం చేశారు. ఆ తరువాత 53, 54 సంవత్సరాల వయస్సులో ఆయన ఇతర పెళ్ళిళ్లు

చేసుకున్నారు. మహనీయ మొహమ్మద్(స)పై మోపబడిన దైవదౌత్య భారం అసాధారణమైనది. దాన్ని సులభంగా నిర్వహించడానికి నలుగురు భార్యల నిబంధన నుంచి ఆయన్ని అల్లా మినహాయించాడు. అత్యున్నతమైన సభ్యతా సంస్కృతులతో కూడిన ఓ నూతన సమాజం ఆవిష్కరణ కోసం ఆయన పురుషులకే గాక స్త్రీలకూ తగిన శిక్షణ ఇవ్వవలసి ఉండింది. నూతన ఇస్లామీయ సమాజంలో స్త్రీ పురుషుల స్వేచ్ఛాయుత కలియికపై ఆంక్షలు ఉండటం వల్ల, ఆ ఆంక్షలను అతిక్రమించకుండా స్త్రీలను వివాహమాడటం ద్వారానే ఈ మహాకార్యం సాధ్యమవుతుంది. అంతే కాదు, ఇస్లామీయ విప్లవ మార్గంలో అవరోధంగా ఉన్న వారి శక్తిని, శత్రువుల సంఖ్యను తగ్గించడానికి కూడా అనేక మంది స్త్రీలను వివాహమాడటం అనివార్యమయింది.

పిన్న వయస్సులో హజ్రత్ ఆయిషా(రజి)ను వివాహమాడటం వల్ల, దైవ ప్రవక్త (స) దివంగతులైన తరువాత కూడా ఆమె ద్వారా ముస్లిం జగత్తుకు అనేక దశాబ్దాలపాటు ప్రవక్త ప్రవచనాలు, ఆయన సంప్రదాయాలు లభిస్తుండేవి. హజ్రత్ ఉమ్మెసల్మా(రజి), ఉమ్మె హబీబా(రజి)లను వివాహమాడటం వల్ల వారి వంశం, తెగల నుంచి ఎదురైన విరోధం కొంత వరకు తగ్గింది. యుద్ధ ఖైదీలైన హజ్రత్ సఫియా, జువైరియా, రైహానా (రజి)లను విడుదల చేసి వివాహమాడటంతో, ఆయా యూదు తెగల ఇస్లాం వ్యతిరేక కార్యకలాపాలు చాలా వరకు మందగించాయి. ఆనాటి అరబ్ సంప్రదాయం ప్రకారం ఒక వ్యక్తి ఏదైనా తెగకు చెందిన స్త్రీని వివాహమాడితే, ఆ వ్యక్తి ఆ స్త్రీ తెగ మొత్తానికే అల్లుడిగా పరిగణించబడేవాడు. ఇస్లాం వ్యాప్తిలో ఈ విషయం కూడా ప్రముఖపాత్ర వహించింది.

ఇస్లాం దిన దిన ప్రవర్ధమానమవుతోంది. మానవ జాతిని సన్మార్గంపైకి తీసుకురావటానికి, వారిలో పశ్చాత్తాప భావాన్ని తీసుకురావటానికి ఏకైక దేవుణ్ణి వారు ప్రార్థించి ఆయన మన్నింపును, క్షమాభిక్షను పొందేలా చేయడం.

మరో వైపు మొహమ్మద్‌పై మరింతగా దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ఎన్ని కష్టాలు వచ్చినా సహనంతో, సంయమనంతో, నైతిక ధైర్యంతో ముందుకు సాగిపోయారు. చివరకు మొహమ్మద్(స) మక్కా నగరాన్ని విడిచి మదీనాకు వెళ్ళారు.

యేసు గ్రంథం 42వ అధ్యాయం 11వ పాఠమందు ఇలా వుంది. ఆయన విచ్చేసే తరుణంలో 'సెల' (మదీన పురాతన నామం) వాసులు గీతికలు పాడుతారు. హజ్రత్ ఇబ్రాహీం(అ), మూసా (అ), ఈసా(అ) గ్రంథాల్లో ఈ పవిత్ర మహోన్నత వ్యక్తిత్వం అవతరణ ప్రస్తావన వుంది. జబూర్ గ్రంథం కూడా ఇలాంటి భవిష్యవాణినే ప్రకటించింది.

ఆయన ముహమ్మద్ నామం యుగాంతం వరకు వుంటుంది. ఎవరి దర్శన భాగ్యం కోసం మదీన ప్రజలు తరలి వచ్చారో ఆయనకు విశ్వప్రభువు తన సర్వవరాల్ని పరిపూర్ణంగా ప్రసాదించాడు. లోకంలోని మహాపురుషుల్లో అందరికంటే మించిన మహనీయుడాయన. అంతటి మహోత్కృష్టుడైన పుణ్యమూర్తికి మదీన కేంద్రం అయింది.

# మనం తరచూ చేసే పొరపాట్లు

***1*** *తౌబా తర్వాత... తెలిసి కూడా పాపాలు చేయడం*

***2*** *ఎప్పుడూ ఆరోగ్యవంతంగా ఉంటామని భావించడం*

***3*** *పాపాలకు దూరంగా ఉండకుండా ఉండటం*

***4*** *ఉపాధి కోసం ప్రయత్నించక పోవడం, అనవసర సంతోషం*

***5*** *పనిని తర్వాత చేసే ఉద్దేశంతో ఆపివేయడం*

***6*** *ఇతరుల మాట కంటే, తమ మాటకే ప్రాముఖ్యత నివ్వడం.*

***7*** *మన రహస్యాలను ఇతరులకు చెప్పి, వారిని రహస్యంగా ఉంచమని వారితో కోరడం*

***8*** *ఇతరుల్ని మోసం చేయడం, వారు మనతో మంచిగా వ్యవహరిస్తారని భావించడం*

***9*** *దుబారా ఖర్చు చేసి అల్లాహ్‌పై భారం మోపడం*

***10*** *సమయం ప్రకారం ఐదు సార్లు నమాజ్ చేయడం మనిషిలో క్రమశిక్షణను పెంపొందిస్తుంది.*

***11*** *పరిశుభ్రత మానసిక, శారీరక పవిత్రతలకు మూల స్తంభం.*

***12*** *మన్నించు, మరిచిపో, పశ్చాత్తాపపడటం నేర్చుకో. ఈ సద్గుణాలు చెడు పనులకు దూరంగా ఉంచుతాయి. సహనాన్ని సత్యాన్ని ప్రబోధిస్తాయి.*

***13*** *తోటి వారి గురించి చెడుగా మాట్లాడకు, మౌనంగా వుండు. ఇతరుల వ్యవహారాల్లో అనవసరంగా జోక్యం చేసుకోవద్దు. ఇది నీలో ఓర్మిని, స్థయిర్యాన్ని పెంచుతుంది. తద్వారా నైతిక ధర్మాన్ని, మానసిక తృప్తిని పొందగలుగుతావు.*

***14*** *అనాథలు, స్త్రీలు, మతి చలించినవారు, అమాయకులకు సంబంధించిన ఆస్తులు, సమస్యల విషయంలో న్యాయసమ్మతంగా, అతి జాగ్రత్తగా వ్యవహరించు, అది సంఘ జీవితంలో నీతి నిజాయితీలను, సౌజన్యతను పెంపొందిస్తుంది. శీల నిర్మాణానికి దోహదపడుతుంది.*

# రోజే ముబారక్

*మజిదె నబవి మె దాఖిల్ హోనేకి దుఆ....*

*"అల్లాహుమ్మ సొల్లిఅలా సయ్యిదినా ముహమ్మదిన్ వ అలా ఆలి సయ్యిది నా ముహమ్మదిన్ అల్లాహుమ్మగ్ ఫిర్లి జునూబి వఫ్ తహ్‌లి అబ్‌వాబ రహ్‌మతిక అల్లాహుమ్మజ్ అల్ని అల్‌యౌమ మిన్ అవ్‌జిహి మన్ తవజ్జహ ఇలైక వ అఖ్‌రబ మన్ తఖర్రబ ఇలైక వన్‌జాఅ మన్‌దాఅక వఅబ్‌దగా మర్‌జాతిక"*

*అయ్ అల్లాహ్! దరూద్ భేజ్ హమారె పయ్‌గమ్‌బర్ ముహమ్మద్ సొల్లల్లాహు అలైహివసల్లమ్ ఔర్ ఉన్కి ఆల్‌పర్. మేరె గునాహోకొ బఖష్‌దె ఔర్ మేరే లియె అప్ని రహెమత్ కె దర్వాజె ఖోల్‌దె. అయ్ అల్లాహ్! ఆజ్‌కె దిన్ ముఝె తేరి తరఫ్ ముతవజ్జ హోనె వాలో మె సబ్‌సె జియాద ముతవజ్జ బనా. తేరా ఖుర్బ్ హాసిల్ కర్నె వాలో మె సబ్‌సె జియాద ఖరీబ్ బనాలె. ఔర్ జియాద 'ఫాఇజుల్ మరామ్' కర్ ఉన్ మెసె జిన్‌హోనె ముఝ్‌సె దుఆకి దర్‌ఖాస్తకి.*

దైవప్రవక్త(స) సమాధి దగ్గరకు చేరుకోగానే "అస్సలాము అలైక యా రసూలల్లాహి వరహ్మతుల్లాహి వబరకాతుహూ" (దైవప్రవక్తా! మీకు సలాం. దేవుని కారుణ్యం, ఆయన శుభాలు మీపై వర్షించుగాక) అని పఠించాలి. అలాగే హజ్రత్ అబూబకర్(ర) సమాధి దగ్గర ఆగి "అస్సలాము అలైక యా అబూబకర్" అని, హజ్రత్ ఉమర్(ర) సమాధి దగ్గర ఆగి అస్సలాము అలైక యా ఉమర్(ర)" అని పలకాలి. ఆతరువాత మస్జిదెనబవీ పరిధిలోనే తూర్పు వైపున వున్న జన్నతుల్ బఖీ వైపు తిరిగి "అస్సలాము అలైకుమ్ అహ్లద్దియారి మినల్ ముఅమినీన వల్ ముస్లిమీన వయర్‌హ ముల్లాహుల్ ముస్తఖ్‌దిమీన మిన్నా వల్ ముస్తాఖిరీన వఇన్నా ఇన్షా అల్లాహు బికుమ్ లాహిఖూన్" అని పఠించాలి. ఇక్కడ పదివేల మంది సహాబీల సమాధులున్నాయి.

*మదీనా దర్శించుకునే భాగ్యం దక్కించుకున్న అదృష్టవంతులు మీరు.... ఇక్కడి నుంచి నేర్చుకొని రండి. ఆ మహాప్రవక్త చూపిన బాటలోనే నడవాలని నియత్ చేసుకోండి. జాగ్రత్తగా గమనించండి. మక్కాలో మఖ్‌బరతుల్ మాల, మదీనాలో మఖ్‌బరతుల్ బఖీ మనకు ఇచ్చే సందేశం ఏమిటి? కొంత మంది మత పెద్దలు ఇంకా ఎందుకు ముస్లింలను మభ్య పెడుతున్నారు? మక్కా, మదీనాలో లేని సాంప్రదాయాన్ని మనం ఎందుకు అనుసరిస్తున్నాం. పుణ్య పురుషులు చనిపోయాక మూఢ జనం వారు చూపిన మార్గం*

*అనుసరించకుండా, వారి సమాధుల్ని ఎందుకు ఆరాధిస్తున్నారు. సజ్జాదేనషీన్, ముతవల్లీల సంపాదన కోసమే ముస్లింలని బకరాలుగా మార్చుతున్నారా? ఆ సమాధుల్ని అలంకరించడం, మొరపెట్టుకుంటూ మొక్కుబడులు చేస్తున్నారు. అమాయక జనం ఎంతో భక్తితో కొనుక్కున్న చాదర్‌లను మళ్ళీ మళ్ళీ అమ్ముకొని ముతవల్లిలు సొమ్ము చేసుకుంటూ దోచుకుతింటున్నారు. ఏకేశ్వరోపాసనకు వ్యతిరేకమైన ఈ వైఖరిని ఖుర్‌ఆన్ తీవ్రంగా ఖండిస్తోంది.*

*"సమాధుల్ని సందర్శించే స్త్రీలను, సమాధులపై ఆరాధనాలయాలు నిర్మించేవారిని, అక్కడ దీపాలంకరణ చేసేవారిని అల్లా క్షమించడు. (తిర్మిజి, అబూదావూద్, నసాయి) "జాగ్రత్త! మీకు పూర్వం గతించిన ప్రజలు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకునేవారు. ఈ చర్య నుంచి నేను మిమ్మల్ని వారిస్తున్నాను" (ముస్లిం)*

*"యూదులు, క్రైస్తవులు తమ ప్రవక్తల సమాధుల్ని ఆరాధనాలయాలుగా చేసుకున్నారు. అందువల్ల దేవుడు వారిని శపించాడు" (ముస్లిం, నసాయి) "వారిలో ఎవరైనా సత్పురుషుడు చనిపోయిన తరువాత వారతని సమాధిని ఆరాధనాలయంగా చేసివేస్తారు. అతని చిత్రాలను (విగ్రహాలను) తయారుచేస్తారు. ప్రళయదినాన వీరు యావత్తు సృష్టిలో పరమ నికృష్టులవుతారు. (బుఖారి, ముస్లిం)*

*నేడు ముస్లింలు మహాపురుషుల సమాధుల్ని పూలదండలు, గలేబులు, దీపాలతో ఆలంకరించి, వాటి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇవన్నీ షిర్క్‌కు దారితీసే విషయాలు. "షిర్క్" మనిషిని నేరుగా నరకానికి చేర్చుతుంది.*

# మజ్జిదే నబవి చరిత్ర - విస్తరణ

మదీనా చేరుకున్న మొహమ్మద్(స) మసీద్ నిర్మించడానికి పూనుకున్నారు. అయితే ఎక్కడ నిర్మించాలన్న అంశంపై అనుచరులతో చర్చించారు. ప్రవక్త సవారీ ఒంటె ఆగి, కూర్చున్న స్థలంలో నిర్మిద్దాం అనుకున్నారు. అయితే ఆ స్థలం నజ్జార్ వంశానికి చెందిన సహెల్, సుహైల్ అనే ఇద్దరు అనాథ బాలురది. పసితనంలోనే తండ్రిని కోల్పోయారు. ప్రస్తుతం వీరిద్దరూ హజ్రత్ అస్అద్(ర) సంరక్షణలో ఉన్నారు. ప్రవక్త మొహమ్మద్(స) ఆ ఇద్దరు పిల్లల్ని పిలిపించి మాట్లాడారు. పిల్లలు ఆ భూమిని ఉచితంగా ఇవ్వడానికి అంగీకరించారు. అయితే ప్రవక్త మొహమ్మద్(స) ఉచితంగా తీసుకోవడానికి ఒప్పుకోలేదు. అప్పట్లోనే 10 దినార్లు చెల్లించి ఆ స్థలం కొన్నారు.

ఖర్జురపు చెట్లు నరికి ఆ స్థలాన్ని చదును చేశారు. ఖిబ్లా వైపు ఖర్జురపు చెట్ల దూలాలను గోడలా పాతిపెట్టారు. ఐదు సార్లు నమాజ్ ఇక్కడే చేసేవారు. అప్పట్లో ఖిబ్లా బైతుల్ ముఖద్దస్ వైపు ఉండేది. ఆ తరువాత హి॥జి 2వ శకంలో ఖిబ్లాను అల్లా ఆజ్ఞ ప్రకారం కాబా వైపు మార్చారు. ఇలాగే కొంత కాలం గడిచింది. మొహమ్మద్(స) చూపిన మార్గంలో నడిచేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. నమాజ్‌కు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండటంతో మజ్జిదె నబవీ నిర్మాణాన్ని విస్తరించాలని నిర్ణయించారు. మొహమ్మద్ ప్రవక్తే స్వయంగా ఆయన చేతుల మీదుగా పునాదిలో రాళ్ళు వేశారు. ఆయన అనుచరులు ఇటుకలు మోసి నిర్మాణాన్ని ప్రారంభించారు. బంకమన్ను, పచ్చి ఇటుకల్ని ఈ కట్టడంలో వాడారు. ఖర్జురపు చెట్ల మ్రానులను దూలాలుగా ఉపయోగించారు. ఆకులతో కప్పు వేసి దాన్ని బంకమన్నుతో అలికారు. మసీదులో నమాజు చేయించే చోట ప్రసంగ వేదికగా ఓ ఖర్జూరపు మొద్దు కోసి నిలబెట్టారు. ఈ మసీదు నిర్మాణంలో ఖర్జూరపు ఆకులు, కర్రలు మొద్దుల్ని ఎక్కువగా ఉపయోగించారు. వర్షం పడినప్పుడు నీళ్ళు కట్టడంలోపలికి రావడంతో నేలంతా పచ్చిగా మారేది. ఆ పచ్చి నేలపైనే మొహమ్మద్ ప్రవక్తతో పాటు అనుచరులు నమాజ్ సమయ ప్రకారం చేసేవారు. వర్షపు నీటితో నేల తడిబారిపోతుండటంతో మసీదు లోపలి ప్రాంతంలో కంకర రాళ్ళతో చదును చేశారు. ప్రవక్త మొహమ్మద్(స) మసీద్ లోపల నడుం వాల్చితే కంకర రాళ్ళ గుర్తులు ఆయన శరీరంపై పడేవి. ఇది చూసి అనుచరులు బాధపడేవారు. దాదాపు పది ఏళ్ళ పాటు మజ్జిదే నబవీ నుంచే ఇస్లాం విస్తరణ కార్యక్రమాలు జరిగేవి. ప్రవక్త(స) ఇక్కడే వుండేవాళ్లు. అల్లాహ్ సందేశం, ఖురాన్ ద్వారా ప్రపంచం నలుమూలలకు ఇక్కడి నుంచే విస్తరించింది.

హి॥జి 7వ శకంలో మళ్ళీ మజ్జిదె నబవీని పునర్ నిర్మించారు. అప్పుడది 2,500 చదరపు మీటర్ల వైశాల్యంలో వుండేది. తరువాత రెండవ ఖలీఫా హ॥జత్ ఉమర్(ర) పాలనలో మరికొంత విస్తరణ జరిగింది. ఆ తరువాత మూడవ ఖలీఫా హ॥జత్ ఉస్మాన్(ర) పాలనలో హి॥జీ శకం 29లో మరొక సారి మసీదును పడగొట్టి పునర్నిర్మించారు. అప్పుడు ఆరడుగుల లోతు పునాదులు తవ్వి, పునాదులదాకా రాళ్ళు, గచ్చుతో నేల ఉపరితలం నుంచి పైవరకు పచ్చి ఇటుకలు, గచ్చుతో గోడలు నిర్మించారు. కప్పును సువాసన గల టేకు కలపతో నిర్మించారు.

హి॥జి శకం 88. ఖలీఫా వలీద్ బిన్ అబ్దుల్ మలిక్ పాలనలో మదీనా గవర్నర్‌గా ఉన్న హ॥జత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్(ర) నేతృత్వంలో మసీదు విస్తరణ, పునర్నిర్మాణం పనులు ప్రారంభించారు. నూతన నిర్మాణం హి.శ.91లో ముగిసింది. ఆ తరువాత

హి.శ.161–165 మధ్య ఖలీఫా మెహ్దీ అబ్బాస్ పాలన కాలంలో చుట్టుపక్కనున్న స్థలాల్ని ఇండ్లను కొని ఆ స్థలాలను కలుపుతూ మసీదును మరో సారి విస్తరించారు.

హి.శ. 656లో అబ్బాసీ ఖలీఫాల పాలనా కాలం ముగిసింది. ఈజిప్ట్ రాజుల పాలనా మొదలైంది. ఆ రాజులు మజ్జిదెనబవీ నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. వారిలో సుల్తాన్ అష్రఫ్ ముఖ్యుడు.

హి.శ. 886లో మజ్జిదె నబవీలో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే సుల్తాన్ పని ప్రారంభించి 84 గజాల పొడువు, 14 గజాల ఎత్తు విస్తరణతో మసీదును పునర్నిర్మించాడు. ఆ తరువాత హి.శ.1265లో ఉస్మానీ ఖలీఫాల పాలనలో ఎంతో శ్రేష్ఠమైన రీతిలో పునర్నిర్మాణం మొదలయి హి.శ.1277లో ముగిసింది. అప్పుడు దాని వైశాల్యం 4056 చదరపు మీటర్లు ఉండేది.

సౌదీ ప్రభుత్వం నెలకొన్న తరువాత హి.శ.1369 క్రీ.శ.1952లో సౌదీరాజు మలిక్ అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో మరింత విస్తరణతో 16,326 చదరపు మీటర్ల స్థలంలో మజ్జిదెనబవీ పునర్నిర్మాణం ప్రారంభమయి క్రీ.శ. 1955లో పూర్తయింది. అప్పుడీ మసీదు పొడవు 128 మీటర్లు, వెడల్పు 91 మీటర్లు ఉండేది. 232 స్థంభాలు కలిగిన ఈ మసీదు వెలుపల నాలుగు మూలలా 72 మీటర్ల ఎత్తు గల నాలుగు మీనార్లు నిర్మాంచారు. హజ్ యాత్రికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నందువల్ల షాహ్ ఫైసల్ కాలంలో 1973లో మసీదు పశ్చిమభాగాన 5 కోట్ల రియాళ్ళతో 35వేల చదరపు మీటర్ల స్థలం సేకరించి షెడ్డులు నిర్మించారు.

సౌదీ రాజుల కాలంలో రెండవ విస్తరణ షాహ్ ఫహద్ బిన్ అబ్దుల్ అజీజ్ పాలనలో జరిగింది. మొదటి విస్తరణకు తొమ్మిది రెట్లు ఎక్కువ విస్తరణ జరగడంతో మజ్జిదె నబవీ చరిత్రలో దీన్ని గొప్ప విస్తరణగా చెప్పవచ్చు. సాధ్యమైన సమస్త సౌకర్యాలతో విస్తరణ పనులు 1985లో ప్రారంభమయి 1994లో ముగిశాయి.

ఆనాటి నుంచి ఈనాటి వరకు మజ్జిదెనబవీ రూపురేఖలు దాదాపు అలాగే ఉన్నాయి. ఈ విస్తరణలో ద్వారాలు, స్తంభాలు, కప్పులు, నగిషీలు పాతకట్టడంలో లాగానే ఉన్నాయి. ఈ రెండు కట్టడాలు కలిపివేసినప్పటికీ కాస్త జాగ్రత్తగా చూస్తే తేడా కన్పిస్తుంది. కొత్త కట్టడం కింద భూగర్భ అంతస్తులున్నాయి. మసీదు లోపలి భాగం పాలరాతి ఫ్లోరింగ్‌తో, 2104 పిల్లర్లతో 82వేల చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగివుంది.

మసీదు మొత్తం కప్పు ఒకే బ్లాకుగా కాకుండా అనేక బ్లాకులుగా నిర్మించారు. వాటిలో గోపురాకారంలో ఉండే 27 బ్లాకులను కదిలే కప్పులుగా నిర్మించారు. అంటే,

అవసరమైనప్పుడు సహజసిద్ధమైన గాలి, వెల్తురు రావడానికి వీలుగా వీటిని యంత్రాల ద్వారా పక్కకు లాగి పెట్టవచ్చు. ఈ గోపురాకారపు కప్పుల పైభాగాలు జర్మన్ సిరామిక్‌తో తయారుచేశారు. లోపలిభాగం కలపతో చేసి దాని మీద వివిధ రకాల నగిషీలు చెక్కారు. కొన్ని చోట్ల స్వచ్ఛమైన బంగారపు తీగలు కూడా పూశారు. మేము మసీదులో ఉన్నప్పుడు పైనుంచి ఎండ రావడం గమనించి తల పెకెత్తి అలా చూస్తూ వుండిపోయాం. మా తలపై వున్న కప్పు మెల్లమెల్లగా పక్కకు జరుగుతూ నీలాకాశం కన్పించింది. టెక్నాలజీని పూర్తిగా వినియోగించి పిల్లర్లకు గోదుగులు అమర్చారు. రిమోట్ ద్వారా దీన్ని ఆపరేట్ చేస్తున్నారు. చతుస్రాకారపు గొడుగులా లావుపాటి కాన్వాస్ గుడ్డతో కట్టిన పందిరిలా ఇవి ఉపయోగపడుతున్నాయి.

మజ్జిదెనబవీ వెలుపల నాలుగు వైపులా 2,35,000 చదరపు మీటర్ల విశాలమైన ఆవరణలు ఉన్నాయి. ఆవరణ కింద భూగర్భ అంతస్తుల్లో ఉజూ, స్నానశాలలు, కార్‌పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. భూగర్భంలో రెండు అంతస్తులోపలికి వెళ్ళడానికి ఎస్కలేటర్లు ఉన్నాయి.

ప్రస్తుతం మజ్జిదె నబవీలో ఒకే సారి ఏడు లక్షల మంది నమాజ్ చేయడానికి చోటు వుంది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఒకేసారి లక్షా 78వేల మంది నమాజ్ చేయవచ్చు. మసీదు కప్పుపై 90వేల మంది నమాజీలకు చోటు వుంది. మసీదు ఆవరణలో ఒకేసారి 4 లక్షల 30 వేల మంది నమాజ్ చేయవచ్చు.

మజ్జిదె నబవీలో 10 దర్వాజాలున్నాయి. ఖిబ్లా (సౌత్ సైడ్) వుంది. అందుకనే అటువైపు దర్వాజా పెట్టలేదు. ఈస్ట్ వైపు మూడు దర్వాజాలు ఉన్నాయి. 1. బాబె జిబ్రయీల్, 2. బాబున్నిసా, 3. బాబె అబ్దుల్ అజీజ్.

బాబె జిబ్రయీల్, బాబున్నిసా పాత దర్వాజాలు. బాబె అబ్దుల్ అజీజ్ దర్వాజాను సౌదీ ప్రభుత్వం అదనంగా ఏర్పాటుచేసింది.

వెస్ట్ సైడ్ నాలుగు దర్వాజాలను ఏర్పాటు చేశారు. బాబుస్సలాం, బాబె అబూబకర్ సిద్దీఖ్, బాబుర్రహ్మ, బాబుస్సవూద్.

ఇందులో బాబుస్సలాం, బాబుర్రహ్మ దర్వాజాలు పురాతనమైనవి. బాబె అబూబకర్ సిద్దీఖ్, బాబుస్సవూద్ దర్వాజాలను సౌదీ ప్రభుత్వం నిర్మాణ సమయంలో అదనంగా ఏర్పాటు చేసింది. అబూబకర్ సిద్దీఖ్(ర) ఇల్లు వున్న స్థలం మజ్జిద్ నిర్మాణంలో తీసుకున్న సందర్భంగా అక్కడ దర్వాజా ఏర్పాటుచేసి దాని పేరు బాబె అబూబకర్ సిద్దీఖ్‌గా పెట్టారు.

మజ్జిదెకే షిమాల్ వైపు మూడు దర్వాజాలు ఏర్పాటు చేశారు.
బాబె ఉమర్, బాబె అబ్దుల్ మజీద్ అల్ మారూఫ్ బాబె మజీది, బాబె ఉస్మాన్.

బాబె మజీది దర్వాజాను తుర్కి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని నిర్మాణం హిజ్రి 1265లో జరిగింది. సౌదీ ప్రభుత్వం చేపట్టిన పునర్ నిర్మాణంలో బాబె ఉమర్, బాబె ఉస్మాన్ దర్వాజాలను ఏర్పాటుచేసింది.

మసీదు కప్పు మీద, ఆవరణల్లో బాగా ఎండ తగిలే చోట గ్రీస్ దేశానికి చెందిన శీతల పాలరాళ్ళు పరచబడ్డాయి. ఇవి తీక్షణమైన ఎండకు కూడా వేడెక్కవు. మసీదు లోపలా బయటా ప్రతి వేళా నమాజు ముగిసిన వెంటనే ఎప్పటికప్పుడు క్లీనింగ్ మిషన్‌ల ద్వారా శుభ్రపరుస్తూనే వుంటారు.

# రియాజుల్ జన్న (జన్నత్ కీ క్యారీ)

ఇక్కడ నఫిల్ నమాజ్ చేసి దరూదో సలాం పఠించాలి. దువా చేయాలి. జన్నత్‌లోని కొంత ప్రదేశం ఇక్కడ వుంది. ఖయామత్ రోజు ఇది పైకి వెళ్ళి పోతుంది. మజ్జిదె నబవీలో బాబె జిబ్రయిల్ దర్వాజా ద్వారా ప్రవేశించి కుడివైపు తిరిగితే ఒక ఇల్లు లాంటి ప్రదేశం కన్పిస్తుంది. ఈ స్థలంలోనే హజ్రత్ ఫాతిమ(ర) ఇల్లు వుండేది. ఈ ప్రదేశం నుంచి ముందుకు వెళ్తుంటే వెంటనే కుడివైపు వున్న స్థలమే రియాజుల్ జన్న. మొహమ్మద్ ప్రవక్త నమాజ్ చేయించే స్థలం--హజ్రత్ ఆయిషా(ర) ఇల్లు మధ్య వున్న స్థలమే రియాజుల్ జన్న.

రోజే ముబారక్ హజ్రత్ ఆయిషా(ర) ఇంట్లోనే వుంది. రియాజుల్ జన్నలో ప్రవక్త ముసల్లా వుంది. ఇక్కడ ఆయన నిలబడి ఇమామత్ నమాజ్ చేయించేవారు. ప్రస్తుతం ఇక్కడ మెహెరాబ్ నిర్మించారు. దీన్నే మహెరాబె నబవి అంటారు. హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్(ర) పాలనకాలంలో ఈ స్థలం పవిత్రతను కాపాడే విధంగా ప్రవక్త నిలబడిన స్థలం విడిచి మిగతా స్థలంలో గోడ నిర్మించి మహెరాబ్ నిర్మించారు. హాజీలు వెళ్ళి అక్కడ నమాజ్‌లో సజ్దా చేసినప్పుడు ప్రవక్త పాదాలున్న స్థలం వుండేలా మహెరాబ్‌ను తీర్చి దిద్దారు. తొమ్మిది ఫీట్ల ఒకే పాలరాయిపై బంగారపు పోతతో డిజైన్ చేశారు. మహెరాబ్‌కు రెండు వైపులా ఎర్ర పాల రాయితో పిల్లర్లలను ఏర్పాటు చేశారు. మహెరాబ్‌పైన దరూదె షరీఫ్ చదవండని రాసివుంది. రియాజుల్ జన్నలో నిలబడి రెండు రకాత్‌లు 'తహియ్యతుల్ మజ్జిద్' నమాజ్ చదవాలి. **మనిషి బ్రతికుండగానే జన్నత్‌లో సజ్దా చేసే అదృష్టం రియాజుల్ జన్నలో దొరుకుతుంది.**

# ఏడు పిల్లర్లు

మజ్జిదె నబవీలోని అడుగడుగు, ప్రతి ప్రదేశానికి పవిత్రమైన చరిత్ర వుంది. రియాజుల్ జన్న సమీపంలో వున్న ఏడు పిల్లర్లను పాలరాయితో దానిపై బంగారు పూతతో అందంగా తీర్చిదిద్దారు.

1. సుతూనె ఆయిషా:

ప్రవక్త(స) చెబుతుండేవారు. మజ్జిదె నబవీలో ఓ పవిత్రప్రదేశం వుంది. అక్కడ నమాజ్ చేస్తే వచ్చే ప్రయోజనం తెలిస్తే పోటీపడతారు. ప్రవక్త తరువాత (హుజూర్ కే పర్దా ఫర్మానేకే బాద్ ) ఆ స్థలాన్ని హజ్రత్ ఆయిషా చూపించారు. అదే సుతూనె ఆయిషా.

2. సుతూనె అబూ లుబాబ:

ప్రవక్త(స) అనుచరుడైన హజ్రత్ అబూ లుబాబకు క్షమాభిక్ష ఇక్కడే దొరికింది. ఆయన తనకు తాను ఈ పిల్లర్‌కు కట్టుకున్నారు.

3. సుతూనె వఫూద్:

మొహమ్మద్ ప్రవక్త(స) బయటి నుంచి వచ్చే వారితో ఇక్కడే కలిసే వారు. ఆధ్యాత్మిక అంశాలపై చర్చించేవారు.

4. సుతూనె సదీర్ :

ప్రవక్త(స) ఇక్కడే ఏతికాఫ్‌లో వుండేవారు. ఆయన పడక కూడా ఇక్కడే ఏర్పాటు చేసుకునేవారు.

5. సుతూనె అలి, సుతూనె హర్రిస్:

హజ్రత్ అలీ రాత్రి పూట ఇక్కడే వుంటూ నమాజ్ చేసుకుంటూ వుండేవారు. ఆయన బాధ్యత ఏమిటంటే బయటి నుంచి వచ్చే వారిపై నిఘా వేయడంతో పాటు ప్రవక్త(స)పై ఇతరులు దాడిచేయకుండా చూసుకోవడం.

6. సుతూనె తహజ్జుద్ :

మొహమ్మద్ ప్రవక్త(స) ఇక్కడే తహజ్జుద్ నమాజ్ చేసేవారు. హజ్రత్ జిబ్రయీల్ వహీ ఈ ప్రదేశానికే తెచ్చేవారు.

7. సుతూనె హన్నాన:

ఇది మహెరాబ్ సొల్లల్లాహు అలైహి వ సల్లమ్‌కు దగ్గరలో వుంది. ప్రవక్త(స) ఎప్పుడు ఇక్కడే ఖర్జూరపు చెట్టు మ్రాను భాగాన్ని ఊతగా చేసుకొని నిలబడి ఖుత్బ ప్రసంగం చేసేవారు. ఆ రోజు నమాజ్ తరువాత అనుచరులతో ముచ్చటిస్తుంటే ఒకతను

కలపతో చేసిన ప్రసంగ వేదిక తీసుకొని మసీదులో ప్రవేశించాడు. యా మొహమ్మద్ మీ కోసం నేడు మూడు మెట్లతో కూడిన ఓ మింబర్ తయారుచేసి తెచ్చాను. మీరు అనుమతిస్తే దీన్ని ఇక్కడ ప్రతిష్ఠిస్తాను. అన్నాడా వ్యక్తి. ప్రవక్త(స) దాని చూసి సరే, అలాగే చెయమన్నారు. అప్పుడా వ్యక్తి దాన్ని సముచిత స్థానంలో కదలకుండా పెట్టేశారు. అప్పుడు మొహమ్మద్ ప్రవక్త(స) ఆ వేదికపై కూర్చొని ఉపన్యసిస్తున్నారు. అంతలో మసీదులోనే ఎవరో ఏడుస్తున్న ధ్వని విన్పించసాగింది. ప్రవక్త(స) అనుచరులు నిర్ఘాంతపోయి నలువైపులా చూశారు. కాని మసీదులో ఎక్కడా ఏడుస్తున్న మనిషి ఛాయలు కన్పించలేదు. కాస్త పరికించి చూస్తే ఆ ధ్వని మొదట ప్రసంగ వేదికగా నిలబెట్టిన ఖర్జూరపు మ్రాను నుంచి వస్తున్నట్లు తెలిసింది. ఆసక్తిగా  దానివైపు చూడసాగారు. ప్రవక్త(స) ఇక తనపై నిలబడరని, ఆ అదృష్టం ఇక తనకు లేదని అది రోదించింది. ప్రవక్త మొహమ్మద్(స) వెంటనే లేచి ఆ మ్రానును గుండెలకు హత్తుకున్నారు. దాన్ని చేత్తో మృదువుగా నిమిరారు. అప్పుడు అందులో నుంచి రోదన ధ్వని రావడం ఆగిపోయింది. ఈ ఏడు చోట్ల కూడా నఫిల్ నమాజ్ చేసి అస్ త గఫార్ చదవాలి.

# సుఫ్ఫహ్

మజ్జిదె నబవీ నార్త్ ఈస్ట్ వైపు చబుతర వుంది. బాబె జిబ్రయిల్ దర్వాజా నుంచి ప్రవేశిస్తే మహెరాబే తహజ్జుద్‌కు ముందు రెండు ఫీట్‌ల ఎత్తు 40 ఫీట్‌ల పొడవు, వెడల్పుతో వుంది. ఈ చబుతర ముందు ప్రవక్త(స) అనుచరులు కూర్చునే వారు. చబుతరపై ఖురాన్ నేర్చుకునేవారు. ప్రవక్త(స) ముఖ్య అనుచరులంతా ఇక్కడే వుండేవారు. వారికి ఇంటికెళ్ళాలనే ధ్యాశ వుండేది కాదు. వీరిని అహ్లె సుఫ్ఫ అనేవారు.

# మింబర్

మొహమ్మద్ ప్రవక్త(స) మూడు మెట్ల కలపవేదిక మొదటి మెట్టు మీద కూర్చొని రెండవ మెట్టుపై కాళ్ళు పెట్టుకునేవారు. తరువాత మొదటి ఖలీఫాగా వచ్చిన హజ్రత్ అబూబకర్(ర) రెండవ మెట్టు మీద కూర్చొని మూడవ మెట్టుపై కాళ్ళు పెట్టుకునేవారు. రెండవ ఖలీఫాగా వచ్చిన హజ్రత్ ఉమర్(ర) మూడవ మెట్టు మీద కూర్చొని కాళ్ళు నేల మీద పెట్టుకునే వారు. నాల్గవ ఖలీఫాగా వచ్చిన హజ్రత్ ఉస్మాన్(ర) కూడా ఆరేండ్ల వరకు అలాగే చేశారు. తరువాత ఆయన దైవప్రవక్త(స) కూర్చొనే స్థానం మీద కూర్చోవడం ప్రారంభించారు.

మొట్టమొదట హి.శ.8వ ఏట తయారుచేసిన ఈ మింబర్‌కు హజ్రత్ ముఆవియా(ర) పాలనలో మరో ఆరు మెట్లు కలిపి తొమ్మిది మెట్ల మింబర్‌గా పునర్నిర్మించారు. అప్పట్నుంచి ఆ మింబర్‌పై నుంచే ప్రసంగించే ఇమాంలు ఏడవ మెట్టు మీద కూర్చునే వారు. ఎనిమిదో మెట్టు మీద నిలబడి ఉపన్యాసం (ఖుత్బా) ఇచ్చేవారు. తరువాత హి.శ. 654లో మజ్జిదెనబవీ అగ్నిప్రమాదానికి గురయినప్పుడు ఈ మింబర్ కూడా కాలి పోయింది. అందువల్ల దాని స్థానంలో యమన్‌రాజు మలిక్ ముజప్ఫర్ ఒక కొత్త మింబర్ తయారుచేయించి పెట్టించాడు.

మింబర్ కాలక్రమంలో అనేక మార్పులు చెందుతూ హి.శ.998 నాటికి ప్రస్తుత రూపం సంతరించుకుంది. ఈ సరికొత్త ప్రసంగవేదికను రెండవ సుల్తాన్ మురాద్ ఉస్మానీ కానుకగా సమర్పించుకున్నాడు. వివిధ రకాల డిజైన్లతో మంచి ఫినిషింగ్‌తో అత్యంత సుందరమైన ఈ ప్రసంగవేదిక ఇప్పటికీ మజ్జిదె నబవీలో కనిపిస్తోంది.

దైవప్రవక్త (స) తన ప్రసంగవేదిక (మింబర్)ను గురించి ప్రస్తావిస్తూ 'నా ఇంటికి, నా మింబర్‌కు మధ్య ఉన్న చోటు స్వర్గ వనాలలో ఒక వనంగా వుంది. నా మింబర్ కౌసర్ సరస్సు అని అన్నారు. (బుకారి)

# మఖ్‌బరతుల్ బఖీ

ఇక్కడే ప్రవక్త(స) అనుచరులు, కుటుంబసభ్యుల సమాధులు వున్నాయి. మొదటి సారిగా ఇక్కడ ఖననం చేసింది ప్రవక్త(స) సోదరులు హజ్రత్ ఉస్మానెగని(ర) బిన్ మజ్ ఊన్ , ఆ తరువాత ప్రవక్త(స) కుమారుడు హజ్రత్ ఇబ్రాహీం, ప్రవక్త(స) కుమార్తె హజ్రత్ రుఖయ్య(ర), హజ్రత్ అలీ తల్లి హజ్రత్ ఫాతిమా, హజ్రత్ అబ్దుర్రహ్మాన్, హజ్రత్ సహద్ బిన్ జరార(ర) (ప్రవక్త(స) బాబాయి)

ఉమ్ముల్ మొఅమినీన్ 1. హజ్రత్ ఆయిషా(ర) 2. హఫ్‌స(ర) 3. సౌద(ర) 4.జయ్‌నబ్ బిన్ హజష్(ర) 5. ఉమ్మెసల్‌మ(ర) 6. జువేరియా (ర) 7. హబీబ(ర) 8. సఫియా(ర).

ప్రవక్త(స) కుమార్తెలు హజ్రత్ ఫాతిమ(ర), రుఖయ్య(ర), జయనబ్(ర), ఉమ్మె కుల్‌సుమ్(ర), హజ్రత్ ఇబ్రాహీం(ర), హసన్ బిన్ హజ్రత్ అలి, జైనుల్ ఆబిదీన్ (ర), అబూ జాఫర్ ముమహ్మద్ బాఖర్(ర), జాఫర్ సాధిఖ్(ర), అబ్బాస్(ర).

మొహమ్మద్ ప్రవక్త(స) అత్తయ్య హజ్రత్ సఫియా బిన్త్ అబ్దుల్ ముతల్లిబ్ (ర), సోదరుడు అబూ సుఫియాన్ బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముతల్లిబ్(ర), సఅద్ బిన్ మాజ్(ర),

అబూ సయీద్ ఖుద్‌రి(ర), ప్రవక్త(స)ను పెంచిన అమ్మ దాయి హలీమా సాదియ(ర), హజ్రత్ మాలిక్ బిన్ అనస్(ర), వీరితో పాటు వేలాది మంది ప్రవక్త అనుచరులు ఇక్కడ విశ్రాంతి తీసుకుంటున్నారు. అసర్ నమాజ్ తరువాత లోపలికి వెళ్ళడానికి అనుమతిస్తారు.

# బదర్ మైదానం

మదీనా నగరానికి నైరుతి దిశలో 80 మైళ్ళ దూరంలో వుంది బదర్ మైదానం. ముస్లింలకు వారి శత్రువులకు తొలి యుద్ధం ఇక్కడే జరిగింది. మొహమ్మద్ ప్రవక్త(స) విజయం సాధించారు. బదర్ యుద్ధం తరువాత అరేబియా మొత్తం ముస్లింలకు ప్రతికూలంగా విజృంభించింది.

అబూ సుఫ్యాన్ నాయకత్వంలో కురైషీ వ్యాపార బృందం సిరియా నుండి తిరుగుప్రయాణమైంది. మదీనాకు సమీపంలో వచ్చిన వీరికి భయం పట్టుకుంది. తమ వద్ద 50 వేల సవరాల విలువ చేసే సరుకు వుంది. తమ బృందంలో నలభై మంది మాత్రమే వున్నారు. మదీనాలోని ముస్లింలు దాడి చేస్తే పరిస్థితి ఏమిటి? ఆలోచనలో పడ్డాడు అబూ సుఫ్యాన్.

తమ వద్ద వున్న సరుకును రక్షించుకోవాలి. మరో వైపు పాత శత్రువును అణిచివేయాలనే ఆలోచనలతో ఓ పథకాన్ని రచించాడు. ఒక వ్యక్తి ద్వారా మక్కాకు కబురు పంపాడు. ఖురైషీ వ్యాపార బృందాన్ని మదీనా ముస్లింలు దోచుకున్నారని... సహాయం చేయడానికి వెంటనే తరలిరావాలంటూ ఆ వ్యక్తి మక్కాలో ప్రచారం ప్రారంభించాడు.

ఈ బృందంతో వచ్చే సరకు చాలా మందికి చెందినది కావడం వల్ల అదొక సమిష్టి సమస్యగా పరిణమించింది. ఈ వార్త విన్న మక్కా యువకులు రగిలి పోయారు. మదీనా ముస్లింలతో పోరాటానికి వెయ్యి మంది యువకులతో ఓ దళం తయారయింది. ఇందులో అన్ని తెగలకు చెందిన యువకులున్నారు. ముస్లింలను ఒకేసారి అంతమొందించాలన్న సంకల్పంతో ఆవేశంగా మక్కా నుండి బయలుదేరారు. భారీగా యుద్ధసామాగ్రి, వందకు పైగా తెగల ప్రముఖ నేతలు తరలి రాగా ఉతబా బిన్ రబీయా వారికి నాయకత్వం వహించాడు.

ఖురైషీలు చేస్తున్న కుట్ర సమాచారం మదీనాలో మొహమ్మద్ ప్రవక్త(స)కు అందుతూనే వుంది. తాను మదీనా వచ్చి రెండేళ్ళయినా కాలేదు. ముహాజిర్‌లు తమ సర్వస్వాన్ని మక్కాలోనే వదిలేసి వట్టి చేతులతో వచ్చేశారు. అన్సార్‌లకు యుద్ధరంగంలో

అంత అనుభవం లేదు. యుద్ధం జరిగితే ముస్లింలంతా అంతమయ్యే ప్రమాదం వుంది. ఒక వేళ మక్కా వాళ్ళు దాడి చేయకుండా బలాన్ని ఉపయోగించి తమ వర్తక బృందాన్ని సురక్షితంగా తీసుకువెళ్ళినా ఆ తరువాత చుట్టుపక్కల వున్న తెగల వాళ్ళు ముస్లింలను లొంగదీసుకోవడానికి వెనుకాడరు. మదీనా యూదులు కూడా విజృంభించే అవకాశం వుంది. పరిస్థితుల్ని సమీక్షించిన ప్రవక్త మొహమ్మద్ (స) ముహాజిర్లను, అన్సార్లను సమావేశపరిచారు. ఒక వైపున మదీనా ఉత్తర దిశలో వర్తక బృందం, రెండో వైపున దక్షిణాన ఖురైష్ సైన్యం ఉన్నాయి. ఈ రెంటిలో ఏదయినా ఒక దానిపై మీకు విజయం ప్రాప్తమవుతుందని అల్లాహ్ వాగ్దానం చేశాడు. ఇక చెప్పండి, మీరు దేనితో పోరాడదలచుకున్నారో!'

వర్తక బృందాన్ని ముట్టడించాలని చాలామంది సూచించారు. కాని ప్రవక్త(స) దూరదృష్టితో మక్కా నుంచి వస్తున్న సైనిక దళాన్నే ఎదిరించేందుకు పోవాలని నిర్ణయించారు. ముస్లిం దళాన్ని రూపొందించారు. చాలా బలహీనంగా వుంది. పోరాడే వ్యక్తులు మూడు వందల మంది మాత్రమే వున్నారు. ఇద్దరి వద్ద గుర్రాలున్నాయి. ఒంటెలు 70కు మించి లేవు. కేవలం 60 మంది వద్ద కవచాలున్నాయి. సరైన ఆయుధ బలం, చాలినంత సైనికులు లేనప్పటికీ కేవలం 313 మంది ముస్లింలతో ప్రవక్త మదీనా నుంచి బయల్దేరారు. హి.శ. 2వ సంవత్సరం. రంజాన్ నెల 12వ తేదీన దక్షిణ దిశ వైపునకు పయనమయారు. రంజాన్ 16వ తేదీన బదర్ సమీపాన చేరారు.

అటువైపు నుంచి ఖురైష్ సైన్యం వస్తోంది. లోయకు ఆవలి వైపుకు వచ్చి చేరినట్లు తెలియడంతో ప్రవక్త(స) ఆదేశానుసారం అక్కడే గుడారాలు వేశారు. ఆ ప్రాంతమంతా ఇసుకతో నిండింది. సైనికుల కాళ్ళు దిగబడుతు ఉన్నాయి. అటు వైపు ఖురైషీలు గుడారాలు వేసిన ప్రాంతం గట్టి నేల.

సహచరులంతా నిద్దురపోతున్నారు. ప్రవక్త(స) రాత్రంతా నమాజ్ చేస్తూ జాగరణ చేస్తున్నారు. ఇంతలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. వర్షం వల్ల ఇసుక నేల గట్టి పడింది. ముస్లింలకు మైదానం అనుకూలంగా తయారైంది. సమీపంలో ఉన్న గుంటలు, చెరువులు నిండిపోయాయి. దాని వల్ల స్నానాలకు, వుజూ చెయ్యడానికి సౌకర్యం కలిగింది. మరో వైపు వర్షం కారణంగా ఖురైషీలు గుడారాలు వేసిన చోట బురద అయింది. వారి కాళ్ళు దిగబడసాగాయి. రంజాన్17న ఫజ్ర్ నమాజ్ తరువాత జిహాద్ గురించి ప్రవక్త(స) ప్రసంగించారు. సైనికుల పంక్తుల్ని సక్రమంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు ముస్లింలు పూర్తి సంతృప్తితో పోరాటానికి సమాయత్తమయారు. సరైన యుద్ధ సామాగ్రి లేని 313

మంది సైనికులు ఒక వైపు, సర్వసన్నాహాలతో వెయ్యికి పైగా తరలి వచ్చిన ఖురైషీ సైనం మధ్య భీకర పోరు కొనసాగింది.

ఈ పోరులో ముహాజిర్లకు సంక్లిష్టమైన పరీక్ష ఎదురైంది. శత్రువుల్లో వారి సోదరులు, కొడుకులు, బంధువులు ఎదురైయారు. ఒకరి తండ్రి, మరొకరి పుత్రుడు, బాబాయి, మామ. తమ ఆత్మీయుల్ని తమ చేతులారా ముక్కలుగా ఖండించే క్లిష్టపరిస్థితి ఏర్పడింది. అల్లా ఏ సంబంధాలను త్రుంచి వెయ్యాలని ఆదేశించాడో వాటిని అవి తమకు ఎంత ప్రియమయినా త్రుంచి వేస్తామని, ప్రవక్త(స) అసత్యవాదని నిరూపించడానికి వచ్చిన ఖురైషీలకు గుణపాఠం నేర్పడానికి ముహాజిర్లు వీరోచితంగా పోరాడారు. ఖురైషీ సైనికులు 70 మంది హతమైయారు. మరో 70 మంది ఖైదీలైయారు. హతమయిన వారిలో పెద్ద పెద్ద తెగలకు చెందిన ప్రముఖ నేతలున్నారు. వాళ్ళలో ఉతబా, షీబా, అబూజహల్, సమ్అ, ఆస్, ఉమయ్యాల మరణంతో ఖురైషీ సైనికుల వెన్ను విరిగింది. ముస్లింలలో ఆరుగురు మహాజిర్లు, ఎనిమిది మంది అన్సార్లు అమరగతులయ్యారు. మొహమ్మద్ ప్రవక్త(స) యుద్ధ ఖైదీల్ని సహాబా(సహచరుల్లో) ఒక్కొక్కరికి ఇద్దరిని, నలుగురిని పంచివేశారు. వారి ఎడల సత్ప్రవర్తనతో మెలగాలని ఆదేశించారు. ఖైదీలను సుఖంగానే ఉంచారు. ఎన్నో సార్లు తామే స్వయంగా కష్టాల్ని సహించి వారికి కష్టం కలగనివ్వలేదు. ఇది చూసి ఖైదీల మనస్సు మారింది. చాలా మంది ఇస్లాం స్వీకరించారు. నష్టపరిహారం ఇచ్చి కొంత మంది ఖైదీలు విడుదల కాగా చదవడం, రాయడం తెలిసిన ఖైదీలు కనీసం పదిమంది పిల్లలకు చదువు చెప్పి విడుదలయ్యారు.

మదీనా అన్సార్‌లపై ఇప్పటి వరకు ముస్లింలకు ఆశ్రయమిచ్చారనే ఆరోపణలుండేవి. కాని ఇప్పుడయితే వారు బాహాటంగా ఇస్లామీయ ఉద్యమంతో సహకరిస్తూ దాన్ని విశ్వసించని వారితో ఘర్షణకు బయల్దేరి వచ్చారు. అంటే వారు అరేబియా మొత్తాన్ని తమ నగరానికి శత్రువుగా చేసుకున్నారు. వాస్తవంగా మదీనా జనాభా అప్పట్లో ఒక వెయ్యికి మించి లేదు. అల్లా, మొహమ్మద్ ప్రవక్త(స) పై ఉన్న విశ్వాసం వారికి ఈ కీలక నిర్ణయం తీసుకునేటట్లు చేసింది.

*"యా అయ్యుహల్లజీన ఆమనూ యిజా లఖీతుమ్ ఫిఅతన్ ఫస్‌బుతూ వజ్‌కురుల్లాహ కసీరల్ల అల్లకుమ్ తుఫ్‌లిహూన్. వ అతీ ఉల్లాహ వరసూలహూ వలా తనాజఊ ఫతఫ్షలూ వతజ్‌హబరీహుకుమ్ వస్‌బిరూ ఇన్నల్లాహ మఅస్సాబిరీన్."*

"ఓ విశ్వాసులారా! మీరు విరోధుల్ని ఎదుర్కొనేటప్పుడు స్థైర్యంతో ఉండండి. మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తే, మీరు సాఫల్యం పొందవచ్చు. అల్లాకు, ప్రవక్తకు

విధేయులై ఉండండి. పరస్పరం కలహాలకు గురికాకండి. అలా చేస్తే మీరు బలహీనులవుతారు. సహనం వహించండి. నిశ్చయంగా అల్లాహ్ సహనం వహించేవారితో ఉంటాడు." ఇక్కడ సహనం అనే పదంలో ఈ క్రింది భావాలు అంతర్లీనమై ఉన్నాయి.

1. తమ భావోద్రేకాల పట్ల, మనోవాంఛల పట్ల నిగ్రహం పాటించాలి.

2. తొందరపాటుకు, ఆందోళనకు, భీతికి లోను కారాదు.

3. ఎలాంటి ప్రలోభాన్ని, లాలసను, అనుచితమైన ఆవేశాన్ని దరి చేరనివ్వరాదు. ప్రతి పనిని ప్రశాంత హృదయంతో బాగా ఆలోచించి చేసిన నిర్ణయాల ప్రకారం పూర్తి చేయాలి.

4. అపాయాలు, ఆపదలు ఆసన్నమైనప్పుడు అడుగులు తడబడకూడదు.

5. కోపతాపాలకు, ఆగ్రహావేశాలకు లోనయి ఎలాంటి అనుచిత కార్యం చేయకూడదు.

6. కష్టాలు వచ్చిపడి పరిస్థితులు మన ఆశలకు భిన్నంగా తారుమారు అయినట్లు కనిపిస్తే కంగారు వల్ల ఆందోళన పడి స్థిమితాన్ని కోల్పోకూడదు.

7. లక్ష్యాన్ని సాధించే ఆసక్తి అవధులు దాటి తొందరపాటుతో లోపభూయిష్ట మైన విధానాన్ని అవలంభించకూడదు.

8. ప్రాపంచిక లాభాలు, ప్రలోభాలు మనస్సును లోబరుచుకోవడం వల్ల వాటి సమక్షంలో బలహీనత కనబరచి వాటికి లొంగిపోకూడదు. మారిన ఈ పరిస్థితుల్లో విశ్వసించిన వారిని, వారి సహనాన్ని ఈ విధంగా కూడా పరీక్షించవలసి ఉంటుంది.

బదర్ యుద్ధం తరువాత అరేబియా మొత్తం ముస్లింలకు ప్రతికూలంగా విజృంభించింది. రణభూమిలో హతమయిన మక్కా నాయకుల ప్రతీకారం కొరకు అనేక హృదయాలు తహతహలాడాయి. అరేబియాలో ఏ ఒక్కని హత్య అయినా తరతరాల వరకు ఘర్షణ కొనసాగుతూనే వుంటోంది. అలాంటిది వందల సంఖ్యలో ప్రముఖ తెగనేతలు ప్రాణాల్ని కోల్పోయారు. ప్రతీకారం తీర్చుకోవడానికి ఆ తెగలు రగలిపోతున్నాయి. మరో ప్రక్క యూదు తెగలు సైతం పాత ఒడంబడికలను ఖాతరు చేయడం లేదు. 'బనూ నజీర్' తెగ నాయకుడైన కాఅబ్ బిన్ అష్రఫ్ కుట్రచేసి ముస్లింలకు వ్యతిరేకంగా సమీకరణలు ప్రారంభించాడు. బద్ర్ యుద్ధం లో ఓడిపోయిన మక్కా అవిశ్వాసులు, యూదు తెగలతో కలిసి కుట్రలు పన్నడం ప్రారంభించారు. బనీఖైనుఖాతెగ ఈవిషయంలో హద్దుమీరి ప్రవక్త(స)ను హత మార్చడానికి పకడ్బందిగా వ్యూహం పన్నింది. దీన్ని పసిగట్టిన ప్రవక్త(స) వారిపై ఎదురుదాడి చేశారు. చివరికి వారు సంధి చేసుకొని మదీనా వదిలిపోయారు. బనీనజీర్ అనే మరో యూదుతెగ మక్కా అవిశ్వాసులతో చేతులుకలిపి యుద్ధానికి బరితెగించింది. దీంతో ఉహుద్ యుద్ధం అనివార్యమైంది.

# ఉహుద్ యుద్ధం

బదర్ యుద్ధం ముగిసి ఏడాది కూడా కాలేదు. అంతర్గతంగానూ ముస్లింల పరిస్థితి అంత మెరుగ్గా లేదు. మదీనా నలువైపు నుంచి ప్రమాదంలో చిక్కుకుంది. భారీ సైనిక దళంతో మెరుపుదాడికి శత్రువులు సిద్ధమవుతున్నారన్న సమాచారం ప్రవక్త(స)కు అందింది.

శత్రువును నగరంలో వుండి ఎదుర్కొవడమా? లేక బయటికి వెళ్ళి సంహరించడమా? అన్న విషయంపై ప్రవక్త(స) తన అనుచరులతో చర్చించారు. బదర్ యుద్ధంలో పాల్గొనని కొంత మంది నవయువకులు బయటికే వెళ్ళి పోరాడాలని పట్టుబట్టారు. వారి ఉత్సాహాన్ని, ఉత్కంఠతను చూసిన ప్రవక్త బయటికి వెళ్ళి యుద్ధం చేయాలనే నిర్ణయించారు.

ఖురైష్ సైన్యం మదీనా సమీపంలో ఉహుద్ గుట్టపై మకాం వేసింది. ఈ సమాచారం తెలుసుకున్న ప్రవక్త(స) శుక్రవారం (జుమ్మ) నమాజ్ చేసి వెయ్యి మంది అనుచరులతో మదీనా నుంచి బయలుదేరారు. వీరిలో అబ్దుల్లా బిన్ ఉబయ్ కూడా ఉన్నాడు. ఇతను ఇస్లాం స్వీకరించినట్లు నమ్మించి శత్రువులకు సహకరిస్తున్నాడు. కొంత దూరం వెళ్ళాక అబ్దుల్లా బిన్ ఉబయ్ 300 మందిని తన పక్షాన తిప్పుకొని ప్రవక్త(స) అనుచరులతో వేరయాడు. తన అసలు రంగు చూపించాడు. ఇక మిగిలిన వారు 700 మంది మాత్రమే.

ఉహుద్ కొండ మదీనా నుంచి దాదాపు నాలుగు మైళ్ళ దూరంలో ఉంది. తన సైన్యాన్ని మహాప్రవక్త(స) ఏ విధంగా నియమించారంటే వెనుక వైపు కొండ వుంది. ముందు ఖురైషీల సైన్యం. వెనుక వైపు ఉన్న ఒక కనుమ ద్వారా దాడి జరిగే ప్రమాదం ఉండటం వల్ల ఆయన అక్కడ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ నాయకత్వాన యాభై మంది విలుకాండ్రను నియమించారు. 'ఎవరినీ ఈ కనుమ గుండా దాటనివ్వకూడదు. ఇక్కణ్ణుంచి ఎలాంటి పరిస్థితుల్లోనూ కదలకూడదు. పక్షులు మా శరీరాన్ని భక్షిస్తూ ఉన్నట్లు చూసినా మీరు మీ స్థానాన్ని విడవకూడదు' అని మరీ మరీ హెచ్చరించారు.

ఖురైషీలు ఈసారి మరింత భారీ యుద్ధసామాగ్రి, స్త్రీలతో పాటు మూడువేల మంది సైనికులను తీసుకొని వచ్చారు. స్త్రీలు పాల్గొన్న యుద్ధాల్లో అరబ్బులు ప్రాణాలకు తెగించి పోరాడతారు. పరాజయం కలిగితే స్త్రీల పరాభావం జరుగుతుందనే ఆలోచనతో ఇలా ప్రాణాలకు తెగించేవారు. ఇక్కడున్న స్త్రీలలో వారి కొడుకులు, బంధువులు బదర్

యుద్ధంలో సంహరింపబడ్డారు. హంతకుల రక్తం తాగనంత వరకు ఓపిగ్గా కూర్చోలేమని ఆ స్త్రీలు రెచ్చగొడుతూ సైనికుల్లో కసిని మరింత పెంచేవారు. ప్రతీకారం తీర్చుకునే ఆవేశం ఉవ్వెత్తున లేవాలని ఖురైషీ స్త్రీలు డప్పు వాయిస్తూ ఉత్తేజం, ఆవేశం, పౌరుషం జనింపజేసే కావ్యాలు గానం చేస్తుండగా యుద్ధం ప్రారంభం అయింది.

ప్రథమంలో ముస్లింలే పైచేయిగా కనిపించారు. ఖురైషీ సైన్యంలో చాలా మంది సంహరించబడ్డారు. సైన్యంలో కలకలం బయలుదేరింది. అది చూసి ముస్లింలు విజయం సాధించామనుకున్నారు. అందువల్ల ఈ తొలి విజయాన్ని పురస్కరించుకుని రణరంగాన్ని మొత్తం స్వాధీనం చేసుకోవడం వదిలేసి యుద్ధ ఫలం సేకరించడంలో నిమగ్నులయ్యారు. కొండ కనుమ వద్ద రక్షణకు నియుక్తులైన వారు సైతం ధనంపై ఆశతో తమ స్థానాల్ని, బాధ్యతను మరిచి ముందుకు కదిలారు. యుద్ధఫలం సేకరించడం, శత్రువులు చెల్లాచెదరవడం గమనించి యుద్ధం ముగిసిందని విజయం ఇస్లామీయ యోధుల హస్తగతమైందని భావించారు. ఒకొక్కరు యుద్ధఫలం సేకరించేందుకు తమ స్థానాన్ని వదిలి పరుగు తీశారు. నాయకుడు అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ ఎంతగా వారిని వారించినా, ప్రవక్త(స) ఆదేశాన్ని గుర్తుచేసినా వారు పట్టించుకోలేదు. ఈ దృశ్యాన్ని గమనించిన ఖాలిద్ బిన్ వలీద్ తన దళంతో మెరుపు దాడి చేశాడు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ కనుమ రక్షణకు మిగిలిపోయిన సైనికులతో వీరోచితంగా పోరాడి అమరులైయ్యారు. అటు చెల్లా చెదురై పారిపోతున్న ఖురైషీ సైన్యం రెట్టింపు ఉత్సాహంతో తిరిగి వచ్చి తిరగ బడింది. ముస్లింలపై రెండు వైపుల నుంచి దాడి జరిగింది. ఈ సంఘటనతో ముస్లింలు బిత్తరపోయారు. యుద్ధభూమి రూపురేఖలే మారి పోయాయి. ముస్లింలు స్థయిర్యాన్ని కోల్పోయారు. చెల్లాచెదురై పారిపోతూ ముస్లింలను ముస్లింలే వధించుకున్నారు. ఈ గందరగోళంలో మొహమ్మద్ ప్రవక్త(స) చనిపోయారనే వదంతి వ్యాపించింది. ఇక సహచరుల్లో మిగిలివున్న వివేకం కాస్తా పటాపంచలై సాహసం కోల్పోయారు. వాస్తవానికి ప్రవక్త(స) గాయపడ్డారు. పన్నెండు మంది అనుచరులు ఆయన్ని తీసుకుని ఒక గుట్టవైపుకు వచ్చేశారు. ప్రవక్త(స) సురక్షితంగా ఉన్నారని ముస్లింలు తెలుసుకున్నారు. తక్షణం వారంతా సమావేశమై ప్రవక్త(స) వున్న స్థలానికి చేరుకున్నారు.

ఏం జరిగిందో ఏమో కాని మరోవైపు ఖురైషీలు పోరాటాన్ని విరమించుకుని రణరంగాన్ని వదలి వెనుతిరిగారు. చాలా దూరం వెళ్లిన తరువాత ఆలోచనలో పడ్డారు. ముస్లింలను పూర్తిగా నిర్మూలించకుండా ఇలా తాము ఎందుకు వెనుతిరిగామంటూ వారు విస్తుపోయారు. అందరూ చర్చించుకొని మరో సారి దాడి చేయాలని సమాలోచనలు

జరిపారు. కాని ధైర్యం చాల్లేదు. మక్కావైపుకు తిరుగు ప్రయాణమైయారు.

ఇటువైపు ప్రవక్త(స) శత్రువులు తిరిగి వస్తారనే ఆలోచనతో ముస్లింలను సమావేశపరిచి తిరస్కారుల్ని వెంబడించాలని ఆదేశించారు. ప్రవక్త(స) ఆధ్వర్యంలో మదీనాకు 8 మైళ్ళ దూరంలో వున్న హమరల్ అసల్ అనే ప్రదేశం వరకు వెంబడిస్తూ వెళ్ళారు. ఖురైషీలు మక్కా తిరిగి వెళ్తున్నారని తెలిసింది. ఇక ప్రవక్త(స), ఆయన అనుచరులు మదీనాకు తిరుగు ప్రయాణమైయారు. ఉహుద్ యుద్ధంలో ప్రవక్త(స) బాబాయి హజ్రత్ హంజ(ర) అమరులైయారు. ప్రవక్త మొహమ్మద్(స) శరీరానికి 80కు పైగా గాయాలైయాయి. 70 మంది అనుచరులు జిహాద్‌లో ప్రాణాలు అర్పించారు. ముస్లిం యోధులలోని కొన్ని బలహీనతలే ఉహుద్ యుద్ధంలో ముస్లింలకు పరాజయం ఎదురైంది.

ఈ యుద్ధంలో ప్రవక్త మొహమ్మద్(స) కొందరు విలువిద్యలో నిపుణుల్ని కీలక ప్రదేశంలో నిలబెట్టి తన దగ్గర్నుంచి తిరిగి ఉత్తర్వు రానంత వరకు ఆ ప్రదేశాన్ని వదిలిపెట్టి పోకూడదని ఆజ్ఞాపించారు. ఘోర యుద్ధం జరిగింది. విజయం ముస్లింలకు వరించింది. శత్రువులు వెన్ను చూపి పారి పోతున్నారు. శత్రువు పారిపోవడం చూసి ముస్లిం యోధులు వారు వదిలి పోయిన సమరసొత్తును సేకరించుకోవడం ప్రారంభించారు. నిర్ణీత కీలక ప్రదేశంలో నియమించబడిన విల్లు విద్యలో కాకలు తీరిన యోధులు సైతం వారి నాయకుడు వారిస్తున్నా విన్పించుకోకుండా ఒకరిద్దరు మినహా అందరూ తమతమ స్థానాలు వదిలి సమరసొత్తు సేకరించు కోవడానికి వెళ్ళి పోయారు.

అప్పుడు శత్రువులు కొండ వెనుక నుంచి వచ్చి ఆ కీలకప్రదేశం గుండా ముస్లింలపై హఠాత్తుగా మెరుపుదాడి చేశారు. దాంతో ముస్లిం సైన్యంలో గందరగోళం ఏర్పడింది. కొందరు ప్రాణభీతితో పారిపోసాగారు. ఈ సమయంలోనే శత్రువు తెలివిగా ప్రవక్త(స) అమరులైయారంటూ వదంతి ప్రచారంచేసి ముస్లిం యోధుల్ని మానసికంగా క్రుంగిపోయేలా చేశారు.

ప్రవక్త ఆజ్ఞల్ని పాటించకపోవడం, ప్రాపంచిక సుఖాల కోసం సమర సొత్తుపై అతి ఆశపడి ఆబాగా వ్యవహరించడం, సమాచార లోపంతో భారీ మూల్యం చెల్లించుకోకతప్పలేదు. దేవునిపై భారం వేసి ఉహుద్ యుద్ధం గెలిచిన ముస్లింలు, వాస్తవ విషయాల్ని మరిచి భగవంతునికి కృతజ్ఞతకు బదులు సంపద ఆశలో పరస్పరం విభేదించుకుంటూ ప్రవక్త(స)కు అవిధేయత చూపి స్వంతంగా ఆలోచించడం వల్లే ఈ నష్టం జరిగింది. శత్రువుల్ని పూర్తిగా తరిమి వేయడానికి ముందే ధనం వైపునకు మళ్ళారు. చివరికి కనుమపై నియుక్తులైన సైనికులు సైతం ఈ విషయంలో పెద్ద పొరపాటు చేశారు.

మనిషి బలహీనతలన్నింటికీ మూలం మరణభీతి. మరణ ఘడియ రానిదే ఏ ప్రాణి మరణించదు. అల్లాహ్ నిర్ణయించిన సమయానికి ముందు ఎవరూ మరణించలేరు. మరెవరూ దాని తరువాత ఒక్క క్షణమైనా జీవించ లేరు. కనుక మృత్యువు నుంచి తప్పించుకునే ఆలోచనలు అనవసరమని ప్రవక్త(స) సహచరులకు ఎప్పుడూ చెబుతుండేవారు. అయితే ఈ జీవితాన్ని ఎలా గడుపుతున్నాం, ప్రపంచ వ్యామోహంలోనా, పరలోక విజయ ప్రాప్తికొరకా? ఎవరైతే దైవధర్మాన్ని స్వీకరించి దానిపై స్థిరంగా నిలిచే, దాన్ని స్థాపించేందుకు కృషి చేసే భాగ్యాన్ని పొందుతారో, దాని కొరకు తమ సర్వస్వాన్ని ధారపోయాలి. దాని ఫలితం ఉత్తమంగా పరిణమిస్తుంది. పరలోక శాశ్వత సౌఖ్యం వారికి ప్రాప్తిస్తుంది.

# హుదైబియా ఒప్పందం

హిజ్రి ఆరవ శకం. కాబాకు దూరమై అప్పటికి ఆరేళ్లు గడిచాయి. ఇస్లాం మూలాంశాల్లో హజ్ ఒక ముఖ్యాంశం. అందువల్లనే మొహమ్మద్ ప్రవక్త(స)తో పాటు ఆయన అనుచరులు కాబా దర్శించుకోవాలని నిర్ణయించుకున్నారు. అన్సార్, ముహాజిర్లు కాబా సందర్శనం చేసే శుభ సమయం కొరకు ఆతృతతో ఎదురు చూస్తూ ఉన్నారు. 1400 మంది ముస్లింలు మొహమ్మద్ ప్రవక్త(స) తోడుగా ప్రయాణానికి సిద్ధమయ్యారు. జుల్‌హులీఫా చేరిన మీదట ఖుర్బాని చేసేందుకు అవసరమయిన గొర్రెల్ని తీసుకున్నారు. ఎందుకైనా మంచిదని ప్రవక్త(స) ఖురైషీల ఆలోచనలు, వ్యూహాల సమాచారం సేకరించడానికి ఒక మనిషిని మక్కాకు పంపారు.

మక్కాలో ఖురైష్ తెగలన్నీ కలిసి ఓ సమావేశంలో గట్టిగా తీర్మానం చేసుకున్నాయి. ప్రవక్త(స)ను ఎట్టి పరిస్థితుల్లోనూ మక్కాలో ప్రవేశించకుండా అడ్డుకోవాలని. మక్కా వెలుపల సైన్యాన్ని మోహరించారు.

ఈ వార్త తెలిసి కూడా ప్రవక్త(స) ప్రయాణాన్ని ఆపలేదు. హుదైబియా అనే చోట మకాం వేశారు. మక్కాకు సమీపంలో హుదైబియా అనే బావి వుంది. అదే పేరు ఆ పల్లెకు వచ్చింది. ఖుజాఅ తెగ నాయకులు ప్రవక్త(స)ను కలిసి ఖురైషీలు పోరాటానికి సిద్ధంగా వున్నారు. మిమ్మల్ని మక్కాలో ప్రవేశించనివ్వరు.

మేము కేవలం ఉమరా చేసే ఉద్దేశంతో వచ్చాం. పోరాడటం మా ఉద్దేశం కాదు. మాకు కాబా గృహ సందర్శనానికి, దాని ప్రదక్షిణకు మాత్రం అవకాశం ఇస్తే చాలని వారితో చెప్పాండి.

మొహమ్మద్ ప్రవక్త(స) పంపిన ఈ సందేశం ఖురైషీలకు అందగానే వారిలో వారు చర్చించుకున్నారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తమైయాయి. ఉరవా అనే వ్యక్తి రాయభారం నడపడానికి ప్రవక్త(స) వద్దకు వచ్చాడు. కాని ఏ విషయం తేలలేదు.

చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే ఖురైషీల తరఫున ఒక దళం ముస్లింలపై మెరుపుదాడి చేసింది. ముస్లింలు వారిని బంధించారు. ప్రవక్త(స) పెద్ద మనస్సుతో వారిని వదిలివేశారు. సంధి సంప్రదింపులకుగాను హజ్రత్ ఉస్మాన్‌ను మక్కాకు పంపాలని ప్రవక్త(స) నిర్ణయించారు. ఉస్మాన్ మక్కాకు వెళ్ళారు. కాని ఖురైషీలు ఏ విధంగానూ రాజీపడలేదు. పైగా హజ్రత్ ఉస్మాన్‌ను బంధించి తమ అదుపులోకి తీసుకున్నారు.

మక్కాలో హజరత్ ఉస్మాన్‌ను హత్య చేశారనే వదంతి వ్యాపించింది. ఈ వార్తవిని ముస్లింలు ఆందోళనపడ్డారు. ఈ వార్త తెలుసుకున్న ప్రవక్త(స) "ఇక ఉస్మాన్ హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం అనివార్యమైపోయింది' అన్నారు. తరువాత ఆయన ఒక తుమ్మ చెట్టు క్రింద కూర్చున్నారు. అక్కడ తన సహచరులందరిచేత ఒక శపథం చేయించారు. 'మేము ప్రాణత్యాగానికైనా సిద్ధమే కాని పోరాడటానికి వెనుదీయము. ఖురైషీల పట్ల హజరత్ ఉస్మాన్ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం" అని సహచరులందరు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞ ముస్లింలలో చిత్రమైన ఉత్తేజాన్ని సృజించింది. వారిలో ప్రతి వ్యక్తి అమరగతి పొందే అభిలాషతో తిరస్కారులతో ప్రతీకారం తీర్చుకునేందుకు తాపత్రయ పడసాగారు. ఈ శపథానికే బయతు రిజ్వాన్ (రిజ్వాన్ శపథం) అని పేరు. దీని ప్రస్తావన దివ్య ఖురాన్‌లోనూ వుంది. మొహమ్మద్ ప్రవక్త(స) హస్తంపైన శపథం బూనిన వారిపట్ల అల్లాహ్ తన హర్షాన్ని ప్రకటించాడు. ముస్లింలు ఆవేశంతో ప్రతీకారం తీర్చుకోవడానికి రగిలి పోతున్నారనే విషయం ఖురైషీలకు అందింది. హజరత్ ఉస్మాన్ సురక్షితంగానే వున్నారని, సంధి సంప్రదింపులకుగాను సుహైల్ బిన్ అమ్రూను తమ రాయబారిగా పంపారు ఖురైష్ నాయకులు. ఆయనతో చాలా సేపు రాజీ సమాలోచనలు జరిగాయి. చివరకు సంధి నిబంధనలు నిర్ణయమైయాయి. సంధి పత్రం రాయడానికి హజరత్ అలీని నియమించారు.

సంధిపత్రంలో 'ఇది మొహమ్మద్ దైవ సందేశహరుని(స) తరఫున రాయబడిన…' అని రాయగా, ఖురైషీల ప్రతినిధి సుహైల్ ఆక్షేపణ వెలిబుచ్చాడు. 'దైవసందేశహరుడు' అనే మాట రాయకూడదని, ఆ ఒక్క విషయంలోనే కదా మాకు మీతో భేదాభిప్రాయం వుంది? (మొహమ్మద్ దైవ సందేశహరునిగా మేము అంగీకరిస్తే ఇదంతా దేనికి?) అన్నాడు సుహైల్.

ఆయన మాట ప్రకారం ప్రవక్త మొహమ్మద్(స) తన స్వహస్తాలతో 'దైవ సందేశహరుడు' అనే పదాన్ని కొట్టి వేశారు. 'నీవు అంగీకరించక పోయినా సరే(వాస్తవం మారిపోతుందా?) దైవసాక్షిగా నేను దైవసందేశహరుణ్ణే' అన్నారు.

సంధి నిబంధనలు

1. ముస్లింలు మక్కాలో ప్రవేశించకుండా ఈ సంవత్సరం వెనక్కి మరలిపోవాలి.

2. మరుసటి సంవత్సరం కాబా సందర్శనానికి రావచ్చు. అయితే కేవలం మూడు దినాలు మాత్రమే బస చేసి తిరిగి వెళ్ళి పోవాలి.

3. ఎలాంటి ఆయుధం వెంట తీసుకురాకూడదు. కేవలం సాధారణ కరవాలం తెచ్చుకోవచ్చు. అయితే అది ఒరలోనే ఉండాలి. బయటికి తీయకూడదు.

4. మక్కాలో ఉన్న ముస్లింలను ఎవరినీ తమతో మదీనా తీసుకు వెళ్ళకూడదు. అయితే మదీనాలో ఉన్న ముస్లింలెవరైనా మక్కాకు తిరిగి వెళ్ళాలని తలిస్తే అలాంటి వారిని ఆపకూడదు.

5. విశ్వసించని వారు లేక ముస్లింలలోని వారు ఎవరైనా మక్కా నుంచి మదీనాకు వెళ్ళిపోతే వారిని మక్కాకు తిరిగి పంపివేయాలి. కాని మదీనా ముస్లిం ఎవరైనా మక్కాకు వెళ్ళినట్లయితే అతన్ని తిరిగి పంపటం జరగదు.

6. అరబ్బు తెగలకు ముస్లింలతోనైనా అవిశ్వాసులతోనయినా స్వేచ్ఛగా ఒడంబడికలు చేసుకోవడానికి అధికారముంటుంది.

7. ఈ ఒప్పందం పదేళ్ళ వరకు అమలులో ఉంటుంది.

ఈ నిబంధనలన్నీ స్థూలంగా ముస్లింలకు ప్రతికూలంగానే ఉన్నాయి. వీటి వల్ల ముస్లింలు అణిగిమణిగి సంధి చేసుకున్నట్లు స్పష్టంగా కనబడుతూనే ఉంది. ఒప్పందం పూర్తికాగానే అక్కడే ఖుర్బానీ చేయాలని ప్రవక్త(స) ముస్లింలను ఆదేశించారు. తానే స్వయంగా ఖుర్బానీ చేసి తలవెంట్రుకల్ని తీసుకున్నారు. ఆ తరువాత సహచరులంతా ప్రవక్త(స) ఆదేశాన్ని పాటించారు. 3రోజుల పాటు హుదైబియాలోనే బసచేశారు. తిరిగి వస్తుండగా 'అల్‌ఫతహ్'సూరా అవతరించింది. అందులో ఈ ఒప్పందాన్ని సూచన ప్రాయంగా ప్రస్తావించి దాన్ని ప్రస్ఫుటమైన విజయంగా పేర్కొనటం జరిగింది. స్థూలంగా చూస్తే ఇది విచిత్రంగా తోస్తుంది. ఏ ఒప్పందంలోనయితే ముస్లింలు అణిగిమణిగి రాజీపడినట్లు స్వయంగా గోచరిస్తుందో, దాన్ని ఘనవిజయంగా పేర్కొనడం మరీ విచిత్రమే కాని తరువాత ఏర్పడిన పరిస్థితులు, హుదైబియా ఒప్పందం వాస్తవంగా ఇస్లామీయ

ఉద్యమచరిత్రలో గొప్ప జయప్రదమైన మలుపుగా పరిణమించిందని స్పష్టపరిచాయి.

ఇంతవరకు ముస్లింలకు, అవిశ్వాసులకు మధ్య ఘర్షణ వుండేది. రణరంగంలో తప్ప పరస్పరం కలుసుకునే అవకాశమే లభించలేదు. ఈ ఒప్పందం వల్ల ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు ముస్లింలు ముస్లిమేతరులు కలుసుకునే అవకాశాలు వచ్చాయి. ఇంకా పరస్పర కుటుంబ సంబంధాలు, వాణిజ్య సంబంధాలు మొదలయ్యాయి. అవిశ్వాసులు ఎలాంటి భయం లేకుండా మదీనాకు రావడం అక్కడ నెలల తరబడి ఉండి ముస్లింలతో స్వేచ్ఛగా కలవడం జరుగుతోంది. ఈ కొత్త ఇస్లామీయ సమాజాన్ని సమీపం నుంచి చూసే అవకాశం వారికి లభించింది.

మక్కా నుంచి మదీనాకు వచ్చే వారు విచిత్రమైన అనుభూతిని పొందేవారు. ఎవరిపట్ల అయితే తమ మనస్సులో ద్వేషం, క్రోధావేశాలు నిండి ఉన్నాయో, వారు నైతిక విషయాల రీత్యా దైనందిన వ్యవహారాల దృష్ట్యా స్వరూప స్వభావాల రీత్యా, తమకంటే ఎన్నో రెట్లు ఉన్నతంగా కనిపిస్తున్నారు. ఏ వ్యక్తులతో తాము ఘర్షణ కొని తెచ్చుకున్నారో వారి ఆంతర్యంలో తమ పట్ల ఎలాంటి ద్వేషం, శత్రుత్వం లేదు. వారికున్న వ్యతిరేకత అంతా కేవలం తమ మిథ్యా విశ్వాసాల పట్ల, దురాచారాల పట్ల మాత్రమే. ముస్లింలు చెప్పే ప్రతి మాటలో సానుభూతి, మానవీయ ప్రేమ, హృదయ అర్ద్రత ప్రతిబింబిస్తూ ఉండేవి. ఇంతగా ఘర్షణలు జరిగినా తమ పట్ల వారు అవలంభించే వైఖరిలో, వారి సత్ప్రవర్తనలో ఏ మాత్రం మార్పు రాలేదు. అంతేగాక ఇలా కలయిక జరగటం వల్ల ముస్లిమేతరులకు ఇస్లాం పట్ల ఉన్న సందేహాలు, అభ్యంతరాలు దూరం కావడానికి, ముస్లింలతో ఇస్లాం గురించి చర్చించుకోవడానికి అవకాశాలు లభించాయి.

అవిశ్వాసుల హృదయాలు ఇస్లాం వైపుకు ఆకర్షించబడ్డాయి. వారి అపోహల తెరలు ఒక్కొక్కటే తొలిగిపోసాగాయి. ఒప్పందం జరిగిన రెండేళ్ళలోనే అనేక మంది ఇస్లాం స్వీకరించారు. ఇంత మంది స్వల్ప వ్యవధిలో ముందెన్నడూ ఇస్లాం స్వీకరించలేదు. ఈ కాలంలోనే ఖురైష్ నాయకుల్లో ప్రముఖులు ఇస్లాం బోధనలపై ప్రభావితులయ్యారు. హజరత్ ఖాలిద్ బిన్ వలీద్, హజరత్ అమ్ర్ బిన్ అస్ ఇస్లాం స్వీకరించారు. దూరప్రాంతాల వరకు వేగంగా ఇస్లాం విస్తరిస్తోంది. ఈ పరిణామాల్ని చూసి అవిశ్వాసులు ఖంగుతిన్నారు. వీలైనంత త్వరగా ఈ ఒప్పందాన్ని భగ్నం చేయాలనే ఆలోచనల్లో ఖురైషీలు పడ్డారు.

హుదైబియా ఒప్పందంతో మొహమ్మద్ ప్రవక్త(స) తన దృష్టినంతా సందేశ ప్రచారం మీదే కేంద్రీకరించారు. రోము చక్రవరి హెరక్లియస్ పేరిట సందేశ పత్రాన్ని హజరత్ దిహియా కల్బీ తీసుకువెళ్ళారు.

*"అనంత కరుణామయుడు, దయాసాగరుడైన అల్లాహ్ పేరుతో, దేవుని దాసుడు, ఆయన ప్రవక్త మొహమ్మద్ తరఫున రోము చక్రవర్తి హెరక్లియస్ పేరిట......*

'సన్మార్గ దర్శనాన్ని అనుసరించే వారికి శాంతి సుఖాలు కలుగుగాక. నిన్ను ఇస్లాం సందేశం వైపుకు ఆహ్వానిస్తున్నాను. ప్రభువైన అల్లాహ్ ఆజ్ఞాపాలనను, ఆయన విధేయతను స్వీకరించావంటే నీవు శాంతి శ్రేయాలతో మనగలుగుతావు. అల్లాహ్ నీకు ద్వివిధ ప్రతిఫలాలలను ప్రసాదిస్తాడు. కాని నీవు అల్లాహ్ విధేయతను నిరాకరిస్తే నీ దేశ ప్రజల పాపం కూడా నీ మీదే పడుతుంది. ఎందుకంటే నీ నిరాకరణ వల్ల ఇస్లామీయ సందేశం వారికి చేరబోదు. అల్లాహ్ తప్ప మరెవరి పట్లనూ దాస్యభావన కలిగి ఉండరాదు. ఆయనకు మరెవరినీ సహవర్తులుగా భావించరాదు. మనలో ఎవరైనా సరే అల్లాహ్ తప్ప ఇతరుల్ని తమ ప్రభువుగా, పోషకుడుగా భావించరాదు. కాని మీరు ఈ మాటను కాదన్నారంటే మేం ఇప్పుడే స్పష్టంగా చెబుతున్నాం. ఇందుకు మీరే సాక్షులుగా వుండాలి. మేమైతే ముస్లింలమే. కేవలం ఒక దేవునికి విధేయులం, ఆయన ఆజ్ఞాపాలన చేసేవారం.

ఇరాన్ రాజు ఖుస్రో పర్వేజ్ పేరిట పత్రాన్ని తీసుకువెళ్ళినవారు హజరత్ అబ్దుల్లా బిన్ ఖుజాఫా సహ్మీ. ఈజిప్ట్ చక్రవర్తికి హజరత్ హాతిబ్ బిన్ అబీ బలకా సందేశపత్రాన్ని తీసుకువెళ్ళారు. అబిసీనియా రాజు నీగస్ పేరిట పత్రం తీసుకువెళ్ళిన వారు హజరత్ అమ్ర్‌బిన్ ఉమ్మయ్యా.

ఇస్లామీయ ఉద్యమం నామరూపాల్లేకుండా సమసిపోవాలన్న ధ్యాసతో యూదులు అనుదినం ఏదో ఒక పన్నాగం పన్నేవారు. మక్కాలోని ఖురైషీలతో కలిసి కుట్ర పన్ని మదీనాలోని కపటుల్ని సయితం పురికొల్ప సాగారు. ముస్లింలలో ఉంటూ లోలోనే ముస్లిం నిర్మూలన కార్యాన్ని శీఘ్ర గతిన కొనసాగించాలనే ప్రయత్నాలు కొనసాగుతూనే వున్నాయి. యూదులు చేసే కుతంత్రాలన్నీ మొహమ్మద్ ప్రవక్త(స)కు తెలుస్తూనే వున్నాయి. యూదులతో ఏదయినా సముచితమైన ఒప్పందం కుదిరితే వారి ఆటల్ని అరికట్టవచ్చని ప్రవక్త(స) భావించారు. అందుకు ప్రయత్నాలు సాగించారు. కాని యూదులు తమ కుట్రల్ని వదల్లేదు. చివరికి తమతో కలిసి మదీనాపై దండెత్తితే తమ ఖర్జూరపు తోటల పంటను శాశ్వతంగా సగం పంచియిస్తూ వుంటామని విభిన్న తెగల వారికి సందేశం పంపారు. యూదుల ఈ ఎత్తుగడ పారింది. తత్ఫలితంగా ఎన్నో తెగల మనస్సులు మారాయి. వారు అందరూ కలసి మదీనాపై దాడి చేయాలన్న విషయంపై ఏకాభిప్రాయానికి రాసాగారు.

కందకం పోరాటం తర్వాత ఇస్లామీయ ఉద్యమం కేవలం రక్షణతో సరిపోదు,

ఇక ముందంజ వెయ్యాలి అనే దశలో ప్రవేశించింది. ఇప్పుడు అవసరమైతే స్వయంగా ముందంజవేసి ప్రమాదాన్ని దూరం చేసే సమయం ఆసన్నమయింది. కనుకనే కందకం పోరాటం ముగియగానే మొహమ్మద్ ప్రవక్త(స) అన్నారు. “జనులు మనపై దాడి చేసే కాలం పోయింది. ఇక మీదట అవసరమయితే మనమే పురోగమించి దాడి చేస్తాం”.

ఇంతవరకూ ముస్లింలు తమ రక్షణకై పోరాడారు. విరోధులు వీరిని అంతమొందించడానికి వీరిపై దాడి చేసేవారు. వీరేమో రక్షణ కోసం కరవాలం పట్టేవారు. దైవసహాయం తోడై శత్రువులు పరాజితులయ్యారు. కాని ఇప్పుడు పరిస్థితులు మరో రూపం దాల్చాయి. ఇస్లామీయ ఉద్యమాన్ని బాగా పటిష్టం చేయడానికి ఇస్లామీయ యోధులు ముందుకు కదలవల్సిన అవసరం ఏర్పడింది. ఇస్లాం ఒక జీవన వ్యవస్థ. ఒక పరిపూర్ణ జీవన విధానం. ఈ వ్యవస్థను ఈ విధానాన్ని స్థాపించడానికి కేవలం ఇస్లామేతర వ్యవస్థల దాడిని ఎదుర్కొని రక్షించుకోవడం మాత్రమే కాదు. ఇస్లామేతర వ్యవస్థల నిర్మూలన చేయడానికి ముందంజ వేసే కృషి చేసే అవసరం కలిగింది.

# ఖైబర్ యుద్ధం

ఖైబర్ యూదులవల్ల పెరుగుతున్న ప్రమాదాన్ని సకాలంలో అణచివేసే సమయం ఆసన్నమైంది. కనుక మహాప్రవక్త(స) ఖైబర్‌పై దండెత్తడానికి సన్నాహాలు చేయసాగారు. యూదుల తరఫున జరగబోయే దాడుల్ని ప్రతిఘటించడానికి ఆయనే మదీనా వెలుపలికి రావలసి వచ్చింది. అది మొహర్రం మాసం. హి.శ. 7వ సంవత్సరం. ఆ సమరంలో ముస్లింల సైన్యం 1600 మందిలో 200 మందికి మాత్రమే వాహనాలు ఉన్నాయి.

ఖైబర్‌లో ఆరు దుర్గాలుండేవి. వాటిలో ఇరవై వేల మంది సైనికులు వుండేవారు. ఖైబర్ చేరిన తరువాత, యూదులు యుద్ధానికే సిద్ధంగా ఉన్నారనీ, ఏ రూపంలోనూ ఒప్పందానికీ, లేదా సంధికీ ఒప్పుకోరని తెలుసుకున్న ప్రవక్త మొహమ్మద్(స) జిహాద్ (శక్తి వంచన లేకుండా సలిపే నిరంతర కృషి)ని గురించి సహాబా సమక్షంలో ఒక ప్రసంగం చేశారు. వారిని అల్లాహ్ ధర్మం కొరకు ప్రాణాన్ని సైతం ధారపోసేందుకు సిద్ధంగా ఉండాలని ఉపదేశించారు. దాదాపు 20 రోజుల దిగ్బంధం తరువాత అల్లాహ్ ముస్లింలకే విజయాన్ని అనుగ్రహించాడు. ఆ యుద్ధంలో 93 మంది యూదులు హతమయారు. 15 మంది ముస్లింలు అమరగతి పొందారు. యుద్ధంలో యూదుల గొప్ప మల్లయోధుడు 'మర్హబ్' హజరత్ అలీ చేతిలో హతమయాడు. ఈ పహిల్వాన్ మరణించడం ఎంతో మహత్కార్యంగా భావించబడింది. ఎందుకంటే అతని శక్తి యుక్తులపై

యూదులకు ఎనలేని విశ్వాసం. అతని గురించి యూదులు గర్వించేవారు.

ముస్లింల విజయానంతరం యూదులు ఒక మనవి చేసుకున్నారు. వాళ్ల ఆధీనంలో ఇంత వరకున్న కమతాలను అలాగే విడిచిపెట్టినట్లయితే తాము వాటి పంటల్లో సగం ముస్లింలకు అందజేస్తూ ఉంటామని విన్నవించుకున్నారు. ప్రవక్త(స) ఈ విన్నపాన్ని ఆమోదించారు. ఆ సగం పంటను వసూలు చేయడానికి వెళ్ళిన ముస్లిం అధికారులు యూదుల పట్ల అవలంభించిన న్యాయరీతివల్ల వారి హృదయాలు మారాయి. ముస్లిం అధికారులు మొత్తం పంటను రెండు రాసులుగా పోసి కమతందార్లకు తమకు నచ్చిన రాసిని ఎన్నుకోవడానికి స్వేచ్ఛ ఇచ్చేవారు.

# మక్కా విజయం

సంఘర్షణా కాలమది. చుట్టుప్రక్కల నుంచి ఎవరు ఎప్పుడు మెరుపు దాడికి పాల్పడతారో. అయినా ప్రవక్త(స) ముస్లిం సమాజాన్ని సుశిక్షణ ఇచ్చారు. ఆ కాలంలో అవతరించిన రెండు ప్రముఖ సూరాలు 'నిసా', 'మాయిదా'లను అధ్యయనం చేస్తే ఆ రోజుల్లో ఇస్లాం కోరే సచ్ఛీలత కొరకు, స్వరూప స్వభావాల కొరకు, ముస్లిం సమాజ నిర్మాణానికి ఎలాంటి చట్టాలు, నియమాలు బోధించబడ్డాయో అర్థమవుతుంది.

'నిసా' సూరా హి.శ.4, 5 సంవత్సరాలల్లో విభిన్న కాలాల్లో అవతరించింది. దాన్ని చదివితే అర్థమవుతుంది. అప్పట్లో ప్రవక్త(స) కొత్త ఇస్లామీయ సంఘాన్ని ఏ విధంగా పురాతన మూఢాచారాల నుంచి పరిశుద్ధ పరచి ఎలా సంఘటిత పరిచారో, ఇంకా జీవన వ్యవస్థను నైతిక, నాగరిక, సామాజిక, ఆర్థిక వ్యవస్థ స్వరూపానికి సంబంధించిన కొత్త సిద్ధాంతాలు పునాదిగా పునర్నిర్మించారో బోధపడుతుంది. ముస్లింలు తమ వ్యక్తిగత జీవితంతో పాటు సామాజిక జీవితాన్ని ఏ విధంగా ఇస్లాం సూత్రాల ఆధారంగా చక్కదిద్దుకోవాలో అల్లాహ్ తరఫున స్పష్టమైన ఆదేశాలు లభించసాగాయి. వారి కుటుంబ వ్యవస్థీకరణ కొరకు సూత్రాలు తెలుపబడ్డాయి. వివాహం, విడాకులకు సంబంధించిన విశదమయిన నిర్దేశాలు సూచించబడ్డాయి. స్త్రీ పురుషుల హక్కుల్ని, అధికారాల్ని నిర్ణయించి సమాజంలోని ఎన్నో కీడుల్ని దూరం చేయడం జరిగింది. అనాథల, ఆర్తుల హక్కుల్ని పరిరక్షించేందుకు తాకీదు చేయబడింది. వారసత్వపు విభజనకు సంబంధించిన చట్టాలు నిర్మించబడ్డాయి. ఇచ్చి పుచ్చుకోవడానికి సంబంధించిన వ్యవహారాల సంస్కరణకై ఆదేశాలు లభించాయి. కుటుంబంలోని తగదాలను ఎలా పరిష్కరించుకోవాలో తెలుపటం జరిగింది. మద్యపానాన్ని నిషేధించడం జరిగింది.

పారిశుద్ధ్యం, పరిశుభ్రతల ఆదేశాలు అందాయి. సత్ప్రవర్తన, సచ్ఛీలతగల వ్యక్తి సంబంధం, దైవంతో ఎలా ఉండాలో, దేవుని దాసులయిన తోటి మానవులతో ఏ విధంగా వారు మెలగాలో ముస్లింలకు బోధ పరచబడింది. దీనికి తోడుగా గ్రంథం కలవారి (యూదులు, క్రైస్తవుల) తప్పుడు ధోరణిని, అనుచితమయిన జీవిత విధానాన్ని విమర్శించి వారి తప్పులు విశదపరచబడేవి. ముస్లింలను అలాంటి తప్పుల నుంచి దూరంగా వుండాలని హెచ్చరించడం కూడా జరిగేది.

ఇస్లామీయ ఉద్యమం ప్రత్యేకత ఇదే. ఈ రీతిలో ముస్లింల సంస్కరణ జరక్కపోతే మిథ్యావాదానికి అభిముఖంగా వారికి విజయం లభించడం దుర్లభం. ఇస్లామీయ ఉద్యమం అనుయాయులు కేవలం వ్యక్తిగతంగా మిథ్యావాదుల సమక్షంలో ఉన్నతంగా ఉండడమేకాక వారొక ఆదర్శప్రాయమైన సమాజాన్ని స్థాపించాలి. అది దాని స్వరూప స్వభావాల ద్వారానే ఇస్లామేతర సమాజాలకన్నా దాని ఆధిక్యతను చాటుకోవాలి. దాని ఘనతను నిరూపించు కోవాలి. ఈ లక్ష్యసాధనకై ప్రత్యేకమయిన ఏర్పాట్లు, లేదా కృత్రిమైన వాతావరణం సృజించే అవసరం లేదు. ఉద్యమం ధ్వజ వాహకుల్లో దైవం పట్ల భయభక్తులు, ఇహ్‌సాన్ స్థితి ఉత్పన్నమయితే కావలసిన పరిణామాలు వాటంతటవే సంభవిస్తాయి. ప్రవక్తలు నడిపే సంస్కరణాత్మక, విప్లవాత్మక ఉద్యమాల తీరుతెన్నులు, ఈ రంగంలోని ఇతర ఉద్యమాలకు భిన్నంగా ప్రత్యేకంగా ఉంటాయి. ప్రవక్త(స) తన అనుయాయుల బోధన, సుశిక్షణ, ఆత్మ శుద్ధీకరణకు ప్రాధాన్యత ఇచ్చి ఆ విషయాలపైనే తన దృష్టిని కేంద్రీకరించారు. 'నిసా' సూరాలో ప్రస్తావించబడిన విషయాల్లో కానవస్తుంది. ఈ సూరాలో నైతికత, నాగరికత, సామాజిక వ్యవస్థకు సంబంధించిన నియమనిబంధనలు వివరించబడిన చోటే, దానికి తోడుగా సందేశ ప్రచార విషయం కూడా వుంది. బహు దైవారాధకులకు గ్రంథం కలవారికి సత్య ధర్మం వైపునకు ఆహ్వానం కూడా తప్పనిసరిగా ఉంది.

హుదైబియా ఒప్పందానికి పిదప, దాదాపు హి. 7వ సంవత్సరం 'మాయిదా' సూరా అవతరించింది. హుదైబియా ఒప్పందం ప్రకారం ముస్లింలు ఆ సంవత్సరం 'ఉమరా' చేయలేదు. కాని మరుసటి సంవత్సరం కాబా సందర్శనానికి రాగలరని నిర్ణయమైంది. గనుక, ఆ రానున్న అవకాశానికి ముందే కాబా సందర్శనానికి సంబంధించిన అనేక మర్యాదల్ని, లాంఛనాల్ని పాటించవలసిన విధుల్ని సూచించటం జరిగింది. తిరస్కారులు అత్యాచారం చేసినప్పటికీ ముస్లింలు తమ పక్షంగా ఎలాంటి అత్యాచారం జరగనివ్వకూడదని బోధించడం జరిగింది.

'మాయిదా' సూరా అవతరణ కాలానికి ముస్లింల పరిస్థితులు ఎంతో మారి

పోయాయి. ఇస్లాంకు నాలుగు వైపుల నుంచి ముంచుకు వస్తున్న ప్రమాదాలు ఇప్పుడు లేవు. అలాంటి పరిస్థితి ఉహుద్ పోరాటం తరువాత ఏర్పడిందే కాని ఇప్పుడు అంతా మారిపోయింది. ఇస్లాం నేడు ఎదురులేని శక్తిగా విజృంభించింది. ఇస్లామీయ రాజ్యం బాగా విస్తరించింది. మదీనాకు నలువైపులా దాదాపు రెండు మైళ్ళ వరకు ఉన్న విరోధి తెగల పీడ విరగడ అయింది. మదీనా యూదుల వల్ల నిత్యం ప్రాణసంకటంగా ఉన్న పరిస్థితి అంతమయింది. యూదులు ఎక్కడయినా మిగిలి వుంటే, వారు లొంగి వుండడానికి అంగీకరించారు. ఇప్పుడు ఇస్లాం కేవలం సాధారణ పరిభాషలో 'మతం' అనబడే కొన్ని విశ్వాసాల సమూహం మాత్రమే కాదని, దాని సంబంధం కేవలం మానవుని మనోమస్తిష్కాలతో మాత్రమే లేదనీ, అది ఒక సంపూర్ణమయిన జీవన వ్యవస్థ అనీ అది మానవుని మనో మస్తిష్కాలతో సహా యావత్తు జీవితంతోనూ ముడిపడి వుందని విస్పష్టంగా తెలిసిపోయింది. ఇందులో ప్రభుత్వ వ్యవహారాలు, రాజకీయాలు, సంధి, సమర రంగాలు సమస్తం అంతర్లీనమయి వున్నాయి. అదీగాక ఇప్పుడు ముస్లింలు కూడా శక్తిని పుంజుకున్నారని, తద్వారా వారు చైతన్యవంతంగా, స్వీకరించిన ధర్మానికీ, జీవన వ్యవస్థకు అనుగుణంగా, తమ జీవితాన్ని ఎలాంటి ఆటంకం లేకుండా గడుపు కోగలరని అందరికీ అర్థమయింది. ఇప్పుడు ఇతర ఏ వ్యవస్థ అయినా, ఏ పరిపాలనా సంబంధాలయినా వారి మార్గానికి అంతరాయం కలిగించలేవని, వారు తాము ఆశ్రయించిన ధర్మం వైపునకు ఇతరులను సైతం ఆహ్వానిస్తూ పోగలరని కూడా విశదమయిపోయింది.

అప్పటికే ముస్లింలకు తమదంటూ ఒక ప్రత్యేక సంస్కృతి రూపొందింది. అది ఇతర సంస్కృతుల్లో ఓ ప్రత్యేకతను సంతరించుకుంటోంది. వారి నైతికతకు, వారి దైనందిన వ్యవహారాలకు సంబంధించిన సిద్ధాంతాలు, సంప్రదాయాలు చూపబడ్డాయి. వారు జరిపే వాణిజ్య వ్యవహారాలు, వారి పరస్పర సంబంధ బాంధవ్యాలు, ఒకటేమిటి వారి పూర్తి జీవితపు స్వరూపమే ఇస్లామీయ సూత్రాలకు ప్రతిరూపంగా మారుతూ పోతోంది. వారికి ఇతరుల సమక్షంలో స్పష్టమైన ప్రత్యేకతలు ప్రాప్తమవుతున్నాయి. వారికి ప్రత్యేకమయిన 'సివిల్', క్రిమినల్ చట్టాలు వున్నాయి. వారి న్యాయస్థానాలున్నాయి. ఇచ్చిపుచ్చుకోవడాలకు, క్రయవిక్రయాలకు వారికి తమ ప్రత్యేక విధానాలున్నాయి. వారసత్వానికి సంబంధించిన చట్టాలు, వివాహాలు విడాకుల నియమాలు, సమాజంలో స్త్రీ పురుషుల పరిధుల్ని నిర్దిష్టపరిచే 'పర్దా' వ్యవస్థ వారికి ప్రత్యేకంగానే ఏర్పడ్డాయి. చివరికి నలుగురితో మసలుకునే రీతులు, భోజన పానీయాలు పుచ్చుకునే విధానాలు, పరస్పరం కలుసుకునే, పలకరించుకునే పద్ధతులు వివరంగా నిర్దేశింపబడ్డాయి. ఇవన్నీ

చేరి ఇస్లామీయ సమాజాన్ని, ఇస్లామీయ జీవిత విధానాన్ని, ఇస్లామేతర సమాజలన్నింటికీ వేరుగా ప్రత్యేక స్థానాన్ని విశిష్ట రూపాన్ని ప్రసాదించాయి. ఇదంతా ప్రవక్త(స) ఎంతో దీక్షతో జరుపుతున్న శిక్షణా బోధనల ఫలితమే. ఆ బోధనల ఫలితంగానే ముస్లింల జీవితాలు పరిశుద్ధంగా, పావనంగా రూపొందసాగాయి.

'మాయిదా' సూరాలో హజ్ యాత్రలో పాటించవలసిన నియమాలు, అన్న పానీయాలూ, ధర్మాధర్మాల గుర్తింపు, వుజూ, స్నానం, తయమ్మమ్ (నీరు లభించనప్పుడు పారిశుధ్యం కోసం అనుసరించవలసిన విధానం) తదితర విషయాల నియమాలు చూపబడ్డాయి. మద్యం, జూదం లాంటి వాటిని అధర్మమైనవిగా ప్రకటించడం, సాక్ష్యానికి సంబంధించిన చట్టాల నిర్మాణం, నీతి న్యాయాలపై నిలకడ కలిగి వుండాలని తాకీదు చెయ్యటం లాంటి విషయాలకు ఇస్లామీయ సమాజానికి అత్యంత అవశ్యకమైన విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వబడింది.

హుదైబియా ఒప్పందంలోని షరతుల్లో ఒకటి ముస్లింలు ఒప్పందానికి మరుసటి సంవత్సరం వచ్చి 'ఉమరా' చేసుకోవచ్చుననేది. తదనుగుణంగా అంటే హి.శ. 7వ సంవత్సరం మొహమ్మద్ ప్రవక్త(స) ముస్లింలను చాలా మందిని తీసుకుని కాబాను సందర్శించారు. ఆ సందర్భంలో సహాబా ఆనందానికీ, ఆవేశానికీ ఒక విశేషమయిన తన్మయత్వానికి హద్దులు లేవు. ఆ దృశ్యం చూసి ఖురైషీ తిరస్కారుల ఆంతర్యంలో అణిగివున్న ఈర్ష్య, ఓర్వలేని తనం బయట పడింది. రెచ్చిపోయారు. తమ అభీష్టం ప్రకారం తమదే పైచేయి అని స్ఫురించేలా చేసుకున్న హుదైబియా ఒప్పందం కదు హీనంగా కనిపించింది ఆనాడు వారికి.

హుదైబియా ఒప్పందం ప్రకారం అరేబియాలోని తెగలకు ముస్లింలతోనైనా లేదా ఖురైషీలతోనైనా ఒడంబడిక చేసుకోవడానికి హక్కు వుంది. ఖుజాఅ, బనూబక్ర్ తెగలు ఎంతో కాలంగా పరస్పరం పోరాడుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఖుజాఅ తెగ ముస్లింలతో ఒడంబడిక చేసుకుంది. వారి శత్రువులైన బనూబక్ర్ తెగ ఖురైషీయులతో కలిసి వుంది. ఒకటిన్నర సంవత్సరాల వరకు ఒప్పందం అమలు జరిగింది. బనూబక్ర్‌తెగ వాళ్ళు ఒప్పందాన్ని పక్కన పెట్టి ఖుజాఅపై ఆకస్మిక దాడికి పాల్పడ్డారు. ఖురైషీలతో కలిసి ఖుజాఅను హత మార్చసాగారు. చివరికి ఖుజాఅ కాబా గృహంలో శరణుతీసుకున్నా అక్కడా వారిని విడువలేదు. హరమ్ లోనూ ఖుజాఅ రక్తం పారింది! ఇక లాభం లేదనుకున్న ఖుజాఆ తెగవారు మొహమ్మద్ ప్రవక్త(స)కు సమాచారం అందజేశారు. హుదైబియా ఒప్పందం ప్రకారం సహాయాన్ని అర్థించారు.

ఖుజాఅ దీనావస్థపై ప్రవక్త(స) ఎంతో బాధపడ్డారు. ఖురైషీలకు సందేశం పంపారు. తక్షణం ఖుజాఅపై చేస్తున్న దారుణాన్ని విరమించు కోవాలని, లేదా ఈ మూడు షరతుల్లో దీన్ని స్వీకరిస్తారో తెలుపాలని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

1. ఖుజాఅ తెగకు చెందిన హతుల 'రక్త పరిహారం' చెల్లించాలి
2. ఖురైషీయులు బనూబక్ర్‌కు సహకరించడం మాని వేయాలి
3. హుదైబియా ఒప్పందం ఇక మీదట అమలు జరగదని ప్రకటించాలి.

ఈ సందేశం వినగానే ఖురైషీయుల్లో ఒక వ్యక్తి 'కర్తబిన్ ఉమర్' మేము మూడో షరతును స్వీకరిస్తున్నాం అని అన్నాడు. సందేశం తెచ్చిన వ్యక్తి వెళ్ళిపోయాక ఖురైషీలకు చాలా బాధకలిగింది. వారు తిరిగి అబూ సుఫ్యాన్‌ని రాయబారిగా పంపారు. ఖురైషీలు ఇంత వరకు అవలంభించిన ధోరణి మూలంగా ప్రవక్త(స)కు ఖురైషీలపై నమ్మకం కుదరలేదు. అందువల్ల అబూసుఫ్యాన్ తెచ్చిన ప్రతిపాదనను సమ్మతించలేకపోయారు.

హజరత్ ఇబ్రాహీం(అ) ఒకే దేవుని అరాధనకై కాబా గృహాన్ని నిర్మించారు. దేవుని ఏకత్వాన్ని చాటే గొప్ప కేంద్రం ఇది. ప్రస్తుతం బహు దైవారాధనకు నిలయమైంది. మొహమ్మద్‌ప్రవక్త(స) ఇబ్రాహీం తెచ్చిన ధర్మం వైపునే అందర్నీ ఆహ్వానిస్తున్నారు. ఈ పవిత్ర స్థలాన్ని బహుదైవారాధకుల మలినాల నుంచి అతి శీఘ్రంగా పరిశుద్ధపరచడం ఎంతైనా అవసరమని భావించారు. కాని ఇంత వరకు పరిస్థితులు అనుకూలించకపోవడం వల్లే ఏం చేయలేకపోయారు. ప్రస్తుతం తగిన సమయం ఆసన్నమయిందని ప్రవక్త(స) భావించారు. తమతో ఒడంబడిక చేసుకున్న తెగలన్నింటికీ ప్రవక్త(స) సందేశాలు పంపారు. మక్కా వారికి ఈ సన్నాహాల సమాచారం చేరకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. కావలసిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాక హి.శ.8వ ఏట రంజాన్ 10వ తారీఖున ప్రవక్త(స) మక్కా వైపునకు బయల్దేరారు. ఇంచుమించు 10 వేల మంది సైనికులతో ఎంతో ఘనంగా అత్యంత వైభవంగా బయల్దేరారు. దారిలో అరేబియాలోని ఇతర తెగలు వచ్చి కలిశాయి.

ఇస్లామీయ సైన్యం మక్కా పొలిమేరలకు చేరింది. రహస్యంగా సైన్యం గురించి సమాచారం సేకరిస్తూ అబూసుఫ్యాన్ పట్టుబడ్డాడు. ఆయన్ని ప్రవక్త(స) సన్నిధిలో హాజరుపరిచారు. ఇస్లాం విరోధుల్లో అగ్రగణ్యుడే కాదు గతంలో మదీనాపై దాడి జరగడానికి కుట్ర చేసింది ఇతనే. చివరికి ప్రవక్త(స) పై హత్యాయత్నం రహస్యంగా చేసింది కూడా ఇతనే. అయినా మొహమ్మద్ ప్రవక్త(స) ఆయన్ని క్షమించారు. 'వెళ్ళు, నిన్ను ఈ వేళ ఏదీ ప్రశ్నించడం జరగదు. అల్లాహ్ నిన్ను మన్నించు గాక, ఆయనే కనికరించే వారందరి కంటే అధికంగా కనికరించే వాడు' అన్నారు.

మక్కాపై దండెత్తిన మొహమ్మద్(స) శత్రువులతో ప్రతీకారం తీర్చుకునే వాడూ, వారి రక్తపిపాసీ కాదు. ప్రపంచంలోని రాజుల్లా గర్వం, అహం భావం కలవాడు కాదని ఆయనకు తెలిసి పోయింది. ప్రవక్త(స) కరుణాస్వభావం అబూ సుఫ్యాన్‌కు కనువిప్పు కలిగించింది. ఇస్లాం స్వీకరించి ప్రవక్త(స) అనుచరుల్లో అబూసుఫ్యాన్ కలిసిపోయాడు.

మొహమ్మద్ ప్రవక్త(స) హజరత్ ఖాలిద్ బిన్ వలీద్‌ను మక్కాలో ఒక మార్గం గుండా ప్రవేశించమని ఆదేశించారు. ఎవరినీ చంపవద్దనీ, అయితే ఎవరయినా ఆయనపై దెబ్బతీస్తే రక్షణ కోసం చర్య తీసుకోవచ్చుని, ఆ అనుమతి వుందనీ ఉపదేశించి పంపారు.

స్వయంగా ప్రవక్త(స) మరొక మార్గం ద్వారా ప్రవేశించారు. హజరత్ ఖాలిద్ వెంటనున్న సైన్యాన్ని ప్రతిఘటిస్తూ ఖురైష్ తెగల్లోని వారు కొందరు బాణాలు విసిరారు. ముస్లింలు ముగ్గురు అమరగతులయారు. అప్పుడు హజరత్ ఖాలిద్ శత్రువులకు ధీటుగా జవాబు చెప్పారు. ప్రతిఘటించిన వారిలో 13 మంది హతమయారు. మిగిలిన వారు పారిపోయారు.

మొహమ్మద్ ప్రవక్త(స) ఎలాంటి ప్రతిఘటన లేకుండా మక్కాలో ప్రవేశించారు. ఆయన సైన్యం చేతిలో ఎవరూ హతం కాలేదు. మక్కాలో ప్రవేశించిన వెంటనే ఈ ప్రకటన చేశారు మొహమ్మద్(స).

తన ఇంటిలో ద్వారాలు మూసుకుని ఉండే వ్యక్తికి మన్నింపు ఇవ్వబడుతోంది. అబూ సుఫ్యాన్ ఇంటిలో ప్రవేశించిన వారికి మన్నింపు ఇవ్వబడుతోంది. కాబా గృహంలో రక్షణ తీసుకున్న వ్యక్తికీ మన్నింపు ఇవ్వబడుతోంది.

ఈ సర్వసామాన్య మన్నింపు ప్రకటన నుంచి ఆరేడుగురిని మినహాయించడం జరిగింది. వారు ఇస్లాం విరోధంలో అగ్రగణ్యులైనవారు. వారిని నిర్మూలించడం అత్యవసరమని భావించడం జరిగింది.

ప్రవక్త(స) మక్కాలో ప్రవేశించిన శుభ సన్నివేశంలో ఆయన ధ్వజ చిహ్నం తెల్లదిగాను, పతాకం నల్లదిగాను ఉండింది. తల మీద 'మగ్‌ఫర్' అనే తలపాగా ధరించారు. దానిపై నల్లని 'అమామా' కట్టుకున్నారు. 'ఇన్నా ఫతహనా' సూరా బిగ్గరగా పారాయణం చేస్తున్నారు. దైవ సన్నిధిలో వినయ విధేయత భావాలతో ఎంతో వినమ్రులై ముందుకు సాగారు. ఆయన అధిరోహించిన ఒంటెపై వినమ్రులయి కూర్చోవడం మూలాన ఆయన పవిత్ర శిరస్సు ఒంటె మూపురానికి తగులుతూ ఉంది.

మొహమ్మద్ ప్రవక్త(స) మస్జిదుల్ హరమ్(కాబా)లో ప్రవేశించగానే విగ్రహాలన్నింటినీ తీసిపారవేయాలని ఆదేశించారు. అప్పుడు కాబాలో 360

విగ్రహాలుండేవి. గోడలపై చిత్రాలుండేవి. అవి తుడిచివేయబడ్డాయి. ఈ విధంగా అల్లాహ్ గృహాన్ని బహుదైవారాధన మాలిన్యానుండి పరిశుద్ధం చేశారు. ఆ తరువాత ఆయన దైవ మహోన్నతను కొనియాడుతూ తక్బీరు పఠించారు. కాబా గృహ ప్రదక్షిణ చేశారు. మకామె ఇబ్రాహీమ్ వద్ద నమాజ్ చేశారు. ఇదే ఆయన జరిపిన విజయోత్సవం. దీన్ని చూసి మక్కా ప్రజలకు కనువిప్పు కలిగింది. ఇలాంటి ఆనందప్రదమయిన సందర్భంలోనూ, ఇంత అఖండమైన దిగ్విజయం లభించినప్పుడు కూడా ఈ ప్రజలు ఎలాంటి వైభవం, ఠీవి కనబరచటం లేదనీ, గర్వం అహంభావాల ప్రదర్శన చేయడం లేదనీ, దానికి భిన్నంగా ఎంతో వినయ వినమ్రతలతో కృతజ్ఞతా భావంతో తమ ప్రభువు ఎదుట మోకరిల్లుతున్నారనీ, ఇలా దైవ స్తోత్రమూ దైవోన్నతి కొనియాడటంలోనే తన్మయులయిపోతున్నారనీ వీక్షించి, సంభ్రమాశ్చర్యాల్లో మునిగిపోయారు. ఈ దృశ్యాన్ని చూసిన ఏ వ్యక్తి అయినా వాస్తవంగా ఇది రాజరికం కాదని, దేశ విస్తరణా పథకం అంతకన్నా కాదనీ, ఇది ఏదో కొత్త మార్గమే అని మక్కావాసులు గ్రహించారు.

మక్కాను జయించిన తరువాత మొహమ్మద్ ప్రవక్త(స) ఎంతో ప్రాముఖ్యం గల చారిత్రక ప్రసంగం చేశారు. 'అల్లాహ్ ఒక్కడే. ఆయన తప్ప మరో దైవం లేదు. ఆయన దైవత్వంలో భాగస్వాములు ఎవరూ లేరు. ఆయన తానిచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. ఆయన తన దాసునికి సహాయం చేశాడు. ఇతర మతాలన్నింటినీ ఏకాకులుగా చేసి వేశాడు. అర్థం చేసుకోండి! గర్వ కారాణాలయిన విషయాలన్నీ, పురాతన హత్యలు, హత్యా ప్రతీకారాలు సమస్తం నా పాదాల కింద ఉన్నాయి. (నేను వాటిని అంతమొందిస్తున్నాను)

కేవలం కాబా సంరక్షణ, తత్సంబంధమైన కార్యాలు, హజ్ యాత్రీకులకు నీటి సరఫరా కార్యాలు మినహాయించి సర్వం నా హస్తగతమయి వున్నాయి. ఖురైష్ ప్రజలారా! అజ్ఞాన కాలపు అహం భావాల్నీ, వంశం, గోత్రం గురించి గర్వపడటాన్ని అల్లాహ్ రూపు మాపాడు. మానవులంతా ఆదమ్ సంతతిలోని వారే ఆదం మన్నుతో సృజించ బడ్డారన్న విషయం మరువకండి'

ఆ తరువాత దివ్యఖుర్ ఆన్ ఆయత్‌ను పఠించారు.

'జనులారా! నేను మిమ్మల్ని ఒకే స్త్రీ పురుషుల జంట ద్వారా పుట్టించాను. మీ ద్వారా తెగలను, వంశాలను సృజించాను. తద్వారా మీరు పరస్పరం పరిచయం చేసుకోవాలని, ఐతే దేవుని దృష్టిలో భయభక్తులు అధికంగా కల వ్యక్తియే ఉత్తముడు. అల్లాహ్ సర్వం తెలిసినవాడు. దేన్నయినా తెలుసుకోగలవాడు.'

అత్యంత ఘనమైన విజయాల్ని సాధించిన ఇస్లాం యోధుడు విజయానంతరం చేసిన ప్రసంగం ఇది. దీనిలో విరోధుల పట్ల ఎలాంటి క్రోధమూ లేదు. ద్వేషమూ లేదు. ఇంకా తాను సాధించిన కార్యం పట్ల గర్వపడనూ లేదు. దాన్ని కనీసం ప్రస్తావించనైనా లేదు. తన త్యాగశీలురయిన అనుయాయుల్ని పొగడనూ లేదు. పైగా పొగడ్త, స్తోత్రం ఏదైనా ఉంటే అది కేవలం అల్లాహ్‌కు మాత్రమే చెందుతుంది అని, జరిగిన దంతా లభించినదంతా, ఆయన అనుగ్రహం వల్లనే జరిగింది, ఆయన కటాక్షం వల్లనే లభించింది అనీ చాటారు.

అరేబియాలో హత్యకు ప్రతీకారం తీర్చుకోవడం ఎంతో ముఖ్యమైంది. ఒక వంశంలో ఎవరైనా చంపబడితే హతుని వంశంలో ఈ విషయాన్ని ఎప్పటికీ జ్ఞాపకముండేలా చూస్తారు. ఏళ్ళు గడచినా, ఆపైన వచ్చే సంతతిలోని వారు, హంతకుని వంశ ప్రజలతో ఆ హత్యకు ప్రతీకారం తీర్చుకోనంత వరకు స్థిమితంగా వుండరు. అయితే ప్రవక్త(స) మక్కాను జయించిన సందర్భంలో ఆయన ఇలాంటి ప్రతీకారాలన్నింటిని అంతం చేశారు. అంటే అరేబియాకు యదార్థమైన శాంతి సుఖాల జీవితాన్ని ప్రదానం చేశారన్నమాట. ఇలాగే అరేబియాలో వంశం, గోత్రాల రీత్యా గర్వపడటం చేసేవారు.

ఇస్లాం ప్రకారం ఎవరు అల్లాహ్ విధేయతను పాటిస్తున్నారు, ఎంత వరకు పాటిస్తున్నారు అనే విషయం తప్ప మరో విషయం ఆధారంగా మనిషి మనిషీ మధ్య ఎలాంటి వివక్ష, భేదాభావం చూపేది లేదు. ఏ వ్యక్తి అల్లాహ్ ఆజ్ఞల్ని పాటించడంలో ఎంత వరకు విధేయుడో, ఆయన ఆగ్రహం పట్ల ఎంత భీతి కలిగి వుంటాడో అతను అంతే గౌరవనీయుడు, అంతే శ్రేష్ఠుడయిన వాడు. వంశం శ్రేష్ఠతకు ఇస్లాంలో ఏ మాత్రం తావు లేదు. వంశాలు కేవలం పరస్పర పరిచయానికి సంబంధించినంత వరకే ఉపకరిస్తాయి. అల్లాహ్ సందేశహరుడు మొహమ్మద్ ప్రవక్త(స) ఈ సందర్భంలో సమాజంలోని అన్ని రుగ్మతల్ని సమాప్తం చేశారు. మానవుల మధ్య సర్వసమానతను ప్రకటించారు. నేటికీ ఇస్లాం తప్ప వేరే మతం ఏదీ ఈ సర్వసమానతను మానవాళికి ప్రసాదించలేక పోయింది.

# మజ్జిదె ఖుబా

మొహమ్మద్ ప్రవక్త(స) మక్కా నుంచి మదీనాకు వలస వస్తూ ఖుబా గ్రామంలో 14 రోజులు వున్నారు. ఇక్కడ నివసిస్తున్న వారిలో అత్యధికులు ఇస్లాం స్వీకరించి ప్రవక్త(స) అనుచరులుగా మారారు. వీరంతా ఘనంగా స్వాగతం పలికారు. స్త్రీలు, పిల్లలు గ్రామం

గ్రామంతా అల్లాహు అక్బర్ నినాదాలతో ప్రవక్తను ఊళ్లోకి తీసుకువస్తారు. వారిలో ప్రతి ఒక్కరూ అతిథిగా తీసుకువెళ్ళడానికి పోటీపడతారు. చివరకు దైవప్రవక్త(స)కు ఆతిథ్యమిచ్చే భాగ్యం హజ్రత్ కుల్సూమ్ బిన్ హదమ్(ర)కు లభించింది. ఖుబావాసుల్ని ఉద్దేశించి మొహమ్మద్ ప్రసంగిస్తూ మసీదు నిర్మించి నిత్యం ఖుర్ ఆన్ పఠించమని ప్రవక్త సూచిస్తారు. ఆ మాట వినగానే స్థానికులు మసీదు నిర్మిణానికి ముందుకు వచ్చారు. వెంటనే పని మొదలైంది. కొందరు నేల త్రవ్వుతుంటే మరి కొందరు మట్టితీశారు. ఇంకొందరు రాళ్ళు మోసుకొస్తున్నారు. ఈ పవిత్ర కార్యంలో ప్రవక్త(స) కూడా పాల్గొని మసీదు నిర్మిణం పూర్తి చేశారు. మొహమ్మద్ ప్రవక్త ఖుబా మసీదులో నమాజ్ చేసి ప్రియ అనుచరుల్ని ఉద్దేశించి ఇలా అన్నారు. ఖుబా మసీదులో4 రకాత్‌లు నఫీల్ నమాజ్ చేసిన వారికి ఉమ్రా చేసినంత పుణ్యం లభిస్తుందన్నారు. ఇస్లాం చరిత్రలో మొదటి మసీద్ ఇదే. మొహమ్మద్ ప్రవక్త(స)కు అత్యంత ఇష్టమైన మసీద్ ఇదే. తరచూ ఇక్కడుకు వెళ్తూ వుండేవారు ప్రవక్త.

# జుమా మజ్జిద్

ఖుబా గ్రామంలో నుంచి బయలుదేరిన ప్రవక్త(స) అనుచరులతో కలసి మదీనాలో ప్రవేశించారు. బనూసాలం బస్తీలోకి వచ్చేటప్పుడు జుమా నమాజ్ వేళ అయింది. అందువల్ల అక్కడే జుమ్మా నమాజ్ చేశారు. ఈ కారణంగా అక్కడ మసీదును నిర్మించారు. దీన్ని జుమామజ్జిద్ అంటారు.

# మజ్జిదుల్ ఇజాబా

మదీనాలోని బనూమావియా బస్తీలో మజ్జిదుల్ ఇజాబా పేరుతో మరొక మసీదు వుంది. దీనికి కూడా ఓ ప్రత్యేకత ఉంది. మొహమ్మద్ ప్రవక్త(స) ఓ సారి ఈ మసీదులో నమాజు చేసిన తర్వాత మూడు విషయాల గురించి దుఆ చేశారు. అల్లా ఆ మూడింటిలో రెండిటిని స్వీకరించి, ఒకదాన్ని స్వీకరించలేదు. దాన్ని గురించి దైవప్రవక్త(స) దుఆ చేసిన తరువాత తన అనుచరులకు ఈ విధంగా తెలియజేశారు. నేను అల్లాహ్‌ను మూడు విషయాలు అర్థించాను. దేవుడు నాకు రెండిటిని ఇచ్చాడు. ఒకదాన్ని ఇవ్వలేదు. నేను నా ప్రభువును నా అనుచర సముదాయాన్ని కరువు కాటకాలతో చంపవద్దని దుఆ చేశాను. అల్లా అంగీకరించాడు. తరువాత నా అనుచర సముదాయాన్ని నీటిలో ముంచి చంపవద్దని దుఆ చేశాను. ఆ దుఆను కూడా అల్లా అంగీకరించాడు. ఆ తరువాత నేను

నా అనుచర సముదాయం ప్రజలు పరస్పరం పోట్లాడుకోకుండా ఐక్యతతో ఉంచమని వేడుకున్నాను. అలా ఈ వేడుకోలును ఒప్పుకోలేదు. (సహీ ముస్లిం)

# మజ్జిద్ ఖిబ్లతైన్

హరమ్ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఈ మసీద్ వుంది. ఖిబ్లతైన్ అంటే రెండు ఖిబ్లాల మసీదు అని అర్థం. మొహమ్మద్ ప్రవక్త(స) మక్కాలో వున్నప్పుడు బైతుల్ ముఖద్దస్ వైపు తిరిగి నమాజ్ చేసేవారు. మదీనాలో కూడా చాలా రోజులు బైతుల్ ముఖద్దస్ వైపు తిరిగి నమాజ్ చేశారు. కాని ప్రవక్త(స) మనసు కాబా వైపు పరితపిస్తుండేది. నమాజ్‌లో ఆకాశం వైపు చూస్తూ అల్లాహ్ ఆదేశం కోసం వేచి చూస్తూ వుండేవారు. బషీర్ బిన్ బరా(ర) ఆహ్వానంపై ఓరోజు మొహమ్మద్ ప్రవక్త(స) ఆయన ఇంటికి వెళ్ళారు. వచ్చిన పని పూర్తయ్యేటప్పటికి జుహర్ నమాజ్ వేళ అయింది. మసీద్‌లో ఇమామత్ చేస్తూ నమాజ్ చేయించారు. రెండు రకాత్‌ల నమాజ్ పూర్తి అయింది. మూడవ రకాత్‌లో ఖిబ్లా మార్పుకు అనుమతిస్తూ అల్లాహ్ ఆదేశం వచ్చింది. 'ప్రతి సారి నీవు నీ ముఖాన్ని ఆకాశం వైపు చూడడాన్ని మేం గమనిస్తున్నాం. నీ ఇష్ట ప్రకారం కాబా వైపు నీ ఖిబ్లా మార్చుకోవచ్చు. ఇక నుంచి మీరు ఎక్కడున్నా కాబా వైపు తిరిగి నమాజ్ చేయండి. (సూరె బఖర నెం. 144)

ఈ సందేశం అవతరించగానే దైవప్రవక్త(స) నమాజ్ స్థితిలోనే బైతుల్ ముఖద్దస్ వైపు నుంచి కాబా గృహం వైపుకు మరలారు. వెనుక ఉన్న సహచరులు కూడా ఆయన్ని అనుసరిస్తూ కాబా దిశకు తిరిగి నమాజ్ పూర్తి చేశారు.

ఈ విధంగా రెండు రకాత్‌లు బైతుల్ ముఖద్దస్ వైపు, రెండు రకాత్‌లు కాబా వైపు తిరిగి జొహర్ నమాజ్ పూర్తి అయింది. ఖిబ్లా మార్పు గురించి మదీనాలో దండోరా వేయించారు. ఈ ప్రకటన వినిపించే సమయంలో కొందరు ఆయా మసీద్‌లలో నమాజీలు రుకూలో ఉన్నారు. వెంటనే వారు రుకూ స్థితిలోనే కాబా వైపుకు తమ దిశను మార్చుకున్నారు. ఖిబ్లా కాబావైపుకు మార్చుకోవడాన్ని యూదులు జీర్ణించుకోలేక పోయారు. ప్రవక్తలంతా బైతుల్ ముఖద్దీస్‌నే ఖిబ్లాగా చేసుకున్నారు. అలాంటి తమ ఖిబ్లా వైపుకే ముస్లింలు మరలి నమాజ్ చేస్తుంటే తమ జాతి ఔన్నత్యాన్ని గురించి గొప్పలు చెప్పుకుంటూ సంబరపడిపోయేవారు. కాని ఖిబ్లా మార్పుతో వారిలో అసూయ ఏర్పడింది. తమ ప్రతిష్టేదో దిగజారిపోతున్నట్లు భావించారు.

# మజ్జిదె గమామ

మజ్జిదె నబవీకి సమీపంలో ఈ మసీద్ వుంది. ప్రవక్త మొహమ్మద్ (స) పండగ రోజులో ఈద్ నమాజ్ ఇక్కడే చేసేవారు. దీన్ని మజ్జిదె ముసల్ల అని కూడా అంటారు. ఒక రోజు ప్రవక్త(స) నమాజ్ చేస్తుంటే మబ్బులు వచ్చాయి. వర్షం పడింది. అందుకే ఈ మసీదును గమామ (మబ్బు)ను గుర్తు చేసుకుంటారు. మసీద్ ముందు పెద్ద గ్రౌండ్ వుంది. ఆ మైదానంలోనే షరియత్ ప్రకారం నిందితుల్ని శిక్షించేవారు.

# మజ్జిదె అబూబకర్ సిద్దిఖ్

మజ్జిదె గమామకు సమీపంలో నార్త్ వైపు మజ్జిదె అబూబకర్ సిద్దీఖ్ వుంది. ఇక్కడ అబూబకర్ సిద్దిఖ్ కొన్ని సార్లు నమాజ్ చేశారు. అందుకే ఇక్కడ దీన్ని నిర్మించారు.

# మజ్జిదె ఉమరె ఫారూఖ్(ర)

ఈ మసీద్ కూడా మజ్జిదె గమామకు అతి దగ్గరలోనే వుంది. ఇక్కడ హజ్రత్ అలీ(ర) పండగ నమాజ్‌కు ఇమామత్ చేశారు.

# ఏడు బావులు

బీరె రేస్, బీరె ఖాతమ్: మజ్జిదె ఖుబా సమీపంలో మగిరిబ్ వైపు వుంది.

బీరె అహన్: మజ్జిదెఖుబా సమీపంలో మష్రిఖ్ వైపు మజ్జిదెషమ్స్‌కు ముందు ఒక తోటలో వుంది.

బీరె బసా: జన్నతుల్ బఖీ ముందు నుంచి ఖుబా వెళ్తుంటే కుడివైపు ఒక తోటలో వుంది.

బీరె హాజా: మజ్జిదె నబవీ ముందు దీవారె షహర్ బయట వున్న బాగే అబూ తల్హాలో వుంది.

బీరె బజా: షామి దర్వాజాకు బయట హజ్రత్ హంజా(ర) సమాధి వైపు వెళ్ళే దారిలో కుడి వైపు వున్న బాగె జమలులైలో వుంది.

బీరె రోమా: వాదియె అఖీఖ్‌లో మజ్జిదె ఖిబ్లతైన్ కంటే ముందు వుంది.

ఈ బావుల్లో వున్న అపరిశుభ్రనీటిని ప్రవక్త(స) మంచినీటిగా మార్చారు. వీలైతే ఇక్కడున్న నీటిని తాగి, వుజూ, గుసుల్ చేస్తారు హాజీలు.

# నమాజ్

**ఫజ్ర్ నమాజ్ :** ఉషోదయం తరువాత సూర్యోదయానికి పూర్వం వరకు చేయవచ్చు. ఫజ్ర్‌లో రెండు సున్నత్, రెండు ఫర్జ్ నమాజ్ చేయాలి.

**జుహర్ నమాజ్ :** సూర్యుడు నడినెత్తి నుంచి పడమర వైపుకు మరలిన తరువాత ప్రారంభం. ఒక వస్తువు నీడ దానికి రెండింతలయ్యే వరకు ఉంటుంది. జుహర్‌లో నాల్గు సున్నత్, నాల్గు ఫర్జ్, రెండు సున్నత్, రెండు నఫిల్ నమాజ్ చదవాలి.

**అస్ర్ నమాజ్ :** జుహర్ సమయం ముగిసిన తరువాత ప్రారంభమయి సూర్యాస్తమయం వరకు ఉంటుంది. అస్ర్‌లో నాల్గు సున్నత్, నాల్గు ఫర్జ్ నమాజ్ చదవాలి.

**మగ్రిబ్ నమాజ్ :** సూర్యాస్తమయం తరువాత పశ్చిమాన ఎరుపురంగు కానరానంత వరకు ఉంటుంది. మగ్రిబ్‌లో మూడు ఫర్జ్, రెండు సున్నత్, రెండు నఫిల్ నమాజ్ చదవాలి.

**ఇషా నమాజ్ :** సూర్యాస్తమయానికి గంటన్నర తరువాత ప్రారంభమయి ఉషోదయం వరకు ఉంటుంది. ఇషాలో నాల్గు సున్నత్‌లు, నాల్గు ఫర్జ్, రెండు సున్నత్, రెండు నఫిల్, మూడు విత్ర్ నమాజ్‌లు చదవాలి.

**జుమా సమయం :** జుహర్ మాదిరిగానే వుంటుంది.

**ఈదుల్ ఫిత్ర్(రంజాన్), ఈదుల్ అజ్‌హా (బక్రీద్)**

ఈ రెండు పండుగల నమాజ్ వేళ సూర్య కాంతి బాగా వ్యాపించిన తరువాత ప్రారంభమయి, సూర్యుడు నడినెత్తిన ఎక్కేవరకు ఉంటుంది.

**నమాజ్ తరీఖా :** కిబ్లా వైపు తిరిగి నిలబడాలి

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్, ఇన్నీ వజ్జహ్‌తు వజ్‌హీయ లిల్లజీ ఫతరస్సమావాతి వల్ లర్జ హనీఫవ్వమా అన మినల్ ముష్రికీన్.

**ఏ వేళ నమాజ్ చేస్తున్నామో నియత్ చేసుకోవాలి**

అల్లాహు అక్బర్ అని పలుకుతూ రెండు చేతులూ చెవుల వరకు ఎత్తాలి. అరచేతి వేళ్ళు నిటారుగా ఉంచాలి. అరచెయ్యి కిబ్లా వైపుకు చూపి చేతులు కిందికి దింపాలి. ఆ తరువాత చేతులు నాభిస్థానంపై కట్టుకోవాలి. ఎడమ చెయ్యిపై కుడి చేయి కట్టుకోవాలి.

సుబ్‌హానకల్లాహుమ్మ వ బిహమ్దిక వతబారకస్ముక వతాలా జద్దుక వలా ఇలాహ గైరుక్.

అవుజు బిల్లాహి మినష్షయితా నిర్రజీమ్ బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

**సూరా ఫాతిహా పఠించాలి**

~~అల్ హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ అర్రహ్మా నిర్రహీమ్ మాలికి యోమిద్దీన్ ఇయ్యాక~~

నబుదు వఇయ్యాక నస్తయీన్ ఇహ్‌దినస్సిరాతల్ ముస్తకీమ్ సిరాతల్లజీన అన్ అమ్తు అలైహిమ్ గైరిల్ మగ్‌జూబి అలైహిమ్, వలజ్జాల్లీన్ (ఆమీన్). బిస్మిల్లా హి్రహ్మా ని్రహీమ్

కుల్ హు వల్లాహు అహద్ అల్లాహుస్సమద్ లమ్ ఎలిద్ వలమ్ యూలద్ వలమ్ ఎకున్ లహు కుఫు అన్ అహద్.

తరువాత అల్లాహు అక్బర్ అని పలుకుతూ రుకూ చెయ్యాలి. నడుపు తల రెండూ ఒకే స్థాయిలో ఉండేలా వంగాలి. అరచేతుల్ని మోకాళ్ళపై ఆనించాలి. “సుబహాన రబ్బి అల్ అజీమ్” మూడు సార్లు పలకాలి.

ఆ తరువాత తిరిగి లేస్తూ చేతులు కిందికి వదిలేసి నిలుచోవాలి.

సమి అల్లాహు లిమన్ హమిద, అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్ద్ అని పఠించాలి.

ఆ తరువాత అల్లాహు అక్బర్ అని పలుకుతూ సజ్దా చెయ్యాలి. **రెండు కాళ్ళ బొటన వేళ్ళు, రెండు మోకాళ్ళు, రెండు అరచేతులు, ముక్కు, నుదురు ఇవన్నీ నేలను తాకాలి** అప్పుడు “సుబహాన రబ్బియల్ ఆలా అని మూడు సార్లు పఠించాలి.

అల్లాహు అక్బర్ అని పలుకుతూ కొన్ని సెకన్లు కూర్చోవాలి. ఎడమ కాలిని పరిచి, కుడికాలి వ్రేళ్ళ ఆధారంగా కూర్చోవాలి. రెండు చేతులు తొడలపై మోకాళ్ళ దగ్గర ఉంచాలి. ఆ పిదప తిరిగి సజ్దా చేస్తూ సుబహాన రబ్బి ఆల్ ఆలా అని మూడు సార్లు పఠించాలి. ఆ తరువాత లేచి నిలబడుతూ అల్లాహు అక్బర్ అని పలకాలి. ప్రారంభంలో నిలబడినట్లే కుడి చెయ్యి, ఎడమ చెయ్యిపై వేసి కట్టుకుని నిల్చోవాలి. ఒక రకాత్ ముగిసింది. రెండవ రకాత్ ప్రారంభమయింది. ఇందులో ఫాతిహా సూరా, మరో సూరా పఠించాలి.

బిస్మిల్లా హి్రహ్మా ని్రహీమ్

కుల్ ఆవుజు బి రబ్బిన్నాస్ మలికిన్నాస్ ఇలా హిన్నాస్ మిన్ షర్రిల్ వస్వాసిల్ ఖన్నాస్ అల్లజీ యువస్ విసు ఫీ సుదూరిన్నాస్ మినల్ జిన్నతి వన్నాస్

తరువాత అల్లాహు అక్బర్ అంటూ ఒక రుకూ రెండు సజ్దాలు మొదటి రకత్ మాదిరిగానే చెయ్యాలి. రెండు సజ్దాలు చేసిన తరువాత కూర్చోవాలి. రెండు రకాతుల తరువాత కూర్చునే దాన్ని “కఆద” అనంటారు.

**అత్తహియ్యాత్ పఠించాలి.**

అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వరహ్మతుల్లాహి వ బరకాతుహు. అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహిస్సాలిహీన్. అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహు వ రసూలుహ్.

అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు అని పఠించేటప్పుడు చూపు వ్రేలును సూచన ప్రాయంగా లేవనెత్తి మళ్ళీ మామూలుగా ఉంచి వెయ్యాలి.

**దరూదె ఇబ్రాహీం :** అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్, వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ, ఇన్నక హమీదున్‌మ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమాబారక్త అలా ఇబ్రహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదున్ మ్మజీద్.

అల్లాహుమ్మగ్‌ఫిర్‌లీ వలివాలిదయ్య వలి ఉస్తాజీ వల్‌జమీయిల్ మూమినీన వల్ మూమినాతి వల్ ముస్లిమీన వల్ ముస్లిమాతి, అల్ అహ్ యాయి మిన్‌హుమ్ వల్ అమ్వాతి ఇన్నక ముజీబుద్దాఅవాతి బిరహ్మతిక యా అర్హమర్రాహిమీన్.

అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి అంటూ మొదటి కుడి వైపునకు తరువాత ఎడవ వైపునకు చూడాలి. దీంతో నమాజ్ ముగిసింది.

**సున్నత్ నమాజ్ వ్యక్తి గతంగా చెయ్యాలి.**

**ఫర్జ్ నమాజ్ సామూహికంగా (జమాత్‌తో కలిసి మస్జిదుల్లో చెయ్యాలి)**

# నమాజ్ తరువాతి దుఆ :

అల్లాహుమ్మ అన్తస్సలాము వ మిన్కస్సలాము, వ ఇలైక యర్‌జి ఉస్సలాము. హయ్యినా రబ్బనా బిస్సలాము. వ అద్ ఖిల్‌నా బి రహ్మతిక దారస్సలాము. తబారక్త రబ్బనా వ తాలైత యా జల్‌జలాలివల్ ఇక్రామ్.

**ఇషా నమాజ్‌లో మూడు రకాతుల విత్ర్ నమాజ్ :**

మూడవ రకాత్‌లో రుకూలోకి పొయ్యే ముందు అల్లాహు అక్బర్ అంటూ రెండు చేతులు చెవుల వరకు ఎత్తి తిరిగి మామూలుగా కట్టుకోవాలి. కునూత్ దుఆ పఠించాలి.

"అల్లాహుమ్మ ఇన్నా నస్తయీనుక వనస్తగ్ ఫిరుక, వనూ మినుబిక, వ నతవక్కలు అలైక, వనుస్‌ని అలై కల్ ఖైర, వనష్ కురుక, వలా నక్‌ఫురుక వనఖ్‌లఉ, వనత్‌రుకు మయ్యఫ్ జురుక అల్లాహుమ్మ ఇయ్యాక నబుదు వలకనుసల్లి, వనస్‌జుదు, వ ఇలైక నస్‌ఆ, వనహ్ ఫిదు వనర్జూ రహ్‌మతిక వనఖ్‌షా ఆజాబక, ఇన్న ఆజాబకల్ జిద్ద బిల్ కుఫ్ఫారి ముల్ హిక్.

**తహజ్జుద్ నమాజ్ :** అర్ధరాత్రి తరువాత ఉషోదయం కంటే ముందు రెండేసి రకాతులుగా 8 రకాతుల నమాజ్ చేయడం సున్నత్.

**అల్ కౌసర్ :** బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

ఇన్నా ఆ తయినా కల్ కౌసర్ ఫ సల్లి లిరబ్బిక వన్‌హర్ ఇన్న సా నియక హువల్ అబ్‌తర్

**అల్ కాఫిరూన్ :** బిస్మిల్లా హి(ర్రహ్మా ని(ర్రహీమ్

కుల్ యా అయ్యుహల్ కాఫిరూన్ లా ఆబుదు మా తా బుదూన్ వలా అన్ తుమ్ ఆబిదూన మా ఆబుద్ వలా అన ఆబిదున్మ్మా ఆ అబ ద్‌తుమ్ వలా అన్తుమ్ ఆబిదూన మా ఆబుద్ లకుమ్ దీనుకుమ్ వ లియ దీన్

**అన్ నస్ర్ :** బిస్మిల్లా హి(ర్రహ్మా ని(ర్రహీమ్

ఇజా జా అ నస్రుల్లాహి వల్‌ఫత్‌హ్ వ రఅయ్ తన్నాస యద్ ఖులూన ఫీ దీనిల్లాహి అఫ్‌వాజా ఫసబ్బిహ్ బి హమ్దిరబ్బిక వస్తగ్ ఫిర్‌హు ఇన్నహూ కానతవ్వాబా.

**అల్ లహబ్ :** బిస్మిల్లా హి(ర్రహ్మా ని(ర్రహీమ్

తబ్బత్ యదా అబీ లహబి వ్వ తబ్బ్ మా అగ్‌నా అన్ హు మాలుహు వమా కసబ్ స యస్‌లా నారన్ జాత లహబ్ వ మ్‌రా తుహ్, హమ్మాలతల్ హతబ్ ఫీ జీదిహా హబ్‌లున్ మ్మిమ్మసద్

**అల్ ఇఖ్లాస్ :** బిస్మిల్లా హి(ర్రహ్మా ని(ర్రహీమ్

కుల్ హు వల్లాహు అహద్ అల్లాహుస్సమద్ లమ్ ఎలిద్ వలమ్ యూలద్ వలమ్ ఎకున్ లహు కువు అన్ అహద్

**అల్ ఫలక్ :** బిస్మిల్లా హి(ర్రహ్మా ని(ర్రహీమ్

కుల్ అఉజు బిరబ్బిల్ ఫలక్ మిన్ షర్రి మా ఖలక్ వ మిన్ షర్రి గాసికిన్ ఇజా వకబ్ వ మిన్ షర్రిన్ నఫ్ఫాసాతి ఫిల్ ఉకద్ వ మిన్ షర్రి హాసిదిన్ ఇజా హసద్

**అన్ నాస్ :** బిస్మిల్లా హి(ర్రహ్మా ని(ర్రహీమ్

కుల్ అవుజు బి రబ్బిన్నాస్ మలికిన్నాస్ ఇలా హిన్నాస్ మిన్ షర్రిల్ వస్వాసిల్ ఖన్నాస్ అల్లజీ యువస్ విసు ఫీసుదూరిన్నాస్ మినల్ జిన్నతి వన్నాస్.

**కలిమయె తయ్యిబా :** లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్ రసూలుల్లాహి.

**కలిమయె షహాదత్ :** అష్‌హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్.

**కలిమయె తమ్‌జీద్ :** సుబ్‌హానల్లాహి వల్ హమ్దు లిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. వలా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహిల్ అలియ్యిల్ అజీమ్.

**కలిమయె తౌహీద్ :** లా ఇలా ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వ లహుల్ హమ్దు యుహ్‌యీ వ యుమీతు బి యదిహిల్ ఖైర్ వహువ అలా కుల్లి

షైయిన్ ఖదీర్.

**కలిమయె రద్దెకుఫ్ర్ :** అల్లాహుమ్మ ఇన్నీ అవూజు బిక మిన్ అన్ ఉష్రిక బిక షైఅన్ వ అన ఆలము బిహీ, వ అస్తగ్ఫిరుక లిమా లా ఆలము బిహీ, తుబ్‌తు అన్‌హు వ తబర్రాతు మినల్ కుఫ్రి వల్ మఆసీ కుల్లిహా అస్లమ్‌తు వ ఆమంతు వ అఖూలు లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్.

**ఈమానె ముజ్‌మల్ :** ఆమంతు బిల్లాహి కమాహువ బి అస్మాయిహీ వసిఫాతిహీ వ ఖబిల్‌తు జమీఅ అహ్‌కామిహీ.

**ఈమానె ముఫస్సల్ :** ఆమన్తు బిల్లాహి వ మలాయికతిహీ వ కుతుబిహీ వ రుసులిహీ వల్ యౌమిల్ ఆఖిరి వల్ ఖద్‌రి ఖైరిహీ వ షర్రిహీ మినల్లాహి తఆలా వల్ బాసి బాదల్ మౌత్.

# ఇస్లాంలో నిద్దురపోయే పద్ధతి

అల్లా మీ కొరకు రాత్రి, పగలు సృష్టించాడు. మీరు రాత్రి సమయంలో విశ్రాంతి పొందటానికి, పగటి సమయంలో మీ ప్రభువు అనుగ్రహాన్ని అన్వేషించడానికే. ఇషా తరువాత నిద్రించడంలో ఆలస్యం చేయకూడదు. ధర్మజ్ఞాన చర్చలో, అతిథితో సంభాషణ, భార్యతో వినోదం జరుపుటలో తప్ప ఇతర వ్యాపకాలు పెట్టుకోరాదు. ప్రవక్త ఇషాకు ముందు నిద్రించడం, ఇషా తరువాత మాట్లాడటాన్ని అసహ్యించుకునేవారు (బుఖారి)

వుజు చేసుకొని పడుకునే ప్రయత్నం చేయాలి. పడకపై వచ్చినప్పుడు నమాజు చేయు విధంగా వుజు చేయాలి. (బుఖారి 247) కుడి పక్కపై పడుకోవాలి. కుడి చెయ్యిని కుడి చెంప క్రింద పెట్టుకొని పడుకోవాలి. (అబూదావూద్ 5037) పగలైనా, రాత్రైనా కడుపు భూమికి అనుకునే విధంగా (బోర్ల) పడుకోకూడదు. (తిర్మిజి 2768) నిద్దురపోయే ముందు దుఆ చదవాలి. సుబ్‌హానల్లా 33, అల్‌హందులిల్లా 33, అల్లాహు అక్బర్ 34 సార్లు చదవాలి. (బుఖారి 3705, ముస్లిం 2727) మళ్ళీ సూరె ఫాతిహ, సూరె బఖరలోని మొదటి నాలుగు వాఖ్యాలు, ఆయతుల్ కుర్సి, సూరె బఖరలోని చివరి రెండు ఆయతులు , ఖుల్ హువల్లాహు అహద్, ఖుల్ ఆఊజు బిరబ్బిల్ ఫలఖ్, ఖుల్ అఊజు బిరబ్బిన్నాని సూరాలు చదవాలి.

**మేల్కొన్న తరువాత ఈ దుఆ చదవాలి:**

అల్‌హందు లిల్లాహిలజీ అహ్యానా బఅద మాఅమాతనా వఇలైహిన్నుషూర్. (బుఖారి6313)